

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 358

మంగళవారం 20-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రష్యా పీఠంపై మళ్లీ పుతిన్
అధ్యక్ష ఎన్నికల్లో ఘనవిజయం. రిగ్గింగ్ జరిగిందన్న ప్రతిపక్షాలు -8లో



ఫెడరర్‌కు షాక్
ఇండియన్ వెల్స్ టోర్నీ ఫైనల్లో డెల్‌పొట్రో చేతిలో ఓటమి -స్పోర్ట్స్‌లో

చేయి చేయి కలిపి.. హోదా కోసం నిలిచి..



- హోదా కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు
- కేంద్రంపై అవిశ్వాసానికి మద్దతు పలికిన ఐదుకోట్ల ఆంధ్రులు
- గుంటూరు జిల్లా కొమ్మూరు వద్ద మానవహారంలో ప్రతిపక్ష నేత జగన్
- మానవహారాలతో పాటు వినూత్న తరహాలో యువకుల నిరసనలు

5లో

పట్టు వీడేదిలేదు!

అవిశ్వాసంపై చర్చ జరగాల్సిందే.. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ మూడో నోటీస్

- సభ సజావుగా లేదు.. సభ్యులను లెక్కించలేకపోతున్నా..
- రెండో తీర్మానం స్వీకరించకుండానే సభ వాయిదా వేసిన లోక్‌సభ స్పీకర్
- అవిశ్వాసానికి మద్దతుగా సభలో నిల్చున్న ప్రతిపక్షాలు
- చర్చకు సిద్ధమన్న హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- వెల్‌లో ఆందోళన కొనసాగించిన టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే
- పార్లమెంట్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ధర్నా



సభ వాయిదా అనంతరం పార్లమెంట్ ఆవరణలో ఆందోళన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీలు. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేత బొత్స

సాక్షి, న్యూఢిల్లీ

కేంద్రంపై అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేంత వరకు పట్టువీడేది లేదని వైఎస్సార్ కాంగ్రెస్ స్పష్టం చేసింది. రెండోసారి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం తీసుకోకుండానే లోక్‌సభ మరోసారి వాయిదా పడడంతో ఆ పార్టీ ఎంపీలు సోమవారం మూడోనోటీసు ఇచ్చారు. సభ సజావుగా లేనందున మద్దతిచ్చే సభ్యులను లెక్కించడానికి వీలుకాదనే సాకుతో సోమవారం స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదావేశారు. ఇదే కారణం చెప్పి శుక్రవారం కూడా అవిశ్వాస తీర్మానాన్ని తీసుకోని విషయం తెలిసిందే. అదే రోజు సభ వాయిదా పడ్డ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం రెండోసారి నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కూడా మరోసారి వారు అవిశ్వాసం నోటీసులిచ్చారు. కాగా సోమవారం మధ్యాహ్నం 12.06 గంటలకు సభాపతి అవిశ్వాసం నోటీసులను ప్రస్తావించారు. 'కేంద్ర మంత్రి మండలిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం, గల్లా జయదేవ్ నుంచి నోటీసులు అందాయి. ఈ తీర్మానం

మిగతా 2వ పేజీలో ▶

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడులో సోమవారం జరిగిన భారీ బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



అబద్ధాల పునాదులపై చంద్రబాబు పాలన

పెదనందిపాడు సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు


- తన స్వార్థం కోసం హోదాను తాకట్టు పెట్టారు
- ఎన్నికలొస్తున్నాయని మళ్లీ మొసలి కన్నీరు
- పూటకో మాటతో ప్రజలను మోసం చేస్తున్నారు
- ప్రతి విషయంలోనూ మోసం.. దగా..
- రాష్ట్రంలో ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు
- ప్రత్తిపాడు నియోజకవర్గం రైతులకు అన్నీ ఇక్కట్లే
- అప్పాపురం చానల్‌కు చంద్ర గ్రహణం
- మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో అందరినీ ఆదుకుంటాం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

అబద్ధాలు, అన్యాయం, అధర్మం అనే పునాదులపై రాష్ట్రంలో చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు, మహిళలు, యువత.. ఎవరినీ వదలకుండా అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిన ఈ పెద్దమనిషి పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మళ్లీ మోసం చేయడానికి సిద్ధమయ్యారని మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 115వ రోజు సోమవారం గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఏ ఒక్క పంటకూ

మిగతా 6వ పేజీలో ▶

నన్ను అణగదొక్కాలని చూస్తున్నారు!



- కేంద్రంపై సీఎం చంద్రబాబు ఆరోపణలు
- బీజేపీ తప్పుడు విధానాలు అనుసరిస్తోందని విమర్శ
- మైనారిటీలతో ముఖ్యమంత్రి సమావేశం

5లో

బాబు రాజకీయ నాటకాలు



- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ విమర్శలు
- సొంత మామకే వెన్నుపోటు పొడిచిన ఘనత బాబుది
- ఏపీ ఆకాంక్షలు నెరవేర్చేందుకు మేమున్నాం

5లో

మార్పుకు నాంది



- 'ఫెడరల్ ఫ్రంట్' దిశగా తెలంగాణ సీఎం కేసీఆర్ తొలి అడుగు..
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో భేటీ

7లో

22న జాతీయ రహదారుల దిగ్బంధం

- ప్రత్యేక హోదాపై కేంద్రం దిగి వచ్చే వరకు ఆందోళన
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

- వివరాలు 5లో



తెలంగాణలో బ్యాలెట్ బంధం

కాంగ్రెస్–టీడీపీ డీల్

- వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జత కట్టనున్న కాంగ్రెస్?
- టీడీపీ, సీపీఐతో కలిసి రాష్ట్ర స్థాయిలో ఫ్రంట్‌కు నిర్ణయం
- పాతిక అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలు కావాలన్న టీడీపీ
- 15 అసెంబ్లీ, 1 లోక్‌సభ స్థానం ఇచ్చేందుకు కాంగ్రెస్ సుముఖం
- ఢిల్లీలో రాహుల్‌కు టీడీపీ ప్రతిపాదనలు అందించిన కాంగ్రెస్ ముఖ్య నేతలు
- ఫ్రంట్‌లో మందకృష్ణ కూడా.. ఎన్నికల్లో పోటీకి అవకాశం

సాక్షి, హైదరాబాద్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి తీరాలన్న కాంక్షతో ఉన్న కాంగ్రెస్.. తెలంగాణలో ఫ్రంట్ ఏర్పాటు చేసే దిశగా పావులు కదుపుతోంది. తెలుగుదేశం పార్టీని ఇందులో కలుపుకునేందుకు కసరత్తు చేస్తోంది. తెలంగాణలో పూర్తిగా బలహీనపడిన నేపథ్యంలో పొత్తుకు టీడీపీ నుంచి కూడా సానుకూల సంకేతాలు వెలువడినట్లు విశ్వసనీయవర్గాలు

మిగతా 2వ పేజీలో ▶

టెట్‌లో 43% ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి గంటా
- 4.14 లక్షల మందికి 1.78 లక్షల మంది ఉత్తీర్ణత
- ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే డీఎస్సీ నోటిఫికేషన్

3లో

హోదా 'పెద్ద' అంశం కాదు



- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్య
- చంద్రబాబు అవినీతిపై దర్యాప్తు జరపాలి
- లోకేష్ అక్రమాలపై టీడీపీ ఎమ్మెల్యేలే నాకు చెప్పారు
- పోలవరం కాంట్రాక్టుల వెనక దురుద్దేశాలున్నాయి..

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా పెద్ద విషయమేమీ కాదని, నిధుల రాకడే ప్రధానమని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు సర్కారుపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్, పార్టీ నాయకులు అవినీతిలో కూరుకుపోయినట్లు టీడీపీకే చెందిన సుమారు 40 మంది ఎమ్మెల్యేలు తనకు చెప్పారన్నారు. ఇదేదో తాను అకస్మాత్తుగా చేస్తున్న ఆరోపణలు కావని, నాలుగేళ్లుగా ఈ విషయాన్ని చంద్రబాబుకు చెబుతూనే వచ్చానని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో పాలనాపరంగా పది పాయింట్లకుగానూ చంద్రబాబుకు 2.5 పాయింట్లు, కేసీఆర్‌కు 6 పాయింట్లు ఇస్తానన్నారు.'న్యూస్ 18'కి పవన్ ఇచ్చిన ఇంటర్వ్యూలో మరికొన్ని అంశాలు...

నిధులు కావాలి.. ఏ రూపంలో అనేది ముఖ్యం కాదు

మాకు, బీజేపీకి మధ్య ఎటువంటి సఖ్యతకు అవకాశం లేదు. రాష్ట్ర ప్రజలు బీజేపీ తీరు పట్ల విసిగిపోయారు. ప్రత్యేక హోదా డిమాండ్ భావోద్వేగ సమస్య కాదు. ఆచరణాత్మక అవసరాల ప్రాతిపదికనే ముందుకొచ్చింది. ఏపీలో వెనుక బడిన ఏడు జిల్లాలు అత్యంత దుర్భర స్థితిలో ఉన్నాయి. వీటిని మెరుగుపర్చాలంటే కేంద్రం నుంచి నిధులు కావాలి. ఏ రూపంలో ఇస్తారనేది ముఖ్యం కాదు. ప్రత్యేక హోదా పేరిట ఇస్తారా? లేదా అనేది ముఖ్యం కాదు. కేంద్రం నుంచి మాకు కావాల్సింది ఆర్థిక సహాయం. మా డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీతో ఎటువంటి రాజీ ఉండదు. ప్రాంతీయ సమస్యలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం కావటం వల్లే మూడో ప్రత్యామ్నాయం ఏర్పాటవుతోంది.

తన ప్రభుత్వంలో అవినీతి చంద్రబాబుకు తెలుసు..

'రాష్ట్ర ప్రభుత్వం అవినీతి గురించి చంద్రబాబుకు చెప్పమని దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు, కొందరు టీడీపీ నేతలు నాకు ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రికి చెప్పే ప్రయత్నం చేస్తే ఆయన పెద్దగా పట్టించుకోలేదు. అందువల్లే నేను మాట్లాడాల్సి వచ్చింది. తన ప్రభుత్వంలో అవినీతి గురించి చంద్రబాబుకు పూర్తిగా తెలుసు. ఈ అవినీతి ఆరోపణలు, అవకతవకలపై కేంద్రం విధిగా చర్యలు తీసుకోవాలి. పోలవరం ప్రాజెక్టును ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించడం వెనుక దురుద్దేశాలున్నాయి. తన వ్యాఖ్యల వెనుక బీజేపీ ఉన్నట్టు టీడీపీ చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. ఇలాఉండగా, న్యూస్18కి ఇచ్చిన ఇంటర్వ్యూపై విమర్శలు రావడంతో పవన్ మాటమార్చారు. హోదాకు కట్టుబడి ఉన్నామంటూ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు.

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెట్టేందుకు అవసరమైన 50 మంది సభ్యులు లేచి నిలుచుంటే వారిని లెక్కించేందుకు వీలుగా సభ సజావుగా నడవాలి. అప్పుడే నేను వారిని లెక్కించి ఈ తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలా లేదా అనేది నిర్ణయించగలను' అని పేర్కొన్నారు. తీర్మానం ప్రస్తావన రాగానే వైఎస్సార్ సీపీతో పాటు విపక్షాల సభ్యులంతా మద్దతుగా వారి స్థానాల్లో నిలబడ్డారు. ఇందులో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, ఎన్సీపీ, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల సభ్యులు ఉన్నారు. శివసేన తటస్థంగా ఉంటామని గతంలోనే ప్రకటించింది.

టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే ఆందోళన..

స్పీకర్ అవిశ్వాస తీర్మానం ప్రస్తావన తెచ్చిన సమయంలో రిజర్వేషన్ల కోటా పెంపు కోసం టీఆర్ఎస్, కావేరీ నదీ బోర్డు ఏర్పాటు కోసం ఏఐఏడీఎంకే ఎంపీలు వెల్‌లో ఆందోళన కొనసాగించారు. వారిని వారి స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆ ఎంపీలు పట్టించుకోలేదు. సభ ఆర్డర్‌లో లేనందున తీర్మానపు నోటీసును సభ దృష్టికి తేలేకపోతున్నాను.. ఐ ఆమ్ సారీ అని చెబుతూ స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

హోదాకు మా మద్దతు: డీఎంకే

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని డీఎంకే స్పష్టం చేసింది. ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ సోమవారం పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అన్నాడీఎంకే పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కావేరీ బోర్డు ఏర్పాటుపై కేంద్రం ప్రకటన చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు.

ప్రజల గొంతునొక్కుతున్న ఎన్డీఏ, స్పీకర్

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 'శుక్రవారం రెండోసారి నోటీసులు ఇచ్చాం. అప్పటికే అన్ని పార్టీలను మద్దతు ఇవ్వాలని కోరాం. అందరూ సానుకూలంగా స్పందించడమే కాకుండా స్పీకర్ అవిశ్వాస తీర్మానం ప్రస్తావించినప్పుడు 100 మందికి పైగా నిలబడ్డారు. అయినా సభ సజావుగా లేదంటూ అనుమతించలేదు. ఎన్డీఏ ప్రభుత్వం, స్పీకర్ ఏపీ ప్రజల గొంతునొక్కుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికైనా సభ సజావుగా జరిగేలా చూడాలి. అన్ని పార్టీలు సానుకూలంగా స్పందిస్తాయి. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

పట్టు వీడేదిలేదు!



ఎందుకు ఓట్లేయించుకున్నారు..

ఎంపీ వెలగపల్లి మాట్లాడుతూ.. 'ప్రత్యేక హోదాను హేళన చేసిన టీడీపీ ఇప్పుడు ఎన్నికల దృష్టితో మళ్లీ హోదా అంటోంది. నాలుగేళ్లుగా ఏం చేసింది? బీజేపీని కూడా అడుగుతున్నాం.. ఎందుకు ఆరోజు హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టి ఓట్లు ఎందుకు వేయించుకున్నారు. ఎందుకు ఒత్తిడి తేలేదని టీడీపీని అడుగుతున్నాం. అవిశ్వాసం మొట్టమొదటిసారిగా పెట్టింది వైఎస్సార్ సీపీనే. అంతతేలిగ్గా మేం వదిలిపెట్టం. వైఎస్సార్ కాంగ్రెస్ వల్లే ఈ పోరాటం ముందుకుసాగింది..' అని పేర్కొన్నారు.

చర్చకు వస్తే అన్యాయాన్ని చెప్పవచ్చు..

ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. 'దేశం దృష్టి అంతా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌పై పడేలా ఈ తీర్మానం ద్వారా చేయగలిగాం. తీర్మానం చర్చకు వస్తే మనకు జరిగిన అన్యాయం చెప్పుకొనే వీలుంటుంది. మేం ఐదుగురం ప్రభుత్వాన్ని పడగొట్టగలుగుతామని చెప్పడంలేదు. హోదా డిమాండ్ వైపు దేశం చూస్తోందంటే మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచీ పోరాటం చేయడం, మేం పార్లమెంటులో పోరాటం చేయడం వల్లే. మేం ఐదుగురమే ఐనా ఏపీకి జరిగిన అన్యాయాన్ని దేశానికి చాటగలిగాం. ఇది వైఎస్సార్‌కాంగ్రెస్ విజయమే. అవిశ్వాస తీర్మానం పెట్టకపోతే ఈరోజు ఇంత అటెన్షన్ వచ్చేదా ' అని ప్రశ్నించారు.

ఊసరవెల్లిలా చంద్రబాబు..

ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ 'మేం మా కార్యాచరణ మేరకు నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్నాం. అవిశ్వాస తీర్మానం పెడతామన్నాం. పెట్టాం. శుక్రవారం ఉదయం వరకు టీడీపీ కేంద్రంపై విశ్వాసాన్ని ప్రకటించింది. మా పోరాటానికి మద్దతు తెలపకపోవడమే కాకుండా హేళన చేసింది. చంద్రబాబు ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారు. ప్యాకేజీ కావాలని అడిగారు. ఇప్పుడు ప్రజల ఆగ్రహంతో మళ్లీ హోదా కావాలంటున్నారు..' అని పేర్కొన్నారు.

టీడీపీ తీరుతో ప్రజలు నవ్వుకుంటున్నారు..

ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మొదట వైఎస్సార్‌సీపీ ఇచ్చే తీర్మానానికి మద్దతు చెబుతామన్న టీడీపీ మళ్లీ శుక్రవారం మాటమార్చింది. మాకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు దక్కుతోందని గమనించి, వైఎస్ జగన్‌కి జాతీయ రాజకీయాల్లో మంచి పేరొస్తోందని ఆయన అభద్రతకు గురయ్యారు. అప్పటికప్పుడు ఎన్డీయేనుంచి బయటకు వచ్చారు. శుక్రవారం ఉదయం నోటీసులు ఇచ్చారు. అర్ధ గంటలో మద్దతు కూడగట్టామని వాళ్లు చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇప్పటికైనా డ్రామాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో రావాలి. మేం రాజీనామాలకు సిద్ధంగా ఉన్నాం.. మీరు కూడా రాజీనామాలకు సిద్ధం కండి' అని పేర్కొన్నారు.

మరోసారి నోటీసు ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం మరోసారి లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇచ్చారు. 'కేంద్ర మంత్రి మండలిపై ఈ సభ అవిశ్వాసం ప్రకటిస్తోంది' అన్న తీర్మానాన్ని మంగళవారం నాటి బిజినెస్ లిస్ట్‌లో చేర్చాలని విన్నవించారు. అలాగే ఈ తీర్మానం వస్తున్నందున పార్టీ ఎంపీలంతా హాజరై తీర్మానం ప్రవేశపెట్టేందుకు మద్దతుగా నిలబడాలని, తీర్మానానికి అనుకూలంగా ఓటేయాలని పేర్కొంటూ వైఎస్సార్ సీపీ చీఫ్ విప్ వైవీ సుబ్బారెడ్డి త్రీలైన్ విప్ జారీచేశారు.

చర్చకు సిద్ధం: హోం మంత్రి

స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానం నోటీసు వచ్చిన విషయాన్ని ప్రస్తావించక ముందు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. 'పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభ సజావుగా సాగడం లేదు. ఏ అంశంపైన అయినా, ఏ సభ్యుడు లేవనెత్తినా దానిపై పూర్తిగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారపక్షం తరఫున చెబుతున్నా. కొందరు సభ్యులు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. ఈ తీర్మానంపై చర్చ జరగాలని నేను కోరుకుంటున్నా. సభ్యులంతా సహకరించాలని కోరుతున్నా. ఈ తీర్మానంపై చర్చ జరిగేందుకు సహకరించండి' అని అన్ని పక్షాలను కోరారు.

టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే నేతలతో చర్చిస్తున్నాం

లోక్‌సభ ప్రారంభానికి ముందు వైఎస్సార్ సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వైఎస్ అవినాశ్‌రెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. 11 గంటలకు సభ వెల్‌లోకి వెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. ధర్నా వద్ద మీడియాతో మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే నేతలతో కూడా మాట్లాడుతున్నామని, సహకరించాలని బతిమాలామని చెప్పారు. వాళ్ల రాజకీయ కోణాలు వాళ్లవని, చంద్రబాబును మించినవారు అని అన్నారు. చంద్రబాబు నాలుగేళ్లుగా నిమ్మకునీరెత్తినట్టు ఉన్నారని, హోదా ఉద్యమాన్ని హేళన చేశారని విమర్శించారు. హోదా కోసం తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అనేక పోరాటాలు చేశారన్నారు. ఏపీకి అన్యాయం చేసిన చంద్రబాబు ఇప్పుడు వచ్చి పోరాడుతున్నానంటున్నారని విమర్శించారు.

తెలంగాణలో బ్యాలెట్ బంధం

కాంగ్రెస్–టీడీపీ డీల్

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించాయి. టీఆర్ఎస్‌కు చెక్ పెట్టేందుకు టీపీసీసీ నాయకత్వం నుంచి వచ్చిన ఈ పొత్తు ఆలోచనకు టీడీపీ అధినేత చంద్రబాబు సుముఖంగా ఉన్నారని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు కాంగ్రెస్‌కు వర్తమానం అందించారు. అప్పటికే టీడీపీ నేతలతో సీట్లపై సాగించిన చర్చలు, ప్రతిపాదనలపై రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులు కొందరు సోమవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో చర్చించినట్లు సమాచారం. ఎన్డీఏ నుంచి తెలుగుదేశం బయటకు రాకముందే తెలంగాణలో కాంగ్రెస్–టీడీపీ మధ్య పలుమార్లు పొత్తు అంశంపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. వచ్చే జూన్ తర్వాత రెండు పార్టీల మధ్య అధికారికంగా చర్చలు జరుగుతాయని, ఆ తర్వాతే కాంగ్రెస్–టీడీపీ–సీపీఐ మధ్య సీట్ల సర్దుబాటు ప్రక్రియ తెరపైకి వస్తుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ మూడు పార్టీలతో పాటు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కూడా ఫ్రంట్‌లో కీలక పాత్ర పోషిస్తారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయడంతోపాటు ఫ్రంట్ తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు.

ఏడాది నుంచి నలుగుతున్న పొత్తు అంశం

పొత్తు అంశం ఇప్పటికిప్పుడు తెరపైకి వచ్చిందేమీ కాదు. రేవంత్‌రెడ్డి టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు ముందే అంతర్గత చర్చలు జరిగాయి. అయితే రేవంత్ అప్పట్లో తెచ్చిన ఈ ప్రతిపాదనను తెలంగాణ టీడీపీ నేతలు కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో రేవంత్‌రెడ్డి విజయవాడ వెళ్లి చంద్రబాబుతో సమాలోచనలు జరిపి వచ్చిన తర్వాత అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత కొంతకాలం ఇది మరుగున పడింది. టీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌తో వెళ్తేనే బాగుంటుందని తెలంగాణ టీడీపీ నేతలు కొందరు చంద్రబాబుకు నచ్చజెప్పారు. దీంతో ఇటీవల మళ్లీ అంతర్గతంగా చర్చలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ తమతో పొత్తు కావాలని అనుకుంటే 25 అసెంబ్లీ సీట్లు, 2 లోక్‌సభ స్థానాలు కావాలని టీడీపీ డిమాండ్ చేసింది. మల్కాజ్‌గిరి, నిజామాబాద్ లోక్‌సభ స్థానాలతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలో 25 అసెంబ్లీ సీట్లు అడిగింది. కాంగ్రెస్ మాత్రం ఒక లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇదే విషయాన్ని ఆ పార్టీ నేతలు అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. ''ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా గత్యంతరమైన పరిస్థితి లేదు. టీఆర్ఎస్‌ను ఎదుర్కోవడానికి మేం టీడీపీ, సీపీఐతో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఇంకా చిన్నాచితకా పార్టీలను కూడా కలుపుకుపోతాం'' అని కాంగ్రెస్ నేత ఒకరు వెల్లడించారు. టీడీపీతో పొత్తు విషయంలో కాంగ్రెస్ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే అవగాహన అవసరమనే నిర్ణయానికి ఆ పార్టీ పెద్దలు వచ్చారు.

'ధరలపై టీటీడీ నియంత్రణ ఉండదు'

సాక్షి, తిరుమల: కోర్టు కేసుల్లో నలిగిన తిరుమలలోని పెద్ద హోటళ్ల టెండర్లు ఎట్టకేలకు సోమవారం తెరుచుకున్నాయి. ఏటా రూ.5 కోట్ల టర్నోవర్‌తో పాటు ఐదేళ్ల అనుభవం కలిగిన హోటళ్ల నిర్వాహకులు ఇందులో పాల్గొనేలా ఫిబ్రవరి 19న టీటీడీ టెండర్లు ఆహ్వానించింది. ఆ మేరకు సోమవారం ఆ ఆరు పెద్ద హోటళ్ల టెండర్లు ఖరారు చేశారు. ఇందులో అన్నపూర్ణ–17.09 లక్షలు, హెచ్‌వీడీసీ– రూ.9.09 లక్షలు, కౌస్తుభం–12.34 లక్షలు, సప్తగిరి–16.20 లక్షలు, శ్రీవత్స–రూ.35.77 లక్షలు, సన్నిదానం–రూ.20 లక్షలతో ఆయా హోటళ్ల నిర్వాహకులు టెండర్ దక్కించుకున్నారు. తాజా టెండర్ నిబంధనల ప్రకారం పెద్ద హోటళ్ల ఆహార పదార్థాల ధరలపై టీటీడీ నియంత్రణ ఉండదు. ఇక జనతా హోటళ్ల టెండర్లు కూడా మంగళవారం తెరవాలని యోచిస్తున్నారు.

ఏపీకి మూడేళ్లలో రూ.1,767 కోట్లు

- మరుగుదొడ్ల నిర్మాణానికి ఇచ్చామని తెలిపిన కేంద్రం
- రాజ్యసభలో ఎంపీ వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబు

సాక్షి, అమరావతి: స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌కు మూడేళ్లలో రూ. 1,767 కోట్లు విడుదల చేసినట్లు పారిశుద్ధ్య శాఖ సహాయ మంత్రి రమేష్‌చందప్ప సోమవారం రాజ్యసభకు తెలిపారు. వైఎస్సార్ సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా 5,94,702 ఇళ్లకు మరుగుదొడ్డి సౌకర్యం లేదని చెప్పారు. రాష్ట్రంలో 8.37 శాతం ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు.

పరిశీలనలో ఐఎన్ఎస్ విరాట్ డీపీఆర్

నౌకాదళ సేవల నుంచి విశ్రమించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విరాట్‌ను హోటల్ కమ్ కన్వెన్షన్ సెంటర్‌గా రూపుదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తమ పరిశీలనలో ఉన్నట్లు రక్షణశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్‌భామ్రే తెలిపారు. సోమవారం రాజ్యసభలో వైఎస్సార్ సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబు ఇస్తూ ఫిబ్రవరిలో రక్షణశాఖకు డీపీఆర్ అందినట్లు చెప్పారు.

చర్చ జరిగేంత వరకు వదిలిపెట్టం

- అవిశ్వాసంపై వైఎస్సార్ సీపీ ఎంపీల స్పష్టీకరణ
- సెంటిమెంట్‌ను గుర్తించి బాబు ఇప్పుడు ప్లకార్డు పట్టుకున్నాడు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంపై తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ ఎంపీలు స్పష్టం చేశారు. సోమవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. అవిశ్వాసంపై చర్చ జరగకూడదన్న ధోరణిలో ప్రభుత్వం సభ నడుపుతోందని మండిపడ్డారు. సభలో ఎంత గందరగోళం ఉన్నప్పటికీ ఆర్థిక బిల్లును ఆమోదింపజేసిన కేంద్రం.. అవిశ్వాసంపై చర్చకు మాత్రం సభ సజావుగాలేదనే వంకను పెడుతోందన్నారు. సభలో తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ఎంపీలు వారి సమస్యలపై నిరసన తెలుపుతుండటంతో ఇదే కారణం చూపుతూ అవిశ్వాసంపై చర్చ జరగనీయకుండా చేయడం సమంజసం కాదన్నారు. ఆరాష్ట్రాల డిమాండ్లపై కేంద్రం ఒక ప్రకటన చేసి సభ సజావుగా జరిగే ప్రయత్నమెందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అవిశ్వాసంపై చర్చ జరిగే వరకు నోటీసులు ఇస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. సభలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా ఉగాది, గుడి పడ్వా పండుగల సందర్భంగా స్పీకర్ ఇచ్చిన విందును వైఎస్సార్‌సీపీ ఎంపీలు బాయ్‌కాట్ చేశారు.

ఇంకెంత కాలం మోసం చేస్తావ్ చంద్రబాబు

ప్రత్యేక హోదా విషయంలో ఇంకెంత కాలం ప్రజల్ని మోసం చేస్తావ్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎంపీ మేకపాటి



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మేకపాటి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, సీనియర్ నేత బొత్స

రాజమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో మొదట్నుంచి మాటలు మార్చి ఇప్పుడు ప్రజల మనోభావాలను గుర్తించి ప్లకార్డు పట్టుకున్నంత మాత్రాన చంద్రబాబును ప్రజలు విశ్వసించరన్నారు. తనను చూసి అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేందుకు కాంగ్రెస్, వామపక్షాలు ముందుకొచ్చాయని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారని, హోదాపై మాటలు మార్చిన చంద్రబాబు తీరుపై అదే కాంగ్రెస్, సీపీఎం, సీపీఐలు తీవ్ర విమర్శలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే.. అప్పుడు కేంద్రంలో వైఎస్సార్‌సీపీది కీలకపాత్ర అవుతుందని, ఆ సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఐక్యత లేకపోవడానికి చంద్రబాబే కారణం

ప్రత్యేక హోదా సాధన విషయంలో ఐక్యత లేకపోవడానికి చంద్రబాబే ప్రధాన కారణమని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. నాలుగేళ్లుగా హోదాపై చంద్రబాబు మాటలు మార్చడం వల్లే ప్రజలు, పార్టీలు ఆయన్ను విశ్వసించడం లేదన్నారు. ముందు నుంచి అన్ని పార్టీలను కలుపుకొనిపోయి ఉంటే ఈ పాటికి హోదా సాధించేవారమన్నారు. గందరగోళం పేరుతో సభను సభాపతి వాయిదా వేయడం సరికాదన్నారు. తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ ప్రస్తావించగానే సభలో 150 మంది ఎంపీలు లేచినిలబడ్డారన్నారు. చర్చకు సిద్ధమంటున్న కేంద్ర హోం మంత్రి.. నిరసన తెలుపుతున్న పార్టీలను ఎందుకు ఒప్పించడం లేదని ప్రశ్నించారు.

వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే: వరప్రసాదరావు



తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఎంపీ వరప్రసాదరావు మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఎలా సాధించాలన్న దానిపై మాట్లాడకుండా జగన్ కేసులను ప్రస్తావిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధి విషయంలో టీఆర్ఎస్ ఎంపీలు సహకరించాలని, అవిశ్వాసంపై చర్చ జరిగే వరకు నిరసన విరమించాలని ఆయన కోరారు. సభ ఆర్డర్‌లో లేకున్నా తమకు అవసరమైన బిల్లులు ఆమోదింపజేసుకొని, అవిశ్వాసంపై చర్చ జరగనీయకుండా చేయడం సరికాదని ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. తీర్మానంపై చర్చ జరిపేందుకు తాము అన్ని పార్టీల నేతలను సంప్రదిస్తామని తెలిపారు.

చంద్రబాబు మనస్తత్వం వల్ల ఏపీ నష్టపోతోంది

- సీఎంపై ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజం
- ముఖ్యమంత్రిది హిట్లర్ మనస్తత్వం.. కొడుకును కూడా నమ్మరు
- ప్రజా సమస్యలపై ప్రధానితో చర్చించాను
- చంద్రబాబు అవినీతిని కూడా ప్రధానికి వివరించాను



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి మనస్తత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. చంద్రబాబుది హిట్లర్ మనస్తత్వమని, హిట్లర్ వల్ల ఒక దేశం ఏవిధంగా నష్టపోయిందో చూశామన్నారు. చంద్రబాబు తన కుమారుడు లోకేశ్‌ను కూడా నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. సోమవారం విజయసాయిరెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తాను ప్రధానిని కలవడంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజా సమస్య పరిష్కారానికి రాజ్యసభ సభ్యుడిగా ప్రధానమంత్రి దగ్గర నుంచి పంచాయతీ సర్పంచ్ వరకు ఎవరినైనా కలుస్తానని, దానికి చంద్రబాబు అనుమతి అవసరంలేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

బాబుకు సమాధానం చెప్పేందుకు సిద్ధం

ప్రధానిని కలిసిన ప్రతిసారి కేసుల గురించి చర్చిస్తున్నానని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణల్లో వాస్తవం లేదని విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. వివిధ కేసుల్లో వస్తున్న రిలీఫ్‌ను న్యాయ వ్యవస్థను మ్యానేజ్ చేయడం ద్వారా పొందుతున్నారన్న చంద్రబాబుకు దమ్ముంటే ఇదే విషయాన్ని మీడియా ముందుకొచ్చి చెప్పాలని సవాల్ విసిరారు. ఒకవేళ చంద్రబాబు మీడియా ముందుకొచ్చి చెబితే దానికి తగిన సమాధానం చెప్పేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలు తగిన సమయంలో బయటపెడతామన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలను తమ పార్టీ ఎప్పటికీ చేయబోదన్నారు. ప్రధానితో గత ఏడాది కాలంలో తాను మూడు, నాలుగుసార్లు సమావేశం అయిఉంటానని, కలసిన ప్రతిసారి ఏపీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దాంతోపాటు చంద్రబాబు రాష్ట్రంలో చేస్తున్న అవినీతి గురించి, ఆయన ఏ విధంగా ప్రజాధనాన్ని హవాలా ద్వారా విదేశాలకు తరలిస్తున్నారో ఆ విషయాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. బాబు అవినీతికి అడ్డుకట్ట వేయాలని కోరానన్నారు.

చర్చను టీడీపీ ఎంపీలు అడ్డుకుంటున్నారు

సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు తాము సిద్ధమేనని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెబుతుంటే వినకుండా టీడీపీ ఎంపీలు అడ్డుకున్నారని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగాలన్న ఉద్దేశంతో తమ పార్టీ ఎంపీలు వారివారి స్థానాల్లో కూర్చున్నారని చెప్పారు. ఇక ప్రత్యేక హోదా సాధనలో తమ పార్టీ విధివిధానాలను తమ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు జరిగినన్ని రోజులూ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి, అవిశ్వాసం పెట్టి అప్పటికీ దిగిరాకపోతే రాజీనామాలు చేస్తామని పునరుద్ఘాటించారు. అలాగే చంద్రబాబు కూడా కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఏమి చేస్తే తానూ అదే చేస్తా అన్న స్వభావాన్ని చంద్రబాబు వదులుకోవాలని సూచించారు.

అవిశ్వాసమంటే బీజేపీకి ఎందుకంత భయం?

ఆర్థికమంత్రి యనమల

సాక్షి, అమరావతి: అవిశ్వాసం అంటే బీజేపీ ఎందుకు భయపడుతోందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. సోమవారం ఆయన వెలగపూడిలో మీడియాతో మాట్లాడుతూ మీ పార్టీ ఎంపీలపై నమ్మకం లేకనే భయపడుతున్నారా అని బీజేపీని ప్రశ్నించారు. మోదీపై అసంతృప్తితో ఉన్న బీజేపీ ఎంపీలు అవిశ్వాసంపై చర్చ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని బీజేపీ భయపడుతున్నట్లుందని వ్యాఖ్యానించారు.

దగాకోరు రాజకీయాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీపార్వతి మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం చంద్రబాబు ఏపీని అవినీతి రాష్ట్రంగా తయారుచేసి దగాకోరు రాజకీయలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీపార్వతి అన్నారు. సోమవారం ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం అబద్దాలు చెప్పి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీకి అన్యాయం చేస్తుంటే చంద్రబాబు అసమర్థ ప్రభుత్వం దాన్ని ఎదుర్కోలేక పోయిందని మండిపడ్డారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు రోజుకో మాట మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హీరోలా పోరాడుతున్నారని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో రాష్ట్రానికి ఏం సాధించావని చంద్రబాబుని ప్రశ్నించారు.

కేంద్రం మ్యాచ్ ఫిక్సింగ్: టీడీపీ

సాక్షి, న్యూఢిల్లీ: అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగనీయకుండా వివిధ పార్టీలతో కేంద్రం మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని టీడీపీ ఎంపీలు విమర్శించారు. సోమవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఆ పార్టీ ఎంపీ తోట నరసింహం మీడియాతో మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మానంపై చర్చ విషయంలో కేంద్రం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. బీజేపీ అంటే బ్రేక్ జనతా ప్రామిసెస్ అని ఎంపీ అవంతి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి అనంత్ కుమార్ రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం స్పీకర్ సభ నడుపుతున్నారని ఆయన విమర్శించారు.



కనీసం మీ 'చక్రం' ఎక్కడుందో గుర్తయినా ఉందా..!?

రాజ్యాంగేతర శక్తులుగా జన్మభూమి కమిటీలు

- జనచైతన్య వేదిక సదస్సులో వక్తల స్పష్టీకరణ
- తక్షణమే రద్దు చేయాలని డిమాండ్


సదస్సులో మాట్లాడుతున్న ఈఏఎస్ శర్మ

సాక్షి, విశాఖపట్నం: రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్న జన్మభూమి కమిటీలను తక్షణమే రద్దు చేయాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు తగినంతగా నిధులివ్వకపోవడమే కాక వాటి హక్కులను హరించివేస్తూ నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. సోమవారం విశాఖ పౌర గ్రంథాలయంలో 'స్థానిక సంస్థల సాధికారిత–జన్మభూమి కమిటీలు' అనే అంశంపై జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఇంధనశాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ మాట్లాడుతూ జన్మభూమి కమిటీలు పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఈ కమిటీల సిఫార్సులు లేనిదే కలెక్టర్ పెన్షను కూడా మంజూరు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల తీర్మానాలకు భిన్నంగా మైనింగ్ కార్యకలపాలు సాగిస్తున్నారన్నారు. ఇది సుప్రీం తీర్పుకు విరుద్ధమన్నారు. అమరావతి సీఆర్‌డీఏలో అంతా అధికారులే ఉన్నారని, నిబంధనల ప్రకారం ఎన్నికైన పాలకవర్గ సభ్యులు అందులో లేకపోతే చట్టరీత్యా చెల్లదని చెప్పారు. అమరావతిలో రైతుల నుంచి సేకరించిన వేల ఎకరాల భూములు ఖాళీగా ఉండడం ఆవేదన కలిగిస్తోందన్నారు. జన్మభూమి కమిటీలు రాజ్యాంగేతర శక్తులుగా మారి స్థానిక సంస్థల సాధికారితను ప్రశ్నార్థకం చేస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ విమర్శించారు.

సమాంతర పాలన చేస్తున్న జన్మభూమి కమిటీలు

మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేత డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ గ్రామాల్లో జన్మభూమి కమిటీలు సమాంతర ప్రభుత్వంలా పాలన సాగిస్తున్నాయన్నారు. విశాఖ మన్యంలో లేటరైట్ పేరిట జరుగుతున్న తవ్వకాల ద్వారా వచ్చే సెస్ సంబంధిత పంచాయతీలకు చెల్లించడం లేదన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ జన్మభూమి కమిటీలను రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినా నేటికీ రద్దు కాలేదన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ చైర్మన్, ఏయూ మాజీ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై గ్రామాల్లో అవగాహన ఉండడం లేదని ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బోడేపూడి ప్రసాదరావు అన్నారు. సీపీఎం నాయకురాలు, జీవీఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ పండుటాకులకు పింఛన్, అర్హులకు రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు వంటివి జన్మభూమి కమిటీలకే అప్పగించడంతో ఆ సభ్యులు అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టబద్ధ పాలనకు బదులు టీడీపీ కార్యకర్తల పాలన సాగుతోందని, గ్రామ స్వరాజ్‌కు బదులు ఎమ్మెల్యే రాజ్ నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో వందల పంచాయతీలు, పురపాలక సంఘాలు, కార్పొరేషన్లకు ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుడా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని విమర్శించారు. సదస్సులో విశాఖ జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్ చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త కోలా గురువులు, సీపీఐ నేత డి.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

టెట్‌లో 43 శాతం ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి గంటా
- 4.14 లక్షల మందికి 1.78 లక్షల మంది ఉత్తీర్ణత

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష–2017 (టెట్)లో 43 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 4,14,120 మంది పరీక్షలు రాయగా అందులో 1,78,071 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో సోమవారం ఆయన టెట్ పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేపర్–1 పరీక్షను 1,73,861 మంది రాయగా 57.88 శాతం మంది (1:6) ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. పేపర్–2 పరీక్షను 1,81,734 మంది రాయగా గణితం, సైన్స్ విభాగంలో 37.26 శాతం (1:4) మంది, సోషల్ విభాగంలో 38.22 శాతం (1:4) మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పేపర్–3లో 58,525 మంది పరీక్ష రాయగా 42.60 శాతం మంది (1:4) ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. అన్ని పేపర్లలో కలిపి 25 శాతం మంది 90 కంటె ఎక్కువ మార్కులు పొందారని తెలిపారు. 190 ఆన్‌లైన్ సెంటర్లలో ఫిబ్రవరి 21 నుంచి మార్చి రెండో తేదీ వరకూ పది రోజుల పాటు టెట్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ప్రాథమిక కీని ఈ నెల నాలుగో తేదీన విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించామని, వీటి ప్రకారం పేపర్–1లో ఐదు మార్కులు, పేపర్–2 (గణితం, సైన్స్)కు 8 మార్కులు, సోషల్‌కు మూడు మార్కులు మొత్తం 16 మార్కులు కలిపామని తెలిపారు. తుది కీని మార్చి 13న విడుదల చేశామన్నారు. జవాబులు సరిగా కనిపించలేదని ఫిర్యాదు చేసిన కారణంగా 84 మంది ఫలితాలను నిలిపివేశామని, పూర్తిగా పరిశీలించి పదిరోజుల్లో వారి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. జనరల్ అభ్యర్థులకు 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం అర్హత మార్కులుగా నిర్ణయించామని తెలిపారు. ఫలితాలను cse.ap.gov.in, aptet.apcfss.in చూడవచ్చని తెలిపారు. డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన ఫైలు ఆర్థిక శాఖకు పంపించామని అక్కడి నుంచి ఆమోదం లభించగానే నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ వారంలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని, రెండు, మూడురోజుల్లో దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు జరుగుతోందని తెలిపారు.

కర్నూలు జిల్లా అభ్యర్థికి టెట్‌లో స్టేట్ ఫస్ట్

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో కర్నూలు నగరానికి చెందిన సి.భారతి అనే అభ్యర్థి పేపర్–1లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు (141 మార్కులు, హాల్ టిక్కెట్ నంబర్ 17113143 02459) సాధించారు. సోమవారం వెలువడిన టెట్ ఫలితాల్లో భారతి స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో సత్తా చాటారు. కర్నూలుకు చెందిన సి.పద్మాజీరావు, హేమ దంపతుల రెండో కుమార్తె భారతి 2014–16 విద్యా సంవత్సరంలో డీఎడ్ పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే టెట్ పేపర్–1లో స్టేట్ ఫస్ట్‌ర్యాంక్ సాధించడంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- విజయవాడలో భారీ ర్యాలీ
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్..
- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ, సీపీఎం
- ఆందోళనపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం విఫలయత్నం

సాక్షి, అమరావతి


తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ విజయవాడ అలంకార్ సెంటర్లోని ధర్నాచౌక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం విజయవాడలో కదం తొక్కారు. రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొని తమ నిరసన తెలియజేశారు. వేతనం రూ.18 వేలకు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె బకాయిలు చెల్లించాలని, సూపర్‌వైజర్ల నియామకాల్లో కార్యకర్తలకు సీనియారిటీ ప్రకారం అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్ రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినదించారు. విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, అధ్యక్షురాలు బేబీరాణి, ఏపీ శ్రామిక మహిళా కన్వీనర్ కె.ధనలక్ష్మి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరావు, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి కె.పార్థసారథి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వీరికి సంఘీభావం తెలిపారు. పార్థసారథి మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యలపై పోరాడుతుంటే ప్రభుత్వం దౌర్జన్యానికి దిగుతోందని మండిపడ్డారు. అంగన్‌వాడీల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీపీఎం నేత మధు మాట్లాడుతూ.. తెలంగాణలో మాదిరిగా జీతాలు పెంచి ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జేడీ శివపార్వతి, ఐసీడీఎస్ కృష్ణా జిల్లా పీడీ కృష్ణకుమారి స్పందిస్తూ.. అద్దె బకాయిలు త్వరలోనే విడుదల చేస్తామని, మిగిలిన సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

ఎక్కడికక్కడ అరెస్టులు..

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర సర్కార్ ప్రయత్నించింది. అన్ని జిల్లాల్లో ఎక్కడికక్కడ ఆదివారం రాత్రి నుంచి అరెస్టులు చేపట్టింది. పలువురు యూనియన్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పలువురిని గృహనిర్బంధంలో ఉంచింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 317 మందిని ముందస్తు అరెస్టు చేయగా.. 78 మందిని బైండోవర్ చేశారు. మరోవైపు వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వర్గీయులు అంగన్‌వాడీ నాయకులకు ఫోన్లు చేసి.. విజయవాడ ధర్నాకు వెళ్లవద్దని బెదిరించినట్లు తెలిసింది.

25న తిరుమలలో హనుమంత వాహనసేవ

26న శ్రీరామపట్టాభిషేకం


హనుమంతవాహనంపై మలయప్పస్వామివారు (ఫైల్)

సాక్షి, తిరుమల: శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 25న హనుమంత వాహన సేవలో భాగంగా శ్రీరామచంద్రమూర్తి రూపంలో మలయప్పస్వామి ఊరేగనున్నారు. ఆరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు తిరుమల మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 26న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు బంగారువాకిలిలో ఆస్థానం, తర్వాత శ్రీరామ పట్టాభిషేకాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఇందులో భాగంగా 25న సహస్రదీపాలంకార సేవలు, 26న వసంతోత్సవ సేవను రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

ఉంచుతారా.. పంచుతారా?

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న నీటి పంపకాలపై చర్చించేందుకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ మంగళవారం భేటీ కానుంది. శ్రీశైలంలో కనీస మట్టాలకు దిగువన ఎంత వరకు వెళ్లి నీటిని వినియోగించుకోవాలి.. అలాగే సాగర్‌లో కనీస నీటి మట్టానికి దిగువకు వెళ్లే అంశంపై చర్చించనుంది. శ్రీశైలంలో 800 అడుగుల వరకు నీటిని వినియోగించాలని గతంలో నిర్ణయించారు. అయితే 800 అడుగుల మేర దిగువకు వెళ్లిన లభ్యత జలాలు 10 టీఎంసీలకు మించి వినియోగించుకునే అవకాశం లేకపోవడంతో ఇప్పుడు దృష్టి సాగర్‌పై పడింది. సాగర్‌లో ప్రస్తుతం 522.3 అడుగులకు నీటి మట్టాలు చేరగా, 154 టీఎంసీల మేర లభ్యత ఉంది. ఇందులో వినియోగానికి 22 టీఎంసీలు మాత్రమే ఉంది. రాష్ట్ర సాగు, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల తాగు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మే నెలాఖరు వరకు 510 అడుగుల దిగువకు వెళ్లేది లేదని తెలంగాణ స్పష్టం చేస్తోంది. అయితే తమ రాష్ట్ర అవసరాల దృష్ట్యా ఈ నెలాఖరు నుంచే 500 అడుగుల వరకు వెళ్లి నీటిని తీసుకునే అవకాశం ఇవ్వాలని ఏపీ కోరుతోంది. ఈ నేపథ్యంలో బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ కీలకంగా మారింది. ఇందులో ఇరు రాష్ట్రాల తాగు, సాగు అవసరాలతో పాటు సాగర్‌లో కనీస నీటి మట్టాలను మెయింటెన్ చేయాలా.. లేక దిగువకు వెళ్లేందుకు అనుమతించాలా.. అనేది నిర్ణయించనున్నారు.

సాక్షి
మంగళవారం, మార్చి, 20


రాహుల్ నేర్వాల్సిన పాఠం

గత సార్వత్రిక ఎన్నికల్లో చావు దెబ్బ తిన్న తర్వాత అస్తిత్వ సంక్షోభంలో కూరుకు పోయిన కాంగ్రెస్ పార్టీ తన 84వ ప్లీనరీ సమావేశాలను న్యూఢిల్లీలో మూడు రోజులపాటు జరుపుకుంది. కాంగ్రెస్ ప్రస్తుతున్నంత బలహీనంగా గతంలో ఎప్పుడూ లేదు. లోక్‌సభలో ఆ పార్టీ బలం పట్టుమని 50 కూడా లేదు. దేశంలో ఇప్పుడు కేవలం మూడంటే మూడుచోట్ల మాత్రమే అధికారంలో ఉంది. అందులో కర్ణాటక ఒక్కటే చెప్పుకోదగ్గ రాష్ట్రం. మిగిలిన రెండూ–పుదుచ్చేరి, మిజోరం చిన్న రాష్ట్రాలే. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడం, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పుకోదగ్గ రీతిలో సీట్లు సాధించడం మాత్రమే ఆ పార్టీకి కాస్త ఊరట. ఈ నేపథ్యంలో ప్లీనరీ చివరిరోజైన ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభ్యులనుద్దేశించి గంటకుపైగా మాట్లాడారు. కొన్ని కీలక సందర్భాల్లో తన ప్రవర్తనాశైలితోనూ, తోచినట్టు మాట్లాడే తన వైఖరితోనూ గతంలో పార్టీని ఇబ్బందులపాలు చేసిన రాహుల్‌గాంధీ ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చాక క్రమేపీ మారుతూ వచ్చారు. అంతర్గతం ఆయన్ను 'పప్పు' అని సంబోధించినవారి నోళ్లు మూతబడే స్థాయిలో ఈ మార్పు కనబడటం మొదలైంది. స్వయంగా నేర్చుకుంటున్న పాఠాలో, సలహాదారుల చలవో... ఆయన తీరుతో దిగాలుపడి ఉన్న కాంగ్రెస్‌కు ఎంతో కొంత ఉత్సాహం పుట్టుకొస్తున్నదైతే నిజం. ముగింపు ప్రసంగం కూడా ఈ కొత్త ఒరవడినే చూపింది. బీజేపీ, ఆరెస్సెస్‌లను కౌరవులుగాను తమ పార్టీని పాండవులుగాను అభివర్ణించి, వచ్చే సార్వత్రిక ఎన్నికలను కురుక్షేత్ర యుద్ధంతో పోల్చారు. అది సత్యానికి, అసత్యానికి మధ్య జరిగే సంగ్రామమని అభివర్ణించారు.

అధికారంలో ఉన్న పార్టీకి ఎన్నో ప్రయోజనాలు, అనుకూలతలు ఉన్నట్టే ఇబ్బందులు కూడా అధికమే. కీలక బాధ్యతల్లో ఉన్నవారు నిరంతరం ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎక్కడేం జరుగుతున్నదో గమనించుకుంటూ దిద్దుబాటు చర్యలు తీసుకుంటూ ఉంటే నష్టాలను పరిమిత స్థాయికి తగ్గించుకోవచ్చు. అందుకు భిన్నంగా ఉంటే ఎదురు దెబ్బలు తప్పవు. గత సార్వత్రిక ఎన్నికల నాటికి వరసగా పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ కన్నూ, మిన్నూ కానని స్థితికి చేరుకుంది. పార్టీ ఎదుగుదల కాంక్షించి పనిచేసేవారిని శత్రువులుగా పరిగణించడం, భజనపరులను ప్రోత్సహించడం, వారు చెప్పినట్టల్లా నిర్ణయాలు తీసుకోవడం పెరిగిపోయింది. కనీసం వార్డు సభ్యులుగా గెలవలేనివారు సైతం సోనియా విధేయులమని చెప్పుకుని ఓ వెలుగు వెలిగారు. అదే సమయంలో తన నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై ఆరోపణల జోరు పెరుగుతున్నా పార్టీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడానికి, సమర్థించుకోవడానికి అది అప్పుడప్పుడు ప్రయత్నించిన పోలేదుగానీ... అవి ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజార్చాయి. ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న సమస్యలు వేరు. గోరక్షణ పేరిట, దేశభక్తి పేరిట, సంస్కృతి పేరిట పలు రాష్ట్రాల్లో మూక దాడులు పెరిగిపోతున్నా వాటిని నివారించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో అది విఫలమైంది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని వాటికి వ్యతిరేకంగా ప్రకటించేదేవరకూ కింది స్థాయి నాయకులు వాటిని తేలిగ్గా తీసుకున్నారు. కొన్ని సందర్భాల్లో సమర్థించారు. ఇక పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వగైరాల వల్ల పౌరులు పడిన యాతనల విషయంలోనూ సరైన స్పందన లేదు. నీరవ్‌మోదీ తదితరులు దేశం విడిచి వెళ్లిపోవడంలాంటి ఉదంతాలు అప్రదిష్ట కలిగించాయి. ఈ నేపథ్యంలో సహజంగానే రాహుల్‌గాంధీ విమర్శల పదును పెరిగింది. అధికారంలో కొస్తే రైతుల రుణాలు మాఫీ చేస్తామని, పేదలకు చేకూరే లబ్ధిని ఆధార్‌తో అడ్డుకోకుండా చూస్తామని ప్లీనరీ భరోసా ఇచ్చింది.

విపక్షంలో ఉన్నందువల్ల వచ్చిన వెసులుబాటు వల్ల విమర్శలు కురిపించడం బాగానే ఉన్నా... ప్రస్ఫుటమైన రీతిలో ఆత్మ విమర్శ కూడా అవసరమని, అది నోటిమాటగా మాత్రమేకాక ఆచరణలోనూ కనబడాలని గుర్తించడంలో మాత్రం రాహుల్ విఫలమయ్యారు. తాము ప్రస్తావించిన కుంభకోణాలకైనా, నిరుపేద జనాన్ని ఇబ్బందులపాలు చేస్తున్న ఆధార్‌కైనా మూలాలు తమ పాలనలోనే ఉన్నాయని రాహుల్ గుర్తించినట్టు లేరు. ఆధార్ ప్రాజెక్టును ప్రారంభించిననాడు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ అదొక గుర్తింపు కార్డు మాత్రమేనని చెప్పారు. తీరా దాన్ని తప్పనిసరి చేస్తూ పోయింది ఆనాటి యూపీఏ ప్రభుత్వమే. రైతుల రుణాలు తాము అధికారంలోకొస్తే మాఫీ చేస్తామని చెబుతున్నారుగానీ... సాగుబడి వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధికంగా మద్దతు ధర నిర్ణయించాలన్న స్వామినాథన్ కమిషన్ నివేదికను యూపీఏ పాలనలో చిత్తశుద్ధితో అమలు చేసి ఉంటే వేలాదిమంది రైతుల విలువైన ప్రాణాలు దక్కేవి. వ్యవసాయం ఇంత గడ్డు స్థితికి చేరుకునేది కాదు. మరోసారి రుణమాఫీ అవసరమే వచ్చేది కాదు.

పార్టీలో యువ రక్తాన్ని నింపి సంస్థాగతంగా దాన్ని బలోపేతం చేస్తానని రాహుల్ హామీ ఇచ్చారు. పార్టీ కోసం అహర్నిశలూ కృషి చేసే యువతీయువకులకు ఇకపై అగ్ర ప్రాధాన్యమిస్తామని... వారికి వృద్ధతరం నేతలు మార్గదర్శకులుగా ఉంటారని కూడా చెప్పారు. రివాజుకు భిన్నంగా ప్లీనరీ వేదికపై తాను తప్ప ఎవరూ లేకపోవడాన్ని ఎత్తిచూపుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను కులాలు, మతాలకు అతీతంగా ఇక్కడకు తీసుకొస్తానని చెప్పారు. తీరా 24 మందితో కూడిన పార్టీ వర్కింగ్ కమిటీకి ఎన్నికలు కాకుండా నామినేట్ చేసే సంస్కృతినే కొనసాగిస్తూ ప్లీనరీ తీర్మానించింది. కేవలం గంభీరమైన ఉపన్యాసాలిచ్చి, ప్రత్యర్థులపై పిడుగులు కురిపించి తిరిగి గత వైభవాన్ని సాధించవచ్చనుకుంటే రాహుల్ పొరబడినట్టే. మాటలకు తగ్గ చేతలు, విమర్శతోపాటు ఆత్మ విమర్శ ఉన్నప్పుడే పార్టీ పట్ల జనంలో విశ్వాసం పెరుగుతుంది. అధికారం దక్కడం మాట అటుంచి ముందు సంస్థాగతంగా బలోపేతమవుతుంది. ఆ సంగతి రాహుల్ గ్రహించాలి.



వైఫల్యాల పట్ల పశ్చాత్తాపం చెందనివాడు, స్వీయలోపాల పట్ల కలికానికన్నా ఆత్మ విమర్శ చేసుకోని వాడు మంచి నేత కాడు.

– రాయ్ క్రోజ్
అమెరికన్ వాణిజ్యవేత్త

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్రమాసం తిథి శు.తదియ సా.5.02 వరకు, తదుపరి చవితి, నక్షత్రం అశ్వని రా.8.04 వరకు తదుపరి భరణి, వర్జ్యం సా.4.05 నుంచి 5.40 వరకు, తదుపరి తె.5.24 నుంచి 6.57 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం ఉ.8.32 నుంచి 9.20 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.43 వరకు, అమృతఘడియలు ప.12.56 నుంచి 2.30 వరకు.


సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.09	మగ్రీబ్	6.27
జొహర్	12.24	ఇషా	7.39
అసర్	4.45		


వీల్‌చైర్ నుంచి విశ్వదర్శనం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మానవజాతి క్రమంగా రోదసిని నివాసయోగ్యం చేసుకోకపోతే భవిష్యత్తు ప్రమాదంలో చిక్కుకోవచ్చని హాకింగ్ ఊహించాడు. 'ఆకస్మికంగా భూగోళం వేడెక్కిపోవడం, అణ్వస్త్ర యుద్ధాలు, కృత్రిమ పద్ధతుల ద్వారా జన్యుకణాలలో వ్యాప్తి చెందే వైరస్ తదితర ప్రమాదకర ప్రయోగాలతో భూప్రపంచంపై జీవరాశి ప్రమాద స్థితికి చేరువ కావచ్చునని హెచ్చరించాడు. సైన్స్, టెక్నాలజీ, రోదసీ, సౌరమండల వ్యవస్థ పరిణామాలను సాధారణ పాఠకులకు అందుబాటులోకి తెచ్చిన బహుకొద్దిమంది శాస్త్రవేత్తలలో హాకింగ్ ఒకరు.

రెండో మాట



'నేను నాస్తికుడిని. భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్తను. ఖగోళ శాస్త్రవేత్తను. ప్రపంచ ఆవిర్భావం, దాని ఉనికికి సంబంధించిన విశ్వదర్శనంలో శిథిల శరీరంతోనే దూర తీరాలు ప్రయాణించి శాస్త్ర పరిశోధనలు కొనసాగించిన నేను సృష్టికి కారకుడు దేవుడు కాదు, దేవుడే లేడన్న నిర్ణయానికి వచ్చాను. ఎందుకంటే విజ్ఞానశాస్త్రాన్ని (సైన్స్) అర్థం చేసుకోవడానికి ముందు మానవుడు ఈ విశ్వసృష్టికి కారకుడు దైవం అని భావించడం సహజం. కానీ శరవేగాన దూసుకుపోతూ ప్రగతిమార్గంలో ఉన్న విజ్ఞానశాస్త్రం అనేక పరిశోధనల తరువాత విశ్వసృష్టికి కారణాన్ని మరింత విశ్వసనీయతతో, వైజ్ఞానికంగా వివరించసాగింది. దైవ భావన ఉద్దేశం మాకు (శాస్త్రవేత్తలు) తెలుసునంటే అర్థం ఆ దైవానికి తెలిసిన ప్రతి విషయమూ మాకు తెలుసునని చెప్పడమే, దేవుడనేవాడుంటే, గింటే! నిజానికి అతడు లేడు. కనుకనే నేను నిరీశ్వరవాదిని, నాస్తికుడిని. దైవం ఉనికిని నా శిథిల శరీరమే ప్రశ్నిస్తోంది.'

– స్టీఫెన్ హాకింగ్ (విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త. ఇటీవల కన్నుమూశారు)

'రెండు ప్రశ్నలు: 1. భగవంతుడు సృష్టికి కారకుడా? 2. కనీసం దేవుడికి ఈ సృష్టి ఎలా జరిగిందో తెలుసా? నిజం చెప్పాలంటే సృష్టి జరిగిన తరువాత వచ్చినవాడు భగవంతుడు. కాబట్టి దేవుడు సృష్టికర్త కాజాలడు. ఈ కారణం చేతనే ఈ సృష్టి ఎలా జరిగిందన్న విషయం కూడా భగవంతుడికి తెలియదు.'

– నాసదీయ సూక్తం (రుగ్వేదం, 10వ మండలం, 129వ సూక్తి)

అంటే రుగ్వేదకాలం నాటికే భారతీయ భౌతికవాదం ప్రచలితమవుతోందన్నది సుస్పష్టం. వివేచనతో, హేతుబద్ధతతో కూడిన వ్యాఖ్యానాలు ఈ భౌతికవాద ప్రపంచానికి అందుతూనే ఉన్నాయి. క్రీస్తుపూర్వం 2–4 శతాబ్దాలలోనే గణితశాస్త్రంలో ప్రసిద్ధుడైన యూక్లిడ్‌కు ఎంతో ముందే ఈ శాస్త్రంలో కొత్త పుంతలు తొక్కి, కొత్త భావధారకు రూపురేఖలు అద్దిన త్రయం– జీనో (క్రీ.పూ. 495–435), యూడోక్సిస్ (క్రీ.పూ. 408–355), ఆర్కిమెడిస్ (క్రీ.పూ. 287–212). ముగ్గురూ గ్రీకులే. ఇక ఆర్యభట్టు (క్రీ.శ.490–599), భాస్కరాచార్య (క్రీ.శ. 6వ శతాబ్దం) భారతీయ మహా గణిత, భౌతికశాస్త్రవేత్తలు. వీరంతా ఆధునిక ప్రపంచ భౌతిక విజ్ఞాన, ఖగోళ శాస్త్రవేత్తలు, అణు విజ్ఞానశాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్, పెన్‌రోజ్ వీలర్, స్టీఫెన్ హాకింగ్‌లకు గౌరవనీయులైన మార్గదర్శకులే. ప్రపంచం పరస్పర ఆధారంతో ప్రభావితమవుతుందని తన సాధారణ సాపేక్ష, విశుద్ధ (ప్రత్యేక) సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, అణు శాస్త్ర విజ్ఞాన పరిధిని విస్తరించిన ఐన్‌స్టీన్ ఇటీవల దివంగతుడైన హాకింగ్‌కు గురుతుల్యుడే. కౌమారం దాటక ముందే దారుణమైన నరాల వ్యాధితో, శిథిల దేవాలయంగా మిగిలిన శరీరంతో దాదాపు 50 ఏళ్లు బతికాడు హాకింగ్. వీల్‌చైర్‌కు పరిమితమై రోదసీ, నక్షత్ర సౌర మండల పరిశోధనలను కొనసాగించడంలోని విశేషం– ఆయన మేధస్సు నిరంత పరిశోధనా తృష్ణతో ప్రకాశిస్తూ ఉండడమే. అందుకే ఇటీవలనే దక్షిణ కొరియాలో (ప్యాంగ్‌చాంగ్) జరిగిన పారాలింపిక్స్‌లో అంగ వైకల్యం కలిగిన కొందరు క్రీడాకారులు హాకింగ్‌కు ఘన నివాళి అర్పించారు. దివ్యాంగులకు హాకింగ్ గొప్ప స్ఫూర్తి. అంతకు ముందు హాకింగ్ దివ్యాంగులైన క్రీడాకారులకు ఆర్ద్రమైన సందేశం ఇచ్చారు: 'మీరు చూడవలసింది అంతరిక్షంలో తారాడుతున్న నక్షత్రాలకేసే. నాలా వైకల్య స్థితిలో ఉన్న మీ పాదాల కేసి మాత్రం మీ చూపులను నిలపకండి!'

విశ్వవీక్షకుడు

విశ్వవీక్షణ ఫలితాలకు అక్షర రూపమిస్తూ హాకింగ్‌తో పాటే ఉంటూ, తుది పత్ర రచనకు రూపకల్పన చేసిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ థామస్ హెర్డాగ్. ఈ తుది పత్రంలోనే తన 'బ్లాక్ హోల్స్(కృష్ణబిలాలు) సిద్ధాంతాన్ని హాకింగ్ సమర్థించుకోవడానికి కొన్ని భావనలు చేశారు. ఈ పరిశోధనలకు అంతుండదు. అందుకే వాటిని శాస్త్రవేత్తల సమ్మతి పొందేవరకు సమాజానికి విడుదల చేయరు. మూఢ విశ్వాసులకు, మత ఛాందసులకు, వారి సంఘ వ్యతిరేక ధోరణులకు; హేతువాదానికి మధ్య తేడా, అసలు ఘర్షణ ఈ బిందువు దగ్గరే ఆరంభమవుతుందని గ్రహించాలి. భౌతిక ప్రపంచానికి పరిణామవాదమనే విలువైన కానుకను అందించిన చార్లెస్ డార్విన్‌ను ఇటీవలే కేంద్ర మంత్రి ఒకరు గేలి చేశారు. అలా తన అజ్ఞానాన్ని చాటుకున్నారు. తాజాగా పదార్థ సాంద్రత, దానిలోని శక్తి గురించి వెల్లడిస్తూ ఐన్‌స్టీన్ వెల్లడించిన (ఇ=ఎంసి స్క్వేర్) సిద్ధాంతాన్నీ, హాకింగ్ కృష్ణబిలాల సిద్ధాంతాన్ని విమర్శిస్తూ 'అన్నీ వేదాలలోనే ఉన్నాయిష' రీతిలో మరో కేంద్రమంత్రి హర్షవర్ధన్ చెప్పారు. అసలు సాపేక్ష సిద్ధాంతం కన్నా విశిష్టమైన సిద్ధాంతం వేదాలలోనే ఉందని హాకింగ్ చెప్పాడని కూడా ఆ మంత్రి చెప్పారు. దీనికి ఆధారాలు ఏమిటని అడిగితే అడ్డదిడ్డమైన సమాధానం చెప్పి తప్పించుకున్నారాయన. రేపు ఇలాంటి వాదనలు ఇంకా పుట్టవచ్చు. ఎందుకంటే డార్విన్ పరిణామవాదాన్ని కనీసం దశావతారాల కోణం నుంచి కూడా చూడలేని అంధులయ్యారు ఈ మూర్ఖశిఖామణులు.

గొప్ప హెచ్చరిక

ముందు ముందు మానవజాతి క్రమంగా రోదసిని నివాసయోగ్యం చేసుకోకపోతే భవిష్యత్తు ప్రమాదంలో చిక్కు కోవచ్చని హాకింగ్ ఊహించాడు. ఇందుకు కారణాన్ని కూడా పేర్కొన్నాడు: 'ఆకస్మికంగా భూగోళం వేడెక్కిపోవడం, అణ్వస్త్ర యుద్ధాలు, కృత్రిమ పద్ధతుల ద్వారా జన్యుకణాలలో వ్యాప్తి చెందే వైరస్ తదితర ప్రమాదకర ప్రయోగాలతో భూప్రపంచంపై జీవరాశి ప్రమాద స్థితికి చేరువ కావచ్చునని హెచ్చరించాడు. 'కృత్రిమ మేధస్సు' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యంత్రాన్ని సృష్టించుకోవడం ద్వారా కొన్ని రోగాలను, దారిద్ర్యాన్ని అదుపు చేయడానికి తోడ్పడవచ్చునేమోగానీ, దాని వల్ల చాలా ప్రమాదాలు, పొంచి ఉంటాయని ముందస్తుగా హెచ్చరించినవాడు హాకింగ్. సైన్స్, టెక్నాలజీ, రోదసీ, సౌర మండల వ్యవస్థ పరిణామాలను సాధారణ పాఠకులకు అందుబాటులోకి తెచ్చిన బహుకొద్దిమంది శాస్త్రవేత్తలలో హాకింగ్ ఒకరు.

రాజకీయ పరిణామాలపై కూడా నిశిత వ్యాఖ్యలు చేయగల నిపుణ శాస్త్రవేత్త ఆయన. కనుకనే 'బుద్ధి జాడ్య జనితోన్మాది'గా పలువురు ప్రపంచ వ్యాఖ్యాతలు, నాయకులు ప్రెసిడెంట్ ట్రంప్‌ను అంచనా కడుతున్న పరిణామాన్ని గమనించిన హాకింగ్, 'తన ఎన్నికకు ముందు ట్రంప్ పేదవాళ్ల ప్రతినిధిగా తనను చిత్రించుకోడానికి ప్రయత్నించిన పచ్చి వదరుబోతు' అన్నాడు. నిజానికి మానవజాతిలో, దేశ దేశాల పాలకుల్లో 'బ్లాక్ హోల్స్' ఉంటారని ఊహించిన హాకింగ్ నిరంతరం ప్రజా బాహుళ్యాన్ని హెచ్చరిస్తూ సామాజిక చైతన్యాన్ని పెంచడానికి ప్రయత్నించిన కమ్యూనిస్టు– సోషలిస్టు మానవతావాది. ఆయన కుటుంబ పునాదులే సమాజవాదం, సమానత్వ సిద్ధాంతాలు. ఆయన 'బ్లాక్ హోల్స్' సిద్ధాంతం, ఆ 'కృష్ణబిలాలు' ఎంత ఆకర్షణీయమైన అంశంగా మారాయంటే అవి భౌతిక విజ్ఞాన శాస్త్రానికి చెందిన ప్రాథమిక భావనలకు నాటికీ నేటికీ పెద్ద సవాళ్లుగా మారాయి.

అంతు చిక్కనివి అనేకం

ఆకాశంలో మన కంటికి కనిపించేవి కొన్ని వస్తువులే. కానీ టెలిస్కోప్స్‌లో కనిపించేవి మరికొన్ని, అలాగే ఏ దృష్టికీ అంతు చిక్కనివి అనేకం. అలాంటి వాటిని కనిపెట్టే యత్నంలో లాప్లస్, హాకింగ్‌ల పరిశోధనల్లో అందినవని భావిస్తున్న 'కృష్ణ బిలాలు' ఒక భాగం. 'బ్లాక్ హోల్' పదంలో అర్థవంతమైన ఆంతర్యం ఉంది. ఆ 'కృష్ణ బిలం ప్రాంతం దిశగా చివరికి కాంతి కిరణం ప్రయాణించినా ఆ కిరణాన్ని పట్టుకుని బ్లాక్ హోల్ తనలోకి గుంజేసుకుంటోంది'. పదార్థం లేదా శక్తీ నశించటం ఉండదు, కానీ ఒక రూపం నుంచి మరో రూపంలోకి (రూప పరివర్తన) మారుతుంది.

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న సామెత లాగా వేదాల్లో లేనిది లేదు, సర్వం వేదమయం, ప్రపంచ విజ్ఞాన శాస్త్రాలన్నింటికీ వైజ్ఞానిక కేంద్ర భూమిక వేద వాఙ్మయం– నిజమే ఒప్పుకుందాం. కానీ ఆ మహత్తర వాఙ్మయం వృద్ధిలోకి రాకుండా అడ్డుకున్నవాడెవడు? అడ్డుకునే స్వార్థపరులైన బ్రిటిష్ సామ్రాజ్య పాలకులకన్నా ముందు వైదిక శాస్త్రవాదులు మన స్వీయప్రతిభను ఎందుకు విస్తరించలేకపోయారు? వేల సంవత్సరాల వేద కాలం నాటికే చార్వాకుడు, కపిలుడు, వాత్సాయనుడు, బుద్ధుడు లాంటివారు ప్రవేశపెట్టిన హేతువాదాన్ని, భౌతికవాదాన్ని ఎందుకు ఎదగనివ్వకుండా అడ్డుకట్టలు వేయాల్సి వచ్చింది? అణువును బద్ధలుకొట్టలేమని ఒకప్పుడు పాశ్చాత్యులే నిర్ణయించి నిస్తేజులై ఉన్న సమయంలో ప్రాచీన కాలంలోనే మన కపిలుడు అణువు రహస్యాన్ని ఛేదించి 'పేలవః పేలవః పేలవః' సిద్ధాంతం రూఢి పరచగా, ఆ తరువాత ఆ సిద్ధాంతం ఆచరణలో ముందుకు సాగకుండా అడ్డుకున్న వారెవరు? స్వార్థ ప్రయోజనాల కోసం, ఉచితంగా ప్రజల శ్రమశక్తిని దోచుకుని సంపదను అనుభవిస్తూ యాచక వృత్తిని ఒక ఉపాధి మార్గంగా భావించి ప్రోత్సహించిన స్వార్థపర శక్తులే దేశంలో భౌతికవాద వినాశనానికి క్రమంగా గోతులు తవ్వాయి. మైథిలీ భాషావేత్త, సుప్రసిద్ధ సాహితీ, తాత్విక, భౌతికవాద ఆచార్యుడయిన పండిత హరిమోహన్ ఝా 'దుర్గా స్తోత్ర పారాయణం' గురించి పురాణ కాలక్షేపం చేస్తూ ''రూపం 'దేవి'/ జయం 'దేహి'/ యశో 'దేహి'/ ద్విషో దేహి'' అంటూ స్తోత్రం చదువుతున్నారు. ఒకరు ప్రశ్నించాడట. అసలు ఈ యాచించే ప్రవృత్తి, సంస్కృతి ఎక్కడినుంచి వచ్చిందని. అందుకు సమాధానంగా పండితుడు ''అరె అబ్బీ! ఈ రోగం చాలా పాతదిరా. వేద కాలం నుంచీ మన నాలుకల మీద 'ద' కూర్చుని ఉంది'' అన్నాడు. 'దేహి/దేహి/దేహి!' అందరి దేవతలతో మనకున్న సంబంధం ఒకే ఒక అక్షరం ద్వారానే– 'దే'. చివరికి ఉపనిషత్తు కూడా 'ద, ద, ద' (దానం/దయ/దమనం) అనే గురు మంత్రమే తీసుకొచ్చింది.


ఇలా వేదం, ఉపనిషత్తు రెండింటి ముగింపు 'ద'అక్షరంతోనే మొదలవుతుంది. చివరికి దర్శనం కూడా 'ద'అక్షరంతోనే ఆరంభమవుతుంది. అసలు మన సంస్కృతే 'దానం' పైన ఆధారపడి ఉంది. అంటే, శ్రమ చేసుకోకుండా ఇలా యాచక ప్రవృత్తి (దేహి)నే బతుకులు చాలించుకోమన్న సిద్ధాంత బోధ వల్లనే దేశంలో భౌతికవాదం ఎదగకుండా స్వార్థపరులు జాగ్రత్త పడ్డారని ఝా నిర్ధారించాడు. చివరికి ప్రాచీన సాహిత్యంలో జాబాలి రాముడికి చేసిన బోధలు భౌతికవాదమే. చార్వాకాచార్యుడు భారతీయ భౌతికవాద ఆది పురుషులలో ఒకరు. హేతువును ఆశ్రయించని, నిరూపణకు నిలబడని వాదనను తిరస్కరించమన్నవాడు వివేకానంద.

abkprasad2006@yahoo.co.in

ప్రజారోగ్యంలో వ్యత్యాసాలు

మన రాజకీయ నేతలు వైద్య చికిత్సల కోసం దేశంలోని ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులకూ, విదేశీ ఆసుపత్రులకూ వెళుతుండటం నిత్యకృత్యమే. తాము ఏర్పర్చిన ప్రజారోగ్య వ్యవస్థలు అత్యంత నాసిరకంగా ఉన్నాయన్న ఎరుకే దీనికి కారణం.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్



మనం మొదట ఈ నాలుగు ఉదంతాలను అర్థం చేసుకుందాం. 1. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఒకరు చెన్నైకి ఎయిర్ అంబులెన్స్‌లో హుటాహుటిన బయలు దేరారు. అక్కడే ఆయన తర్వాత మరణించారు. ఆయనకు లివర్ కేన్సర్ ఉంది. 2. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవలే చెన్నయ్ ఆసుపత్రిలో సాధారణ ఆరోగ్య పరీక్ష చేయించుకున్నారు. 3. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ చికిత్స కోసం మొదట ముంబై ఆసుపత్రికి వెళ్లారు. తర్వాత వెల్లడి కాని వ్యాధి చికిత్స కోసం అమెరికా వెళ్లారు. 4. సోనియా గాంధీ కూడా ఇదే విధంగా అమెరికా వెళ్లారు. ఆమె వ్యాధి స్వభావం గురించి కానీ, ఆమె చికిత్స చేయించుకున్న ఆసుపత్రి వివరాలు కానీ దాచి ఉంచారు.

పై ఉదంతాలను కింది వాటితో పోల్చి చూద్దాం.

1. ప్రసవానికి చేరువైన ఒక గర్భిణిని ఉదంపూర్‌లోని ఆసుపత్రిలో చేర్చడానికి అంబులెన్స్ సౌకర్యాన్ని నిరాకరించారు. దీంతో ఆమె ప్రైవేట్ అంబులెన్స్‌ని ఉపయోగించాల్సి వచ్చింది. తర్వాత ఆసుపత్రిలో ఆమెను మూడుగంటల పాటు ఏ డాక్టరూ పట్టించుకోలేదు. గర్భంలోనే పాప మరణించింది. ఆ పాప మృతదేహాన్ని ఒక అట్టపెట్టెలో ఉంచి వెనక్కు పంపించారు.

2. ముంబైలోని ఎల్ఫిన్‌స్టన్ బ్రిడ్జిలో తొక్కిసలాట ఘటనలో రైలు ప్రయాణికుల విషాద మరణం తర్వాత చనిపోయిన వారి నుదుటిపై స్కెచ్ పెన్‌తో మృతుల సంఖ్యను వరుసగా రాశారు. మృతుల గౌరవానికి భంగం కలిగించినందుకు హైకోర్టు ఆగ్రహం ప్రదర్శించింది.

3. ఒక వ్యక్తి, వైద్యులు తొలగించిన తన కాలిని పరుపుపై దిండుగా ఉపయోగించుకున్న ఘటన ఝాన్సీ ఆసుపత్రిలో సంభవించింది.

4. పాట్నాలో తొమ్మిదేళ్ల కుమార్తె మృతదేహాన్ని ఆమె తండ్రి తన భుజాలపై మోసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఎందుకంటే ఆమెను గ్రామానికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించలేదు. ఆమెను అత్యవసరంగా ఆసుపత్రిలో చేర్పించడానికి చేపట్టాల్సిన విధివిధానాల విషయంలో చాలా జాగు చేశారు. (మున్నాబాయ్ సినిమాలో దీనిపైనే నిరసన తెలిపారని గుర్తుంచుకోవాలి).

ఈ రెండు రకాల ఉదంతాలు కొట్టొచ్చినట్లుగా మన ఆరోగ్య సంరక్షణ సంపన్నులకు, శక్తిమంతులకు అనుకూలంగా ఉందనే ఒక దయనీయ కథనాన్ని చెబుతున్నాయి. అత్యంత మొరటైన విషయం ఏమిటంటే, తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో వైద్యపరమైన అసౌకర్యాలను పట్టించుకోని ముఖ్యమంత్రులు బయటి రాష్ట్రాలకు వెళ్లి వైద్య సహాయం కోసం ప్రయత్నించడమే.

ఇటీవలే అమితాబ్ బచ్చన్ భుజం నొప్పికి చికిత్స చేయడానికి వైద్యుల బృందం ఒకటి జైపూర్‌కు హుటాహుటిన చేరుకుంది. ఇంత సూపర్ సంపన్నుడికి అందుబాటులో లేనిదంటూ ఏదీ ఉండదు. వారు పతాక శీర్షికల్లో కనిపిస్తుంటారు. సగటు మనిషి తన బాధలతో కుములుతుంటాడు. మనలాంటి వారి బాధలు, ఇబ్బందులు మన చేతులకంటే పొడవుగా కొనసాగుతుంటాయి. నిజానికి వాటికి అంతం అనేది ఉండదు.

ఇక్కడ వర్ణించిన రెండు రకాల ఉదంతాలూ అవేవో సర్వసాధారణం అన్నరీతిలో ప్రధాన శీర్షికల్లో వస్తుండటం ఒక మినహాయింపు. అదే సమయంలో దేశం ఇలాంటి వ్యత్యాసాలను ప్రదర్శించే తదుపరి ఉదంతాల వైపు సాగిపోతుంటుంది. గుర్తించాల్సింది ఏమిటంటే రాజకీయ ప్రముఖులు తమ రాష్ట్రాల్లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపర్చడానికి ఏ ప్రయత్నమూ చేస్తున్నట్లు కనిపించదు.

ఎందుకంటే దేశంలోని రాజకీయ ప్రముఖులంతా సంపన్నులూ, శక్తిమంతులూ కాబట్టే వీరిలో ఏ ఒక్కరికీ సగటు మనిషి బాధలు, వ్యధలు పట్టవు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగొందుతున్నట్లుగా మంచి గణాంకాలను మాత్రం చూపుతుంటారు. మనుషులు గణాంకాలుగా మాత్రమే కనబడుతున్న వైనాన్ని ఇది సూచిస్తుంది.

ఆందోళన, ఆగ్రహం తప్పిస్తే ప్రజానీకం దీనిపట్ల పెద్దగా స్పందించడం జరగదు. ప్రముఖులు భారత్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళతారని, పారికర్, సోనియా వంటి కొందరు విదేశాలకు వెళతారని ప్రజలకు తెలుసు. ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ఈ ప్రముఖులకు ఏమాత్రం నమ్మకం లేదని ఇది సూచిస్తుంది. ప్రజావైద్య వ్యవస్థను మెరుగుపర్చడానికి తాము పెద్దగా ప్రయత్నించలేదని వారికి తెలుసన్న వాస్తవం మనకు బోధపడుతుంది కూడా.

సంవత్సరానికి ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున బీమాను పది కోట్ల కుటుంబాలకు కల్పిస్తున్నట్లు కేంద్రం చేసిన ప్రకటనను కూడా పై నేపథ్యంలో అనుమానాస్పదంగానే చూడాలి. ఎందుకంటే దేశంలో ప్రైవేట్ రంగం మాత్రమే మెరుగైన సౌకర్యాలను కలిగి ఉంది.

ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఆసుపత్రుల్లోనే పేదలకు కొన్ని విభాగాలను ఏర్పర్చి ఉంచారు కానీ కార్పొరేట్ ఆసుపత్రుల్లోలాగా నడుస్తున్న ఈ విభాగాలు సైతం పేదలకు వైద్యాన్ని నిరాకరిస్తున్నాయి. ఎదుగుతున్న మధ్యతరగతితో సహా ఇలాంటి విభాగాల్లో వైద్యసేవలు పొందడానికి కూడా శక్తిలేని వారు శిలకు, బండరాయికి మధ్య నలిగిపోతుంటారు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com


వెన్నుపోటును మర్చిపోవాలా?

కొన్నిసార్లు పట్టుకుని ఉండటం కన్నా వదిలివేయడం మేలు అన్నది కదా ఆ అమ్మాయి. వదిలివేయడం అంటే ఎట్లాగా? సర్వ ధ్వంసం చేయగలిగిన స్థితిలో ఉండి కూడా పట్టుకోకుండా వదిలివేస్తామా?



సామాన్య

ఆలోచనం



నిన్న దినపత్రికలో తల్లిని హత్య చేసి తలనుపట్టుకుని పోలీస్ స్టేషన్‌కి వచ్చి లొంగిపోయిన కొడుకు వార్త ఒకటి చదివాను. ఎందుకనో మన సంతా దిగులు, చిరాకు కమ్ముకున్నాయి. ఎప్పుడో చదివిన ఎస్.ఎల్ భైరప్ప ''గృహ భంగం'' నవలలో పనికిమాలిన ఇద్దరు కొడుకుల భారాన్ని భుజాలపైకి ఎత్తుకున్న వితంతు తల్లి పాత్ర జ్ఞాపకం వచ్చింది. అదే రోజు రాత్రి హోటల్లో బస చేసిన వెంటనే అలవాటుగా పక్కనే వున్న పత్రికను చేతిలోకి తీసుకున్నాను తిరగేద్దామని. పత్రిక పేరు ''పాస్'' ప్రకటనలతో నిండిన నాలుగైదు ముందు పేజీలు తిప్పాక, చక్కటి అమ్మాయి ఫొటో. పేరు శర్వాణి పొన్నం, చీఫ్ ఎడిటర్. ప్రారంభ వాక్యాలు ''క్రూర విమర్శ, నిజాయితీరాహిత్యం, వెన్నుపోటు.. వంటి పలు అంశాలను అలాగే పట్టుకోకుండా వదిలేయడమే కొన్నిసార్లు ఉత్తమంగా ఉంటుంది'' అని రాశారు ఆమె.

ఎందుకనో మనసు పదే పదే ఆ వాక్యాల చుట్టూ భ్రమించడం మొదలు పెట్టింది. అంతకు ముందే వస్తూ వస్తూ ప్రయాణంలో చదవడానికి పట్టుకొచ్చిన చువాంగ్ త్సు పుస్తకపు పరిచయ వాక్యాలు జ్ఞాపకం వచ్చాయి. 815వ సంవత్సరంలో చైనా ఆస్థానకవి ''చు ఈ''ని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడని, రాజ్యం పనితీరుని నిలదీసే ప్రశ్నలు వేస్తున్నాడని దేశబహిష్కారం చేసిందట అక్కడి రాజ్యం. భార్యను మాత్రమే తన వెంట రానిచ్చారు. ఊరు కాని ఊరు, అంతవరకు పొందిన సౌకర్యాలు, మానసిక సౌఖ్యాలు, ఆనందాలు ఏవీ లేని, ఉన్న అన్నిటినుంచి తరిమివేసిన దూరాభారం. ఎలా ఆ దుఃఖం నుంచి బయటపడటం. అప్పుడు చువాంగ్ త్సును చదవటం మొదలు పెట్టాడట చు ఈ.

ఆ చదువు నుంచి అతను ''స్వస్థలాన్ని వదిలేయడం, బంధువులకు దూరంకావడం, ఎరుగని కొత్త ప్రాంతంవైపు బహిష్కరణకు గురికావడంతో, నా హృదయం ఎంతో పరితాపానికి, బాధకు గురవుతోంది. చువాంగ్ త్సును సంప్రదించాక, నేను దేనికి చెందినవాడినో కనుగొన్నాను. కచ్చితంగా నా స్థలం కనీసం భూమి కాని చోటే ఉంది'' అంటూ ''రీడింగ్ చువాంగ్ త్సు'' అనే పేరుతో ఒక కవితను రాశాడు. చువాంగ్ త్సు ఇంకా అంటాడు ''ఏం జరిగినా దాని వెంట సాగిపో, నీ మనస్సును స్వేచ్ఛగా ఉంచుకో: నీవు ఏం చేస్తున్నావో దాన్ని ఆమోదించడం ద్వారా సమస్థితిలో ఉండు. ఇదే అంతిమమైనది'' అని.

నిజంగా దుర్మార్గమైన విమర్శలనూ, నిజాయితీలేని వ్యక్తులనూ, వెన్నుపోట్లనూ మనసులో పెట్టుకోకుండా సరే లెమ్మని పోనియ్యడం సాధ్యమేనా? అనర్హులై ఉండీ అర్హులను చూసి అసూయపడే మనుష్యులూ, మనం ముందుండాలంటే ముందుండేవాళ్ళని క్రిందికి లాగడమే మార్గం అని నమ్మే వ్యక్తులూ.. కులాలనీ, మతాలనీ, ఉందనీ, లేదనీ ఇంకా అదనీ ఇదనీ, అర్థం కాకనో అర్థం చేసుకునే స్థాయి లేని స్థోమత లేని వ్యక్తులు చేసే ఎన్నెన్ని గాయాలు?

కొన్నిసార్లు హృదయానికయ్యే ఈ గాయపు పోట్లు చాలా తీవ్రంగా ఉంటాయి, మానాయనుకున్నా మచ్చలు మరీ భయంకరంగా పడి మిగిలిపోతాయి కదా, అటువంటపుడు మరచిపోదామనుకున్నా మచ్చలు కనిపిస్తున్నపుడు మరి చువాంగ్ త్సు నో, జిడ్డు కృష్ణమూర్తినో చదువుకుంటూ, స్మరించుకుంటూ ఈ గాయాల నదిని దాటివేయగలమా? మళ్ళీ శర్వాణి జ్ఞాపకం వస్తుంది నాకు. కొన్నిసార్లు పట్టుకుని ఉండటం కన్నా వదిలివేయడం మేలు అన్నది కదా ఆ అమ్మాయి. వదిలివేయడం అంటే ఎట్లాగా?

పేజీలు తిప్పుతూ వెళితే రాంగోపాల్ వర్మ ఇంటర్వ్యూ కనిపించింది అదే పత్రికలో. 'మన జీవనమంతా ఉదయరాత్రాల మధ్యన ఉంచి చూసుకోవడం. ఈ పొద్దు గడిస్తే ఈ రాత్రికి మరణిస్తాం. అందరమూ మరణిస్తాం. మనల్ని మోసం చేసిన వాళ్ళు, వెన్నుపోటుదారులు, అసత్యవంతులు, తప్పు చేస్తూనే దబాయించే దుర్మార్గులూ అందరమూ మరణిస్తాం' ఆర్జీవీ చెప్పిన ఈ పొట్టి వాక్యం సులభంగా వుంది కదా.

ఇలా ఆలోచించుకుంటూ ఉన్నానా.. హఠాత్తుగా క్రైస్తవ మత ప్రేమిక అయిన నా బిడ్డ వచ్చి ''అమ్మా.. అమ్మా!'' నీ యుద్ధాన్ని నా యుద్ధంగా భావించి నేనే నీ బదులుగా పోరాడుతాను, నిన్ను అవమానపర్చిన వారిని వారి స్వమాంసం వారు తినేట్లు చేస్తాను' అని వచ్చిందమ్మా ఇవాళ్టి వాక్యం, ఇట్స్ కూల్'' అంది. నవ్వొచ్చింది. కనుక శర్వాణి చెప్పినట్టు కొన్నింటిని పట్టుకోకుండా వదిలేయడంలో నిజంగానే చాలా సుఖం వుంది కదా. జీవితంలో దమ్ముతో నిలబడి పోరాడాల్సిన అంశాలు చాలానే ఉంటాయి. పోరాడాలి. అలాగే వదిలేసి ముందుకు నడిచిపోవాల్సిన అంశాలూ చాలా ఉంటాయి. ఆగిపోకూడదు. ముందు కెళ్లిపోవాలి. ఎప్పుడు ముందుకెళ్లాలి, ఎప్పుడు పోరాడాలో మన బుద్ధి మనకు తప్పక చెపుతుంది. అందులో మనసును తల దూర్చనీయకపోతే చాలు. కాలం ముందుకే వెళుతుంది. వెనకకు ఎప్పుడూ రాదు. అన్నింటికన్నా ముందుండి ఎప్పుడూ నన్ను నడిపించే హేతువు, నాలో మొలకెత్తే భావ నిస్సత్తువను కాలితో మట్టం చేసే హేతువు ఇదే నిజమని చెప్తుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి | 80196 00900

చేయి చేయి కలిపి.. హోదా కోసం నిలిచి..


గుంటూరు జిల్లా కొమ్మూరులో నిర్వహించిన మానవహారంలో ప్రజలతో కలసి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ప్రత్యేక హోదా కోసం రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు
- ప్యాకేజీలతో మోసం చేయొద్దు.. ప్రత్యేక హోదా మా హక్కు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నినదించిన ప్రజానీకం
- కేంద్రంపై అవిశ్వాసానికి మద్దతు పలికిన ఐదుకోట్ల ఆంధ్రులు
- గుంటూరుజిల్లా కొమ్మూరు మానవహారంలో ప్రతిపక్షనేత

సాక్షి నెట్‌వర్క్

పిల్లాజెల్లా.. ఊరూవాడా.. అందరూ రోడ్లపైకి చేరారు.. చేయీ చేయీ కలిపారు.. ఎర్రటి ఎండ చురుక్కుమంటున్నా... నిలబడడం వల్ల నీరసం వస్తున్నా మొక్కవోని దీక్షతో అలాగే నిలిచారు.. నినాదాలతో హోరెత్తించారు. ఆ కార్యక్రమం పూర్తయ్యేవరకు ఒక్కరు కూడా అడుగు వెనక్కి వేయలేదు. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా..రాష్ట్రవ్యాపితంగా 'ప్రజాసంకల్ప మానవహారం' కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం పార్లమెంటులో పోరాడుతున్న వైఎస్సార్సీపీ ఎంపీలకు సంఘీభావంగా ఆ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 'ప్రజాసంకల్ప మానవహారం' కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. అన్ని జిల్లాల్లోనూ ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభించింది. పలు చోట్ల ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు స్వచ్ఛందంగా వచ్చి ఈ మానవహారం కార్యక్రమాలను జయప్రదం చేశారు. ఈ కార్యక్రమాలలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు భాగస్వాములయ్యారు. వివిధ నియోజకవర్గ కేంద్రాలలో జరిగిన మానవహారాలలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమ్మూరు మానవహారంలో ప్రతిపక్షనేత..

వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు గ్రామంలో గ్రామస్తులు, పార్టీ అభిమానులతో కలిసి ప్రజాసంకల్ప మానవహారంలో పాల్గొన్నారు. నాలుగేళ్ల చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతున్న ప్రజల్లో ధైర్యం నింపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర 115 రోజు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో కొనసాగింది. జగన్ పాదయాత్రగా కొమ్మూరు చేరుకొనే సమయానికి గ్రామంలో ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడి మానవహారంగా ఏర్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇచ్చితీరాలంటూ నినాదాలు చేస్తున్నారు. పార్టీ నేతలు రావి వెంకటరమణ, మేకతోటి సుచరిత, లావు శ్రీకృష్ణదేవరాయలు, బాలశౌరి తదితరులతో కలిసి జగన్‌మోహన్‌రెడ్డి ఆ మానవహారంలో పాల్గొన్నారు. 'ప్రత్యేక హోదా జగన్‌తోనే సాధ్యం'.. ఢిల్లీ గడ్డపై హోదా నినాదం వినిపించిన ఏకైక నాయకుడు జగన్' అని ప్రజలు, అభిమానులు ఈ సందర్భంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కలిసికట్టుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రత్యేక హోదా సాధించుకుందామని వారు నినదించారు.

పోలీసుల అత్యుత్సాహం

విశాఖ నగరంలోని ఇసుకతోట జంక్షన్ లో జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై పోలీసులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల అత్యుత్సాహంతో అక్కడ కాసేపు తోపులాట జరిగింది. ఇందులో వైఎస్సార్సీపీ విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ ముక్కుకు తీవ్ర గాయమైంది. అనంతరం తైనాలను, విశాఖ తూర్పు కో ఆర్డినేటర్ వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో పాటు పులువురిని అరెస్టు చేశారు. దాంతో మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద పార్టీ శ్రేణులు ధర్నాకు దిగాయి. అలాగే రాష్ట్రంలోని అనేక చోట్ల పోలీసులు మానవహారం కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి.

మానవహారాల్లో వినూత్న నిరసనలు..

మానవహారం కార్యక్రమాలలో భాగంగా అనేక చోట్ల ప్రజలు వినూత్న తరహాలో నిరసనలు కూడా తెలిపారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో మానవహారం కార్యక్రమం అనంతరం రోడ్డుపై బైఠాయించిన నాయకులు, కార్యకర్తలు కేంద్రంలోని బీజేపీ, టీడీపీ విధానాలకు నిరసనగా అర్ధనగ్న ప్రదర్శన చేశారు. విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ వద్ద జరిగిన మానవహారంలో ఓ కార్యకర్త గుండుగీయించుకుని నిరసన తెలిపారు.. కార్యక్రమానికి హాజరైన పలువురు కార్యకర్తలు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. గుంటూరు జిల్లాలో పలు చోట్ల పార్టీ నాయకులు ర్యాలీలు నిర్వహించి మానవహారం కార్యక్రమాలలో పాల్గొన్నారు. కూడళ్లలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. క్షీరాభిషేకాలు చేశారు. వైఎస్సార్ జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హోదా కోసం నినదించారు. విజయనగరం జిల్లా సాలూరులో ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మనసులను మార్చి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే బుద్ధిని ప్రసాదించాలంటూ వేడుకున్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అరకులోయలో భారీ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. పాడేరులో ఎంపీటీసీ సభ్యురాలు గిడ్డి విజయలక్ష్మి ఐటీడీఏ కార్యాలయం ఎదుట మూడురోజుల రిలే దీక్ష చేపట్టారు. కాగా విభజన హామీలు అమలు చేయాలంటూ చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద చిత్తూరు మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి సోమవారం ఒకరోజు నిరాహారదీక్ష చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పది నియోజకవర్గాల కేంద్రాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు మానవహారం కార్యక్రమాలతో పాటు బైక్‌ర్యాలీలు నిర్వహించారు.

హోదా అవసరం లేదన్నట్లుగా వాదించారుగా..



''తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదా అవసరం లేదన్నట్లుగా వాదించారు. ప్రజల ఆకాంక్షలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉండగా, నాలుగేళ్ల పాలనలో కేంద్రంతో ఈ విషయమై మాట్లాడలేదు. ముఖ్యమంత్రి రకరకాల మోసపూరిత మాటలను చెప్పడం వల్లే కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదా విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ప్రత్యేకహోదా ఆవశ్యతపై ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేసేందుకే పార్టీ మానవహారం కార్యక్రమాన్ని చేపట్టింది.''

– ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్

నాలుగేళ్లు మోకరిల్లి నేడు కుటిల రాజకీయమా..



రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తాకట్టుపెట్టి కేంద్రం వద్ద మోకరిల్లిన చంద్రబాబు నేడు కుటిల రాజకీయాలు చేస్తూ ప్రత్యేక హోదా నినాదాన్ని భుజానికెత్తుకునేందుకు ప్రయత్నాలు చేయడం విడ్డూరంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మొన్నటి వరకూ ప్రత్యేక హోదా సంజీవనా, ప్రత్యేక ప్యాకేజీతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పి, నేడు మాట మార్చారు. ప్రత్యేక హోదా కోసం జగన్ చేస్తోన్న పోరాటంతో ప్రజలు ఆయనవెంట వెళ్ళిపోతారనే భయంతోనే బాబు మరోసారి యూటర్న్ తీసుకున్నారు.

– ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ, పార్టీ శాసనమండలి ఫ్లోర్‌లీడర్


గుంటూరు జిల్లా పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో మానవహారం


కృష్ణాజిల్లా తిరువూరులో..


నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో..


పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో వైఎస్సార్‌సీపీ శేణుల మానవహారం

నాలుగేళ్లు అంటకాగి మాపై నిందలా?

- సీఎం చంద్రబాబుపై ఎమ్మెల్యే గడికోట ధ్వజం
- చంద్రబాబు ముస్లింల కోసమే ఎన్డీఏ నుంచి బయటికొచ్చానంటే ఎవరూ నమ్మరు



సాక్షి, హైదరాబాద్: ఇన్నేళ్లుగా బీజేపీతో అంటకాగుతూ మైనారిటీలకు చేసిన ద్రోహానికి సీఎం చంద్రబాబు ముందు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము బీజేపీకి దగ్గరవుతున్నట్లు చంద్రబాబు ఆరోపణలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మతో కలిసి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీతో నాలుగేళ్లు స్నేహం చేసిన చంద్రబాబు ఇప్పుడు ముస్లిం సోదరుల కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చాననటం విచిత్రంగా ఉందన్నారు. బీజేపీతో కలవడం టీడీపీకి కొత్త కాదని గడికోట చెప్పారు. టీడీపీ స్థాపించిన తరువాత నుంచి ఎనిమిది ఎన్నికలొస్తే ఏడు సార్లు బీజేపీతో పొత్తు పెట్టుకుందని చెప్పారు. గోద్రా ఘటన, ముంబైలో హత్యాకాండలు జరిగినపుడు బీజేపీకి పూర్తి స్థాయిలో మద్దతునిచ్చిన చంద్రబాబు ఇప్పుడు ముస్లింల కోసమే బయటకు వచ్చానంటే ఆయన్ను ఎవరూ నమ్మరన్నారు. చంద్రబాబు ఏరోజూ మైనారిటీల గురించి ఆలోచించలేదన్నారు. వైఎస్సార్ సీపీ లౌకిక పార్టీ అని తమ విధానాన్ని పార్టీ అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారని, అదే వైఖరిని కొనసాగిస్తున్నామని, చంద్రబాబులాగా నాటకాలు ఆడబోమన్నారు. ముస్లింలకు చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. మసీదు మౌజన్‌లకు రూ 2,000 , రూ 3,000లు వేతనాలు ఇస్తున్నారని అది కూడా స్థానిక టీడీపీ నేతలు సిఫార్సు చేసిన 5 శాతం మందికే ఇస్తున్నారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మౌజన్‌లకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో వైఎస్సార్ సీపీ పొందుపరచిందని గడికోట పేర్కొన్నారు. మైనారిటీలు బాగు పడాలనే ఉద్దేశ్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లతో మైనారిటీలకు ప్రయోజనం చేకూరిందన్నారు.

జగన్ బాటలో చంద్రబాబు

హోదా కావాలని ప్రతిపక్ష నే జగన్ ఉద్యమాలు చేస్తే అవహేళనగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు తప్పని పరిస్థితుల్లో హోదా కావాలంటున్నారని గడికోట చెప్పారు. నలభై ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబుకు ప్రతిపక్ష నేత జగన్ బాటలో నడవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెడితే ఏమొస్తుందన్న వ్యక్తి ఇపుడు తానే అవిశ్వాసం ప్రతిపాదిస్తున్నట్లుగా బిల్డప్ ఇచ్చుకుంటున్నారని దుయ్య బట్టారు. జగన్‌పై పెట్టిన కేసుల్లో పస లేక కొట్టివేయ బోతున్నారనే ఆక్రోశంతోనే చంద్రబాబు తాము బీజేపీతో కుమ్మక్కు అయినట్లు ఆరోపిస్తున్నారని గడికోట చెప్పారు.

వైఎస్సార్ సీపీ సింగిల్‌గానే పోరాటం చేస్తుంది

గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సింగిల్‌గానే పోరాటం చేసిందని, వచ్చే ఎన్నికల్లో కూడా సింగిల్‌గానే పోటీ చేస్తుందని వాసిరెడ్డి పద్మ చెప్పారు. రాష్ట్రంలో తాము బీజేపీతో జత కట్టే పరిస్థితి ఎప్పటికీ రాదన్నారు. నాలుగేళ్లు బీజేపీతో అంటకాగిన చంద్రబాబు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తనపై కుట్ర జరుగుతోందని చంద్రబాబు ఆరోపించటాన్ని ప్రస్తావిస్తూ... నాలుగేళ్ల పాటు రాష్ట్ర ప్రజలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నింది చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీలేనన్నారు.


కేంద్రం ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నాడు

పవన్‌కళ్యాణ్‌పై ముగ్గురు మంత్రుల మండిపాటు

సాక్షి, అమరావతి: టీడీపీ అవిశ్వాసానికి మద్దతు ఇస్తుంటే అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతున్నారని, కేంద్రం రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివి వినిపించారని రాష్ట్ర మంత్రులు కె అచ్చెన్నాయుడు, దేవినేని ఉమామహేశ్వరావు, పి నారాయణ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై మండిపడ్డారు. సోమవారం రాత్రి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రత్యేక హోదా హామీ ఇవ్వలేదన్న పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు వింటుంటే ఆశ్చర్యం వేస్తుందన్నారు. ఎన్‌డీఏ భాగస్వామినని చెప్పుకుంటున్న పవన్‌కు బీజేపీ మేనిఫెస్టోలో ఏముందో తెలియదా? అని మంత్రులు ప్రశ్నించారు. ఏపీ బీజేపీ మ్యానిఫెస్టోలో ప్రత్యేక హోదా అంశం ఉందని గుర్తు చేశారు. మోదీకి వ్యతిరేకంగా పవన్ ఎందుకు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదన్నారు. రెండు రాష్ట్రాల సీఎంలకు పవన్ మార్కులు వేస్తున్నారని, ఆయన మార్కులు ఎవరికి కావాలన్నారు. నావల్లే గెలిచారు, నేను ప్రచారం చేయడం వల్లే గెలిచారనే తరహాలో మాట్లాడటం సరికాదన్నారు. పోలవరంలో పవన్‌కు ఇన్నాళ్లూ కనిపించని అవినీతి ఇప్పుడే కనిపించిందా అని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీ పరిస్థితి గొర్రెతోక బెత్తెడే అన్న చందంగా ఉందని, అందుకే పవన్‌ను బీజేపీ అడ్డం పెట్టుకుంటోందని విమర్శించారు.

నన్ను అణగదొక్కాలని చూస్తున్నారు

- కేంద్రంపై సీఎం చంద్రబాబు ఆరోపణలు
- బీజేపీ తప్పుడు విధానాలు అనుసరిస్తోందని ధ్వజం
- మైనారిటీలతో ముఖ్యమంత్రి సమావేశం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ పెద్దలు తనను అణగదొక్కాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. సోమవారం ఉండవల్లిలోని తన నివాసం వద్ద ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. న్యాయం చేయాలని కోరుతున్న తమపై ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధించే వరకూ పోరాటం చేస్తామన్నారు. బీజేపీ తప్పుడు విధానాలు అనుసరిస్తోందన్నారు. మైనారిటీ కోటాలో జలీల్‌ఖాన్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఈ సందర్భంగా ముస్లిం నేతలు చంద్రబాబును కోరారు.

ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్

ఏపీకి హోదా ఇస్తానని కాంగ్రెస్ పార్టీ కూడా ప్లీనరీలో చెప్పిందని, అలాంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఎంపీలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సీఎం ప్రశ్నించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ యూ టర్న్ ఎందుకు తీసుకున్నాడో అందరికీ తెలుసన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వాన్ని విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నాడో చెప్పాలన్నారు. ద్రోహులకు డిపాజిట్లు కూడా రావన్నారు. అన్ని నియోజకవర్గాలలో బైక్ ర్యాలీలు నిర్వహించి ఇంటింటికీ ప్రచారం చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి లేనట్లుగా చంద్రబాబు మాట్లాడటం సబబుకాదని, అవసరమైతే క్రియాశీలకంగా మారతానని చెప్పడం సముచితంగా ఉంటుందని ఈ సందర్భంగా ఎంపీ గరికపాటి మోహన్‌రావు సూచించారు. అవిశ్వాసం తీర్మానంపై ఇతర పార్టీల ఎంపీల సంతకాలు కూడా తీసుకుంటున్నామని, అదనంగా మరో నోటీసు కూడా ఇస్తామని ఎంపీ గల్లా జయదేవ్ చెప్పారు.

పోలవరం కాంక్రీట్ పనుల వేగం పెరగాలి: సీఎం

పోలవరం స్పిల్ వే, స్పిల్ ఛానల్ (కాంక్రీట్) పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 2019 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను సోమవారం వర్చువల్ రివ్యూ ద్వారా ఆయన సమీక్షించారు. ఇప్పటివరకూ 54.4 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. నెలాఖరులోగా లక్ష క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. పోలవరం హెడ్ వర్క్స్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 25 కెమేరాలను ఫైబర్ గ్రిడ్‌తో అనుసంధానించి పనులను ప్రజలకు చూపాలని ఆదేశించారు. అనంతరం 29 ప్రాధాన్య ప్రాజెక్టుల పనులపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో కొరియా పరిశ్రమల క్లస్టర్

కొరియాకు చెందిన 16 ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కియా అనుబంధ సంస్థలైన హ్యుండై మొబిస్‌తో ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, మొబిస్ కంపెనీల ప్రతినిధులు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..ఏపీని దక్షిణ కొరియా రెండో స్వగృహంగా భావించాలని కోరారు. అనంతపురం నుంచి నెల్లూరు వరకూ చిత్తూరు మీదుగా ఆటో కారిడార్ తయారవుతుందని తెలిపారు.

22న జాతీయ రహదారుల దిగ్బంధం

- హోదాపై కేంద్రం దిగి వచ్చే వరకు ఆందోళన
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా సాధన కోసం ఈ నెల 22న జాతీయ రహదారులను దిగ్బంధించాలని ప్రత్యేక హోదా సాధన సమితి, విభజన హామీల సాధన సమితి నిర్ణయించింది. సోమవారం విజయవాడలో 'ఏపీ ప్రత్యేక హోదా–విభజన హామీల సాధన సమితి' ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. చలసాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు పలు తీర్మానాలు చేశారు. హోదా సాధన కోసం సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని వక్తలు అభిప్రాయపడ్డారు. కేంద్రం దిగివచ్చే వరకు ఆందోళనలు కొనసాగించాలని తీర్మానం చేశారు.

హోదా సాధనే మా లక్ష్యం: వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా సాధనే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా సాధన కోసం ఆందోళనలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రత్యేక హోదా కోసం తాము ధర్నాలు చేసినా.. బంద్‌లు చేసినా.. నిరహారదీక్షలకు దిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడమే కాకుండా అపహాస్యం చేశాయన్నారు. అయినా కూడా వెనక్కి తగ్గకుండా వైఎస్ జగన్ పిలుపు మేరకు.. ఈనెల 5న ఢిల్లీలో మరోసారి ధర్నా నిర్వహించామని చెప్పారు. అలాగే సోమవారం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మానవహారం నిర్వహించామని వివరించారు. ఇప్పటికే పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు అవిశ్వాస తీర్మానం ఇచ్చారని.. త్వరలో ఎంపీలు కూడా రాజీనామాలు చేయనున్నారని చెప్పారు. హోదా సాధన కోసం ఏ పార్టీతోనైనా కలిసి పని చేయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ప్రజా ద్రోహిగా పేర్కొంటూ టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. అన్ని వర్గాలను ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. కాంగ్రెస్ నేత తులసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదాకు మద్దతు ఇస్తూ కాంగ్రెస్ ప్లీనరీలో తీర్మానం చేశామన్నారు. హోదా కోసం ఆమరణ దీక్షకు తాను సిద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పోతిన వెంకట రామారావు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత మల్లాది విష్ణు, ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జనసేన నాయకుడు అద్దేపల్లి శ్రీధర్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నేతలు

బాబు రాజకీయ నాటకాలు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ విమర్శలు
- సొంత మామకే వెన్నుపోటు పొడిచిన ఘనత బాబుది
- ఏపీ ఆకాంక్షలు నెరవేర్చేందుకు మేమున్నాం...



సాక్షి, న్యూఢిల్లీ: రాజకీయ నాటకాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును మించినవారు ఎవరూ లేరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ఎద్దేవా చేశారు. సోమవారం ఢిల్లీలో ఆయన ఓ వార్తా ఏజెన్సీతో మాట్లాడుతూ సొంత మామకే వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. ఇన్నేళ్లుగా రాజకీయ గిమ్మిక్కులు చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ఆంధ్రప్రదేశ్ డిమాండ్లపై తామెప్పుడూ సానుకూలంగా ఉన్నా చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ రాజకీయ నాటకాలు ఆడుతోందని చెప్పారు.

ఏపీకి మేమున్నాం..

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తామున్నామని రాంమాధవ్ పేర్కొన్నారు. 'అవిశ్వాస తీర్మానానికి మేం భయపడడం లేదు. మాకు పార్లమెంటులో సరిపడా బలం ఉంది. ఏ చర్చకైనా మేం సిద్ధం. టీడీపీ నిర్ణయం కేవలం రాజకీయపరమైనది. మాతో చాలా ఏళ్లుగా కలిసి ఉన్నారు. మా భాగస్వాములుగా ఉన్నారు. కలిసి పనిచేశాం. అకస్మాత్తుగా వాళ్లు కొన్ని సెంటిమెంట్ అంశాలను లేవనెత్తుతూ అవిశ్వాస తీర్మానం తెచ్చారు. దీనికి వాళ్లే ఏపీ ప్రజలకు, దేశానికి వివరణ ఇవ్వాలి' అని రాంమాధవ్ చెప్పారు.

సెంటిమెంట్ పేరుతో టీడీపీ డ్రామాలు

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కాపాడుతామని రాంమాధవ్ తెలిపారు. 'ఇంకా చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి ఉంది. నూతన రాష్ట్ర అభివృద్ధికి మేం పూర్తి మద్దతు ఇస్తున్నాం. కానీ టీడీపీ ప్రత్యేక హోదా అనే సెంటిమెంట్ అంశాన్ని చూపుతోంది. దానికి కొన్ని రాజ్యాంగపరమైన అడ్డంకులున్నాయి. హోదా కంటే ఎక్కువ ప్రయోజనాలను కల్పిస్తామని చెబుతున్నాం. ఏపీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నాం. నాలుగేళ్లుగా చేస్తున్న సాయం కొనసాగిస్తాం. హోదా కంటే ఎక్కువ ప్రయోజనాలను అందిస్తాం. టీడీపీ సెంటిమెంట్ పేరుతో డ్రామాలు ఆడుతోంది' అని రాంమాధవ్ పేర్కొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర 115 వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,540 కి.మీ

115వ రోజు నడిచిన దూరం
12 కిలో మీటర్లు

ప్రారంభం
ఉ. 7.30 గంటలకు కాకుమాను శివారు

ముగింపు: సా.5.30 గంటలకు పెదనందిపాడు శివారు

ముఖ్యాంశాలు
- కాకుమాను శివారు, కాకుమాను, పెద్దివారి పాలెం, నాగులపాడులో జనంతో మమేకం
- కొమ్మూరులో ప్రజాసంకల్ప మానవహారం
- పెదనందిపాడులో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్



ప్రారంభం: ఉ.7.30 గంటలకు పెదనందిపాడు శివారు

ముఖ్యాంశాలు
- పెదనందిపాడు శివారు, రాజుపాలెం క్రాస్, పరిటాల వారిపాలెం క్రాస్, అన్నవరం క్రాస్, ఉప్పలపాడులో జనంతో మమేకం
- పాలపర్రులో జెండా ఆవిష్కరణ



పెదనందిపాడులో అశేషజనవాహిని మధ్య పాదయాత్ర సాగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీలో చేరిన జ్యోతుల చంటిబాబు

ప్రజాసంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రతినిధి, **పెదనందిపాడు (ప్రత్తిపాడు):** తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా పనిచేసి, ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేసిన జ్యోతుల చంటిబాబు సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాదయాత్రలో జగన్‌ను కలిసి పార్టీలో చేరేందుకు ఆసక్తిని వ్యక్తం చేయడంతో పార్టీ కండువా కప్పి ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. జ్యోతుల చంటిబాబు రెండు మార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. టీడీపీకి రాజీనామా చేసిన సమయంలోనే ఏలేరు రిజర్వాయర్ నీటి సంఘం ప్రాజెక్టు చైర్మన్ పదవిని కూడా వదులుకున్నారు

కాగా, నాలుగేళ్లుగా టీడీపీలో పలు అవమానాలకు గురైన పలువురు నాయకులు, కార్యకర్తలు 500 మంది సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గుంటూరు జిల్లా మండల కేంద్రమైన పెదనందిపాడులో నిర్వహించిన భారీ బహిరంగ సభ అనంతరం గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు దివ్వి రాంబాబు, మొవ్వా శ్రీనివాసరావు, నూతి శ్రీనివాసరావు, నూర్ బాజీబాషా, వార్డు మెంబర్ నూర్‌బీ వారి అనుచరులు 500 మంది పార్టీలో చేరారు.



జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న జ్యోతుల చంటిబాబు



బహిరంగ సభలో విల్లును ఎక్కుపెడుతున్న వైఎస్ జగన్





కాకుమాను, కొమ్మూరులో అవ్వ, తాతల సమస్యలు వింటున్న వైఎస్ జగన్

అబద్ధాల పునాదులపై చంద్రబాబు పాలన



జననేతతో కలిసి నడుస్తున్న అక్కచెల్లెమ్మలు

▶ మొదటి పేజీ తరువాయి

గిట్టుబాటు ధర లేదని, సాక్షాత్తు చంద్రబాబే దళారులకు నాయకత్వం వహిస్తూ రైతుల శ్రమను దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రత్యేక హోదాపై మొసలి కన్నీరు

''చంద్రబాబు చేసిన అన్నింటికంటే పెద్ద ఘోరం ఏంటో తెలుసా? కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు రావాల్సిన ప్రత్యేక హోదా హక్కును తాకట్టు పెట్టడం. చేయాల్సిందంతా చేసి ఇవాళ మొసలి కన్నీరు కారుస్తున్నాడు. 2016 సెప్టెంబర్ 8న అరుణ్ జైట్లీ.. మేం ప్యాకేజీ ఇస్తాం అని చెప్పినప్పుడు ఇదే పెద్ద మనిషి కేంద్ర ప్రభుత్వంలోని మంత్రి పదవుల నుంచి ఎందుకు వైదొలగలేదు? ఈ ప్రకటన చేసినందుకు చంద్రబాబు.. అరుణ్ జైట్లీని పొగిడారు. ఢిల్లీకి వెళ్లి సన్మానించి వచ్చారు. ఇటీవల అరుణ్ జైట్లీ మళ్లీ అదే ప్రకటన చేస్తే.. ఈ విషయం ఇప్పుడే కొత్తగా తెలిసిందన్నట్లు మొసలి కన్నీరు కారుస్తూ ప్లేట్ ఫిరాయిస్తాడు. ఎలక్షన్లు దగ్గరకు వస్తున్నాయని కేంద్రంలో ఉన్న తన మంత్రి పదవులను ఉపసంహరించుకొన్నాడు. ప్రతి విషయంలోనూ మోసం.. దగా.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో సంకట పరిస్థితి

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉంటే కరువు ఉంటుంది. లేకపోతే వరద వస్తుంది. ప్రకాశం బ్యారేజీ, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలు వచ్చే కాలువలను ఆధునికీకరించకపోవడం వల్ల చివరి ఆయకట్టు భూములకు నీళ్లందని పరిస్థితుల్లో కరువుతో పంటలు ఎండిపోతాయి. మరో వైపున డ్రెయిన్లను ఆధునికీకరించకపోవడం వల్ల వరదలొచ్చి పంట పొలాలు ముంపునకు గురవుతాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి గుంటూరు చానల్, అప్పాపురం చానల్ వస్తే, నాగార్జున సాగర్ నుంచి పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ వస్తుంది. ఈ కాలువల కింద బతుకుతున్న రైతన్నల మాటలు వింటుంటే బాధనిపిస్తోంది. గుంటూరు చానల్ కింద దాదాపు 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆధునికీకరణ పనులు వట్టిచెరుకూరు వద్దనే ఆగిపోవడంతో ఈ ఆయకట్టుకు నీరందడం లేదు. అక్కడ ఒక లిఫ్ట్ పెడితే చివరి భూముల దాకా నీళ్లందించగలుగుతామని రైతన్నలు నాలుగేళ్లుగా పాలకుల్ని గట్టిగా అడుగుతూ వినతి పత్రాలు ఇస్తున్నా కూడా పట్టించుకోవడం లేదు. ఈ కాలువను యామర్రు నుంచి పర్చూరు వరకు పొడిగించాలని, దీని వల్ల దాదాపుగా 35 వేల ఎకరాలకు సాగునీరు అదనంగా అందుతుందనే డిమాండ్‌ను కూడా పట్టించుకోవడం లేదు.

పొలాలు మునిగిపోతున్నా పట్టించుకోరు..

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పాపురం చానల్‌కు దాదాపు రూ.65 కోట్లు మంజూరు చేశారు. పనులు కూడా మొదలు పెట్టారు. ఆ నేత మన మధ్య నుంచి వెళ్లిపోయిన తర్వాత ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌ను తుర్లపాడు నుంచి పొడిగించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. నాన్నగారి హయాంలోనే రూ.300 కోట్లతో ఈ పనులు చేపట్టాలని భావించారు. రూ.3 కోట్లతో సర్వే పూర్తి చేశారు. రాజశేఖరరెడ్డి గారు మన మధ్య నుంచి వెళ్లిపోయిన తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఈ కాలువే గనుక పూర్తయితే పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, పర్చూరు, చిలకలూరిపేట రూరల్ పరిధిలో దాదాపుగా 30 వేల ఎకరాలకు సాగునీరందించవచ్చని తెలిసి కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. మరోవైపు పొలాలు ముంపునకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని రైతన్నలు చెబుతున్నారు. నల్లమడ డ్రెయిన్‌ను ఆధునికీకరించే కార్యక్రమంలో దాదాపు 115 కిలోమీటర్లకు సంబంధించి 80 కిలోమీటర్ల పనులు నాన్నగారి హయాంలో పూర్తి చేశారని రైతులు నాతో చెప్పారు. మిగిలిపోయిన 35 కిలోమీటర్ల పనులు ఈ ప్రభుత్వం చేయని కారణంగా పొలాలు మునకకు గురవుతున్నాయన్నారు.

తాగునీటికీ కటకటే

ఇదే నియోజకవర్గంలో దాదాపు 98 గ్రామాలు ఉన్నాయి. 80 శాతం గ్రామాల్లో తాగునీటికి అల్లాడుతున్న పరిస్థితి. గ్రామాల్లోని చెరువులను విపరీతంగా తవ్వేసి మట్టిని అమ్ముకుంటున్నారు. పక్కనే కొమ్మూరు గ్రామం కనిపిస్తుంది. ఆ గ్రామం నుంచి ఇక్కడకు వచ్చేటప్పుడు ఆ గ్రామ ప్రజలు, అక్క చెల్లెమ్మలు నా దగ్గరకు వచ్చి 'అన్నా.. మా గ్రామంలోని చెరువును విచ్చలవిడిగా లోతుగా తవ్వేశారన్నా.. లోతుగా తవ్వడంతో మంచి నీరు పోయి ఉప్పు నీరు ఉబికి వచ్చేస్తుందన్నా.. తాగడానికి నీరు లేని పరిస్థితుల్లో ఉన్నామన్నా.. నీళ్ల క్యాను కొనాలంటే రూ.20 పెట్టి కొనుక్కోవాల్సి వస్తోందన్నా.. డ్రమ్ము నీరు కొనాలంటే రూ.100 అవుతుందన్నా' అని చెప్పారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంది. అమరావతి వద్ద కృష్ణా నది నుంచి రూ.100 కోట్లతో పైపులైను ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందించవచ్చని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నా.. ఆలోచించని పరిస్థితి.

రైతన్నల పరిస్థితి దారుణం

రాష్ట్రంలో రైతన్నలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నాలుగేళ్లలో కనీసం ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర వచ్చిందా? వరికి రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉత్పత్తి ఖర్చు క్వింటాకు దాదాపు రూ.1,900. కనీస మద్దతు ధర చూస్తే క్వింటా రూ.1,550. రైతన్నలు ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మాలనుకుంటే రూ.1,400 కూడా రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. పత్తి ఉత్పత్తి ఖర్చు దాదాపు రూ.5,200 అవుతుంది. కనీస మద్దతు ధర దాదాపు రూ.4,320. రైతన్న మార్కెట్‌లో అమ్ముకోవాలంటే మాత్రం రూ.3,100కు కూడా కొనే నాథుడు లేడు. మిర్చి పంట ఉత్పత్తికి క్వింటాకు దాదాపుగా ఏడెనిమిది వేల రూపాయలు ఖర్చు అవుతుంది. మద్దతు ధర మాత్రం కరువు. రైతన్నలు మిర్చి యార్డులో ధర్నాలు.. నేనొచ్చి నిరాహార దీక్షలు చేసే పరిస్థితి చూశాం. ఇవాళ మిర్చిని రూ.6 వేలకు కూడా కొనుగోలు చేసే నాథుడు లేడు. మినుములు ఉత్పత్తి ఖర్చు దాదాపు రూ.5,600 అయితే, కనీస మద్దతు ధర రూ.5,400. రైతు అమ్ముకోవాలంటే రూ.4 వేలకు కూడా అడిగే నాథుడు లేడు. పెసలు ఉత్పత్తి ఖర్చు దాదాపు రూ.5,800 అయితే, కనీస మద్దతు ధర రూ. 5,575. రూ.4 వేలకు కూడా అమ్ముకోలేని పరిస్థితి. మొక్కజొన్న ఉత్పత్తి ఖర్చు సుమారు రూ.1,700 అయితే కనీస మద్దతు ధర రూ.1,425. రూ.1,150కి కూడా కొనే నాథుడు లేడు. శనగ పంట ఉత్పత్తి ఖర్చు రూ. 5,200 అయితే కనీస మద్దతు ధర రూ. 4,400. రూ.3 వేలకు కూడా కొనే నాథుడు కరువైన పరిస్థితి. కంది క్వింటా ఉత్పత్తి వ్యయం రూ.5,600 అయితే కనీస మద్దతు ధర రూ.5,450. మార్కెట్‌లో రూ.4 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి. చంద్రబాబే దళారీలకు నాయకుడు కావడంతో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత నీట్‌గా ప్యాక్ చేసి రైతన్నల దగ్గర నుంచి కొన్న రేటుకన్నా.. మూడింతలు, నాలుగింతలు ఎక్కువ ధరకు ప్రజలకు అమ్ముతారు.

మన ప్రభుత్వం రాగానే ఇలా చేస్తాం..

మహానేత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేశం మొత్తం మీద 48 లక్షల ఇళ్లు కడితే.. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అన్ని ఇళ్లు కట్టి దేశంతో పోటీ పడ్డారు. ఎన్నికల సమయంలో ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలంలో ఇల్లు కట్టిస్తానని చంద్రబాబు చెప్పాడు. ఈ నాలుగేళ్లలో ఒక్క ఇల్లైనా కట్టించాడా? మనందరి ప్రభుత్వం రాగానే ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తా. నాన్న హయాంలో 13 జిల్లాల్లో కలిపి 24 లక్షల వరకు ఇళ్లు కట్టించారు. నాన్నగారి హయాం కంటే ఒక లక్ష ఎక్కువగా ఇళ్లు కట్టిస్తాం. ఆ ఇంటిని అక్క చెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేయిస్తాం. అవసరమైతే బ్యాంకుల వారితో మాట్లాడి ఆ ఇల్లు తాకట్టు పెట్టుకుని వడ్డీ లేని రుణం ఇచ్చేలా చూస్తాం. ప్రతి అవ్వా తాతకు పెన్షన్ రూ.2 వేలు చేస్తాం. 60 ఏళ్ల నుంచి 45 ఏళ్లకు పెన్షన్ వయస్సు తగ్గిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు 45 ఏళ్లకే పింఛన్ ఇస్తాం. నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలనూ ఆదుకుంటాం. ఏడాదిలో జరగబోయే ఎన్నికల్లో ఎలాంటి నాయకుడు కావాలో మీరు ఆలోచించండి. చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత, నిజాయితీ రావాలి. ఇది జగన్ ఒక్కడి వల్ల సాధ్యం కాదు. మీ అందరి తోడు కావాలి. మీ ఆశీర్వాదం కావాలి'' అని వైఎస్ జగన్ అన్నారు.

• జగనోత్సాహం



పెదనందిపాడులో జననేతను చూడటానికి స్తంభాలెక్కిన యువకులు

ఒకటా.. రెండా.. ఎన్నెన్నో మోసాలు

- బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలన్నాడు. ఇవాళ బ్యాంకుల వారు పంపిస్తున్న నోటీసులు మాత్రం ఇంటికి వస్తున్నాయి.
- రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు పూర్తిగా బేషరతుగా మాఫీ చేస్తానన్నాడు. ఇవాళ రుణ మాఫీ కార్యక్రమం అప్పులపై అయిన వడ్డీకి కూడా సరిపోవడం లేదు.
- రైతన్నలకు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులకు ప్రభుత్వాలే వడ్డీ కట్టేవి. ఈ పెద్ద మనిషి ఆ డబ్బు కట్టక పోవడంతో ఇవాళ బ్యాంకులు రైతులకు సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదు.
- పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు.
- జాబు రావాలంటే బాబు రావాలన్నాడు.. లేదంటే నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ఇవాళ ఉపాధి లేదు. ఉద్యోగం లేదు. 47 నెలలైంది. ఈ లెక్కన నెలకు రూ.2 వేలు చొప్పున రూ.94 వేలు బాకీ పడ్డారు. ఈ డబ్బులు ఎప్పుడిస్తారని చంద్రబాబును అడగండి.
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇవాళ పెట్రోలు, డీజిల్ ధరలు రాష్ట్రంలో భగ్గుమంటున్నాయి. లీటరుకు ఆరేడు రూపాయలు ఎక్కువగా బాదుతున్నారు.
- అధికారంలోకి వస్తూనే బెల్టుషాపులు తీసేస్తానని చెప్పాడు. ఇవాళ గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఉందో లేదో తెలియదు కానీ మందు షాపు లేని గ్రామం ఏదైనా ఉందా? ఈయన గారి హైటెక్ పాలనలో ఫోన్ కొడితే మందు బాటిల్ ఇంటికి తీసుకొస్తున్నారు.
- తానొస్తే కరెంటు బిల్లులు తగ్గిస్తానని చెప్పి.. ఇవాళ్టికి మూడుసార్లు పెంచారు. నాడు రూ.50, రూ.100 వచ్చిన బిల్లులు ఇవాళ రూ.500 నుంచి రూ. 2వేల వరకు వస్తున్నాయి. ఆర్టీసీ చార్జీలు కూడా పెంచేశారు.
- మట్టి మొదలు.. మద్యం, కాంట్రాక్టులు, బొగ్గు కొనుగోళ్లు, కరెంటు కొనుగోళ్లు, అమరావతి భూములు.. చివరకు గుడి భూముల వరకు ఏదీ వదలడు. పైనేమో ఆయన తింటాడు.. కిందేమో జన్మభూమి కమిటీల పేరుతో పందికొక్కులకొదిలేస్తాడు. పెన్షన్‌లు కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా.. తుదకు మరుగుదొడ్డి మంజూరు చేయాలన్నా వీరికి లంచాలివ్వాల్సిన పరిస్థితి.

115వ రోజు

19–03–2018, సోమవారం

పెదనందిపాడు శివారు, గుంటూరు జిల్లా



కోట్ల కంఠాలు ఒక్కటై హోదా ఆకాంక్షను ఎలుగెత్తి చాటడం స్ఫూర్తిదాయకం

కాకుమాను దగ్గర రోషన్‌బీ అనే అక్క వచ్చి కలిసింది. ఆమెతో పాటు మరో 50 మంది అక్కచెల్లెమ్మలొచ్చారు. వారంతా రోజూ కూలీలుగా వెళతారట. వారి మేస్త్రిని నేనేనని చెప్పిన రోషన్‌బీ అక్క.. 'రోజుకు మాకు రూ.200 కూలి.. ఈ రోజు దాన్ని వదులుకుని మేమంతా మిమ్మల్ని చూడ్డానికి వచ్చామన్నా..' అని చెప్పింది. ఆ ఆప్యాయతకు మనసు చలించింది. ఆ అక్కచెల్లెమ్మలకు కూడా బాబుగారి సెగ తప్పలేదట. ఆయనగారి రుణ మాఫీ మాటలు నమ్మి మోసపోయామని చెప్పారు. కూలీనాలీ డబ్బుల్లో అంతోఇంతో మిగుల్చుకుని బ్యాంకుల్లో దాచుకుందామంటే.. ఆ డబ్బును వడ్డీల కింద బ్యాంకుల వాళ్లు జమ చేసుకుంటున్నారట. చంద్రబాబుగారిని నమ్మాలేగానీ.. నమ్మిన వారిని నట్టేట ముంచడంలో వారూ వీరనే తేడానే లేదు.

అక్కడే గాయత్రి అనే చిన్నారి ఎంతో ఉత్సాహంతో పరుగులు పెడుతూ కనిపించింది. జగనన్నా.. అంటూ గట్టిగా నినాదాలు చేస్తోంది. కాసేపయ్యాక చుట్టూ ఉన్న జనాన్ని తోసుకుని వచ్చి నా చెయ్యి పట్టుకుంది. నాతో పాటు దాదాపు నాలుగు కిలోమీటర్లు నడిచింది. నన్ను కలుస్తున్న వారందరితో.. మనందరి కష్టాలూ పోవాలంటే అన్నను గెలిపించాలంటూ పెద్ద ఆరిందలా.. ఆ చిట్టితల్లి చెబుతుంటే ఎంతో ముచ్చటేసింది.

పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు ప్రవేశపెట్టిన తీర్మానానికి సంఘీభావంగా కొమ్మూరు గ్రామంలో చేయిచేయి కలిపి అక్కచెల్లెమ్మలు, సోదరులు, పార్టీ శ్రేణులతో మానవహారంగా ఏర్పడ్డాము. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని వారు నినదిస్తుంటే.. నేనూ స్వరం కలిపాను. పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మానవహారాలుగా ఏర్పడి ప్రత్యేక హోదా ఆకాంక్షను.. కోట్ల కంఠాలు ఒక్కటై ఎలుగెత్తి చాటడం నిజంగా స్ఫూర్తిదాయకం.

కొమ్మూరు గ్రామంలో ప్రవేశించింది మొదలు.. కడదాకా.. పిల్లలు మొదలుకుని వృద్ధుల దాకా ప్రతి ఒక్కరూ తాగునీటి సమస్యపై ఫిర్యాదులు చేశారు. అన్నా.. మండల ప్రెసిడెంట్, జెడ్పీ చైర్‌పర్సన్ ఇద్దరూ మా ఊరి నుంచే ఎన్నికయ్యారు. ఊరికి ఎంతోకొంత మేలు జరగకపోదా.. అని ఆశపడ్డాం. కానీ మా పరిస్థితిని మంచినీటికి కూడా గతిలేని, దయనీయ స్థితికి తీసుకొచ్చారు. ఇంతకుమునుపు తాగునీటికి ఇబ్బందులుండేవి కావు. ఈ ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు అప్పటి దాకా ఉన్న వాటర్ ప్లాంట్‌ను తీసేశారు. తమ అవినీతి సంపాదన కోసం నీరు – చెట్టు పథకమంటూ చెరువులను ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో అవి ఉప్పు నీటిమయమై నిరుపయోగమైపోయాయి. ఇప్పుడు పక్క గ్రామాలకు పోయి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి దాపురించింది. ఊళ్లో రెండు చెరువులున్నా, పక్కనే సాగర్ జలాలు పారుతున్నా.. గుక్కెడు మంచినీటికి గతిలేని పరిస్థితి మాది. అన్నీఉన్నా అల్లుడి నోట్లో శనిలా తయారైంది.. అని బాధగా చెప్పారు. ప్రజలకు తాగడానికి గుక్కెడు నీరు అందివ్వలేని ప్రజా ప్రతినిధులు ఎందరుంటే మాత్రం ఏం ప్రయోజనం.. అనిపించింది. పదవులనేవి ప్రజా సేవకు కాకుండా దోపిడీకి సాధనాలుగా మారడం బాధనిపించింది.

'నేను బలహీనపడితే.. ఆంధ్రప్రదేశ్ బలహీనపడుతుంది.. ప్రజలకు నష్టం జరుగుతుంది' అంటూ చంద్రబాబుగారు తెగ బాధపడిపోయినట్లు ఈ రోజు పత్రికల్లో వచ్చిన వార్త చూడగానే చాలా విడ్డూరం అనిపించింది. నిజమే.. ఓటుకు కోట్లు లాంటి అనేక అవినీతి కేసులతో ఆయన బలహీనపడ్డాడు. ఆయనగారు కేసుల్లో ఇరుక్కుని తన ఒక్కడి స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడంతో నిజంగా రాష్ట్రమూ బలహీనపడింది. తెలంగాణ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం దగ్గర అడ్డంగా దొరికిపోయి.. బయటపడటం కోసం సాగర్ జలాలు మొదలుకుని.. ప్రత్యేక హోదా వరకూ రాష్ట్ర ప్రయోజనాలన్నింటినీ తాకట్టు పెట్టాడు. బాబుగారి పాపాలు ప్రజలకు శాపాలుగా మారుతుంటే రాష్ట్రం బలహీనపడక మరేమవుతుంది? ఆయన చేసిన తప్పుడు పనుల గురించి నిలదీస్తే.. తెలుగు జాతిపై దాడి.. అంటున్నాడు. ప్రజా ప్రతినిధుల ఓట్లను కోట్లిచ్చి కొనుగోలు చేయాలని ఆయనకేమైనా తెలుగు జాతి చెప్పిందా? తప్పుడు పనులు చేయాలని రాష్ట్ర ప్రజలేమైనా పురమాయించారా?!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ఓటుకు కోట్లు వంటి అవినీతి కేసుల్లో సాక్ష్యాధారాలతో సహా అడ్డంగా దొరికిపోయి వాటి నుంచి బయట పడేందుకు.. కేవలం మీ ఒక్కరి స్వార్థం కోసం తెలుగు జాతి ప్రయోజనాలను తాకట్టుపెట్టడం నిజం కాదా? రాష్ట్రానికి న్యాయ సమ్మతంగా రావాల్సినవాటిని కూడా అడగలేని బలహీన స్థితిలోకి మీరు పడిపోయి.. తద్వారా రాష్ట్రం బలహీనం అవడానికి కారణం మీరు కాదా?

వైయస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర | మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

కాళ్లరిగినా.. కటాక్షించరు!

- ఏళ్ల తరబడి తిరుగుతున్నా పరిష్కారం కాని సమస్యలు
- చిన్న చిన్న సమస్యలకూ లభించని మోక్షం
- పరిష్కారమయ్యాయని చెబుతున్నా పదేపదే వస్తున్న అవే అర్జీలు
- సర్కారు లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతనలేదు
- రాష్ట్రవ్యాప్తంగా మొక్కుబడిగా సాగుతున్న గ్రీవెన్స్ సెల్



స్థలం కోసం, ఇంటి కోసం, పింఛన్ కోసం.. భూ వివాదాలు పరిష్కారం కోసం ఎంతో ఆశతో కలెక్టర్‌కు విన్నవించుకున్నా.. కాళ్లరిగేలా తిరుగుతున్నా పరిష్కారం కాకపోతే పేదవాళ్లకు ఎంత కష్టం.. ఇలా ఒకసారి కాదు, రెండు సార్లు కాదు.. పదేపదే వారు వినతులతో వస్తున్నా అధికారులకు కనికరం కలగడంలేదు. వారం వారం జిల్లా కలెక్టరేట్‌లలో జరుగుతున్న 'మీకోసం' కార్యక్రమం ఇలా పెద్ద ప్రహసనంలా మారుతోంది. సమస్యలు చెప్పకుందామని ఎంతో వ్యయ ప్రయాశలకోర్చి మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి పోటెత్తుతున్న ప్రజానీకానికి ఎక్కువ శాతం నిరాశే మిగులుతోంది. కొండలా పేరుకుపోతున్న దరఖాస్తుల్లో పరిష్కారానికి నోచుకునేవి అతితక్కువే. స్వయంగా కలెక్టర్లకే విన్నవిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదు. ఎక్కువగా రెవెన్యూ, హౌసింగ్, డీఆర్‌డీఏ, జిల్లా పౌర సరఫరాలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, మున్సిపాలిటీ తదితర విభాగాలకు సంబంధించిన అర్జీలు వస్తున్నాయి. ఇవన్నీ పరిష్కారమైనట్లు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో చూపిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటోంది. వస్తున్న వారే మళ్లీ మళ్లీ వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సోమవారం (19వ తేదీ) జరిగిన మీకోసం కార్యక్రమాన్ని 'సాక్షి' బృందం పరిశీలించింది. బాధితులతో మాట్లాడింది. వారం వారం ఈ కార్యక్రమం మొక్కుబడి తంతుగా మారిందని స్పష్టమవుతోంది. వచ్చిన దరఖాస్తులే మళ్లీ వస్తున్నాయి. ప్రకాశం జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో శ్మశానం లేక మృతదేహాలను పారే వాగులు, వంకల్లో పడేస్తున్నా సమస్యను పరిష్కరించాలన్న తీరిక అధికారుల్లో కొరవడింది. 'మీకోసం' చిత్తశుద్ధితో జరగడంలేదని చెప్పడానికి ఇలాంటి తార్కాణాలు ఎన్నో.

→ కృష్ణా జిల్లాలో ప్రతి వారం 250 నుంచి 300లకు పైగా వివిధ సమస్యలపై అర్జీలు వస్తున్నాయి. వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో పరిష్కారమైనట్లు చూపుతున్నట్లు ఆరోపణలున్నాయి. వాస్తవానికి 50 శాతం అర్జీలు కూడా పరిష్కారానికి నోచుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి.

→ గుంటూరు జిల్లాలో గత రెండేళ్లలో గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలన్నీ పరిష్కరించేశామని అధికారులు చెబుతున్నారు. కానీ, ఇక్కడ కూడా 50 శాతం మించి పరిష్కరించలేదని వారం వారం వస్తున్న ఫిర్యాదుదారులను చూస్తేనే తెలుస్తోంది. ప్రతి గ్రీవెన్స్‌కు 300 నుంచి 500 మంది బాధితులు వస్తుంటారు. వీరిలో మహిళలు, వృద్ధులు అధికం. అయితే, ఇక్కడ వారికి కనీస వసతులు కూడా ఉండడంలేదు.

→ శ్రీకాకుళం జిల్లాలో మీ కోసం సెల్ నిర్వహణ నామమాత్రంగా మారింది. సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఎక్కువగా ఆర్థిక అంశానికి సంబంధించిన వినతులు ఉంటున్నాయి. నాన్ ఫైనాన్స్ సమస్యలకు కూడా సకాలంలో మోక్షం లభించడంలేదు. దీంతో ఫిర్యాదుదారులు అధికారుల చుట్టూ పదేపదే తిరగాల్సిన దుస్థితి నెలకొంది.


కర్నూలు జిల్లా ఆదోనిలో కలెక్టర్ సత్యనారాయణకు అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు

→ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలు వచ్చారు. ఎక్కువగా ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణం, పంచాయతీ సమస్యలు, రేషన్‌కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తులు వచ్చాయి.

→ కర్నూలు జిల్లాలో ప్రతి సోమవారం మీకోసం నిర్వహిస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదు. ప్రతివారం వేలాదిగా అర్జీలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. చాలావరకు పరిష్కరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ.. వచ్చిన వారే పదేపదే వస్తున్నారు. ఇవన్నీ కాకిలెక్కలేనని ప్రతివారం వచ్చే అర్జీదారులను బట్టి తెలుస్తోంది. సోమవారం 200 మందికి దాకా అర్జీలు సమర్పించారు. సాధారణంగా 500 మంది దాకా వస్తారు.

→ ప్రకాశం జిల్లాలోనూ అర్జీలన్నీ పరిష్కరించినట్లు జిల్లా యంత్రాంగం ఘనంగా ప్రకటించుకుంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడా వచ్చిన దరఖాస్తులే మళ్లీమళ్లీ వస్తున్నాయి. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో 276 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారే ఎక్కువగా ఉంటున్నారు.

→ తూర్పు గోదావరి జిల్లాలో 314 మంది వివిధ సమస్యలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. పింఛన్‌లు, రేషన్‌కార్డులు, వ్యక్తిగత, సామాజిక సమస్యలు, భూ వివాదాలు సహా మరెన్నో అంశాలపై గ్రీవెన్స్‌లో కలిసి దరఖాస్తులు అందజేశారు.

→ అనంతపురం జిల్లాలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌కు 128 అర్జీలు వచ్చాయి. వీటన్నింటినీ ఆయా శాఖల వారీగా విభజించి ఆన్‌లైన్ చేశారు. మండల కేంద్రాల్లోని అధికారులకు సిఫార్సు చేశారు. సోమవారం వచ్చిన అర్జీలు ఇచ్చిన వారిలో అధికశాతం గతంలో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చిన వారే ఉండటం గమనార్హం. గ్రీవెన్స్‌కు వచ్చే సమస్యల్లో అధిక శాతం పింఛను, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలే ఉంటున్నాయి.

→ నెల్లూరు జిల్లాలో 99 శాతం అర్జీలను పరిష్కరించినట్లు అధికారులు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. వాస్తవానికి లక్షల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ, హౌసింగ్, డీఆర్‌డీఏ, జిల్లా పౌరసరఫరాలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, మున్సిపాలిటీ తదితర శాఖలకు సంబంధించిన అర్జీలు అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి.

→ వైఎస్సార్ జిల్లాలో సోమవారం 230 అర్జీలు వచ్చాయి. ప్రధానంగా పెన్షన్లు మంజూరు కోసం అధికంగా ఉన్నాయి. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. మరికొంతమంది పక్కాగృహాలు మంజూరు చేయాలని విన్నవించారు.

→ విశాఖ జిల్లాలో మీ కోసం కార్యక్రమం ఓ మాయాజాలాన్ని తలపిస్తోంది. లక్షలాది మంది గ్రీవెన్స్‌లో పెట్టుకుంటున్న అర్జీలు ఏమైపోతున్నాయో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం 210 మంది అర్జీలు పెట్టుకున్నారు. వీరిలో అత్యధికులు గతంలో వచ్చిన వారే. ఎక్కువగా భూ వివాదాలు..ఇళ్ల స్థలాలు..పింఛన్ల కోసమే ఎక్కువగా వచ్చాయి.

చచ్చిపోతానన్నా ఫలితం లేదు



నా పేరు టంకాల మోహనరంగా. మాది శ్రీకాకుళం జిల్లా జి.సగడాం మండలం బాతువ స్వగ్రామం. గ్రామంలో ఎకరన్నర భూమి ఉంది. బోరు బావి విద్యుత్ కనెక్షన్ కోసం రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనెక్షన్ ఇవ్వలేదు. నా భూమి పక్కనే టీడీపీ నేత భూమి ఉంది. ఆయన తనకు అమ్మమని ఒత్తిడి తెస్తున్నాడు. నేను అమ్మకపోవడంతో కనెక్షన్‌ను అడ్డుకుంటున్నాడు. మీకోసంలో అనేకసార్లు ఫిర్యాదు చేశా. ఈ ఏడాది జనవరి 22న ఆత్మహత్యాయత్నం కూడా చేసుకున్నా. కలెక్టర్ స్పందించి వారంలో రోజుల్లో విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తానన్నారు. అయినా పరిష్కారం కాలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు గ్రీవెన్స్‌కి వచ్చినా ఫలితం శూన్యం.

– టంకాల మోహన్ రంగా, బాతువ గ్రామం, జి.సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా)


'మీకోసం' రద్దు చేయాలంటూ జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గుదే నాగరాజు

▶ 150 కుటుంబాలున్న మా గ్రామంలో ఎవరైనా చనిపోతే ఆ మృత దేహాలను నీరుపారే వాగుల్లో..వంకల్లో పడేయాల్సి వస్తోంది. శ్మశానం కావాలంటూ మూడేళ్ల నుంచి 'మీకోసం'లో అర్జీలు ఇస్తున్నా సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. సామాజిక సమస్యను పరిష్కరించనప్పుడు మీకోసం కార్యక్రమం ఎందుకు? (ప్రకాశం జిల్లా జేసీతో పొన్నలూరు మండలం, మాలెపాడు పంచాయతీలోని చెంచుపాలెంకు చెందిన గుదే నాగరాజు అన్న మాటలివి)



▶ ఈ ఫొటోలో ఉన్న మహిళ హాకీ క్రీడాకారిణి జుజ్జువరపు జ్యోతి. కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన ఈమె పాఠశాల స్థాయి నుంచి హాకీలో ప్రతిభ చూపుతోంది. 15 సార్లు అంతరాష్ట్ర, రెండుసార్లు జాతీయ మహిళా జట్టుకు ఎంపికైంది. బీఏ, బీఈడీ చదివిన జ్యోతి.. తనకు ఏదోక చిన్నపాటి ఉద్యోగం కల్పించాలని గతంలో గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చింది. కాంట్రాక్టు టీచర్ పోస్టు ఇవ్వాలని కలెక్టర్ డీఈఓని ఆదేశించినా పనికాలేదు. ఆ తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌నూ అర్థించింది. అక్కడా న్యాయం జరగలేదు. అప్పటి నుంచి ఆమె గ్రీవెన్స్‌కు రావడం, చూద్దాంలే అనడం పరిపాటిగా మారింది.

ఏడాది నుంచి తిరుగుతున్నా



మా నాన్న మారెప్ప పేరుపై 7.08 ఎకరాల భూమి ఉంది. 2016 అడంగల్‌లో కూడా అదే ఉంది. అయితే, ఏడాది క్రితం 2.74 ఎకరాలు తక్కువగా చూపారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా పొరపాటున వేరే రైతు సర్వే నెంబర్‌లో ఎక్కిందని, సవరణ చేస్తామని చెప్పారు. ఏడాదిగా తిరుగుతున్నా. ప్రతి సారీ ఇదేమాట చెబుతున్నారు. పని మాత్రం కావడం లేదు.

– వీరేష్, పెద్ద హరివాణం, కర్నూలు జిల్లా

గెజిట్ నోటిఫికేషన్ కోసం 8 ఏళ్ల నుంచి తిప్పుతున్నారు!


పులిచింతల ముంపు గ్రామ నిర్వాసితులు

పులిచింతల ప్రాజెక్టు కోసం గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం అమ్మాజీగూడెం గ్రామాన్ని ఖాళీ చేశాం. దాదాపు 200 కుటుంబాల వారం గ్రామం వదలి వెళ్లిపోయాం. 8 ఏళ్ల నుంచి గెజిట్ నోటిఫికేషన్ వేయలేదు. అధికారులను ఎన్నిసార్లు కలిసినా స్పందించడం లేదు. ప్రతిసారి జిల్లా కేంద్రానికి రావాలంటే ఎంత ఇబ్బంది? ఈరోజు తాడో పేడో తేల్చుకుని గాని వెళ్లం.

– టి. అంకమ్మరావు, అమ్మాజీగూడెం గ్రామస్తుడు

మార్పుకు నాంది

- 'ఫెడరల్ ఫ్రంట్' దిశగా ఇది తొలి అడుగు..
- పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో భేటీ

కోల్‌కతా: దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు దిశగా, ప్రత్యామ్నాయం దిశగా నాంది పడిందని, 'ఫెడరల్ ఫ్రంట్'వైపు అడుగులు మొదలయ్యాయని టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి, ప్రత్యామ్నాయ ఎజెండా అత్యవసరమని వ్యాఖ్యానించారు. తమది ప్రజలందరి ఫ్రంట్ అని, నిజమైన సమాఖ్య స్ఫూర్తిని అందించేందుకు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. సమ్మిళిత, ఉమ్మడి నాయకత్వంలో ఫెడరల్ ఫ్రంట్ కొనసాగుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్ సోమవారం కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీతో భేటీ అయ్యారు. దేశంలో బీజేపీయేతర, కాంగ్రెసేతర పక్షాలతో 'ఫెడరల్ ఫ్రంట్'ఏర్పాటు అంశంపై ఆమెతో చర్చించారు. అనంతరం కేసీఆర్, మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడారు. దేశంలో గుణాత్మక మార్పు దిశగా ఇది ప్రారంభమని, తాము సమాఖ్య స్ఫూర్తికి నిజమైన అర్థమిచ్చే ఫెడరల్ ఫ్రంట్‌ను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని కేసీఆర్ చెప్పారు. ''ఈ రోజు సమావేశానికి ప్రత్యేకత ఉంది. ఇది ఫెడరల్ ఫ్రంట్‌కు, మొత్తం మార్పుకు మొదలు. ఆ దిశగా ఫలవంతమైన చర్చలు జరిగాయి. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం దిశగా మాతో కలసి వచ్చే అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుపుతాం. ఇప్పుడు దేశానికి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి, ప్రత్యామ్నాయ ఎజెండా అత్యవసరం..''అని అన్నారు.

ఇది ప్రజల ఫ్రంట్: 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ ఫ్రంట్ కడుతున్నట్లు అపార్థం చేసుకుంటున్నారని, అయితే తమది సాదాసీదా ఎన్నికల ఫ్రంటు కాదని కేసీఆర్ చెప్పారు. తమది దేశ ప్రజల కోసం ఏర్పాటు కానున్న ఫెడరల్ ఫ్రంట్ అన్నారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, తామిద్దరమే (కేసీఆర్, మమతా బెనర్జీ) అంతా నిర్ణయించలేమని కేసీఆర్ చెప్పారు.

ఇది శుభారంభం: మమతా బెనర్జీ: మారుతున్న భారత రాజకీయాల నేపథ్యాన్ని, ఫ్రంట్ అంశాన్ని చర్చించామని.. ఇదొక శుభారంభమని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పారు. కేసీఆర్ అభిప్రాయాలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని తెలిపారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీలకు ఐక్య దళిత మహానాడు వినతి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో దళితుల భూములకు రక్షణ కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఐక్య దళిత మహానాడు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం జాతీయ అధ్యక్షుడు కల్లూరి చంగయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎంపీలకు వినతిపత్రం అందజేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లా చిత్తూరులోని తొట్టంబేడు మండలం, వరదయ్యపాలెం మండలాల పరిధిలో 1,050 ఎకరాల దళితుల భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కుందని ఆరోపించారు. ఇందులోని 650 ఎకరాలను గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దళితులకు ఇచ్చారని వివరించారు. ఈ భూములను ప్రభుత్వం పలు సంస్థలకు కట్టబెట్టిందని, వేలాది ఎకరాల దళితుల భూములను కొల్లగొట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో కొప్పాల మురళి, లక్ష్మీరాజ్యం, సింగమాల కాటయ్య, నందం మురళి, కొప్పుల జయరాజు, పూర్ణవిజయ్, రవీంద్రబాబు, నాగరాజు, ఏసురత్నం ఉన్నారు.

అవిశ్వాసంపై చంద్రబాబువి అసత్యాలు

- కాంగ్రెస్, వామపక్షాలకు మీపై నమ్మకం లేదు
- ఒకవేళ నిజంగా అంత నమ్మకముంటే రాష్ట్రంలో ఎందుకు ఆందోళనలు చేస్తున్నాయ్?
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పార్థసారథి ధ్వజం



విజయవాడ సిటీ: కేంద్రంపై అవిశ్వాసం విషయంలో సీఎం చంద్రబాబు అసత్యాలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. తనపై నమ్మకంతోనే బీజేపీ వ్యతిరేక పక్షాలు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికాయంటూ చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. చంద్రబాబుపై ఆయా పార్టీలకు అంత నమ్మకమే ఉంటే.. రాష్ట్రంలో ఆయనకు వ్యతిరేకంగా ఎందుకు పోరాటం చేస్తున్నాయో ముఖ్యమంత్రే చెప్పాలన్నారు. సోమవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిన్నటి వరకు అవిశ్వాస తీర్మానంతో ప్రయోజనం ఉండదని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కేంద్రంపై సభలో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించినప్పుడు జాతీయ, ప్రాంతీయ పార్టీలు వివిధ కారణాలతో మద్దతు పలుకుతాయన్న విషయం చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తమిళనాడు సభ్యులు కావేరి వివాదం గురించి.. కాంగ్రెస్, వామపక్షాలు బీజేపీకి వ్యతిరేకంగా అవిశ్వాసానికి మద్దతు పలకడం సహజమన్నారు. కానీ దీన్ని కూడా చంద్రబాబు తన స్వప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు వైఖరి చూస్తుంటే.. ఓటుకు కోట్లు కేసుతో పాటు పోలవరం, రాజధాని భూ సేకరణకు కాంగ్రెస్, వామపక్షాలు మద్దతు తెలుపుతున్నాయని చెప్పుకున్నా ఆశ్చర్యం లేదని ఎద్దేవా చేశారు. రేపొద్దున్న యూపీఏకు నాయకుడిని తానేనని చంద్రబాబు చెప్పుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు.

పవన్ ఆరోపణలపై సమాధానం చెప్పు?

టీడీపీ ప్రభుత్వ అవినీతిపై పవన్ కల్యాణ్ లేవనెత్తుతున్న అంశాలపై సమాధానం చెప్పాలని సీఎం చంద్రబాబును పార్థసారథి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని, మోసం చేశారని మీ పార్టనర్ పవన్ సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై ఉన్న తప్పుడు కేసుల గురించి చంద్రబాబు మాట్లాడటం చూస్తుంటే.. ఆయనకు న్యాయస్థానాలపై గౌరవం లేదన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలికితే కేసులు కొట్టేస్తారన్నట్లుగా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలియదా అని చంద్రబాబును ప్రశ్నించారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన చంద్రబాబు భరతం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

దేవుడా.. ఇదేమి పరీక్ష

- కొద్దిసేపటిలో 'పది' పరీక్ష రాయాల్సి ఉండగా అన్న మృతి
- దుఃఖాన్ని దిగమింగుతూ పరీక్షకు హాజరైన తమ్ముడు

రంగంపేట/ప్రత్తిపాడు: ఏడాది పాటు కష్టపడి చదివి పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమైన ఇద్దరు విద్యార్థులకు విధి పరీక్ష పెట్టింది. తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ఓ విద్యార్థి కొద్ది గంటల్లో పరీక్ష రాయాల్సి ఉండగా.. ఆ విద్యార్థి అన్న వాగులో పడి మృతి చెందాడు. అలాగే గుంటూరు జిల్లా తిక్కిరెడ్డిపాలెంకు చెందిన ఓ విద్యార్థిని తండ్రి గుండెపోటుతో మరణించాడు. అయినా కూడా ఆ విద్యార్థులు పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ.. సోమవారం ఇంగ్లిష్ పరీక్ష రాశారు. వివరాలు.. తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన కొమిరిశెట్టి మనోహర్ మారేడుమిల్లి మండలంలోని పాములేరు వాగులో పడి ఆదివారం మరణించాడు. కాగా, అతని తమ్ముడు స్వతంత్రకుమార్ పదో తరగతి చదువుతున్నాడు.


పరీక్ష కేంద్రానికి వచ్చిన స్వతంత్రకుమార్, పరీక్ష రాస్తున్న తలమాల విన్నీ హర్షిత

సోమవారం ఉదయం 9 గంటలకు ఇంగ్లిష్ పేపర్–1 రాయాల్సి ఉంది. పరీక్షకు సన్నద్ధమవుతుండగా.. మనోహర్ మృతి చెందిన విషయం స్వతంత్ర కుమార్‌కు తెలిసింది. దీంతో షాక్‌కు గురైన స్వతంత్రకుమార్ విలపిస్తూ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు, బంధువులు ఓదార్చి ధైర్యం చెప్పడంతో.. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ పరీక్ష రాసిన అనంతరం అంత్యక్రియలకు హాజరయ్యాడు.

తండ్రి మరణించినా: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంకు చెందిన తలమాల విన్నీ హర్షిత స్థానిక సరోజిని విద్యాలయంలో పదో తరగతి చదువుతోంది. శనివారం ఆమె తండ్రి సీనియర్ పాత్రికేయుడు తలమాల నీలాంబరం గుండెపోటుతో మరణించారు. దీంతో ఆ బాలిక షాక్‌కు గురైంది. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఆమెకు కుటుంబసభ్యులు, బంధువులు నచ్చజెప్పి సోమవారం ఇంగ్లిష్ పరీక్ష రాయించారు.

మిద్దె తోటల పెంపకంపై కోర్సు

సాక్షి, అమరావతి: సేంద్రీయ వ్యవసాయం, మిద్దె తోటల పెంపకంపై దూరవిద్య సర్టిఫికెట్ కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రవేశపెడుతున్నట్టు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించింది. సేంద్రీయ సాగును ప్రపంచమంతటా భారీ ఎత్తున ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మిద్దె తోటల పెంపకం గ్రామస్తులకే కాకుండా పట్టణవాసులకూ లాభదాయకమని పేర్కొంది. 3 నెలల వ్యవధిలో ఈ సర్టిఫికెట్ కోర్సులు పూర్తవుతాయి. ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సులు ఒక్కొక్క దానికి రూ.3 వేలు ఫీజు వసూలు చేస్తారు. 6వ తరగతి చదివి ఉండి తెలుగులో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

'కట్న' పిశాచులు..

- అదనపు కట్నం కోసం చిత్రహింసలు
- అవనిగడ్డ వైద్యశాలలో చికిత్స
- మోపిదేవి సర్పంచ్, తమ్ముడు, తల్లిదండ్రుల నిర్వాహకం

అవనిగడ్డ: కట్టుకున్న భార్య అనే కనికరం లేకుండా అదనపు కట్నం కోసం ప్రత్యక్ష నరకం చూపించారు. చావబాది స్పృహ తప్పిపోతే చికిత్స చేయించాల్సింది పోయి, తాళం వేసి రాత్రంతా ఇంట్లో బంధించారు. కృష్ణా జిల్లా మోపిదేవి కాలనీలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యాయం చేయాల్సిన పోలీసులే రాజీకి ప్రయత్నించడం విమర్శలకు దారితీస్తోంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోపిదేవి కాలనీకి చెందిన కర్లపూడి కిశోర్‌కి చిరువోలుకు చెందిన దోవారి జ్యోతితో 2012 ఏప్రిల్ 27న వివాహమైంది. వివాహం సందర్భంగా కిశోర్‌కు అత్తమామలు రూ.35 వేల నగదు, ఉంగరం, 4 సెంట్లు స్థలం కట్నంగా ఇచ్చారు. తమ తదనంతరం ఇల్లు కూతురు, అల్లుడికి చెందేలా పత్రాలు రాసిచ్చారు. అయితే పెళ్లయిన ఏడాదికే అదనపు కట్నం తీసుకురావాలని, ఇంటి పత్రాలు ఇవ్వాలని జ్యోతిని భర్త కిరణ్, అతని తల్లిదండ్రులు హింసించడం ప్రారంభించారు. వీరి వేధింపులు భరించలేక నాలుగేళ్ల క్రితం జ్యోతి ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అనంతరం పెద్దలు రాజీ కుదిర్చి కాపురానికి పంపించారు. అయితే కిరణ్ వేరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే జ్యోతిని తరచూ కొట్టేవాడు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తే..

ఈ నెల 12న జ్యోతి, ఇద్దరు పిల్లలను తీసుకుని కిరణ్ అత్తవారింటికి వెళ్లి మీ అమ్మాయి మా పరువంతా తీసింది, ఇక్కడే ఉంచుకోమని వదిలేసి వెళ్లాడు. తర్వాత విషయం


మీరైనా న్యాయం చేయండని చేతులెత్తి వేడుకుంటున్న బాధితురాలు జ్యోతి


ఘటన జరిగి వారం రోజులైనా కదలలేని స్థితిలో బెడ్‌పై పడుకుని ఉన్న జ్యోతి, పక్కనే పిల్లలు, ఆమె తల్లి

తెలుసుకున్న జ్యోతి తల్లి దోవారి వెంకటేశ్వరమ్మ, భర్త ఆదిశేషు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్ఐ టి.నాగేంద్రరావు కిరణ్, ఆయన కుటుంబ సభ్యులను పిలిపించాడు. జ్యోతికి దెయ్యం పట్టడంతో వాతలుపెట్టి, కొట్టినట్లు పోలీసులకు కిరణ్ చెప్పాడు. పోలీసులు కూడా వారి మధ్య రాజీకి ప్రయత్నించి పంపించివేశారు.

ప్రభుత్వాస్పత్రిలో చేరడంతో కేసు నమోదు..

భర్త కిరణ్ కొట్టిన దెబ్బలకు విపరీతమైన నొప్పులు రావడం, తల తిప్పడంతో ఈ నెల 14న జ్యోగి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. ఈ విషయాన్ని బయటకు పొక్కనిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని భర్త, బావలు బెదిరించడంతో బాధితురాలు ఎవరికీ చెప్పుకోలేదు. ఆదివారం కిరణ్ ఆస్పత్రికి వచ్చి కేసు పెడితే నిన్ను చంపేస్తాను, లేదంటే నేను ఏదైనా తాగి చస్తానని బెదిరించాడని జ్యోతి ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోజే వాళ్లు తనను చంపేసేవారని, స్పృహతప్పి పడిపోవడంతో వెళ్లిపోయారని తెలిపింది. ఆయన దగ్గరకు వెళ్తే తనను చంపేస్తారని, మీరైనా న్యాయం జరిగేలా చూడాలని విలేకరులకు చేతులు జోడించి వేడుకుంది. ఈ విషయమైన ఎస్ఐ నాగేంద్రరావును వివరణ కోరగా భర్త, అత్తమామ, బావతో కలిసి స్టేషన్‌కు వచ్చారని, వారిని మందలించి పంపించినట్టు చెప్పారు. అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలలో చేరిన తర్వాత సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణదొర సమాచారం మేరకు ఎస్ఐ మణికుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

చిత్రహింసలకు గురిచేశారు..

ఈ నెల 11న రాత్రి ఐదేళ్ల కుమారుడు నితీష్‌కుమార్, మూడేళ్ల కుమార్తెతో కలసి మోపిదేవి కాలనీలోని ఇంట్లో నేను పడుకుని ఉండగా, అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో భర్త కిరణ్, బావ అయిన తెలుగుదేశం పార్టీకి చెందిన మోపిదేవి సర్పంచ్ కర్లపూడి పూర్ణచంద్రరావు, అత్తమామలు నాగమణి, నాగులు, ఆడపడుచు స్వప్న వచ్చారు. అందరూ కలసి నాపై దాడిచేసి చిత్రహింసలకు గురిచేశారు. కిరణ్ అట్లకాడను కాల్చి కాళ్లు, తొడలపై వాతలు పెట్టగా, కేకలు వేయకుండా అత్తమామలు నోట్లో గుడ్డలు కుక్కారు. కొట్టొద్దని చేతులెత్తి వేడుకున్నా కనికరం లేకుండా బావ, ఆడపడుచు చెప్పుతో చెంపలపై కొట్టారు. భర్త, బావ కలసి తలను గోడకేసి బండను బాదారు. స్పృహతప్పి పడిపోయిన తర్వాత ఇంటికి తాళాలేసి వెళ్లిపోయారు.

– జ్యోతి, బాధితురాలు

ఐ యామ్ వెరీ సారీ



కొనసాగుతున్న కేజ్రీవాల్ క్షమాపణల పర్వం

- క్షమించాలంటూ తాజాగా గడ్కరీ, సిబల్‌కు ఢిల్లీ సీఎం లేఖలు
- కేజ్రీపై ఉన్న మరో 30 పరువునష్టం కేసులు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన మరో ఇద్దరు ప్రత్యర్థులకు తాజాగా క్షమాపణలు చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాల్లేకుండా ఆరోపణలు చేశానని, తనను క్షమించాలని కోరుతూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ కొడుకు అమిత్ సిబల్‌లకు ఆయన లేఖలు రాశారు. దేశంలోనే తొలి 20 మంది అత్యంత అవినీతిపరుల్లో గడ్కరీ ఒకరంటూ గతంలో కేజ్రీవాల్ ఓ జాబితాను ప్రచురించారు. అమిత్ సిబల్‌పై కూడా అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో వారు కేజ్రీవాల్‌పై వేర్వేరుగా పరువునష్టం కేసులు వేయగా ప్రస్తుతం విచారణ నడుస్తోంది. కేజ్రీవాల్ క్షమాపణ లేఖలను ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌కు సమర్పించారు. అమిత్ సిబల్‌కు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా కూడా క్షమాపణలు చెప్పారు. అనంతరం పరువునష్టం కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు గడ్కరీ, కేజ్రీవాల్ సంయుక్తంగా ఒక దరఖాస్తును, కేజ్రీవాల్, అమిత్ సిబల్‌లు మరో దరఖాస్తును కోర్టుకు సమర్పించారు. దీంతో ఈ రెండు కేసుల నుంచి కేజ్రీవాల్‌కు కోర్టు విముక్తి కల్పించింది. కాగా, కోర్టు కేసుల నుంచి బయటపడటానికి కేజ్రీవాల్ న్యాయవాదులు అమలు చేస్తున్న వ్యూహం ఇదని విశ్లేషకులు అంటున్నారు. సిసోడియా మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేయాల్సిన సమయాన్ని అహంభావంతో కోర్టుల చుట్టూ తిరిగి వృథా చేయకూడదనే ఉద్దేశంతోనే క్షమాపణలు చెప్తున్నాం. 'మా వ్యాఖ్యలతో ఎవరైనా బాధకు గురైతే మేం క్షమాపణలు చెప్తాం. అహంకారంతో దాన్ని వైరంగా మార్చం. ప్రజల కోసం పనిచేయడానికి మేం ఇక్కడున్నాం. కోర్టుల చుట్టూ తిరగడానికి కాదు' అని ఆయన అన్నారు. మరోవైపు తనపై ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వేసిన రెండో పరువునష్టం కేసును కేజ్రీవాల్ కోర్టులో వ్యతిరేకించారు. కేజ్రీవాల్ సూచనల మేరకే ఆయన న్యాయవాది రాం జెఠ్మలానీ తనను అభ్యంతరకర పదాలతో దూషించాడంటూ జైట్లీ ఈ కేసు వేశారు.

మూడు పోయి.. మరో 30 ఉన్నాయి

కేజ్రీవాల్‌పై ఇంకా 30 పరువునష్టం కేసులున్నాయి. శిరోమణి అకాలీదళ్ నేత విక్రమ్ సింగ్ మజీథియాకు మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధాలు ఉన్నాయని కేజ్రీవాల్ ఆరోపించడంతో ఆయన పరువునష్టం కేసు వేయడం, ఇటీవలే ఆయనకూ కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పి కేసును ఉపసంహరించుకునేలా చేయడం తెలిసిందే. కేజ్రీవాల్ వైఖరిని ఆప్ నేతలే కొందరు వ్యతిరేకిస్తున్నారు. కేజ్రీవాల్ క్షమాపణ కోరడంతో ఆప్ పంజాబ్ చీఫ్ పదవికి ఎంపీ భగవంత్ మన్ రాజీనామా కూడా చేశారు. గడ్కరీ, సిబల్‌లకు కేజ్రీ క్షమాపణ చెప్పడంతో మరో రెండు కేసుల నుంచి ఆయన బయటపడ్డారు.అయినా మరో 30 పరువునష్టం కేసులు ఆయనపై ఉన్నాయి.

ఎందుకు వెనకడుగు వేస్తున్నారు?

20 మంది అత్యంత అవినీతిపరుల జాబితాను ప్రచురించిన కేజ్రీవాల్ ఇప్పుడు ఎందుకు వెనక్కు జారుకుంటున్నారని ఆప్ మాజీ నాయకురాలు అంజలీ దమానియా ప్రశ్నించారు. గడ్కరీ అవినీతిపరుడనే అనేందుకు తన వద్ద ఉన్న ఆధారాలను అప్పుడే కేజ్రీవాల్‌కు ఇచ్చానని, అవినీతిపరులకు శిక్ష పడేలా చేయకుండా ఆయన ఇప్పుడు వెనకడుగు వేస్తున్నారన్నారు. అంజలీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ తరఫున గడ్కరీపై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం 2015లో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తిన సమయంలో ఆమె ఆప్‌ను వీడారు.

రైతు సమస్యలపై కాంగ్రెస్‌తో పనిచేస్తాం

స్వాభిమాన్ షేత్కారీ సంఘటన చీఫ్ రాజు శెట్టి

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని స్వాభిమాన్ షేత్కారీ సంఘటన చీఫ్, లోక్‌సభ సభ్యుడు రాజు శెట్టి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో సోమవారం నాడిక్కడ భేటీ అనంతరం శెట్టి మీడియాతో మాట్లాడారు. రైతుల సమస్యలపై దృష్టి సారించనున్నట్లు రాహుల్ కాంగ్రెస్ ప్లీనరీలో ప్రకటించిన మరుసటి రోజే ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మార్చి 29న మహారాష్ట్రలో నిర్వహించనున్న రైతు సదస్సుకు హాజరు కావాల్సిందిగా రాహుల్‌ను ఆయన ఆహ్వానించారు. గతేడాది ఆగస్టులో ఎన్డీఏ నుంచి శెట్టి బయటికొచ్చిన సంగతి తెలిసిందే.



అజ్మీర్‌లోని ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాకు సోమవారం ప్రధాని మోదీ తరఫున చాదర్ సమర్పిస్తున్న కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ

శాంతి, సామరస్యాలు దేశ సైద్ధాంతిక మూలాలు: మోదీ

జైపూర్: శాంతి, సామరస్యం, ఏకతా భారతదేశ సైద్ధాంతిక మూలాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సోమవారం ఆయన అజ్మీర్‌లోని సూఫీ మతగురువు హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాకు చాదర్‌ను సమర్పించారు. ప్రధాని తరఫున కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ దర్గాను సందర్శించి, చాదర్‌ను సమర్పించారు. 806వ వార్షిక ఉర్సు సందర్భంగా దేశ, విదేశాల్లో ఉన్న ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ అనుచరులకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'శాంతి, సామరస్యం, ఏకతా భారతదేశ సైద్ధాంతిక మూలాలు. సూఫీయిజం కూడా భారతీయ తత్వమే. భారతదేశంలో గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయాలకు చిహ్నంగా సూఫీ తత్వవేత్త ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ నిలుస్తారు' అని మోదీ ఆ సందేశంలో పేర్కొన్నారు.

జేఎన్‌యూలో అధ్యాపకుడి లైంగిక వేధింపులు



పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలిస్తున్న జేఎన్‌యూ విద్యార్థినులు

న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్న అతుల్ జోహ్రి అనే అధ్యాపకుడిని పోలీసులు రక్షిస్తున్నారంటూ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థులు వసంత్ కుంజ్ పోలీస్ స్టేషన్ వరకు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. జోహ్రి తమను లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఎనిమిది మంది విద్యార్థినులు ఫిర్యాదు చేసిన నాలుగు రోజుల అనంతరం కూడా పోలీసులు కేవలం ఎఫ్ఐఆర్ నమోదు చేసి వదిలేశారనీ, కనీసం ఆయనను విచారించలేదని జేఎన్‌యూ విద్యార్థి సంఘం నాయకులు మండిపడ్డారు. ఎనిమిది మంది విద్యార్థినుల ఫిర్యాదులపై వేర్వేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని 54 మంది అధ్యాపకులు కూడా పోలీసులను డిమాండ్ చేశారు.

టెక్సస్‌లో సీరియల్ బాంబర్!

హ్యూస్టన్: అమెరికాలోని టెక్సస్ రాజధాని ఆస్టిన్‌లో ఈ నెలలో నాలుగోసారి పేలుడు సంభవించింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఆస్టిన్‌లో వరుసగా పేలుళ్లు సంభవిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీటి వెనుక సీరియల్ బాంబర్ ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పేలుడు జరిగిన ప్రాంతంలోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ 350 మంది ప్రత్యేక ఏజెంట్లను, బాంబు స్క్వాడ్‌లను ఆస్టిన్‌కు పంపింది.

భారతీయ సీనియర్లు వేధించారు!

లాస్‌ఏంజెలెస్: తమను బలవంతంగా ఉద్యోగాల నుంచి తొలగించారని, ఆ స్థానంలో తక్కువ అర్హతలున్న దక్షిణాసియా వాసుల్ని నియమించుకున్నారని ఆరోపిస్తూ అమెరికాకు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్‌పై లాస్ ఏంజెలెస్‌లోని డిస్ట్రిక్ట్ కోర్టులో ముగ్గురు మాజీ ఉద్యోగులు కేసు దాఖలు చేశారు. భారత్‌కు చెందిన పై అధికారులు, సహ ఉద్యోగులు అవమానించారని, తక్కువ రేటింగ్ ఇవ్వడంతో పాటు ప్రమోషన్లు నిరాకరించారని తమ పిటిషన్‌లో వారు పేర్కొన్నారు. అయితే తమపై దాఖలైన కేసు చట్టపరంగా చెల్లదని హెచ్–1బీ వీసాదారులు అత్యధికంగా పనిచేస్తున్న జాబితాలో రెండో స్థానంలో ఉన్న కాగ్నిజెంట్ కోర్టుకు తెలిపింది. ఆ ఆరోపణలు అమెరికా పౌర హక్కుల చట్టం కిందకు రావని ఆ కంపెనీ వాదిస్తోంది. 'పౌర హక్కుల చట్టం 1964 ప్రకారం.. జాతి ఆధారంగా వివక్ష నిషేధం. అయితే దేశం ఆధారంగా వివక్ష చూపారని ఈ కేసులోని కక్షిదారులు ఆరోపించారు. అందువల్ల ఆరోపణలు చెల్లవు' అని కోర్టుకు వెల్లడించింది. గురువారం కోర్టు తన నిర్ణయం వెలువరించనుంది.

ప్రత్యేక మతంగా లింగాయత్!

వీరశైవులకూ మతపరమైన మైనారిటీ హోదా

- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం
- త్వరలోనే కేంద్రానికి సిఫారసు
- 17 శాతం లింగాయత్‌ల ఓట్లకోసం కాంగ్రెస్ ప్రయత్నాలు
- నిప్పుతో ఆడొద్దు: రిజర్వేషన్లపై మండిపడ్డ బీజేపీ



సోమవారం బెంగళూరులో సంబరాలు చేసుకుంటున్న లింగాయత్ వర్గీయులు

సాక్షి, బెంగళూరు: ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ కర్ణాటకలో అధికార కాంగ్రెస్ మరింత దూకుడును ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న లింగాయత్‌లు, వీరశైవ లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ.. మతపరమైన మైనారిటీ హోదాను కల్పించే వ్యూహంపై ముందడుగేసింది. సోమవారం సమావేశమైన కర్ణాటక కేబినెట్.. లింగాయత్ సామాజికవర్గాన్ని ప్రత్యేక మతంగా గుర్తిస్తూ.. వారికి మతపరమైన మైనారిటీ హోదా కల్పించాలన్న రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫారసులను ఆమోదించింది. ఈ సిఫారసు లను త్వరలో కేంద్రానికి పంపనుంది. కన్నడ మంత్రి టీబీ జయచంద్ర మాట్లాడుతూ.. 'రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. ఈ నిర్ణయం ద్వారా తదుపరి విస్తృతమైన సంప్రదింపులు, చర్చలు జరుపుతాం' అని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రస్తుతం మైనారిటీ హోదాను అనుభవిస్తున్న వారికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. కొందరు లింగాయత్ స్వాములు.. సోమవారం సీఎం సిద్దరామయ్యను కలిసి కమిటీ రిపోర్టు వీలైనంత త్వరగా అమలయ్యేలా చూడాలని కోరారు. కేబినెట్ నిర్ణయంతో హర్షిస్తూ.. లింగాయత్‌లు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకోగా.. వీరశైవులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్బుర్గితోపాటు దావణగెరె, బిజాపుర ప్రాంతాల్లో లింగాయత్‌లు, వీరశైవులకు మధ్య ఘర్షణలు జరిగాయి. కాగా, ఈ రిజర్వేషన్‌పై తమ వైఖరిని వెల్లడించాలని బీజేపీ చీఫ్ అమిత్‌షా, యడ్యూరప్పలు రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు.

నిప్పుతో ఆటలొద్దు.. బీజేపీ: లింగాయత్‌లు, వీరశైవుల రిజర్వేషన్ల వివాదానికి బీజేపీ సహా పలు హిందూ సామాజిక వర్గాలు మొదటినుంచీ దూరంగా ఉంటున్నాయి. అయితే.. సిద్దరామయ్య సర్కారు తీసుకున్న తాజానిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. రాజకీయ అవసరాలకోసం సిద్దరామయ్య ప్రభుత్వం కులాలు, మతాలను విభజిస్తోందని మండిపడింది. ఓటుబ్యాంకు రాజకీయాలకోసం సిద్దరామయ్య నిప్పుతో ఆడుతున్నారని కర్ణాటక బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధర్ రావు విమర్శించారు. ఎన్నికల్లో గెలిచేందుకు.. విభజించు–పాలించు అన్న బ్రిటిషర్ల విధానాన్నే కాంగ్రెస్ అమలుచేస్తోందన్నారు. 'వీరశైవులు, లింగాయత్‌లు ఒక్కటే. ఈ రెండు సామాజిక వర్గాలూ హిందుత్వంలో భాగమే. రాజకీయ లాభం కోసం వీరిని విడగొడుతున్నారు' అని కర్ణాటక బీజేపీ సీఎం అభ్యర్థి యడ్యూరప్ప మండిపడ్డారు. కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

చాలాకాలంగా డిమాండ్

లింగాయత్‌లు చాలాకాలంగా ప్రత్యేక మతంగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో లింగాయత్‌లకు మతపరమైన మైనారిటీ హోదా ఇవ్వాలన్న అంశం చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఇలాంటి కీలకమైన అంశాన్ని.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో లేవనెత్తడం కాంగ్రెస్‌కు మేలు చేస్తుందని భావిస్తున్నారు. యడ్యూరప్ప కూడా లింగాయత్ సామాజిక వర్గానికి చెందినవారే. దీంతో ఆయన్ను, బీజేపీని దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్ ఉన్నపళంగా ప్రత్యేక మతం పేరుతో మైనారిటీ అంశాలను తెరపైకి తెచ్చింది.

17 శాతం లింగాయత్‌ల ఓట్లకోసం..

అఖిల భారత వీరశైవ మహాసభ.. లింగాయత్‌లు, వీరశైవులు ఒక్కటేనని అందరికీ ప్రత్యేక మత హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా.. మరో గ్రూపు కేవలం లింగాయత్‌లకు మాత్రమే ఈ హోదాను ఇవ్వాలని పట్టుబడుతోంది. కొందరు లింగాయత్‌లు ఓ అడుగు ముందుకేసి.. వీరశైవులను తమలో కలుపుకునేందుకు సిద్ధమేనని.. అయితే వీరశైవులంతా లింగాయత్‌లేనని చెప్పుకోవాలనే షరతుపెట్టారు. దీనిపై కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దీనికితోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో 17 శాతం ఉన్న వీరశైవులు, లింగాయత్‌ల ఓట్ల కోసం సిద్దరామయ్య సర్కారు.. హైకోర్టు రిటైర్డ్ జడ్జి హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ మార్చి 2న తన నివేదికను అందజేసింది. 'కర్ణాటకలోని లింగాయత్, వీరశైవ లింగాయత్‌లకు మతపరమైన మైనారిటీ హోదా ఇవ్వవచ్చు' అని ఈ కమిటీ సూచించింది.

లింగాయత్ X వీరశైవం!

కర్ణాటక రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందుండే లింగాయత్‌లు చాలాకాలంగా మతపరమైన మైనారిటీ హోదా కోసం పోరాడుతున్నారు. లింగాయత్‌లు రెండు వర్గాలు. ఇందులో ఒకరు లింగాయత్‌లు, రెండోవారు వీరశైవ లింగాయత్‌లు. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు (బసవణ్ణ) లింగాయత్ సిద్ధాంతాన్ని ఏర్పాటుచేశారు. 'అనుభవ మంటపం' అనే వేదికను ఏర్పాటుచేసి అందరినీ ఆదరించారు. విగ్రహారాధన లేకుండా.. నిరాకారుడైన శివుడినే పూజించాలని ప్రబోధించారు. అందరూ ఇష్టలింగం పేరుతో లింగాన్ని మెడలో వేసుకోవాలని, చేసే పని ద్వారానే దైవాన్ని చేరతామని (కాయకేవ కైలాస) ప్రబోధించాడు. ఆయన తర్వాత తరతరాలుగా పలువురు గురువులు మఠాలను స్థాపించి బసవణ్ణ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ఈ మఠాలు విద్యాసంస్థలతో బాటు, అనేక సంస్థలు నిర్వహిస్తూ ఆర్థికంగా, సామాజికంగా బలంగా వున్నాయి. గతంలోనే కర్ణాటక ప్రభుత్వం లింగాయత్‌లు, వీరశైవులను (గతంలో వీరంతా ఒకటేననే భావన ఉండేది) 5% రిజర్వేషన్‌తో బీసీ 3–బి కేటగిరీలో చేర్చారు. ప్రస్తుతం వీరంతా హిందువులుగానే పరిగణించబడుతున్నారు.

ఇతర మైనారిటీల్లాగే..: లింగాయత్‌లు తాము హిందువులం కాదని.. బౌద్ధులు, జైనులు, సిక్కుల్లాగా తామూ గురువులనే అనుసరిస్తామనీ, కాబట్టి తమను కూడా వారిలాగే మైనారిటీలుగా గుర్తించాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. లింగాయతులు, తాము ఒకటే సమూహమని వీరశైవులంటున్నారు. వీరశైవులు తమను లింగాయత్‌లుగా చెప్పుకోవడం కొందరు లింగాయత్‌లకు నచ్చటం లేదు. నిజానికి వీరశైవం బసవణ్ణ కంటె ముందు నుంచే అస్తిత్వంలో వుంది. హిందూమతంలోని ఓ శాఖే వీరశైవం అంటారు. అయితే శివుణ్ని తప్ప విష్ణువుని కొలవరు వాళ్లు. శివుడికి బలులిస్తారు. వైదికకర్మలను, ఆగమ శాస్త్రాన్ని ఆచరిస్తారు. లింగాయతులు వీటికి వ్యతిరేకం. దీంతో వివిధ లింగాయత్ వర్గాలు తమను వీరశైవుల్లో కలిపి లెక్క వేయవద్దని, తమకు మైనారిటీ హోదా యిచ్చి తీరాలని కోరుతూ ఆందోళనలు నిర్వహించాయి.

కర్ణాటకలో లింగాయత్‌లు రాజకీయంగా కూడా కీలక స్థానాలు అలంకరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక 15 ఏళ్లపాటు లింగాయతులే ముఖ్యమంత్రులుగా వున్నారు (నిజలింగప్ప, బిడి జత్తి, ఎస్ఆర్ కాంతి, వీరేంద్ర పాటిల్). ఆ తర్వాత కూడా లింగాయత్ వర్గానికి చెందిన ఎస్ఆర్ బొమ్మయ్, జెహెచ్ పాటిల్, యడ్యూరప్ప సీఎంలయ్యారు. కన్నడనాట వీరి జనాభా 17 శాతం. దాదాపు 100 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించగలిగే స్థానంలో ఉన్నారు.

చైనా రక్షణమంత్రిగా మిస్సైల్ ఎక్స్‌పర్ట్!

భారత్‌తో చర్చలకు వాంగ్ యి



వాంగ్ యి

బీజింగ్: ప్రపంచంలో చైనాను మరింత శక్తిమంతంగా నిలిపేలా.. సమర్థవంతంగా, సేవా దృక్పథంతో పనిచేసేలా కొత్త మంత్రి వర్గాన్ని చైనా ప్రధాని లీ కెకియాంగ్ ఏర్పాటుచేశారు. నలుగురు ఉప ప్రధానులతో పాటు 26 మంత్రిత్వ శాఖలు, కమిషన్లతో కూడిన కొత్త కేబినెట్‌కు చైనా పార్లమెంటు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. భారత్ సహా పలు సరిహద్దు దేశాలతో విభేదాల నేపథ్యంలో క్షిపణి రంగ నిపుణుడు లెఫ్టినెంట్ జనరల్ వై ఫెంఘేను రక్షణ శాఖ మంత్రిగా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. చైనాలో సైనిక ఆధునికీకరణ, పునర్వ్యవస్థీకరణకు ఆయన కృషి చేశారు. ఇక ఉప ప్రధాని ల్యూ హీ చైనా ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో కీలక పాత్ర పోషించనున్నారని తెలుస్తోంది. ప్రపంచంలో అమెరికా తర్వాత అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాలో 30 ఏళ్ల అనంతరం 2016లో వృద్ధి రేటు మందగించింది. చెన్ వెన్‌కింగ్‌కు అంతర్గత భద్రత వ్యవహారాలు అప్పగించగా.. సంస్కరణ వాదిగా పేరొందిన యీ గ్యాంగ్ పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గవర్నర్‌గా నియమితులయ్యారు. 15 ఏళ్లుగా గవర్నర్‌గా ఉన్న ఝౌ స్థానంలో గ్యాంగ్‌కు ఈ అవకాశం దక్కింది.

విదేశాంగ మంత్రికి స్టేట్ కౌన్సిలర్ పదవి

చైనా అత్యున్నత దౌత్య పదవి అయిన స్టేట్ కౌన్సిలర్‌గా విదేశాంగ మంత్రి వాంగ్ యిను నియమించారు. భారత్‌తో సరిహద్దు వివాదంలో చైనా ప్రతినిధిగా చర్చలకు ఆయన నాయకత్వం వహించనున్నారు. చైనాలో విదేశాంగ మంత్రి కన్నా స్టేట్ కౌన్సిలర్ పదవి పెద్ద ర్యాంకు. ఇటీవల కాలంలో చైనాలో ఏకకాలంలో రెండు పదవులను నిర్వహిస్తున్న మొదటి వ్యక్తి వాంగ్ కావడం గమనార్హం.

నాలుగో కేసులోనూ లాలూ దోషే

శిక్ష ఖరారుపై 21 నుంచి వాదనలు



రాంచీ: బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు మరో ఎదురుదెబ్బ. దాణా కుంభకోణానికి సంబంధించిన నాలుగో కేసులోనూ ఆయన దోషిగా తేలారు. దుమ్కా ఖజానా నుంచి రూ.3.13 కోట్లను అక్రమంగా ఉపసంహరించుకున్న కేసులో లాలూ పాత్ర ఉందని నిర్ధారిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి శివ్‌పాల్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. లాలూతోపాటు మరో 18 మందిని దోషులుగా తేల్చారు. ఇక మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాతోపాటు 12 మందిని నిర్దోషులుగా ప్రకటించారు. దోషులకు శిక్షలు ఖరారు చేసేందుకు ఈ నెల 21 నుంచి జడ్జి వాదనలు వింటారని సీబీఐ తరఫు న్యాయవాది తెలిపారు.



మీరట్‌లో వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం. తొమ్మిది రోజులపాటు నిర్వహించే యజ్ఞంలో భాగంగా 500 క్వింటాళ్ల మామిడి కలపను హోమంలో మండించనున్నారు.

నోట్ల రద్దుతో పన్ను ఉగ్రవాదం: యశ్వంత్ సిన్హా

న్యూఢిల్లీ: నోట్ల రద్దు నిర్ణయం పన్ను ఉగ్రవాదానికి దారి తీసిందని బీజేపీ అసమ్మతి నేత, కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా విమర్శించారు. పేర్లు ప్రస్తావించకుండానే ప్రధాని మోదీని పిచ్చి తుగ్లక్‌గా పేరుమోసిన 16వ శతాబ్దపు ఢిల్లీ రాజు మహ్మద్ బిన్ తుగ్లక్‌తో పోల్చారు. ఆర్థిక వేత్త అరుణ్ కుమార్ రాసిన 'డీమానెటైజేషన్ అండ్ ద బ్లాక్ ఎకానమీ' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో యశ్వంత్ సిన్హా మాట్లాడారు. పెద్దనోట్లను ఉపసంహరించడం వల్ల ఏ ప్రయోజనాలు ఉంటాయని మోదీ చెప్పారో వాటిలో ఏ ఒక్కటీ జరగలేదన్నారు.

రష్యా పీఠంపై మళ్లీ పుతిన్

అధ్యక్ష ఎన్నికల్లో ఘనవిజయం

- రిగ్గింగ్ జరిగిందన్న ప్రతిపక్షాలు

మాస్కో: అమెరికా, బ్రిటన్‌లతో తీవ్రమైన విభేదాలు నెలకొన్న నేపథ్యంలో రష్యన్లు మరోసారి వ్లాదిమిర్ పుతిన్(65)కే పట్టం కట్టారు. దేశవ్యాప్తంగా ఆదివారం ముగిసిన అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్‌కు 76.67 శాతం ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి కమ్యూనిస్ట్ పార్టీ నేత పావెల్ గ్రుడినిన్‌కు 11.79 శాతం ఓట్లు వచ్చాయి. తాజా విజయంతో 2024 వరకూ పుతిన్ రష్యా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. అంతేకాకుండా నియంత జోసెఫ్ స్టాలిన్ (24 ఏళ్లు) తర్వాత అత్యధికకాలం రష్యాను పాలించిన నేతగా పుతిన్ రికార్డు సృష్టించారు. 2014లో ఉక్రెయిన్ నుంచి రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియాలో పుతిన్‌కు 92 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావెల్నీపై రష్యా ఎన్నికల సంఘం వేటు వేయడంతో పుతిన్ విజయం లాంఛనప్రాయమైంది. నాలుగోసారి అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాను జీవితాంతం రష్యా అధ్యక్షుడిగా కొనసాగబోనని పుతిన్ స్పష్టం చేశారు. 2030లో మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా? అన్న విలేకరుల ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఏంటి.. నాకు వందేళ్లు వచ్చేవరకూ ఇక్కడే(అధ్యక్ష పీఠంపై) కూర్చోవాలా? అది జరగదు' అని పుతిన్ జవాబిచ్చారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన పుతిన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో పాటు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, బొలీవియా అధ్యక్షుడు ఇవో మొరేల్స్‌లు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు కోసం సెల్ఫీ పోటీలు, ఉచిత బహుమతులు, ఫుడ్ ఫెస్టివల్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించిన రష్యా ప్రభుత్వం ఓటింగ్‌లో పాల్గొనాల్సిందిగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది. ఈ ఎన్నికల్లో తాము అనుకున్న దానికంటే ఎక్కువ పోలింగ్ జరిగిందనీ, ఇందుకు కారకులైన వివిధ దేశాధినేతలకు ధన్యవాదాలని ఫలితాల అనంతరం రష్యా ఎన్నికల సంఘం చీఫ్ ఎల్లా పాంఫిలోవా ఎద్దేవా చేశారు. మరోవైపు ఈ ఎన్నికల్లో పుతిన్ రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రస్తుతం రష్యాలో ఆశ్రయం పొందుతున్న అమెరికా నిఘా సంస్థ ఎన్ఎస్ఏ మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ స్నోడెన్ ఓ స్కూల్‌లో రిగ్గింగ్ జరుగుతున్న చిత్రాన్ని ట్వీటర్‌లో పోస్ట్ చేశారు.



కేజీబీ టు క్రెమ్లిన్

- రష్యాపై మరింత పట్టుపెంచుకున్న పుతిన్
- దేశ ఆర్థికవ్యవస్థ, పాశ్చాత్యదేశాలతో సత్సంబంధాలే ప్రధాన సవాలు

రష్యా నేత పుతిన్ అధ్యక్ష ఎన్నికల్లో సాధించిన ఘన విజయం 2024 వరకూ ఆయన పదవిలో కొనసాగడానికి అవకాశమిచ్చింది. రష్యా రాజ్యాంగం ప్రకారం వరుసగా రెండు సార్లు మించి ఏ నేతా అధ్యక్ష పదవి చేపట్టకూడదు. దాని ప్రకారం 2024 ఎన్నికలు వదిలేసి 2030లో ఆయన అధ్యక్ష పదవికి పోటీచేయొచ్చు.

వ్యూహ రచనలో దిట్ట!

నిఘా సంస్థ కేజీబీలో ఓ అధికారి స్థాయి నుంచి రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ సెనెట్ వరకూ సాగిన పుతిన్ ప్రయాణం అసామాన్యం. పుతిన్ అధ్యక్షుడిగా ఉన్న మొదటి ఎనిమిదేళ్లలో (2000–2008) రష్యా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టింది. ఆ రోజుల్లో భారీగా పెరిగిన ముడి చమురు, సహజ వాయువు ధరల ఫలితంగా సంపన్నులు సహా రష్యన్ల ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఆయన తన అధికారం సుస్థిరం చేసుకోగలిగారు. ప్రభుత్వంపై తిరుగులేని పట్టు సంపాదించారు. మొదట రాజకీయ పలుకుబడి ఉన్న బడా పారిశ్రామికవేత్తలను, తర్వాత ప్రతిపక్ష నేతలను నిరాధార ఆరోపణలతో దెబ్బతీశారు. వారిలో కొందరిని దేశం నుంచి బహిష్కరించారు. రష్యాలో రాజకీయాలు లేని ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకు పుతిన్ చేసిన ప్రయత్నం ఫలించింది. 'ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తా. మీరు రాజకీయాలకు దూరంగా ఉండండి' అన్న పుతిన్ మాటలను సామాన్య ప్రజానీకం, కార్మికవర్గం నమ్మడంతో పుతిన్ అధికారానికి అడ్డంకులు లేకుండా పోయాయి. అయితే, గత ఆరేళ్లలో పాశ్చాత్యదేశాల ఆంక్షల ఫలితంగా రష్యా ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. అయినప్పటికీ సిరియా అంతర్యుద్ధంలో జోక్యం, క్రిమియా ఆక్రమణ ద్వారా దేశాన్ని పుతిన్ అగ్రరాజ్యం దిశగానే నడిపిస్తున్నారని రష్యన్లు విశ్వసిస్తున్నారు. కాగా, పుతిన్‌కు తొలినాళ్లలో ప్రజాదరణ ఉన్నప్పటికీ ఇప్పుడు జరిగే ప్రతీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని ప్రతిపక్షాలు, పరిశీలకులు ఆరోపిస్తున్నారు.

అణచివేయడంలో ఘటికుడు

ప్రధాన ప్రత్యర్థులను అణచివేయడం, అక్రమంగా జైలుకు పంపడం, ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హులను చేయడం పుతిన్‌కు కొట్టిన పిండి. 1952లో లెనిన్‌గ్రాడ్‌లో జన్మించిన పుతిన్ సెయింట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదువుకున్నారు. 1975లో కేజీబీలో ఇంటెలిజెన్స్ అధికారిగా ఉద్యోగంలో చేరి వేగంగా లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగారు. రాజకీయాలపై ఆసక్తితో 1991లో ఉద్యోగానికి రాజీనామా చేసి మకాం రాజధాని మాస్కోకు మార్చారు. యునైటెడ్ రష్యా పార్టీ నేత అయిన పుతిన్‌కు ప్రధానిగా తొలి అవకాశం అధ్యక్షుడు బోరిస్ ఎలిత్సిన్ ఇచ్చారు. 1999లో అప్పటి ప్రధాని సెర్జీ స్టెపాషిన్‌ను బర్తరఫ్ చేసి పుతిన్‌ను ప్రధానమంత్రిగా ప్రమోట్ చేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో రాజీనామా చేసిన ఎలిత్సిన్ తాత్కాలిక అధ్యక్షునిగా పుతిన్‌ను నియమించారు. 2000 అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ తన సమీప కమ్యూనిస్ట్ ప్రత్యర్థి గెనడీ జ్యుగనోవ్‌పై విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో 72 శాతం ఓట్లు సాధించి రెండోసారి అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. 2008లో ప్రధానిగా నియమితులయ్యారు. 2011లో అధ్యక్ష పదవీకాలాన్ని నాలుగు నుంచి ఆరేళ్లకు పెంచారు. ఈ చట్ట సవరణ చేశాక 2012లో పుతిన్ మూడోసారి అధ్యక్షపదవికి పోటీచేసి 64 శాతం ఓట్లతో గెలిచారు. తాజా విజయంతో పుతిన్ నియంత జోసెఫ్ స్టాలిన్ తర్వాత రష్యాను ఎక్కువ కాలం పాలించిన నేతగా చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు.

–సాక్షి నాలెడ్జ్ సెంటర్



విద్య, ఉద్యోగ సమాచారం



ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా... 542 ఖాళీలు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)... వివిధ విభాగాల్లోని 542 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర ప్రభుత్వానికి చెందిన షెడ్యూల్ 'ఎ' మినీరత్న కేటగిరీ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్.

- **పోస్టు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్ (జేఈ).
- **వేతనశ్రేణి:** రూ.40,000-రూ.1,40,000.
- **విభాగాల వారీ ఖాళీలు:** సివిల్ ఇంజనీరింగ్-100 (అన్‌రిజర్వ్‌డ్-50+ ఓబీసీ (ఎన్‌సీఎల్)-27+ఎస్సీ-15+ఎస్టీ-8); ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-100 (అన్‌రిజర్వ్‌డ్-50+ఓబీసీ (ఎన్‌సీఎల్)-27+ఎస్సీ-15+ఎస్టీ-8); ఎలక్ట్రానిక్స్-330 (అన్‌రిజర్వ్‌డ్-189+ఓబీసీ (ఎన్‌సీఎల్)-80+ఎస్సీ-39+ఎస్టీ-22); ఆర్కిటెక్చర్-12 (అన్‌రిజర్వ్‌డ్-9+ఓబీసీ (ఎన్‌సీఎల్)-2+ఎస్టీ-1).
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఆర్క్‌తోపాటు గేట్-2018 క్వాలిఫై స్కోర్ కార్డ్.
- **వయసు:** 2018, ఏప్రిల్ 30 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** గేట్ స్కోర్ ఆధారంగా స్క్రీనింగ్, మెరిట్ లిస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్.
- **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం:** మార్చి 28, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 27, 2018.
- **వెబ్‌సైట్:** w w

ఏయూఈఈటీ-2018

విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం... ఆరేళ్ల బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏయూఈఈటీ)-2018' ద్వారా దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

- **కోర్సు:** బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ.
- **విభాగాలు:** సీఎస్ఎస్ఈ, కంప్యూటర్ సైన్స్ అండ్ నెట్‌వర్కింగ్, సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ.
- **అర్హతలు:** ఇంటర్మీడియెట్.
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష (ఏయూఈఈటీ) ద్వారా.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,200 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.1,000).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం:** మార్చి 22, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 21, 2018.
- **రూ.1,500 ఆలస్య రుసుంతో చివరి తేదీ:** ఏప్రిల్ 30, 2018.
- వెబ్‌సైట్: www.audoa.in

ఈఎస్‌డీఎంలో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్‌లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్) అనుబంధ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ఈఎస్‌డీఎం).. ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ డిజైన్‌లో ఆర్నెళ్ల పీజీ డిప్లొమా కోర్సు (డీఈపీడీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ మేజర్ సబ్జెక్టు (ఈఈఈ/ఈసీఈ/ఈఅండ్ఐ/..)గా కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ మే 9, 2018. దరఖాస్తు రుసుం రూ.300. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక నిర్వహిస్తారు.

- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** w w

ఏయూ సెట్-2018

విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం.. 2018-19కి గాను వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో మాస్టర్స్ డిగ్రీ, ఇంటెగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ 'ఆంధ్రా యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏయూ సెట్)-2018' ప్రకటన విడుదల చేసింది.

- **కోర్సులు:** ఎంఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంహెచ్ఆర్ఎం, ఎంజేఎంసీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీఈడీ, ఎంఈడీ, ఎంటెక్, ఐదేళ్ల ఇంటెగ్రేటెడ్ ఎంఎస్సీ (కెమిస్ట్రీ - అప్లైడ్ కెమిస్ట్రీ), జియాలజీ).
- **దరఖాస్తు రుసుం:** రూ.600 (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.500).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల స్వీకరణ:** మార్చి 22, 2018.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 21, 2018.
- **రూ.1,000 ఆలస్య రుసుంతో చివరి తేదీ:** ఏప్రిల్ 30, 2018.
- **వెబ్‌సైట్:** w w w y

అత్యున్నత ఫార్మసీ విద్యకు నైపర్



w . a a

ఫార్మసీ.. ప్రస్తుతం ఐటీకి దీటుగా కొలువులు అందిస్తున్న రంగం. వేతన ప్యాకేజీలు, కెరీర్ అవకాశాలు, ఉద్యోగ భద్రత.. ఇలా దేన్ని తీసుకున్నా.. ఫార్మా ఒక అడుగు ముందే ఉంటోంది. ఇలాంటి సమయంలో ఫార్మసీ ఉన్నత విద్యకు తలమానికంగా నిలుస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో ప్రవేశం పొందితే.. భవిష్యత్తు బంగారుమయమే. కొద్ది రోజుల క్రితం గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జీప్యాట్) ఫలితాలు విడుదలయ్యాయి. వీటి ఆధారంగా నిర్వహించే నైపర్ జేఈఈ నోటిఫికేషన్ త్వరలో వెలువడనుంది. ఈ నేపథ్యంలో నైపర్ అందిస్తున్న పీజీ కోర్సులు, ఎంపిక ప్రక్రియ, కెరీర్ అవకాశాలపై ఫోకస్..

ఫార్మా రంగానికి నిపుణులను అందించే ఉద్దేశంతో నైపర్‌లను ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్, గువహటి, హాజీపూర్, హైదరాబాద్, కోల్‌కతా, రాయ్‌బరేలి, ఎస్ఏఎస్ నగర్ (మొహాలీ)లో నైపర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో పోస్టు గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇండస్ట్రీ, రీసెర్చ్ ల్యాబ్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా నైపర్‌లు ఉన్నత ప్రమాణాలతో కోర్సులను అందిస్తున్నాయి.

w e s

పీజీ కోర్సులు



నైపర్ క్యాంపస్‌లు పీజీ స్థాయిలో ఎంఎస్-ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎం.టెక్-ఫార్మసీ, ఎంబీఏ (ఫార్మసీ) కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

పీజీ స్పెషలైజేషన్లు

- **ఎంఎస్-ఫార్మసీ:** మెడిసినల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైజెస్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటిక్స్, ఫార్మకో ఇన్ఫర్మాటిక్స్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ట్రెడిషనల్ మెడిసిన్.
- **ఎం.ఫార్మసీ:** ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ రీసెర్చ్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ఫార్ములేషన్స్).
- **ఎంటెక్ ఫార్మసీ:** ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ), ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ).
- **ఎంబీఏ (ఫార్మసీ):** ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్.

జీప్యాట్+నైపర్ జేఈఈతో..

జాతీయ స్థాయిలోని జీప్యాట్ ఆధారంగా ఫార్మసీ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. కానీ, నైపర్‌లో ప్రవేశం పొందాలంటే మాత్రం జీప్యాట్ స్కోర్ ద్వారా నైపర్-జేఈఈ (నైపర్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) పేరుతో నిర్వహించే ప్రత్యేక పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

నైపర్-జేఈఈ అర్హతలు

- బీఫార్మసీ లేదా నిర్దేశించిన కోర్సులో కనీసం 60 శాతం మార్కులు లేదా 6.75 సీజీపీఏ (10 పాయింట్ల స్కేలుపై) లేదా తత్సమాన పర్సంటేజీతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- జీప్యాట్/గేట్/నెట్ ఉత్తీర్ణత.

నైపర్-జేఈఈ విధానం

నైపర్ ఆన్‌లైన్ జేఈఈలో 200 ఆబ్జెక్టివ్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. రెండు గంటల వ్యవధిలో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కులుంటాయి. ఈ పరీక్షలో విజయం సాధించాలంటే.. బీఫార్మసీ స్థాయి అకడమిక్స్‌పై పూర్తిస్థాయి పట్టు అవసరం. కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ విభాగాలపై దృష్టిసారించాలి. మొత్తం 200 ప్రశ్నల్లో 70 శాతం ప్రశ్నలు వీటి నుంచే వస్తున్నాయి. కోర్ సబ్జెక్టులకు సంబంధించి బీఫార్మసీలో పొందిన నైపుణ్యం, జీప్యాట్ ప్రిపరేషన్.. పరీక్షలో రాణించేందుకు ఉపయోగపడతాయి. ఫార్మకాలజీలో రిసెప్టర్స్, వాటి రకాలు, మెకానిజమ్ ఆఫ్ యాక్షన్, ఔషధాల వర్గీకరణ, క్లినికల్ ట్రయల్స్, ప్రీ-క్లినికల్ ట్రయల్స్ తదితర అంశాలు ముఖ్యమైనవి.

ఉమ్మడి కౌన్సెలింగ్

- పీజీ కోర్సుల్లో (ఎంబీఏ మినహా) ప్రవేశాలకు నైపర్-జేఈఈలో ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు.
- ఎంబీఏ ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి నైపర్-జేఈఈతో పాటు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. నైపర్-జేఈఈకి 85 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది.
- ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా తుది జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులు ఆయా క్యాంపస్‌ల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఏటా ఒక క్యాంపస్ నైపర్-జేఈఈ, కౌన్సెలింగ్ బాధ్యతలు చేపడుతుంది.

ఆర్థిక ప్రోత్సాహం

నైపర్ క్యాంపస్‌ల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు (ఎంబీఏ-ఫార్మసీ మినహా) నెలకు రూ.12,400 స్టయిపెండ్ లభిస్తుంది. ఈ స్టయిపెండ్ కొనసాగాలంటే.. ప్రతి సెమిస్టర్‌లోనూ సీజీపీఏ ఆరు పాయింట్లకు తగ్గకూడదు.

క్యాంపస్‌ల వారీగా పీజీ సీట్లు

మొహాలీ	249
అహ్మదాబాద్	77
గువహటి	41
హైదరాబాద్	125
హాజీపూర్	46
కోల్‌కతా	52
రాయ్‌బరేలి	42

నైపర్-జేఈఈ 2018 సమాచారం

- అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్:** ఏప్రిల్ చివరి వారం.
- **నైపర్ జేఈఈ తేదీ:** జూన్ రెండో వారం
- **నైపర్ జేఈఈ పరీక్ష కేంద్రాలు:** అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చెన్నై, చండీగఢ్, డెహ్రాడూన్, గువహటి, హైదరాబాద్, జైపూర్, లక్నో, ముంబై, నాగపూర్, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
- **నైపర్ హైదరాబాద్ వెబ్‌సైట్:** w w

అవకాశాలు అపారం

"నైపర్ ప్రవేశ ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉంటుంది. కానీ, ఒక్కసారి నైపర్ క్యాంపస్‌లో ప్రవేశం పొంది.. కోర్సు పూర్తిచేస్తే మాత్రం కెరీర్ అద్భుతంగా ఉంటుంది. ఫార్మా కంపెనీలు, డ్రగ్ ఫార్ములేషన్ కేంద్రాలతో పాటు పరిశోధనా సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తాయి. కెరీర్ ప్రారంభంలోనే నెలకు కనీసం రూ.40 వేల జీతం అందుతుంది. కాబట్టి విద్యార్థులు బీఫార్మసీతో సరిపెట్టకుండా.. పీజీ స్థాయి కోర్సులు చేయాలి."

– ప్రొఫెసర్ బి.రాజేశ్వర రెడ్డి, డీన్, నైపర్-హైదరాబాద్

పరిశోధనలతోనే ప్రగతి..



సివిల్స్, గ్రూప్స్ ప్రత్యేకం
జనరల్ ఎస్సే

ఒక దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి సైన్స్, టెక్నాలజీ చాలా కీలకమైనవి. స్వాతంత్ర్యానంతరం సమగ్ర జాతీయ అభివృద్ధికి సైన్స్, టెక్నాలజీ రెండు మూలస్తంభాలని భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించారు. అందుకే కీలక, వ్యూహాత్మక రంగాల్లో అభివృద్ధి సాధనకు మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించి.. పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై భారత ప్రభుత్వం తొలుత దృష్టిసారించింది.

- ప్రస్తుతం భారత్ ఆర్థికశక్తిగా ఎదిగేందుకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ రంగాల్లో నవీకరణ సాధించడం ఎంతైనా అవసరం. నిశితంగా పరిశీలిస్తే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందున్న దేశాలే వేగంగా అభివృద్ధి చెందుతాయనే విషయం అర్థమవుతుంది. ఆధునిక కాలంలో సైన్స్, టెక్నాలజీలో నవీకరణ ద్వారా సాధించే పురోగతి మాత్రమే సామాజిక, ఆర్థిక సమ్మిళిత అభివృద్ధికి తోడ్పడుతుంది. ఆర్థిక ప్రగతిలో టెక్నాలజీ పాత్ర కీలకమైనదని ఎంతో మంది ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు.
- ఒక దేశంలోని పరిశోధన, అభివృద్ధి స్థాయి; మానవ వనరులు, నవీకరణ స్థాయి బట్టి ఆ దేశ ప్రగతి సాధించే తీరు నిర్ధారితమవుతుంది. దీన్ని అర్థం చేసుకొని, ఈ మూడు అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరముంది. అప్పుడే భారత్ త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ఆర్ అండ్ డీ, వివిధ దేశాల దృక్పథం

- పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) విషయంలో వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలిస్తే దాని ప్రాధాన్యం ఏంటనేది అర్థమవుతుంది. ఆర్ అండ్ డీపై ఎక్కువ వ్యయం చేస్తున్న దేశాల జాబితాలో ఇజ్రాయెల్ మొదటి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో స్వీడన్, ఫిన్లాండ్, జపాన్, స్విట్జర్లాండ్ ఉన్నాయి. అమెరికా ఆరో స్థానంలో, కెనడా 13వ స్థానంలో ఉన్నాయి. బ్రిక్స్ దేశాలను పరిశీలిస్తే రష్యా 22వ స్థానంలో, చైనా 26, బ్రెజిల్ 31వ స్థానాల్లో నిలిచాయి. భారత్.. 38వ స్థానంలో ఉంది.
- దేశ జనాభాలో పరిశోధకుల సంఖ్య లేదా శాతంలో ఫిన్లాండ్ మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి నాలుగు స్థానాల్లో స్వీడన్, జపాన్, సింగపూర్, డెన్మార్క్ ఉన్నాయి. అమెరికా ఏడో స్థానంలో నిలిచింది. బ్రిక్స్ దేశాల్లో రష్యా 12వ స్థానంలో, భారత్ 36, చైనా 39, బ్రెజిల్ 43 స్థానంలో ఉన్నాయి.
- జనాభా ప్రాతిపదికన సాధించిన పేటెంట్ల ఆధారంగా అమెరికా తొలి స్థానంలో నిలిచింది. తర్వాతి నాలుగు స్థానాల్లో జపాన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, ఇజ్రాయెల్ ఉన్నాయి. బ్రిక్స్ దేశాల్లో భారత్.. 26వ స్థానంలో ఉండగా, రష్యా 34, బ్రెజిల్ 41వ స్థానంలో నిలిచాయి.



పై మూడు అంశాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన గ్లోబల్ టెక్నాలజీ ఇండెక్స్ (జీటీఐ)లో ఫిన్లాండ్ తొలిస్థానంలో నిలిచింది. జపాన్, అమెరికా వరుసగా రెండు, మూడు స్థానాలు సాధించాయి. బ్రిక్స్ దేశాలను పరిశీలిస్తే రష్యా 21వ స్థానంలో, చైనా 30వ స్థానంలో నిలిచాయి. బ్రెజిల్, భారత్.. వరుసగా 41, 42 స్థానాల్లో ఉన్నాయి.

పై సమాచారాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తే భారత్.. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా చెబుతున్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశాల స్థాయిని చేరుకోవడం అంత తేలిక కాదని అర్థమవుతుంది. ఇలాంటి పరిస్థితిలో భారత్.. ఆర్ అండ్ డీపై వ్యయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిశోధన, అభివృద్ధిపై చేసే వ్యయాన్ని దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఒక శాతం నుంచి రెండు శాతానికి పెంచాలని సైన్స్ విధానం (2003)లో ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదు. శాస్త్ర, సాంకేతిక, నవకల్పన విధానం-ఎస్‌టీఐ (2013)లో దాదాపు మళ్లీ అదే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. అయితే 2010 నాటికి పరిశోధన, అభివృద్ధిపై భారత్ దాదాపు 13 బిలియన్ డాలర్లు ఖర్చు చేయగా, చైనా 130 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.

ప్రయత్న లోపం

- దేశంలో సైన్స్, టెక్నాలజీ పరిశోధనల్లో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల పాత్ర కీలకం. ఇవి పనిచేస్తున్న స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు.. ఆయా ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ఆశించినంతగా కృషి చేయలేకపోతున్నాయి.
- దేశంలో జనాభా పెరుగుతున్న క్రమంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధన, అభివృద్ధిపై అతి తక్కువగా ఖర్చు చేయడం ద్వారా దేశ సమస్యలను పరిష్కరించడం అంత తేలిక కాదు.
- దేశంలో దారిద్ర్యం, ఆకలి, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు; ఆరోగ్యం, పోషణ, భద్రత, మారుమూల ప్రాంతాల అభివృద్ధి తదితరాలను సాధించాలంటే పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై దృష్టిసారించాల్సిన అవసరముంది. మెక్‌కెన్సీ, డెలాయిట్ తదితర అంతర్జాతీయ సంస్థల అధ్యయనాలు ఇలాంటి అంశాలను ఇప్పటికే స్పష్టం చేశాయి.

వచ్చే దశాబ్దంలో 10-12 శాతం వృద్ధి రేటు సాధించాలంటే కనీసం జీడీపీలో 4 శాతాన్నయినా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆర్ అండ్ డీపై వ్యయం చేయాలి.

కార్యక్రమాల అమలు

భారత్‌లో 1958, 1983, 2003, 2013లో సైన్స్ విధానాలను ప్రకటించి.. అమలు చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ).. దేశ సైన్స్ విధానాన్ని రూపొందించడంతోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనలను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలను అమలుచేస్తోంది. ఇందులో భాగంగా నైపుణ్యం కలిగిన దేశీయ మానవ వనరులను సైన్స్ వైపు ఆకర్షించే లక్ష్యంతో Innovation in Science Pursuit for Inspired Research (INSPIRE) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఫండ్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ఎస్ అండ్ టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎఫ్ఐఎస్ఐ), ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ సైంటిఫిక్ ఎక్స్‌లెన్స్ (పీయూఆర్ఎస్ఈ) కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

- మహిళలకు ఇప్పటికే అమల్లో ఉన్న వివిధ శాస్త్ర, సాంకేతిక కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి Knowledge Involvement in Research Advancement through Nurturing (KIRAN) అనే సరికొత్త కార్యక్రమాన్ని డీఎస్‌టీ అమల్లోకి తెచ్చింది.
- ఇదే తరహాలో CURIE (Consolidation of University Research for Innovation and Excellence) పేరుతో మహిళా విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న ఇంజనీరింగ్ సవాళ్లను గుర్తించి.. వాటి పరిష్కారానికి నవీకరణ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ IMPRINT (Impacting Research Innovation and Technology) కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీన్ని దేశంలోని అన్ని ఐఐటీలు, ఐఐఎస్సీ (బెంగళూరు) సంయుక్తంగా చేపడుతుండగా, సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి విభాగం సహకరిస్తోంది. ఈ విధంగా సవాళ్లను ఎదుర్కోవడంలో ఐఐఎస్సీ, ఐఐటీలను సైతం భాగస్వామ్యులను చేశారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ.. IMPRINT - 2 కార్యక్రమానికి రూ.1,000 కోట్లు కేటాయించింది.



నేషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎన్ఐసీ)

- దేశంలో నవీకరణను ప్రోత్సహించే లక్ష్యంతో నేషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎన్ఐసీ) ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో విజ్ఞాన పరిశోధనలపై ఆసక్తి పెంచి.. వారిని పరిశోధన వైపు ప్రోత్సహించే లక్ష్యంతో కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై), నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయి. ఇన్ని కార్యక్రమాలు అమలవుతున్నా దేశంలో సామాజిక వర్గాలకు అతీతంగా విద్యార్థులు, విద్యావేత్తల్లో జ్ఞాన తృష్ణ పూర్తిస్థాయిలో పెంపొందలేదు. కాబట్టి ప్రభుత్వం ఈ దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాలి. దేశంలోని ప్రతి పౌరుడికి సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కలిగించాలి. స్థానిక తెగల సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చి.. దాని ఆధారంగా పరిశోధన కార్యక్రమాలను అమలుచేయాలి. దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రాచుర్యం తీసుకురావాలి. వ్యవసాయం, ఆరోగ్యం, శక్తి రంగాల్లో ప్రధాన సమస్యల దృష్ట్యా హై రిస్క్ ఇన్నోవేషన్ (హెచ్ఆర్ఐ)ను ప్రోత్సహిచాలి.
- సైన్స్, నవీకరణ విధానంలో భాగంగా సామాజిక, ఆర్థిక లక్ష్యాల సాధనకు.. ప్రభుత్వ నిధులతోపాటు ప్రైవేటు పెట్టుబడులు సైతం అవసరం. ఇందులో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధి, నవీకరణలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. అవసరమైతే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో సైతం కార్యక్రమాలను చేపట్టాలి. ఆరోగ్య, పోషణ, శక్తి, భద్రత తదితర రంగాల్లో ఈ రకమైన భాగస్వామ్యం దేశానికి ఎంతైనా అవసరం.
- దేశీయ పరిశ్రమలతోపాటు ప్రవాస భారతీయ సంస్థలు సైతం సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో పాలుపంచుకునేలా చూడాలి. ప్రైవేటు రంగంలో జరిగే పరిశోధనలకు.. ప్రభుత్వ రంగ పరిశోధనల స్థాయి (హోదా) కల్పించాలి. ఈ దిశగా హై రిస్క్ ఇన్నోవేషన్‌పై పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ ప్రైవేటు సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

నవీకరణ ద్వారా వెలుగులోకి వచ్చిన నూతన టెక్నాలజీలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రైవేటు రంగం ముందుకొచ్చినప్పుడే.. ఆయా టెక్నాలజీలు త్వరితగతిన జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరుతాయి.

సి.హరికృష్ణ
డైరెక్టర్,
సి.హరికృష్ణ ఐఏఎస్ స్టడీ సర్కిల్.



సాక్షి బిజినెస్
మంగళవారం 20-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
253 ▼	101 ▼
32,923	10,094

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,311	▽ 177
డోజోన్స్	24,511	▽ 435
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,043	▽ 121
డాక్స్	12,217	▽ 173
షాంఘై	3,280	△ 10
నికాయ్	21,481	▽ 197

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.30	65.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.22	92.14
€	యూరో	ఎస్‌బీఐ	78.61	81.26
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.49	62.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.35	51.10
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.62	50.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.73	18.64
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.10	18.82
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.78

ఓలా, ఉబెర్ సేవలకు బ్రేక్!

దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సమ్మె

- చాలా వరకూ నిలిచిపోయిన వాహనాలు
- ప్రోత్సాహకాలు తగ్గడంపై డ్రైవర్ల నిరసన
- ఓలా, ఉబెర్లకు ధీటుగా త్వరలో యాప్
- తెలంగాణ డ్రైవర్ల సంఘం వెల్లడి

సాక్షి, బిజినెస్ బ్యూరో/సిటీబ్యూరో

డ్రైవర్లకు చెల్లించే నగదు ప్రోత్సాహకాలు నిలిచిపోవటంతో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఉబెర్, ఓలా ట్యాక్సీ డ్రైవర్లు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగారు. హైదరాబాద్‌లో దాదాపు 50 శాతం మంది స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నట్లు సమాచారం. ముంబైలో ఈ నిరసన ప్రభావం కొట్టొచ్చినట్టు కనపడింది. ఢిల్లీ, బెంగళూరు, పుణేలో మాత్రం ప్రభావం తక్కువే ఉంది. ఇరు కంపెనీలు ఒప్పంద సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఆదాయాలు రావటం లేదని, అందుకే సమ్మెకు దిగామని డ్రైవర్లు చెబుతున్నారు.

హైదరాబాద్‌లోనూ సమ్మె ప్రభావం...

దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో ట్యాక్సీ డ్రైవర్లు సర్వీసులను నిలిపేశారు. దీంతో



చాలాచోట్ల మధ్యాహ్నం వరకు క్యాబ్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఓలా, ఉబెర్‌లు తమను మొదట భాగస్వాములుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించి ఎలాంటి ఒప్పందాలు, అంగీకార పత్రాలు లేకుండా నిలువుదోపిడీ చేస్తున్నాయని తెలంగాణ ఫోర్ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సలావుద్దీన్ ఈ సందర్భంగా విమర్శించారు. నగరంలో రెండు క్యాబ్ సంస్థల్లో వాహనాల సంఖ్య ఒకానొక స్థాయిలో 1.25 లక్షలకు పెరిగింది. డ్రైవర్ ఓనర్లు ప్రత్యామ్నాయాలు చూసుకోవడంతో ఇప్పుడు ఈ సంఖ్య సగానికి పడిపోయిందని సమాచారం. మరోవైపు ఓలా సంస్థ లీజు ప్రాతిపదికన పెద్ద ఎత్తున వాహనాలను సమకూర్చుకుంది. దీంతో అప్పటి వరకు బుకింగ్‌లపైన ఆధారపడి వాహనాలు నడిపిన డ్రైవర్ల పరిస్థితి తలకిందులైంది. అన్నిచోట్లా ఇదే వాతావరణం ఉండటంతో లీజ్ ఒప్పందాలను రద్దు చేయాలనేది కూడా డ్రైవర్ల సమ్మె డిమాండ్లలోకి చేరింది.

నెలకు రూ.75,000 ఉండాలి..

ప్రతి నెలా కనీసం రూ.75 వేలు లభించేలా బుకింగ్‌లు, ఇన్సెంటివ్‌లు ఇవ్వాలనేది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ప్రస్తుతం చాలా మంది డ్రైవర్లు నెలకు రూ.25 వేలు కూడా సంపాదించలేని పరిస్థితి నెలకొంది. లీజు క్యాబ్‌లకు అధిక బుకింగ్‌లు ఇవ్వటం, సొంత వాహనాలు ఉన్న డ్రైవర్లకు బుకింగ్‌లను భారీగా తగ్గించడమే దీనికి అసలు కారణం. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్‌లకు ప్రత్యామ్నాయంగా క్యాబ్ డ్రైవర్లే స్వయంగా నిర్వహించుకునేలా 'టీసీడీఓఏ' పేరిట మొబైల్ యాప్‌ను తెచ్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. క్యాబ్ డ్రైవర్ల ఉపాధికి కనీస గ్యారెంటీ లభించేలా దీన్ని రూపొందిస్తున్నట్లు టీసీడీఓఏ అధ్యక్షుడు శివ చెప్పారు. శంషాబాద్ కేంద్రంగా రెండు నెలల్లో ఈ సంస్థను ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. 5,000 మంది డ్రైవర్లతో ప్రారంభించి క్రమంగా దీన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం బాగ్ లింగంపల్లిలో సమావేశం కూడా నిర్వహించారు.

తప్పనిసరి కావటంతోనే...

ఓలా, ఉబెర్ సంస్థల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకొనేందుకు, బుకింగ్‌లు పెంచుకొనేందుకు అన్ని విధాలుగా ప్రయత్నం చేశాం. రెండేళ్ల పాటు పోరాటం చేశాం. జైలుకు కూడా వెళ్లాం. కానీ ఫలితం లేదు. ప్రభుత్వం కూడా మా బాధలను పట్టించుకోలేదు. గత్యంతరం లేక మేమే స్వయంగా మొబైల్ యాప్‌ను తెస్తున్నాం.

–శివ (టీసీడీఓఏ)

బండ్లు తాకట్టు పెట్టాను

ఓలా, ఉబెర్‌లో ఉపాధి బాగుందని మంచిర్యాల నుంచి హైదరాబాద్ వచ్చా. ఏడాది పాటు బాగానే ఉంది. రెండు బండ్లు కొన్నా. ఓలాలో పెట్టా. కానీ క్రమంగా ఆదాయం పడిపోయింది. బండి ఫైనాన్స్ కూడా కష్టమైంది. వాహనాలు తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఎవరిపైనా ఆధారపడకుండా మేమే ఒక యాప్ ఏర్పాటు చేసుకోవడం మంచిదనిపిస్తోంది.

–కమలహాసన్, డ్రైవర్

టీసీడీఓఏ లక్ష్యాలు...

- ప్రతి డ్రైవర్‌కు రోజుకు రూ.3000 నుంచి రూ.5000 ఆదాయం
- ఆర్టీసీ డ్రైవర్ల తరహాలో 8 గంటల పని విధానం
- లాభాపేక్ష లేకుండా డ్రైవర్లే స్వయంగా నిర్వహించుకొనే వెసులుబాటు
- ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన రవాణా సదుపాయాలు
- డ్రైవర్ల బీమా, ఇతర అన్ని సదుపాయాలు ఒకే వేదిక నుంచి అమలయ్యేలా చర్యలు

బ్యాంకుల్లో స్కామ్‌లపై జేపీసీ దర్యాప్తు..!

యూఎఫ్‌బీయూ డిమాండ్



కోల్‌కతా: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) స్కాం సహా వరుసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలన్నింటిపైనా జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరపాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) డిమాండ్ చేసింది. బ్యాంకులను పర్యవేక్షించడంలో రిజర్వ్ బ్యాంక్ విఫలమైనందునే ఈ కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయని.. వీటిల్లో చిన్న ఉద్యోగులను బలిపశువులను చేస్తున్నారని యూఎఫ్‌బీయూ పశ్చిమ బెంగాల్ విభాగం కన్వీనర్ సిద్ధార్థ్ ఖాన్ ఆరోపించారు. 'ఇటీవలి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను ఇద్దరు వజ్రాభరణ వ్యాపారులు మోసం చేసిన కేసులో సమగ్రమైన జేపీసీ విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే 1992లో హర్షద్ మెహతా స్కామ్ సమయంలో జేపీసీ విచారణ జరిపినట్లుగానే ఇప్పుడు కూడా చేయాలని కోరుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. అసలు పీఎన్‌బీ జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)ల ఆధారంగా చెల్లింపులు జరిపేందుకు ఉపయోగపడిన స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆమోదముద్ర ఉందా లేదా అన్నదీ ప్రశ్నార్థకమేనని ఖాన్ పేర్కొన్నారు. మరోవైపు, భారీ మొండిబాకీలు, కుంభకోణాలతో పాటు బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంపై తొమ్మిది ట్రేడ్ యూనియన్లు మార్చి 21న పార్లమెంటు ముందు ర్యాలీ నిర్వహించనున్నట్లు యూఎఫ్‌బీయూ తెలిపింది. అటు, బెయిల్–ఇన్ నిబంధనతో కూడిన ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు ప్రతిపాదనను కూడా వ్యతిరేకిస్తున్నట్లు వివరించింది.

డాలర్ బలంతో రూపాయి డీలా..!

- ఒకేరోజు 23 పైసలు డౌన్
- 65.17 వద్ద ముగింపు



ముంబై: అంతర్జాతీయంగా పటిష్ట డాలర్ ఇండెక్స్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక సమావేశం నేపథ్యంలో సోమవారం రూపాయి నష్టాల బాట పటింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు తగ్గి 65.17 వద్ద ముగిసింది. భారత్ కరెంట్ అకౌంట్ (క్యాడ్- ఎఫ్ఐఐ, డీఐఐ, ఈసీబీలు మినహా దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ మారకద్రవ్య నిల్వల మధ్య నికర వ్యత్యాసం) పెరుగుతుందన్న ఆందోళనలు కూడా రూపాయి బలహీనతకు కారణమని విశ్లేషకుల అంచనా. డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీలో క్యాడ్ 2 శాతంగా నమోదయ్యిందని తాజా గణాంకాలు స్పష్టం చేశాయి.

బినాని సిమెంట్‌ను కొంటాం

- రూ.7,266 కోట్లకు ఆఫర్ ఇచ్చిన అల్ట్రాటెక్ సిమెంట్
- గత వారంలో రూ.6,350 కోట్ల దాల్మియా ఆఫర్‌కు సీఓసీ ఓకే
- సీఓసీ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ ఎన్‌సీఎల్‌టీలో బినాని పిటిషన్

న్యూఢిల్లీ: బినాని సిమెంట్ వేలంలో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ బినాని సిమెంట్‌ను కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చింది. రుణాలు చెల్లించలేక డిఫాల్ట్ అయిన బినాని సిమెంట్‌ను రూ.7,266 కోట్లకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అల్ట్రాటెక్ సిమెంట్ పేర్కొంది. బినాని సిమెంట్‌ను కొనుగోలు చేయడానికి తాము రూ.6,350 కోట్ల బిడ్‌ను దాఖలు చేశామని, దీనికి రుణదాతల కమిటీ (సీఓసీ) అంగీకరించిందంటూ దాల్మియా సిమెంట్ వెల్లడించిన రోజుల్లోనే అల్ట్రాటెక్ రూ.7,266 కోట్ల ఆఫర్‌నివ్వడం విశేషం. రూ.6,350 కోట్ల ఆఫర్‌తో పాటు రుణదాతలకు బినాని సిమెంట్‌లో 20 శాతం వాటాను కూడా దాల్మియా సిమెంట్ ఆఫర్ చేసింది.

దివాలా ప్రక్రియ రద్దు చేయండి !

మరోవైపు తమ అనుబంధ సంస్థ, బినాని సిమెంట్స్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన దివాలా ప్రక్రియను రద్దు చేయాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేయనున్నామని బినాని ఇండస్ట్రీస్ ఎక్స్ఛేంజ్‌లకు నివేదించింది. ఈ మేరకు తమ డైరెక్టర్ల



బోర్డ్ నిర్ణయించిందని బినాని సిమెంట్ పేర్కొంది. బినాని సిమెంట్‌లో తమకున్న 98.43% పూర్తివాటాను అల్ట్రాటెక్‌కు విక్రయించాలని నిర్ణయించామని కూడా పేర్కొంది. బినాని సిమెంట్ రుణదాతల బకాయిలను తీర్చడానికి అల్ట్రాటెక్ భరోసానివ్వడంతో బినాని ఇండస్ట్రీస్ ఈ మేరకు ప్రకటన చేసింది. ఈ నెల 14న జరిగిన రుణదాతల కమిటీ(సీఓసీ) భేటీలో బినాని సిమెంట్‌ను రూ.6,350 కోట్లకు కొనుగోలు చేయాలన్న దాల్మియా ఆఫర్‌ను సీఓసీ ఆమోదించింది. దాల్మియా ఆఫర్‌ను ఆమోదించిన ఈ భేటీ చెల్లదంటూ ఉత్తర్వులివ్వాలని గత వారమే ఎన్‌సీఎల్‌టీలో బినాని ఇండస్ట్రీస్ పిటీషన్‌ను దాఖలు చేసింది.

బినాని సిమెంట్ రుణ బకాయిలను తీర్చడానికి నిధులను అందించాలని బినాని సిమెంట్ కంపెనీ ప్రమోటర్ సంస్థ, బినాని ఇండస్ట్రీస్..తమను సంప్రదించిందని అల్ట్రాటెక్ పేర్కొంది. బినాని సిమెంట్‌లో 98.43% వాటా కొనుగోలు కోసం రూ.7,266 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అల్ట్రాటెక్ తెలిపింది. దివాళా ప్రక్రియ రద్దయి, ఇతర ఆమోదాలూ లభిస్తేనే ఇది సాకారమవుతుందని వివరించింది.

నాలుగో అతి పెద్ద సిమెంట్ కంపెనీ !

బినాని సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 6.25 మిలియన్ టన్నులు, ఇక అల్ట్రాటెక్ సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 92.5 మిలియన్ టన్నులు. అల్ట్రాటెక్ సిమెంట్ చేతికి బినాని సిమెంట్ వస్తే, ప్రపంచంలోనే అతి పెద్ద నాలుగో సిమెంట్ కంపెనీగా(చైనా మినహా) అల్ట్రాటెక్ సిమెంట్ అవతరిస్తుంది.

సగం బకాయిలు చెల్లిస్తాం.. వేలం ఆపండి: ఉత్తమ్ గాల్వా స్టీల్స్

మరో ఆసక్తికర పరిణామంలో తమ కంపెనీ ఆస్తుల వేలం విక్రయాన్ని ఆపాలని, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు బకాయి పడిన రూ.5,654 కోట్ల మొత్తంలో 51 శాతం చెల్లిస్తామని ఉత్తమ్ గాల్వ స్టీల్స్ ఆఫర్ చేసింది. ఈ మేరకు వన్ టైమ్ సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలంటూ ఈ కంపెనీ ఈ నెల 15న ఎస్‌బీఐకు ఒక లేఖ రాసింది. ఉత్తమ్ గాల్వ స్టీల్స్‌కు రూ.5,644 కోట్ల మేర రుణాలిచ్చిన 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐదే అధిక వాటా. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.2,884 కోట్లు చెల్లిస్తామని, దివాల ప్రక్రియను నిలిపేయాలని ఉత్తమ్ గాల్వ స్టీల్స్ ఆ లేఖలో పేర్కొంది.

యాక్సిస్ కొత్త 'బ్యాంక్ గ్యారంటీలు' చెల్లవు

టెలికం శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: టెలికం సంస్థలకు సంబంధించి ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ కొత్తగా ఇచ్చే బ్యాంక్ గ్యారంటీలను తీసుకోబోమని టెలికం శాఖ (డాట్) స్పష్టం చేసింది. గతంలో ఎయిర్‌సెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తరఫున ఇచ్చిన బ్యాంక్ గ్యారంటీలను చెల్లించడంలో యాక్సిస్ విఫలం కావడమే ఇందుకు కారణమని పేర్కొంది. ఇది భారత ప్రభుత్వంతో కుదుర్చుకున్న కాంట్రాక్టును ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ నుంచి బ్యాంక్ గ్యారంటీలు తీసుకోరాదని మార్చి 16న జారీ చేసిన ఆఫీస్ మెమోలో టెలికం శాఖ తెలిపింది. మరోవైపు, తాము భారతి ఎయిర్‌టెల్ తరఫున మాత్రమే బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చినట్లు యాక్సిస్ బ్యాంక్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యారంటీలకు సంబంధించి చెల్లింపులు జరిపిన పక్షంలో టెలికం వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ టీడీశాట్ ఆదేశాలను ఉల్లంఘించినట్లవుతుందని, అందుకే జరపలేదని వివరించాయి. టీడీశాట్ ఆంక్షలు ఎత్తివేసిన పక్షంలో



నిబంధనలకు అనుగుణంగా సదరు గ్యారంటీలకు సంబంధించి చెల్లింపులు జరుపుతామని తెలిపాయి.

వాస్తవానికి ఎయిర్‌సెల్ స్పెక్ట్రంను ఉపయోగించుకోవడానికి సంబంధించి భారతి ఎయిర్‌టెల్ తరఫున బ్యాంక్ గ్యారంటీని ఇచ్చినట్లు యాక్సిస్ వర్గాలు వివరించాయి. అయితే, ఎయిర్‌సెల్, టెలికం శాఖల మధ్య వివాదంలో టీడీశాట్ ఉత్తర్వులవల్ల బ్యాంక్ గ్యారంటీ చెల్లింపులను జరిపేందుకు యాక్సిస్‌కు వీలు లేకుండా పోయిందని వివరించాయి. కాంట్రాక్టుల నిబంధనలకు అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చిన టెలికం కంపెనీలు గానీ డిఫాల్ట్ అయిన పక్షంలో ప్రభుత్వం పెనాల్టీ కింద ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకుంటుంది.

ఓపెన్ ఆఫర్ నుంచి కేంద్రానికి మినహాయింపు

- ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్రం మూలధన సాయం
- దీంతో పెరగనున్న వాటా

న్యూఢిల్లీ: పలు ప్రభుత్వరంగ బ్యాంకులకు తాజా అదనపు మూలధన సాయం తర్వాత కేంద్ర ప్రభుత్వం ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా సెబీ మినహాయింపు ఇచ్చింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, విజయాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నిధుల సాయంతో వీటిల్లో కేంద్రం వాటా పెరగనుంది. నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత మేర వాటా పెంచుకుంటే ప్రస్తుత వాటాదారులకు కేంద్రం ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, తాజా నిధుల సాయం తర్వాత కూడా ఆయా బ్యాంకుల నియంత్రణలో ఎటువంటి మార్పు ఉండనందున ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు సెబీ తన



ఆదేశాల్లో స్పష్టం చేసింది. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న సాయం ఆయా బ్యాంకులు నియంత్రణ పరమైన నిబంధనలు (మూలధన అవసరాలు) చేరుకునేందుకు వీలు కల్పిస్తుందని, తర్వాత ఈక్విటీ క్యాపిటల్‌ను మరింత పెంచుకునేందుకు అవసరమైన అదనపు పరపతి లభిస్తుందని సెబీ పేర్కొంది. తాజా మూలధన సాయంతో పీఎన్‌బీలో ప్రభుత్వం వాటా 5.21 శాతం, కెనరా బ్యాంకులో 6.25 శాతం, సిండికేట్ బ్యాంకులో 9.73% మేర పెరగనుంది. అలాగే, విజయా బ్యాంకులో 5.48%, బ్యాంకు ఆఫ్ బరోడాలో 5.33%, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో 11.91% మేర కేంద్రం వాటా పెరుగుతుంది.

అడకత్తెరలో వాలెట్ సంస్థలు!

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలు, టెలికం సేవలతో పాటు అన్ని రకాల సర్వీసులకూ ఆధార్ సంఖ్యను అనుసంధానించడానికి కేంద్రం ఇచ్చిన గడువును సుప్రీంకోర్టు నిరవధికంగా పొడిగించటం మొబైల్ వాలెట్ సంస్థలకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టింది. పేటీఎం, మొబిక్విక్ వంటి ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్ సంస్థలు (పీపీఐ) ఆర్‌బీఐ గడువును ఆధారంగా చేసుకుని ఇప్పటికే తమ కస్టమర్ల కేవైసీ వివరాలను తీసుకునే పనిని ఆరంభించాయి. అయితే కేవైసీ వివరాల కోసం ఇవన్నీ ప్రధానంగా ఆధార్ సంఖ్యపైనే ఆధారపడుతున్నాయి. కారణం... ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ ఎలక్ట్రానిక్ తరహాలో సులువుగా పూర్తయిపోతుండటం... దానికి ఖర్చు కూడా తక్కువ కావటమే.

- ఆధార్ గడువు పొడిగించటంతో ఇబ్బందులు
- కేవైసీ పూర్తి చేయడానికి కస్టమర్ల అనాసక్తి
- ఆధార్ వివరాలిచ్చేందుకు సుముఖంగా లేని తీరు
- వేరే పత్రాలతో కేవైసీ పూర్తి చేస్తే తడిసి మోపెడు
- ఆర్‌బీఐ గడువు ముగిశాక లావాదేవీల్లో క్షీణత

అయితే, ఆధార్ చెల్లుబాటుపై విచారణ పూర్తయ్యేంత వరకు గడువును పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కస్టమర్లు తమ ఆధార్ నంబర్ ఇవ్వటానికి, బయోమెట్రిక్ వివరాలివ్వటానికి ఆసక్తి చూపించకపోవచ్చనేది పరిశ్రమ వర్గాల తాజా అంచనా. మొబైల్ వాలెట్ సంస్థలన్నీ ఫిబ్రవరి 28 నాటికి తమ కస్టమర్లకు సంబంధించి పూర్తి కేవైసీ వివరాలను సమీకరించాలన్నది ఆర్‌బీఐ ఆదేశం. కేవైసీ వివరాలు లేని ఖాతాల్లో కొత్తగా నగదు జమ చేయటం వంటి లావాదేవీల్ని ఆర్‌బీఐ నిషేధించింది కూడా. దీంతో కేవైసీ వివరాలను సమీకరించి, యూజర్లను కాపాడుకోవటానికి వాలెట్ సంస్థలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఆర్‌బీఐ గడువు ముగిశాక రూ.12,000 కోట్లు విలువ కలిగిన ప్రీపెయిడ్ వాలెట్ పరిశ్రమ లావాదేవీలు దాదాపు 60 శాతం వరకూ తగ్గిపోయినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి కూడా. ఈ సమయంలో సుప్రీంకోర్టు ఆధార్ గడువు పొడిగించడం తమకు ఇబ్బందికరమేనని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు పూర్తి గందరగోళానికి దారితీసిందని మొబిక్విక్ సీఈవో బిపిన్ ప్రీత్‌సింగ్ ట్వీటర్‌లో పేర్కొన్నారు కూడా.



ఆధార్‌తోనే కేవైసీ ఎందుకంటే..!

నిజానికి కేవైసీ వివరాలను నమోదు చేయటానికి ప్రభుత్వం ఆమోదించిన ఏ గుర్తింపు కార్డునయినా తీసుకోవచ్చని వాలెట్ కంపెనీలకు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. కానీ, మొబిక్విక్, పేటీఎం వంటి సంస్థలు ఆధార్ బయోమెట్రిక్ డేటాబేస్‌పైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. ఎందుకంటే ఇది వేగంతో కూడినదే కాక చౌక కావడమే. ''కేవైసీకి ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. పేపర్ డాక్యుమెంట్ ఆధారంగా చేసే ప్రక్రియతో యూజర్లకు అసౌకర్యం. కంపెనీలకు వ్యయ భారం. అదే ఆధార్‌తో అయితే ధ్రువీకరణ డిజిటల్ విధానంలో వేగంగా పూర్తవుతుంది'' అని ఓ పేమెంట్ కంపెనీ సీఈవో వ్యాఖ్యానించారు. పలు ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీల్లో పెట్టుబడులున్న ఓ వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ తాజా పరిణామాలపై మాట్లాడుతూ... ''కంపెనీలు ఆధార్ ఆధారిత కేవైసీని రూ.25లోపు ఖర్చుతోనే పూర్తి చేసుకోగలవు. అదే గతంలో మాదిరి పేపర్ ఆధారిత కేవైసీని పూర్తి చేయాలంటే ఎంతలేదన్నా రూ.500 ఖర్చు చేయాల్సి ఉంటుంది'' అని తెలిపారు. ఇక పేపర్ డాక్యుమెంట్లను తీసుకుంటే భద్రతాపరమైన రిస్క్ ఎదురవుతుందని, ప్రతీ కస్టమర్‌కు సంబంధించిన వివరాలతో డేటా నిర్వహించాల్సి వస్తుందని, ఇది మోసగాళ్లకు వరంగా మారుతుందన్న అభిప్రాయాన్ని కూడా పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆధార్ అయితే ఆ వివరాలు సంస్థల వద్ద ఉండవు. నంబర్ మాత్రమే ఉంటుంది. ఆ నంబర్‌కు సంబంధించి అన్ని వివరాలు యూఐడీఏఐ వద్దే ఉంటాయి.

తప్పదంటే చేసేదేమీ లేదు...

సుప్రీంకోర్టు గడువు పొడిగించినప్పటికీ, కేవైసీకి ఆధార్ తీసుకోవడంపై ఎటువంటి నిషేధం లేనందున కంపెనీలు ఆధార్ ఆధారిత ఈ కేవైసీ విషయంలో ముందుకు వెళ్లే ఆలోచనతోనే ఉన్నాయి. అదే సమయంలో అవసరమైతే ఇతర గుర్తింపు పత్రాలైన డ్రైవింగ్ లైసెన్స్, పాన్ ద్వారా కేవైసీ పూర్తి చేసేందుకూ సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం ఆమోదించిన ఇతర డాక్యుమెంట్ల ద్వారా కూడా కేవైసీ పూర్తి చేసేందుకు తాము అనుమతిస్తున్నట్టు ఆక్సిజెన్ సర్వీసెస్ జాయింట్ ఎండీ సునీల్ కులకర్ణి తెలిపారు. అయితే, కేవైసీ పూర్తి చేసే విషయంలో కస్టమర్ల నుంచి స్పందన పెద్దగా లేదని, ఇది ఇంకా పెరగాల్సి ఉందని చెప్పారాయన. ఇక మరో వాలెట్ సంస్థ మొబిక్విక్ తొలుత ఆధార్ నంబర్‌ను మాత్రమే తీసుకోగా, కొన్ని రోజులుగా కేవైసీ కింద ఇతర గుర్తింపు కార్డులను కూడా ఆమోదించడం మొదలు పెట్టింది.

పెట్రోల్ మార్కెట్లో ప్రైవేట్ హవా

మూడేళ్లలోనే రెట్టింపు వాటా

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ మార్కెట్లో ఎస్సార్ ఆయిల్, రిలయన్స్ వంటి ప్రైవేట్ సంస్థలు గణనీయంగా వాటా పెంచుకుంటున్నాయి. గత మూడేళ్లలో ఇవి తమ వాటాను రెట్టింపు చేసుకున్నాయి. పెట్రోల్ అమ్మకాల్లో 7%, డీజిల్ విక్రయాల్లో 8% వాటాకు చేరుకున్నాయి. చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో ఈ విషయాలు తెలిపారు. 2002 మార్చి నుంచి ప్రైవేట్ కంపెనీలు కూడా పెట్రోల్, డీజిల్‌ను విక్రయించేందుకు అనుమతులు ఇచ్చినట్లు, ఆ తర్వాత ఇంధనం ధరలపై నియంత్రణలను కూడా తొలగించినట్లు ఆయన వివరించారు. దీంతో ఇండియన్ ఆయిల్ వంటి ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థలకు పోటీగా రిలయన్స్, ఎస్సార్, షెల్ మొదలైనవి కూడా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేశాయి. 2004–05లో ధరలపై ప్రభుత్వ నియంత్రణ మళ్లీ తిరిగి రావడంతో పోటీపడలేక వెనక్కి తగ్గాయి. ఇక 2010 జూన్‌లో పెట్రోల్ ధరలపైనా, 2014 అక్టోబర్ నుంచి డీజిల్‌పైనా నియంత్రణను ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ పరిణామాలన్నింటి దరిమిలా 2015–16లో పెట్రోల్ అమ్మకాల్లో 3.5 శాతం, డీజిల్ అమ్మకాల్లో 3.1 శాతం ప్రైవేట్ కంపెనీల వాటా ఉండేదని ప్రధాన్ వివరించారు. 2017–18లో పెట్రోల్ అమ్మకాల్లో 6.8%కి, డీజిల్ అమ్మకాల్లో 8.2%కి ప్రైవేట్ సంస్థల వాటా చేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి దేశవ్యాప్తంగా 61,678 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో ఐవోసీవి 26,752, హెచ్‌పీసీఎల్‌వి 14,853, బీపీసీఎల్‌వి 14,293 ఉన్నాయి. ఇక ప్రైవేట్ రంగంలో ఎస్సార్‌కి 4,275 పెట్రోల్ బంకులు, రిలయన్స్‌కి 1,400, షెల్‌కి 100 బంకులు ఉన్నాయి.



గృహ రుణాలపై ఎస్‌బీఐతో ఐఎంజీసీ జట్టు



గృహ రుణాలకు సంబంధించి ఇండియా మార్టిగేజ్ గ్యారంటీ కార్పొరేషన్ (ఐఎంజీసీ), ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. వేతనయేతర వర్గాలు, స్వయం ఉపాధి పొందుతున్న గృహ రుణ దరఖాస్తుదారులకు ఇది ఉపయోగకరంగా ఉండనుంది. దీనితో దరఖాస్తుదారులు రుణ అర్హతను దాదాపు 15 శాతం దాకా పెంచుకునేందుకు వీలుంటుందని ఎస్‌బీఐ పేర్కొంది. ఐఎంజీసీ డిఫాల్ట్ గ్యారంటీ కవరేజీ తీసుకోవడం ద్వారా దరఖాస్తుదారు మరింత అధిక మొత్తాన్ని రుణంగా పొందడానికి అవకాశాలు ఉన్నాయని ఎస్‌బీఐ ఎండీ (రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్) పి.కె. గుప్తా తెలిపారు. నేషనల్ హౌసింగ్ బ్యాంక్, జెన్‌వర్త్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సంయుక్తంగా ఐఎంజీసీని ఏర్పాటు చేశాయి. దేశీయంగా పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఇది మార్టిగేజ్ డిఫాల్ట్ గ్యారంటీ స్కీములు అందిస్తోంది.

రీకనెక్ట్ బ్రాండ్ విద్యుత్ ఆదా ఇన్వర్టర్ ఏసీలు..!



విద్యుత్ ఆదాచేసే రీకనెక్ట్ బ్రాండ్ ఇన్వర్టర్ ఎయిర్‌కండీషన్లు (ఏసీ) మార్కెట్‌లోకి విడుదలైనట్లు ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన తెలిపింది. పూర్తిగా 100 శాతం కాపర్‌తో ఈ ఏసీలను రూపొందించడం జరిగింది. స్టెబిలేజర్ ఫ్రీ నిర్వహణ దీని ప్రత్యేకత. 130వీ–265వీ ఓల్టేజ్ ఒడిదుడుకుల్లోనూ ఎటువంటి అంతరాయాలూ లేకుండా ఈ ఆధునిక డిజైన్ ఏసీలు పనిచేస్తాయి. అమ్మకం తదుపరి వినియోగ సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రకటన ప్రకారం– షరతులకు లోబడి ఈ రీకనెక్ట్ బ్రాండ్ ఇన్వర్టర్ ఏసీలకు ఐదేళ్ల వారెంటీ ఉంటుంది. రూ.18,990 నుంచీ అందుబాటు ధరల్లో ఈ ఏసీలు మార్కెట్‌లో లభ్యమవుతాయి. మరిన్ని వివరాలకు రిలయన్స్ డిజిటల్ లేదా జియో స్టోర్‌లను సంప్రదించాలని ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

33 వేల దిగువకు సెన్సెక్స్

- ప్రభావం చూపిన క్యాడ్, ఫెడ్ భయాలు
- ఈ ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయిన సూచీలు
- 253 పాయింట్ల నష్టంతో 32,923కు సెన్సెక్స్
- 101 పాయింట్లు పతనమై 10,094కు నిఫ్టీ



అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు భయాలకు కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) పెరగడం కూడా జత కావడంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. సెన్సెక్స్ వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ, నిఫ్టీ వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టపోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 33 వేల పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10,100 పాయింట్ల దిగువకు పడిపోయాయి. లోహ, టెలికం, బ్యాంక్, టెక్నాలజీ, ఆయిల్, రియల్టీ షేర్లలో అమ్మకాలు కొనసాగడంతో సెన్సెక్స్ 253 పాయింట్లు నష్టపోయి 32,923 పాయింట్ల వద్ద, నిఫ్టీ 101 పాయింట్లు నష్టపోయి 10,094 పాయింట్ల వద్ద ముగిశాయి. స్టాక్ సూచీలకు ఈ ఏడాది కనిష్ట స్థాయిలు ఇవే. సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు మూడు నెలల కనిష్టానికి పడిపోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 100 పాయింట్లు లాభపడగా, మరో దశలో 319 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద 419 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఈ ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 995 పాయింట్లు పతనమైంది. వచ్చే నెల 1 నుంచి దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ) విధించనుండటంతో మార్కెట్లో అమ్మకాల జోరు కొనసాగుతోందని నిపుణులంటున్నారు. ప్రపంచ మార్కెట్ల ఒడిదుడుకుల ప్రభావంతో మన మార్కెట్ కుదేలవుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. బాండ్ల రాబడులు పెరుగుతుండడం, వాణిజ్య యుద్ధ భయాలు.. ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణ వైపుకు పురికొల్పుతున్నాయని పేర్కొన్నారు.

నేడూ మార్కెట్‌కు నష్టాలే..!

సోమవారం అమెరికా, యూరప్ మార్కెట్లు భారీ పతన ప్రభావం నేడు (మంగళవారం) మన మార్కెట్‌పై ఉండొచ్చని నిపుణులంటున్నారు. ఈ వార్త రాసే సమయానికి(రాత్రి గం.11.30నికు) అమెరికా డోజోన్స్ 350 పాయింట్లు, నాస్‌డాక్ ఇండెక్స్ 160 పాయింట్లు, ఎస్‌జీఎక్స్ నిఫ్టీ 50 పాయింట్లకు పైగా నష్టాలతో ట్రేడవుతున్నాయి. యూరప్ మార్కెట్లు 1.1 శాతం నుంచి 1.7శాతం రేంజ్‌లో నష్టపోయాయి. దేశీయంగానూ ప్రతికూల పరిణామాలే ఉన్న నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ల భారీ పతనం మన మార్కెట్‌పై తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశాలే అధికంగా ఉన్నాయని, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10వేల పాయింట్ల దిగువకు పడిపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బంధన్ బ్యాంక్ ఐపీఓ 14 రెట్ల ఓవర్ సబ్‌స్క్రిప్షన్

ఈ నెల 27న స్టాక్‌మార్కెట్లో లిస్టింగ్ !



కోల్‌కతా: ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) 14.5 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. క్యూఐపీ, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్‌ఎన్‌ఐ)ల నుంచి మంచి స్పందన లభించిందని బ్యాంక్ ఎం.డీ., సీఈవో చంద్ర శేఖర్ ఘోష్ చెప్పారు. క్యూఐపీకు కేటాయించిన వాటా 38.67 రెట్లు, హెచ్‌ఎన్‌ఐలకు కేటాయించిన వాటా 13.89 రెట్లు చొప్పున ఓవర్ సబ్‌స్క్రైబయ్యాయని వివరించారు. రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన వాటా 1.05 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిందని తెలిపారు.ఈ నెల 27న బంధన బ్యాంక్ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి.

లెమన్ ట్రీ ఐపీఓ ప్రైస్ బాండ్ రూ.54-56

ఈ నెల 26-28 మధ్య ఐపీఓ • ఇష్యూ సైజ్ రూ.1,040 కోట్లు



ముంబై: లెమన్ ట్రీ హోటల్స్ కంపెనీ తన ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు ధరల శ్రేణిని రూ.54–56గా నిర్ణయించింది. ఈ ఐపీఓ ఈ నెల 26న మొదలై 28న ముగుస్తుంది. ఈ ఐపీఓలో భాగంగా 18.54 కోట్ల షేర్లను జారీ చేస్తారు. ఇష్యూ సైజ్ రూ.1,040 కోట్లు. ఈ కంపెనీలో భాగస్వాములైన మాపుల్ వుడ్, విష్పరింగ్ రిసార్ట్స్, పామ్స్ ఇంటర్నేషనల్, ఆర్‌జే గ్రూప్ సంస్థలు ఈ షేర్లను విక్రయిస్తాయి. కనీసం 265 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

గిడ్డంగుల విస్తరణలో అమెజాన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కస్టమర్లకు త్వరితగతిన ఉత్పత్తులను అందించేందుకు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ పెద్ద ఎత్తున గిడ్డంగులను (ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు) ఏర్పాటు చేస్తోంది. తాజాగా 6 ప్రత్యేక గిడ్డంగులు, 25 డెలివరీ స్టేషన్లను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే సంస్థకు 9 ప్రత్యేక గిడ్డంగులు, 35 డెలివరీ స్టేషన్లున్నాయి. వీటికితోడు 41 గిడ్డంగులను సంస్థ నిర్వహిస్తోంది. పెద్ద ఉపకరణాలైన టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, ఫర్నిచర్ వంటివి స్పెషల్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల ద్వారా వినియోగదార్లకు సరఫరా చేస్తారు. తాజా విస్తరణతో 30 నగరాల్లో ఆర్డరు ఇచ్చిన తదుపరి రోజులోపే డెలివరీ చేస్తున్నట్టు అమెజాన్ ఇండియా కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ అఖిల్ సక్సేనా తెలిపారు. అప్లయాన్సెస్ కేటగిరీ లీడర్ సుచిత్ సుభాష్‌తో కలిసి సోమవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌తోసహా ఇతర నగరాల్లోని ప్రత్యేక గిడ్డంగుల సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్టు చెప్పారు. స్పెషల్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల ద్వారా 5,000 రకాల విస్తృత శ్రేణి ఉత్పాదనలను విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. వీటిలో 200 ఎక్స్‌క్లూజివ్ ప్రొడక్టులు ఉన్నాయన్నారు.

పార్లమెంటులో 'బిజినెస్'



పసిడి దిగుమతి విధానం మారదు



దేశంలో పసిడి దిగుమతి విధానాన్ని సమీక్షించాలన్న ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదు. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి సీఆర్ చౌదరి లోక్‌సభలో ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలిపారు. మెటల్స్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని రత్నాలు, ఆభరణాల పరిశ్రమ నుంచి డిమాండ్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ విషయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. 10 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నప్పటికీ, బంగారం దిగుమతులు అధికంగానే ఉంటున్నట్లు తెలిపారు. సుంకాలు తగ్గిస్తే, అది ప్రభుత్వ ఆదాయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందువల్ల సుంకాల విధాన సమీక్ష ప్రతిపాదనే లేదని అన్నారు.

రక్షణ, నౌక, బొగ్గు రంగాల్లో ఎఫ్‌డీఐల్లేవ్...



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబర్ మధ్య కాలంలో రక్షణ, నౌక, బొగ్గు విభాగాలు సహా ఆరు రంగాలు అసలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులనే (ఎఫ్‌డీఐ) ఆకర్షించలేకపోయాయి. మంత్రి సీఆర్ చౌదరి లోక్‌సభలో ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలిపారు. ఫొటోగ్రాఫిక్ రా ఫిల్మ్ అండ్ పేపర్, పీచు, రంగుల్లో కలిపే రసాయనాల రంగాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించలేకపోయిన విభాగాల్లో ఉన్నాయి. రక్షణ, సింగిల్ బ్రాండ్ రిటైల్, పౌర విమానయానంసహా పలు రంగాల్లో కేంద్రం ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించింది. 2017–18 ఏప్రిల్–డిసెంబర్ మధ్య దేశంలోకి ఎఫ్‌డీఐలు స్వల్పంగా 0.27 శాతం పెరిగాయి. విలువ రూపంలో 35.94 బిలియన్ డాలర్లకు చేరాయి.

టెలికం స్పెక్ట్రం పరిమితులు పెంపు

న్యూఢిల్లీ: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న టెల్కోలకు టెలికం శాఖ (డాట్) కొంత ఊరటనిచ్చింది. స్పెక్ట్రం హోల్డింగ్ పరిమితులను, స్పెక్ట్రం చెల్లింపులకు సంబంధించి వాయిదాల సంఖ్యను పెంచుతూ లైసెన్స్ నిబంధనలను సడలించింది. 2012 నుంచి 2016 దాకా పలు విడతలుగా నిర్వహించిన స్పెక్ట్రం వేలం చెల్లింపులకు సంబంధించి గరిష్టంగా పదహారు వాయిదాల్లో కట్టేట్లు లైసెన్సుదారు ఎంచుకోవచ్చంటూ లైసెన్సు సవరణ నోట్‌లో టెలికం శాఖ పేర్కొంది. స్పెక్ట్రం ధరలోగానీ, వడ్డీ రేటులో గానీ ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ టెల్కోలు 2034–35 దాకా అధిక సంఖ్యలో వాయిదాల విధానాన్ని ఎంచుకున్న పక్షంలో దాదాపు రూ. 74,446 కోట్ల మేర అధికంగా కట్టాల్సి వస్తుంది. టెలికం రంగానికి తాజా సవరణలు కొంత ఊరట కల్పించనున్నాయి.

వ్యవసాయంపై యువతకు అనాసక్తి

ఉద్యోగావకాశాల పోర్టల్ ఇన్‌డీడ్ సర్వే నివేదిక



న్యూఢిల్లీ: వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలపై యువతరం అంతగా ఆసక్తి చూపడం లేదు. ఉద్యోగ భద్రత లేకపోవడం, వ్యవసాయ రంగం వృద్ధిపై అవగాహన అంతగా లేకపోవడం, ఔత్సాహిక వ్యాపారవేత్తల స్ఫూర్తి లోపించడం ఇందుకు కారణాలుగా ఉంటున్నాయి. ఉద్యోగావకాశాల వెబ్‌సైట్.. ఇన్‌డీడ్ ఇండియా నిర్వహించిన ఒక సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2017లో తమ పోర్టల్‌లో వ్యవసాయ సంబంధ ఉద్యోగాల కోసం జాబ్ సెర్చ్‌లు సగటున 25 శాతం తగ్గాయని సంస్థ తెలిపింది. 21–25 సంవత్సరాల వయస్సుగల ఉద్యోగార్థుల (తాజా గ్రాడ్యుయేట్స్ మొదలైన మిలీనియల్స్) నుంచి వ్యవసాయ సంబంధ ఉద్యోగాలపై అత్యంత తక్కువ ఆసక్తి వ్యక్తమవుతోంది. అయితే, 31–35 ఏళ్ల మధ్య వయస్సుగల వారు ఈ తరహా ఉద్యోగాలపై సగటు కన్నా ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆయా ఉద్యోగాలకు సంబంధించిన అవగాహన, సవాళ్లను ఎదుర్కొనడానికి అవసరమయ్యే నైపుణ్యాలను అప్పటికే సాధించడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. సర్వే ప్రకారం 2007 నుంచి చూస్తే వ్యవసాయ సంబంధ ఉద్యోగాల్లో చేరే యువత సంఖ్య 4 శాతం పెరిగింది. మొత్తం మీద ఉద్యోగ భద్రత ఉన్న పక్షంలో ఈ రంగంలో ఉద్యోగావకాశాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నట్లు సర్వే పేర్కొంది.

'సేంద్రియ' సంస్థల్లో అవకాశాలు ..

2022 నాటికల్లా వ్యవసాయాదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా .. దేశీ రైతాంగం వేగవంతంగా యాంత్రీకరణకు అలవాటు పడుతున్న నేపథ్యంలో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా కనిపిస్తున్నాయని ఇన్‌డీడ్ ఇండియా ఎండీ శశి కుమార్ తెలిపారు. అగ్రిబిజినెస్, వ్యవసాయ వనరుల నిర్వహణ, ఫుడ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ మొదలైన అత్యాధునిక కోర్సులు కూడా ఈ రంగంలో రాణించేందుకు ఉపయోగపడగలవని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం ఎపిగామియా, పేపర్‌బోట్, యాంటీడోట్, 24 మంత్ర వంటి సేంద్రియ వ్యవసాయోత్పత్తుల సంస్థలు మరింతగా నియామకాలు జరిపే అవకాశాలు ఉన్నాయి.

వివో బ్రాండ్ అంబాసిడర్‌గా అమీర్ ఖాన్



న్యూఢిల్లీ: వివో బ్రాండ్ మొబైల్ ఫోన్లకు ప్రముఖ హిందీ సినిమా నటుడు అమీర్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు అమీర్ ఖాన్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని వివో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కెన్నీ జెంగ్ తెలిపారు. వివో బ్రాండ్ కింద భవిష్యత్తులో రానున్న మోడళ్లకు అమీర్ ఖాన్ ప్రచారం చేస్తారని, ఆయనతో త్వరలోనే ఒక టీవీ కమర్షియల్‌ను తెస్తామని వివరించారు. వివో భారత యాత్రలో తాను కూడా ఒక భాగమవుతున్నందుకు ఉత్సాహంగా ఉందని అమీర్ ఖాన్ పేర్కొన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,340	▼	120
బంగారం (99.5, 10గ్రా)	30,190	▼	120
వెండి (కిలో)	37,940	▼	335
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		–
బంగారం (22 క్యారెట్లు)	28,860		–
వెండి (కిలో)	– –		–
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,300		–
బంగారం (22 క్యారెట్లు)	28,860		–
వెండి (కిలో)	41,000		–
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,150		–
బంగారం (22 క్యారెట్లు)	28,900		–
వెండి (కిలో)	39,100		–
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	30,860		–
బంగారం (22 క్యారెట్లు)	28,860		–
వెండి (కిలో)	41,500		–
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,300		–
బంగారం (22 క్యారెట్లు)	28,800		–
వెండి(కిలో)	39,200		–
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,300		–
బంగారం (22 క్యారెట్లు)	28,950		–
వెండి (కిలో)	39,300		–

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.08 (రాత్రి 11.00కు)	$62.41 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	66.03 (రాత్రి 11.00కు)	$66.21 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 20-3-2018

విశాఖ	325–00
చిత్తూరు	363–00
వరంగల్	332–00
ముంబై	370–00
చెన్నై	370–00
విజయవాడ	317–00
గోదావరి	317–00
నమక్కల్	360–00
19–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365–00
కోల్‌కతా	360–00
ఢిల్లీ	310–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	364.3	370.5
AMBUJA CEME	231.15	234.75
ASIAN PAINT	1102.55	1122.75
AXIS BANK L	519.45	522.6
BAJAJ AUTO	2849.45	2910.45
BAJAJ FINAN	1631.85	1687.9
BHARTI AIRT	399.65	416.75
TATA POWER	79.55	79.95
TITAN COMPA	869	879.25
TORRENT PHA	1261.65	1268.45

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
3M INDIA LI	19689.15	19991.6
63 MOONS TE	104	108.55
8K MILES SO	674.8	695.3
A AND M JUM	65.25	66
AARTI DRUGS	540.8	550.15
AARTI INDUS	1141.15	1155.85
AARVI ENCON	77	75.75
BANSWARA SY	97.75	104
BASF INDIA	1992.4	2016.5
BATA INDIA	676.9	699.6
BAYER CROPS	4120.2	4106.75
BEARDSELL L	50.8	52.65
BEML LIMITE	1029.3	1071.45
BERGER PAIN	245.15	252.45
BETA DRUGS	145.9	145.5
BF INVESTME	286.7	302.2
BF UTILITIE	393.4	408.85
BGR ENERGY	102.3	107.45
BHAGERIA IN	284.75	290.15
BHANSALI EN	163.85	169.5
DHUNSERI TE	283.45	296.1
DIC INDIA L	503.65	488.85
DILIP BUILD	969	970.7
DISH TV IND	67.25	68.95
DISHMAN CAR	309.95	325.3
DIXON TECHN	3403.65	3447.55
DOLLAR INDU	415	429.35
DOLPHIN OFF	80	84.15
DONEAR IND.	52.25	53.6
DR. LAL PAT	880.45	894.8
DYNAMATIC T	1725.8	1745.85
DYNEMIC PRO	188.5	190

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GUFIC BIOSC	114.95	120.75
GUJ IND POW	103.15	103.65
GUJ NAR VAL	409.35	416.8
GUJ STATE F	121.95	123
GUJ. APOLLO	208.75	210.9
GUJARAT ALK	696.15	723.5
GUJARAT AMB	252.1	260.2
GUJARAT FLU	782.95	788.15
GUJARAT GAS	825.9	834.95
GUJARAT MIN	126.8	127.7
GUJARAT PIP	132.5	132.25
GUJARAT STA	188.1	192.2
GULF OIL LU	920	944.95
JAYANT AGRO	320.45	327.85
JAYSHREE TE	95.05	98.1
JBF INDUSTR	112.6	140.75
JBM AUTO LI	420.35	438.95
JET AIRWAYS	673.35	703.8
JET KNITWEA	100	100
JHS SVEND.	60.15	61.75
JIND POL IN	56.6	57.05
JINDAL DRIL	150.1	153.8
JINDAL PHOT	55.8	57.15
JINDAL POLY	332.65	344.4
JINDAL SAW	121.15	126.55
JINDAL STAI	86.8	90.75
MANAKSIA LT	51.1	52.65
MANAPPURAM	102.95	104.65
MANG.CHEM.F	64.4	62.95
MANGALAM CE	316.3	326.6
MANGALAM DR	170.8	176.55
MANPASAND B	367.3	380.65
MARATHON NX	423.7	443.75
MAS FINANCI	561.35	571.4
MASTEK LTD	532.3	557.15
MATRIMONY.C	822	839.35
MAWANA SUGA	51.85	54.75
MAX FINANCI	430.2	447.25
MAX INDIA L	90.75	90.25
PIONEER DIS	182.75	190.2
PLASTIBLEND	201.45	204.6
PNB HOUSING	1121.4	1104.8
PNC INFRATE	154.25	153.9
PODDAR HOUS	1100	1115.65
PODDAR PIGM	267.75	279.45
POKARNA LIM	191.75	192.25
POLY MEDICU	249.4	251.6
POLYPLEX CO	484.25	490.05
PONNIE SUGA	156.75	158.95
POWER MECH	852.5	873.05
PPAP AUTOMO	531.45	558.5
PRABHAT DAI	157.55	165.7
SHARDA CROP	372.75	377.15
SHARDA MOTO	1916.2	1949.6
SHEELA FOAM	1489.65	1499.95
SHEMAROO EN	489.8	504.5
SHILPA MEDI	490.2	456.45
SHIPPING CO	65.2	67
SHIRPUR GOL	136.75	137.45
SHIVA MILLS	55.4	61.15
SHIVA TEXYA	492.95	495.1
SHIVAM AUTO	73.75	75.35
SHOPPERS ST	536	541.45
SHRE PUSH C	231.45	228.25
SHREE TIRUP	55	55.1
THE NEW IND	684.95	695.35
THE PHOENIX	592.45	608.65
THE RAMCO C	746.35	740.8
THE RUBY MI	300.05	304.65
THE STATE T	147.6	154.6
THE TINPLAT	205.95	215.95
THEJO ENGIN	510	510
THEMIS MEDI	595	589.55
THERMAX LTD	1158.7	1155.05
THIRUMALAI	1870.3	1901.3
THOMAS COOK	268.25	273.85
THYROCARE T	599.65	616.1
TI FINANCIA	663.35	674.5

I J K L **M N O P** **R S T U** **V W Y Z**

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

బీఎస్‌ఈ ఎస్‌ఎంఈ ట్రేడ్ షేర్లు

నలుపు చేప..



సోమశిల జలాశయంలో లభ్యమైన వింత చేప

సోమశిల: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సోమశిల జలాశయంలో జాలర్లకు అరుదైన వింత చేప లభ్యమైంది. జలాశయం లోతట్టు ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లిన పెంచలయ్య వలకు నలుపు రంగులో ఉన్న వింత చేప చిక్కింది. ఈ వింత చేపను సూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

గుంటూరులో నకిలీ మిరప విత్తనాలు స్వాధీనం



నకిలీ మిరప విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు వెస్ట్: అక్రమంగా రవాణా అవుతున్న నకిలీ మిరప విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వీఆర్ఎల్ పార్శిల్‌లో సోమవారం అధికారులు తనిఖీలు చేశారు. బెంగళూరు నుంచి వచ్చిన 30 కేజీల బస్తాను వారు గుర్తించారు. దీన్ని పరిశీలించగా నకిలీ మిరప విత్తనాలు బయటపడ్డాయి. ఈ విత్తనాల విలువ రూ.30 లక్షలు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ విత్తనాలను బెంగళూరులోని కృషి సీడ్స్ నుంచి గుంటూరు సన్ సీడ్స్‌కు సరఫరా చేస్తున్నట్టు గుర్తించామన్నారు. తనిఖీల్లో ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు, అధికారులు అంకమ్మరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో టోకరా..!

- గుంటూరులో ప్రజ్ఞా కన్సల్టెన్సీ ఘరానా మోసం
- 13 మంది నుంచి రూ.45.5 లక్షల వసూలు
- గ్రీవెన్స్‌లో అర్బన్ ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

లక్ష్మీపురం (గుంటూరు)



కెనడాలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ మోసపోయిన విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు



కెనడా నుంచి వచ్చినట్టు చూపించిన నకిలీ పత్రాలు

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గుంటూరులో ఓ కన్సల్టెన్సీ ప్రతినిధులు నిరుద్యోగుల రూ.లక్షలు వసూలు చేసి దగా చేశారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో బాధితులు సోమవారం గుంటూరులో జరిగిన గ్రీవెన్స్‌లో అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయారావును కలసి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు బ్రాడీపేటలో ఉన్న ప్రజ్ఞా కన్సల్టెన్సీలో డైరెక్టర్ అయిన కోటా విజయ్ అనే వ్యక్తి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ చేసిన ప్రచారం చూసి పలువురు నిరుద్యోగులు ఆకర్షితులయ్యారు. కెనడాలో వాల్‌మార్ట్, బెస్ట్ బే, బల్క్‌బోన్, రియల్ కెనడియన్ తదితర కంపెనీలలో సూపర్‌వైజర్లుగా, మేనేజర్లుగా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించాడు. నెలకు రూ.1.25 లక్షలు (మన కరెన్సీలో) జీతం వస్తుందని చెప్పాడు. అతని మాటలను నమ్మిన నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి వివిధ ఖర్చుల పేరుతో రూ.3.50 లక్షల చొప్పున రూ.45.50 లక్షలు వసూలు చేశారు. ఇలా గుంటూరు, ఏలూరు, తెనాలి, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 13 మంది నుంచి నగదు వసూలు చేశాడు. మోసపోయిన నిరుద్యోగులంతా బి.టెక్, ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారు కావడం గమనార్హం. వీరందరూ 2017 జూన్‌లో కోటా విజయ్‌కు వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చి నగదు చెల్లించారు. ఆ తర్వాత ఎన్నిసార్లు అడిగినా కెనడా నుంచి అపాయింట్‌మెంట్ లెటర్లు, వీసాలు త్వరలో వస్తాయంటూ చెప్పుకుంటూ వచ్చాడు. గత నెల 20న మెయిల్ వస్తుందని, మెయిల్ చూసుకున్న తక్షణమే తన వద్దకు రావాలని చెప్పాడు. అభ్యర్థులంతా ఆ రాత్రి మెయిల్ రాకపోవడంతో ఉదయమే విజయ్ వద్దకు వెళ్లారు. ఢిల్లీలో చార్లెస్ అనే వ్యక్తి తమ సంస్థలో భాగస్వామి అని, అతను మీకు కెనడాకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తాడని, లేని పక్షంలో అమెరికా వ్యాపార సంస్థకు అయినా పంపిస్తాడని చెప్పాడు. దీంతో విజయ్ తీరుపై వారందరికీ అనుమానం వచ్చి నిలదీశారు. దీంతో కెనడాలో ఉద్యోగాల కోసం నగదు చెల్లించిన 13 మందికి వారిచ్చిన దాంట్లో 40 శాతం నగదు మాత్రం వెనక్కు ఇచ్చాడు. మిగతా డబ్బు విషయం అడగొద్దని, తనకు బాగా పలుకుబడి ఉందని, తననేమీ చేయలేరంటూ హెచ్చరించాడు. దీంతో బాధితులు తమ ఆవేదనను అర్బన్ ఎస్పీకి వినిపించారు. సానుకూలంగా స్పందించిన అర్బన్‌ఎస్పీ సీహెచ్ విజయారావు విచారించి న్యాయం చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

మద్యం మత్తులో ఏఆర్ కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన

గుంటూరు జీజీహెచ్‌లో ఘటన

గుంటూరుఈస్ట్: మహిళలకు రక్షణ కల్పించాల్సిన రక్షకభటుడు విధుల్లో ఉన్న మహిళా అధికారితో నీచంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో విర్రవీగిన ఆ రక్షకభటుడికి ఆమె ధైర్యంగా ఎదురు తిరిగి తోటి వారి సహకారంతో పోలీసులకు అప్పగించింది. గుంటూరు కొత్తపేట ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అర్బన్ ఏఆర్ కానిస్టేబుల్ కె.రత్తయ్య ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ద్విచక్రవాహనంపై గుంటూరు జీజీహెచ్‌లోని ఓ డెయిరీ పార్లర్ వద్దకొచ్చాడు. అటువైపు నడిచి వెళ్తున్న మహిళా సెక్యూరిటీ అధికారితో అసభ్యంగా మాట్లాడటంతో ఆమె ఎదురు తిరిగింది. దీంతో రత్తయ్య ద్విచక్రవాహనం స్టార్ట్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఆమె ధైర్యంగా అతని బైక్ ఇంజిన్ ఆఫ్ చేసి తాళం లాక్కుంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. దీనిని గమనించిన కొందరు సెక్యూరిటీ గార్డులు, రోగుల సహాయకులు అక్కడికి చేరుకుని రత్తయ్యను పట్టుకుని అత్యవసర విభాగంలోని పోలీస్ అవుట్ పోస్టుకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు రత్తయ్యను కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పగా ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్‌బాబు ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదుచేశారు.

ఈ ఏడాది రాష్ట్రానికి కష్టాలు

విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



మోహన్‌బాబు కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న స్వామి

సాక్షి, తిరుమల/చంద్రగిరి: శ్రీవిళంబినామ సంవత్సరంలో కుజుడి ప్రభావం వల్ల రాష్ట్రానికి కష్టాలు ఎదురవుతాయని, పరిహారం కోసం విశాఖపట్నంలో మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. సోమవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం స్వరూపానందేంద్ర మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం తలపెట్టిన మహాయజ్ఞం నిర్విఘ్నంగా జరిగేందుకు శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. అంతకు ముందు ఆలయ పేష్కార్ రమేష్, స్వరూపానందేంద్ర సరస్వతికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

మోహన్‌బాబు జన్మదిన వేడుకల్లో స్వామి

శ్రీ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఒక అద్భుతమైన రూపకల్పన అని, క్రమశిక్షణతో పాటు మన లక్ష్యాన్ని చేరడానికి తోడ్పాటును అందించే విద్యాలయం అని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి అన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరిలోని శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో సోమవారం విద్యాసంస్థల అధినేత, సినీ నటుడు మంచు మోహన్‌బాబు జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన స్వరూపానందేంద్ర స్వామీజీ మోహన్‌బాబు కుటుంబ సభ్యులను సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయం దేశంలో మరెక్కడా లేదని కితాబిచ్చారు. ఇక్కడ చదువుకునే ప్రతి ఒక్కరూ ప్రపంచం కోసం ఆలోచించే గొప్ప మేధావులుగా ఎదగాలని ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో నటి ప్రజ్ఞాజైస్వాల్, ముంబై యూనివర్సిటీ (డీమ్డ్) తపాన్ పటేల్, శాంతా బయోటిక్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, అంతర్జాతీయ హిందూ స్వయం సేవక్ సంఘం జాయింట్ కో–ఆర్డినేటర్ రవికుమార్ అయ్యన్‌లతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

జగన్ వల్లే సజీవంగా హోదా

ప్రతిపక్ష నేత గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమించారు: ఎమ్మెల్యేపెద్దిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి. పక్కన చిత్తూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

తిరుపతి మంగళం: ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాల మధ్య ప్రత్యేక హోదా సజీవంగా ఉండటానికి కారణం ప్రతిపక్ష నేత వైఎస్ జగనేనని పుంగనూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయనే ఉద్దేశంతో పార్టీ ఎంపీలతో రాజీనామాలకు కూడా సిద్ధపడ్డారని చెప్పారు. పెద్దిరెడ్డి సోమవారం ఎంఆర్‌పల్లిలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించడానికి ప్రధాన కారణం చంద్రబాబేనని ధ్వజమెత్తారు. విభజన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో వైఎస్ జగన్ గల్లీ నుంచి ఢిల్లీలో సైతం ఉద్యమాలు, యువభేరి, ధర్నాలు నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని మొట్టమొదట గొంతెత్తి నినదించిన ఏకైక నాయకుడు జగన్ అని చెప్పారు. హోదా కోసం ఉద్యమాలు చేస్తే జైలుకు పంపుతామని హెచ్చరించిన ద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. చంద్రబాబు ఓటుకు కోట్లు కేసులు చిక్కుకుని జైలుకు పంపుతారనే భయంతో రాష్ట్రాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. టీడీపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్ సమయంలో కూడా ప్రత్యేక హోదా కోసం నోరు మెదపని ద్రోహులన్నారు.

బాబు మోసపూరిత రాజకీయాలకు రుజువు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా అడ్డుపడుతున్న దుష్టశక్తి చంద్రబాబేనని పెద్దిరెడ్డి ఆరోపించారు. హోదా ఏమైనా సంజీవినా అని హేళనగా మాట్లాడిన ఆయన యూటర్న్ తీసుకోవటం మోసపూరిత రాజకీయాలకు రుజువన్నారు. చంద్రబాబు ఈసారి కుప్పంలో ఓడిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న వైఎస్సార్ సీపీ వచ్చే ఎన్నికల్లో 145 సీట్లు సాధించి ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అతిసార మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి

అఖిలపక్ష నేతల డిమాండ్

కొరిటెపాడు(గుంటూరు): అతిసార వ్యాధి కారణంగా మరణించినవారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కిలారి రోశయ్య, సీపీఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈమేరకు జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అతిసార వ్యాధి కారణంగా చనిపోయిన వారిని గుర్తించే ప్రక్రియ సరిగా జరగడంలేదని, పౌర సమాజాన్ని కూడా ఇందులో భాగస్వాములను చేస్తే వాస్తవ మరణాలు వెలుగులోకి వస్తాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో అతిసార మరణాలు రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్లే సంభవించాయని, ప్రజలకు సురక్షిత మంచినీటిని అందజేయడంలో మున్సిపల్ శాఖ పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు.

చంద్రబాబు పాలనలో ప్రజారోగ్యం అస్తవ్యస్తం

వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం అధ్యక్షుడు గోసుల శివభరత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శివభరత్‌రెడ్డి, దుట్టా, ఇతర వైద్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): గుంటూరులో డయేరియా బారిన పడి ఏకంగా 17 మంది మృతి చెందటం పూర్తిగా చంద్రబాబు సర్కారు వైఫల్యమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు ఆరోపించారు. హనుమాన్‌జంక్షన్‌లోని డాక్టర్ దుట్టా నివాసంలో సోమవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖ మంత్రిగా కామినేని శ్రీనివాస్ రాజీనామా చేసిన తర్వాత ఇప్పటికీ ఆ శాఖకు మంత్రిని నియమించకపోవటమే ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. డయేరియా ఘటనకు బాధ్యుడైన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ బాషా, పార్టీ జిల్లా కార్యదర్శి నక్కా గాంధి తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన ఇన్విజిలేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో పదో తరగతి పరీక్షలలో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఆయా జిల్లాల అధికారులు ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి, వి.సుధీర్, కె.వెంకటరెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. పురుష ఉపాధ్యాయులు బాలికలను ఏ విధంగా తనిఖీ చేస్తారని వారు ప్రశ్నించారు. బాలికల వద్ద స్లిప్స్ దొరికితే ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో అతిసారతో మరొకరి మృతి



ఇస్మాయిల్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య గుల్షాద్

గుంటూరు ఈస్ట్: గుంటూరు జీజీహెచ్‌లో అతిసార వ్యాధి వల్ల మరో వ్యక్తి మృతి చెందాడు. గుంటూరులోని పొన్నూరు రోడ్డు ప్రియాంక గార్డెన్స్ 3వ లైనుకు చెందిన షేక్ ఇస్మాయిల్ (45) అమరావతి రోడ్డులో టీకొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 17వ తేదీ నుంచి ఇస్మాయిల్ అతిసారకు గురికాగా, ఇంటి వద్దనే చికిత్స పొందాడు. ఆదివారం రాత్రి ఇస్మాయిల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో సోమవారం కుటుంబ సభ్యులు ఆయన్ను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇస్మాయిల్‌కు భార్య షేక్ గుల్షాద్, ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె రేష్మాకు ప్రస్తుతం వివాహం చేసే ప్రయత్నాలలో ఉండగా, ఇస్మాయిల్ మృతి చెందాడు.

ఉగాది విశిష్ట సేవా పురస్కార గ్రహీతలు వీరే



ఉగాది విశిష్ట సేవా పురస్కారాల గ్రహీతలు వీరే..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఫిలాంత్రోఫిక్ సొసైటీ, తెలుగు విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది విశిష్ట సేవా పురస్కారాల కార్యక్రమం సోమవారం రాత్రి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో సీతా మాడభూషి(అమెరికా), సీహెచ్‌బీవీఆర్ కృష్ణశర్మ, ఇంద్రనీల్ మేకల, ఖాదర్ ఖాన్, ఎంవీ వినయకుమారి, ఎన్‌వీఎం సూర్యశ్రీ, మానస ఎండ్లూరి, జి.శాంతిశర్మ(రాజమహేంద్రవరం), ముప్పిడి శ్యామ్యూల్ రాజు(బిక్కవోలు), డాక్టర్ కోటా రాంబాబు (మధిర, తెలంగాణ), కోటయ్య, ఇసాక్ బాబు(వైరా, తెలంగాణ), బాలస్వామి, రామారావు(ఖమ్మం), జాషువా (సఖినేటిపల్లి), నాగేశ్వరరావు(మోరిపోడు), సురేష్‌కుమార్, మజ్జి రామచంద్రరావు(విజయవాడ), కె.జగదీష్ పాల్(యలమంచిలి), కె.విమలరాణి(విజయనగరం), కృష్ణవేణి(గోపాలపట్నం), సత్యవతి(తెలంగాణ) ఉన్నారు

జగన్‌కు భయపడే హోదాపై బాబు యూటర్న్

బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ



బెల్లంకొండ (పెదకూరపాడు): ప్రత్యేక హోదాపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భయపడే ముఖ్యమంత్రి చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని బీజేపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలంలో సోమవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల్లో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి భయపడి చంద్రబాబు మాట మార్చారన్నారు. ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీ గొప్పదని, హోదా ముగిసిన అధ్యాయమని, హోదా కోసం పోరాడితే విద్యార్థులను జైలుకు పంపుతానని చంద్రబాబు చెప్పిన విషయాలను గుర్తు చేశారు. చంద్రబాబు 29 సార్లు ఢిల్లీకి వెళ్లి వైఎస్ జగన్‌పై కేసులు పెట్టాలని, నియోజకవర్గాలను పెంచాలని కోరారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు.

'కాంట్రాక్టు ఉద్యోగులను రోడ్డున పడేశారు'

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఏపీ హెల్త్ మెడికల్ మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మేసా ప్రసాద్, ఉపాధ్యక్షుడు కె.మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్నికలప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి చంద్రబాబునాయుడు మోసం చేశారని మండిపడ్డారు.




మ్యాంగో మార్కెట్‌లో విక్రయించేందుకు రైతులు తీసుకొచ్చిన మామిడికాయలు

నున్న మ్యాంగో మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రారంభం

నున్న (విజయవాడ రూరల్): కృష్ణాజిల్లాలోని నున్న మ్యాంగో మార్కెట్‌లో మామిడికాయల కొనుగోలు, అమ్మకాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా వినాయకపురం నుంచి, కృష్ణాజిల్లాలోని సూరంపల్లి, ఆగిరిపల్లి, సీతారామపురం నుంచి రైతులు తీసుకొచ్చిన పది టన్నుల బంగినపల్లి మామిడికాయలను.. వ్యాపారి రామకృష్ణారావు కొనుగోలు చేశారు. టన్ను మామిడికాయలను రూ.70 వేలకు కొనుగోలు చేసినట్లు రామకృష్ణ తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వీటిని ఢిల్లీకి చెందిన వ్యాపారులకు విక్రయించామని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 20-3-2018



క్రికెటర్లు రోబోలు కాదు...

మైదానంలో భావోద్వేగాలు ప్రదర్శించడం, దూకుడుగా కనిపించడం ఆటలో భాగమే. మైదానంలో రోబోల్లా కనిపించే ఆటగాళ్లను మేం చూడాలనుకోవడం లేదు. అయితే క్రికెటర్లు తమ పరిధి దాటకుండా ఉండటం కూడా ముఖ్యం. బూతులు మాట్లాడకుండా కూడా దూకుడు ప్రదర్శించవచ్చు. ఇటీవలి జరిగిన కొన్ని సంఘటనలకు (రబడ తరహా) నేను మద్దతివ్వడం లేదు కానీ శిక్షల భయంతో ఆటగాళ్లు కనీసం ఒకరి వైపు మరొకరు కూడా చూసుకోకుండా ఉండే పరిస్థితి రావడం మంచిది కాదు.

– బ్రెట్ లీ, ఆస్ట్రేలియా మాజీ పేస్ బౌలర్

షమీ అభిమానుల్లో నేనొకరిని...

- అంతకుమించి మా మధ్య ఏమీ లేదు
- పాక్ స్నేహితురాలు అలీష్బా వివరణ



ఇస్లామాబాద్: భారత పేసర్ మొహమ్మద్ షమీ పాకిస్తానీ స్నేహితురాలు అలీష్బా ఎట్టకేలకు మౌనం వీడింది. సోమవారం ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ షమీతో తన అనుబంధాన్ని ఆమె వెల్లడించింది. గతేడాది ఇంగ్లండ్‌లో జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ అనంతరం తమ మధ్య స్నేహం మొగ్గ తొడిగిందని ఆమె చెప్పింది. ఫైనల్లో పాక్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్ సందర్భంగా షమీకి, పాక్ అభిమానికి మధ్య మాటామాటా పెరిగింది. అది మీడియాలో చూసిన అలీష్బా భారత పేసర్‌పై అభిమానం పెంచుకున్నట్లు తెలిపింది. 'సామాజిక సైట్లలో షమీ లక్షలాది ఫాలోయర్లలో నేను ఒకర్ని. అప్పుడపుడు పోస్ట్‌లు చేసేదాన్ని. దానికి అతను స్పందించేవాడు. ఓ సెలబ్రిటీగా అతనితో సాధారణ సంభాషణే జరిగేది. దుబాయ్‌లో మా సోదరి నివసిస్తోంది. మా సోదరి ఇంటికి వచ్చిన సందర్భంలో షమీ కూడా దుబాయ్‌లోనే ఉండటంతో అతడిని కలిశాను. అంతకుమించి మా మధ్య ఇంకేమీ లేదు. షమీ భార్య ఆరోపిస్తున్నట్లు నేను షమీకి డబ్బు ఇవ్వలేదు' అని అలీష్బా తెలిపింది.

బోల్ట్... ఓ ప్రేక్షకుడిగా!



సిడ్నీ: స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌కు విచ్చేయనున్నాడు. అయితే పోటీదారుడిగా కాదు.... సగటు ప్రేక్షకుడిగా! వచ్చే నెల ఆస్ట్రేలియాలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో 100 మీటర్ల పరుగు ఫైనల్ పోటీని బోల్ట్ తిలకిస్తాడని అతని సహచరుడు యోహాన్ బ్లేక్ వెల్లడించాడు. '8 సార్లు ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ 100, 200 మీటర్ల పరుగులో రికార్డు నెలకొల్పిన బోల్ట్ గోల్డ్‌కోస్ట్‌కు వస్తున్నాడు. 100 మీ. పరుగు ఫైనల్స్‌ను తిలకిస్తాడు' అని చెప్పాడు. తాను వచ్చాక జమైకన్లు పతకం గెలవకపోతే బాగుండదని బోల్ట్ అన్నట్లు బ్లేక్ తెలిపాడు.

జింబాబ్వేపై విండీస్ గెలుపు

హరారే: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీలో సోమవారం జరిగిన సూపర్‌సిక్స్ పోరులో వెస్టిండీస్ 4 వికెట్ల తేడాతో జింబాబ్వేపై గెలుపొందింది. మొదట జింబాబ్వే 50 ఓవర్లలో 289 పరుగులు చేసి ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (138; 20 ఫోర్లు, 2 సిక్సర్లు) శతక్కొట్టాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన విండీస్ 49 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి గెలిచింది. శామ్యూల్స్ (86; 6 ఫోర్లు, 4 సిక్సర్లు), హోప్ (76; 5 ఫోర్లు, 1 సిక్స్), లూయిస్ (64; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు.

పంకజ్ శుభారంభం

యాంగాన్ (మయన్మార్): ఆసియా బిలియర్స్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ పంకజ్ అద్వానీ శుభారంభం చేశాడు. తొలి లీగ్ మ్యాచ్‌లో పంకజ్ 4–0తో యో టెక్ షిన్ (సింగపూర్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో రూపేశ్ షా (భారత్) 4–0తో సిహోమ్‌బింగ్ (ఇండోనేసియా)పై నెగ్గాడు.

దినేశుని నవోదయం



- కెరీర్‌లో ఎత్తుపల్లాలు
- ఆత్మవిశ్వాసమే ఆయుధం
- 'నిదహస్' ఫైనల్‌తో హీరోగా దినేశ్ కార్తీక్

ఎప్పుడో 2004లో జాతీయ జట్టులోకి వచ్చాడు.
2006లో భారత్ ఆడిన తొలి అంతర్జాతీయ టి20లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అతడే.
ఇంగ్లండ్ గడ్డపై 2007లో టెస్టుల్లోనూ మెరిశాడు.
...అయినా ఇప్పటికీ 'ఒక్క చాన్స్' కోసం తపన
...అటు సహచరులు, ఇటు కుర్రాళ్లతో పోరాటం
...ఆత్మవిశ్వాసం కోల్పోకుండా అలుపెరగని పయనం
...ఎట్టకేలకు తానేంటో నిరూపించుకున్న వైనం
...ఆ ఆటగాడు దినేశ్ కార్తీక్. తన ప్రస్థానం ఇలా...

ఫైనల్ ఇన్నింగ్స్ జీవిత కాలం గుర్తుంటుంది. ఏడాదిగా జట్టుతో ఉంటున్నా. మేం చాలా శ్రమించాం. చివరకు టోర్నీని గెలిచాం. బౌలర్లు వేసే బంతులకు తగ్గట్లు నా స్టాన్స్ మార్చుకున్నా. దీనికి ప్రతిఫలం దక్కింది. ప్రేక్షకుల నుంచి మాకు అనూహ్య మద్దతు లభించింది. బ్యాటింగ్‌లో అది నాకు ఊపునిచ్చింది.

– దినేశ్ కార్తీక్



వ్యక్తిగత జీవితంలోనూ...

అదేంటో కాని... దినేశ్ కార్తీక్ క్రీడా కెరీర్‌లాగే వ్యక్తిగత జీవితంలోనూ ఒడిదొడుకులున్నాయి. 2007లో 22 ఏళ్ల వయసులోనే చిన్ననాటి స్నేహితురాలు నిఖితను పెళ్లి చేసుకుని ఆశ్చర్యపర్చిన అతడు 2012లో ఆమెతో విడిపోవాల్సి వచ్చింది. తర్వాత నిఖిత తమిళనాడుకే చెందిన భారత క్రికెటర్ మురళీ విజయ్‌ను వివాహమాడింది. అనంతరం కార్తీక్... భారత స్టార్ స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పల్లికల్‌ను 2015లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరిప్పుడు అన్యోన్యంగా ఉంటున్నారు.



సాక్షి క్రీడా విభాగం

'ఇప్పుడున్న పరిస్థితుల్లో ఐపీఎల్, ఇంగ్లండ్ సిరీస్ ఇలా ప్రతి టోర్నీ నాకు ముఖ్యమే. ఒక్కదాంట్లో విఫలమైనా జట్టుకు దూరమవుతా. ఒత్తిడిని ఎదుర్కొంటూ అత్యున్నత స్థాయిలో ఆడుతూ పోవడమే నేను చేయగలిగినది' నిదహస్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు దినేశ్ కార్తీక్ వ్యాఖ్యలివి. వీటిని బట్టి జట్టులో చోటుపై అతడెంతటి ఊగిసలాటలో ఉన్నాడో చెప్పొచ్చు. అవును మరి... ఒకటా, రెండా? టీమిండియా తరఫున కార్తీక్ అరంగేట్రం చేసి 14 సంవత్సరాలు కావొస్తోంది. అది జట్టు మంచి వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ కోసం చూస్తున్న సమయం. అప్పటికి మహేంద్ర సింగ్ ధోని కూడా వెలుగులోకి రాలేదు. అయితే... ప్రతిభ ఉన్నా, అదృష్టం తోడు లేక, పెద్దగా అవకాశాలూ రాక సగటు ఆటగాడిగానే మిగిలిపోయాడీ తమిళ తంబి. ఓవైపు క్రీడా జీవితంలో తీవ్ర పోటీని ఎదుర్కొంటుంటే, మరోవైపు వ్యక్తిగత జీవితంలోనూ ఆటుపోట్లు ఎదురయ్యాయి. కానీ అతడు పోరాటం కొనసాగించాడు. తోటివారైన మనోజ్ తివారీ, అంబటి రాయుడు, ఇర్ఫాన్ పఠాన్ జాతీయ జట్టులోకి వచ్చి వెళ్లిపోయినా కార్తీక్ మాత్రం ఆత్మ విశ్వాసం కోల్పోలేదు. 31 ఏళ్ల వయసులో గత రంజీ సీజన్‌లో భారీగా పరుగులు చేసి మరోసారి సెలెక్టర్ల పిలుపు అందుకున్నాడు. ఇప్పుడు మన మహామహ క్రికెటర్లకూ సాధ్యం కాని రీతిలో చివరి బంతికి సిక్స్ కొట్టి, కప్‌నూ సాధించిపెట్టి ఒక్క మ్యాచ్‌తో హీరోగా మారిపోయాడు. ఈ అత్యద్భుత ఇన్నింగ్స్ అతడి స్థాయిని ఎక్కడికో తీసుకెళ్లింది. అది ఇకనైనా జట్టులో చోటును స్థిరం చేస్తుందా?

> **దక్షిణాఫ్రికాపై 2006లో టీమిండియా ఆడిన తొలి టి20లో దినేశ్ కార్తీక్ జట్టు సభ్యుడు. ఈ మ్యాచ్‌తోనే టి20ల్లో అరంగేట్రం చేసిన ఇతడు 28 బంతుల్లో 31 పరుగులు చేసి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గానూ నిలిచాడు.**

ధోని కంటే ముందటివాడు...

ఏళ్లుగా టీమిండియాలోకి వస్తూ పోతూ ఉన్న దినేశ్ కెరీర్ ఆసాంతం పడుతూ లేస్తూనే సాగింది. ధోని కంటే ముందే, చిన్న వయసులో (18 ఏళ్ల)నే జట్టుకు ఎంపికైనా అతడికి ఏమీ కలిసిరాలేదు. ఫామ్ కంటే నిలకడగా అవకాశాలు రాకపోవడమే తనను ఎక్కువగా దెబ్బతీసింది. ఈలోగా ధోని దూసుకెళ్లిపోయాడు. మహి తర్వాత కీపింగ్ నైపుణ్యంతో టెస్టుల్లో వృద్ధిమాన్ సాహా, ఎడమచేతి వాటం బ్యాటింగ్ కారణంగా పార్థివ్ పటేల్ చోటు కొట్టేశారు. ఇక వన్డేలు, టి 20ల్లో ధోనికి తోడు రిషభ్ పంత్, సంజూ శామ్సన్ వంటి కుర్రాళ్లు. ఇలా ఎటుచూసినా పోటీనే. ఇలాంటి నేపథ్యంలో రాకరాక అవకాశం వచ్చినా కార్తీక్‌కు అది కత్తి మీద సాములాంటిదే. ఏ మాత్రం విఫలమైనా చోటు మళ్లీ గల్లంతే. అందుకే అతడు పైవిధంగా వ్యాఖ్యలు చేశాడు.

ఇప్పుడేం చేయాలి?

అటు పూర్తిస్థాయి కీపర్‌గా కాక, ఇటు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గానూ పరిగణించలేక ఇప్పటివరకు దినేశ్ కార్తీక్ కెరీర్ డోలాయమానంలో ఉండేది. కానీ... నిదహస్ ట్రోఫీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై మెరుపు ఇన్నింగ్స్‌లో అతడి చక్కటి క్రికెటింగ్ షాట్లు బ్యాట్స్‌మన్‌గా ఎంతటి పరిపూర్ణుడో చాటాయి. ఫైనల్లో దినేశ్ కొట్టిన కొన్ని షాట్లను తానూ ఆడాలనుకుంటున్నట్లు రోహిత్ శర్మ చెప్పడమే దీనికి నిదర్శనం. ప్రస్తుతానికి ప్రపంచకప్ జట్టులో ధోనికి స్టాండ్‌బై కీపర్‌గా ఇతడికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అనంతరం మహి రిటైరైనా దినేశ్ వైపే మొగ్గు ఉంటుందనడంలో సందేహం లేదు. ఈలోగా మరిన్ని అవకాశాలిస్తూ అతడిలో ఆత్మవిశ్వాసం పెంచాలి. అవసరమైతే స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా నాలుగో స్థానంలో ఆడించే ప్రయోగం చేయాలి. కార్తీక్ ఈ ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతాకు సారథ్యం వహించనున్నాడు. కెప్టెన్‌గానూ నిరూపించుకుని మరో మెట్టు ఎక్కడానికి అతడికిదో చాన్స్. ఇకపై తన క్రీడా ప్రయాణం సాఫీగా సాగాలని... ఫినిషర్‌గా భారత్‌కు మరిన్ని విజయాలు అందించాలని ఆశిద్దాం.

ఆ సిక్స్ నేను చూడలేదు...

13వ ఓవర్లో నేను అవుటయ్యాక తనను బ్యాటింగ్‌కు పంపనందుకు దినేశ్ కార్తీక్ నొచ్చుకున్నాడు. కానీ మ్యాచ్ తర్వాత చాలా సంతృప్తిగా కనిపించాడు. ఆత్మవిశ్వాసం నిండుగా ఉన్న, ఎప్పుడైనా, ఎక్కడైనా బ్యాటింగ్ చేయగల అతడి అవసరం చివర్లో చాలా ఉంటుందనే ఇలా చేశాం. మ్యాచ్‌ను నువ్వే ముగించాలని అతడికి చెప్పా. ఇలాంటి ఆటగాడి అవసరం జట్టుకు చాలా ఉంది. అయితే చివరి బంతికి దినేశ్ కార్తీక్ కొట్టిన సిక్స్ షాట్‌ను నేను చూడలేదు. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌లో తేలుతుందేమోనని భావించి ప్యాడ్‌లు కట్టుకునేందుకు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాను.

–రోహిత్‌శర్మ, భారత కెప్టెన్

అభిషేక్ నాయర్ అండతో...

ప్రతి ఆటగాడికి కొంతకాలం దుర్దశ ఉంటుంది. దినేశ్ కూడా ఆ దశను చవిచూశాడు. 2016 ఐపీఎల్ వేలంలో అతడి విలువ రూ.9 కోట్ల నుంచి రూ.2 కోట్లకు పడిపోయింది. రంజీల్లోనూ విఫలమయ్యాడు. ఈసారి విఫలమైతే ఇక అంతే అనే పరిస్థితుల్లో ఆటతీరు మెరుగుకు ముంబై వెళ్లిన అతడు అభిషేక్ నాయర్ ఇంట్లోని చిన్న గదిలో ఉండాల్సి వచ్చింది. కనీస వసతులు లేని ఆ గదిలో ఉండేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ప్రవీణ్ ఆమ్రే, అమిత్ పగ్నిస్, అపూర్వ దేశాయ్ వంటివారి వద్ద శిక్షణ పొందాడు. నాయర్ కూడా కొంత తోడ్పడ్డాడు. అక్కడ నేర్చుకున్న సాంకేతిక అంశాలతో దినేశ్ ఆట పూర్తిగా మారింది. తర్వాతి రంజీ సీజన్‌లో 14 ఇన్నింగ్స్‌ల్లో 50పైగా సగటుతో 704 పరుగులు చేశాడు. చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టుకు ఎంపికయ్యాడు. దాదాపు ఏడాదిన్నరగా స్థిరంగా జట్టులో కొనసాగుతున్నాడు.



'డెవిల్' పొట్రో...

- ఇండియన్ వెల్స్‌లో సంచలన ప్రదర్శన
- తొలి మాస్టర్స్ 1000 టైటిల్ సాధించిన అర్జెంటీనా స్టార్
- ఫైనల్లో ఫెడరర్ అనూహ్య పరాజయం
- 3 మ్యాచ్ పాయింట్లు చేజార్చుకున్న స్విస్ దిగ్గజం


డెల్‌పొట్రో

ఇది నిజంగా చాలా పెద్ద విజయం. ఫైనల్లో ఫెడరర్‌ను ఓడించి నేను ఈ టైటిల్‌ను గెలిచానంటే నమ్మలేకపోతున్నాను. నా ఎడమ చేతి మణికట్టుకు మూడో శస్త్రచికిత్స తర్వాత ఆటను మానేయాల్సిన స్థితిలో నిలిచిన నేను ఈ క్షణాన్ని అసలు ఊహించలేదు. పునరాగమనం కోసం నేను చాలా కష్టపడ్డాను. ప్రస్తుతం నేను చాలా అద్భుతంగా ఆడుతున్నాననేది వాస్తవం. ఇక ముందు కూడా ఇదే జోరు కొనసాగిస్తా.

- డెల్ పొట్రో

కాలిఫోర్నియా: ఈ ఏడాది వరుసగా 17 విజయాలతో ఊపు మీదున్న నంబర్‌వన్ రోజర్ ఫెడరర్‌కు షాక్. గతంలో ఐదు సార్లు ఇదే టైటిల్ సాధించి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఈ స్విస్ స్టార్‌కు ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లో ఊహించని పరాజయం. అర్జెంటీనా ఆటగాడు డెల్‌పొట్రో సంచలన ప్రదర్శన ముందు ఫెడెక్స్ తలవంచాల్సి వచ్చింది. ఫైనల్లో డెల్‌పొట్రో 2 గంటల 42 నిమిషాల్లో 6–4, 6–7 (8/10), 7–6 (7/2)తో ఫెడరర్‌ను ఓడించి తొలిసారి మాస్టర్స్–1000 స్థాయి టైటిల్‌ను గెలుచుకున్నాడు. మూడో సెట్‌లో 5–4తో ఆధిక్యంలో ఉండి తన సర్వీస్‌లో ఫెడరర్ 40–15తో విజయం అంచుల్లో నిలిచాడు. అయితే ఇదే గేమ్‌లో అతను మూడు సార్లు మ్యాచ్ పాయింట్లను కోల్పోవడం అనూహ్యం! ఫెడరర్ సర్వీస్ చేసిన పదో గేమ్‌లో డెల్‌పొట్రో బ్రేక్ సాధించడం... ఆ తర్వాత ఇద్దరు తమ సర్వీస్‌లు నిలబెట్టుకోవడంతో ఆట టైబ్రేక్‌కు చేరింది. ఈ దశలో చెలరేగిన డెల్‌పొట్రో మరో అవకాశం ఇవ్వలేదు. తాజా ప్రదర్శనతో డెల్‌పొట్రో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరుకున్నాడు. రెండేళ్ల పాటు గాయాలతో ఆటకు దూరమై ఒక దశలో 1,045 ర్యాంక్‌కు పడిపోయిన అతను 2016లో పునరాగమనం చేసి ఇటీవలే టాప్–10లోకి అడుగు పెట్టాడు. ఫెడరర్, డెల్‌పొట్రో మధ్య ఈ ఫైనల్‌కు ముందు 24 మ్యాచ్‌లు జరగ్గా... 18 సార్లు విజయం రోజర్‌నే వరించింది. విజేతగా నిలిచిన డెల్‌పొట్రోకు 13,40,860 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 8 కోట్ల 74 లక్షలు) దక్కగా... ఫెడరర్ ఖాతాలో 6,54,380 డాలర్లు (రూ. 4 కోట్ల 26 లక్షలు) చేరాయి.



4 ఫైనల్స్‌లో ఫెడరర్‌పై డెల్ పొట్రో సాధించిన విజయాల సంఖ్య. 2009 యూఎస్ ఓపెన్, 2012, 2013 బాసెల్ ఓపెన్ ఫైనల్స్‌లో ఫెడరర్‌ను ఓడించాడు.

ఫెడరర్

వారెవ్వా...ఒసాకా



ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన 20 ఏళ్ల జపాన్ క్రీడాకారిణి నయోమి ఒసాకా విజేతగా అవతరించింది. ఫైనల్లో ఒసాకా 6–3, 6–2తో 20వ సీడ్ దరియా కసత్‌కినా (రష్యా)ను ఓడించింది. తద్వారా సెరెనా విలియమ్స్ (అమెరికా–1999లో), కిమ్ క్లియ్‌స్టర్స్ (బెల్జియం–2005లో) తర్వాత అన్‌సీడెడ్ హోదాలో ఈ టోర్నీ టైటిల్ నెగ్గిన మూడో క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందింది. విజేతగా నిలిచిన ఒసాకాకు 13,40,860 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 8 కోట్ల 74 లక్షలు), రన్నరప్ కసత్‌కినాకు 6,54,380 డాలర్లు (రూ. 4 కోట్ల 26 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఆఫ్రిది ఔదార్యం!

పాక్ హాకీ దిగ్గజానికి ఆర్థికసాయం

మన్సూర్ అహ్మద్... పాకిస్తాన్ హాకీ సూపర్‌స్టార్స్‌లో ఒకడు. 14 ఏళ్ల కెరీర్‌లో గోల్‌కీపర్‌గా 338 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అతను పాక్‌కు ప్రాతినిధ్యం వహించాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన 1994 ప్రపంచ కప్ ఫైనల్లో చివరి పెనాల్టీని అద్భుతంగా ఆపి జట్టును చాంపియన్‌గా నిలపడంతో అతను జాతీయ హీరోగా మారిపోయాడు. ఆసియా క్రీడలు, చాంపియన్స్ ట్రోఫీల్లో పతకాలు, 1992 బార్సిలోనా ఒలింపిక్స్ కాంస్యం కూడా అతని ఖాతాలో ఉన్నాయి. అయితే ఇంత ఉజ్వలమైన కెరీర్ తర్వాత కూడా ఆర్థికపరంగా మన్సూర్ పరిస్థితి గొప్పగా లేదు. చాలా మంది క్రికెటేతర ఆటగాళ్లలాగే అతనూ ఓ మోస్తరు సంపాదనతోనే గడిపేశాడు. అయితే కొన్నాళ్ల నుంచి హృదయ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ మన్సూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అరుదైన ఈ వ్యాధి కోసం ఆస్పత్రి వర్గాలు రూ.15 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశాయి! సొంత డబ్బు ఇప్పటికే దాదాపుగా ఖర్చు పెట్టేయగా, పాక్ హాకీ సమాఖ్య కొంత సహకరించింది. అయితే ఇప్పుడు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా తయారైంది.



ఈ సమయంలో పాకిస్తాన్ క్రికెట్ స్టార్ షాహిద్ ఆఫ్రిది నేనున్నానంటూ ముందుకొచ్చాడు. తన స్వచ్ఛంద సంస్థ ద్వారా అతను మన్సూర్‌ను ఆదుకునేందుకు సిద్ధమయ్యాడు. 'మన్సూర్ లాంటి దిగ్గజాన్ని ఇలాంటి స్థితిలో చూస్తూ ఊరుకోలేం. ఆయన మంచి చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యే వరకు షాహిద్ ఆఫ్రిది ఫౌండేషన్ అన్ని ఖర్చులూ భరిస్తుంది' అని ఆఫ్రిది ప్రకటించాడు. సహజంగానే పాకిస్తాన్‌లో క్రీడాకారుల ఆదాయం అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్జనపరంగా పాక్‌లో నంబర్‌వన్ స్పోర్ట్స్‌మన్ అయిన ఆఫ్రిది మరో ఆటగాడికి సహకరించేందుకు ముందుకు రావడంపై అన్ని వైపుల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి.

రొనాల్డో 50వ హ్యాట్రిక్



మాడ్రిడ్: సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అరుదైన హ్యాట్రిక్‌ల రికార్డు సాధించాడు. ఆదివారం సాధించిన హ్యాట్రిక్ గోల్స్‌తో అతని హ్యాట్రిక్‌ల ఫిఫ్టీ పూర్తయింది. లా లీగా (స్పెయిన్) చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన ఈ పోరులో రియల్ మాడ్రిడ్ 6–3 గోల్స్‌తో గిరోనా క్లబ్‌పై ఘనవిజయం సాధించింది. రియల్ మాడ్రిడ్ సూపర్ స్టార్ ఏకంగా నాలుగు గోల్స్ చేసి జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. రొనాల్డో 50 హ్యాట్రిక్స్‌లో 41 సార్లు మూడేసి గోల్స్, ఏడు సార్లు నాలుగు గోల్స్, రెండు సార్లు ఐదు గోల్స్ ఉన్నాయి. కేవలం లా లీగాలోనే ఏకంగా 34 సార్లు హ్యాట్రిక్ సాధించిన అతను అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఐదు సార్లు పోర్చుగల్ తరపున ఈ ఫీట్ నమోదు చేశాడు. ఓవరాల్‌గా ఫుట్‌బాల్ చరిత్రలో అత్యధిక హ్యాట్రిక్‌లు చేసిన రికార్డు బ్రెజిల్ దిగ్గజం పీలే (92 హ్యాట్రిక్స్) పేరిట ఉంది.

బాలిక కడుపులో రెండు కిలోల తల వెంట్రుకలు

శస్త్రచికిత్స చేసి బయటకు తీసిన వేలూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు



ఆరోగ్యం గురించి చిన్నారిని అడిగి తెలుసుకుంటున్న వైద్యులు. (ఇన్‌సెట్‌లో) చిన్నారి కడుపులో నుంచి తీసిన వెంట్రుకలు

వేలూరు (తమిళనాడు): తమిళనాడులోని వేలూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఓ బాలికకు శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులో ఉన్న 2 కిలోల తల వెంట్రుకలను తొలగించారు. వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. వేలూరు జిల్లా ఆర్కాడు అన్నానగర్‌కు చెందిన అయ్యప్పన్ భవన నిర్మాణ కార్మికుడు. అతనికి భార్య అముద, కుమార్తెలు దివ్య, జనని(7) ఉన్నారు. జననికి చిన్న వయసు నుంచే వెంట్రుకలు తినే అలవాటుంది. ఇటీవల తీవ్ర కడుపునొప్పితో వాంతులు చేసుకుంటున్న బాలికను తల్లిదండ్రులు వేలూరు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి ఆమె పేగుల్లో తల వెంట్రుకలు ఉన్నట్లు గుర్తించారు. ఈనెల 6న చిన్నారికి శస్త్ర చికిత్స చేసి కడుపులో ఉన్న 2 కిలోల తల వెంట్రుకలను బయటకు తీశారు. ఆ బాలిక కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

చెన్నై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

టీ.నగర్ (చెన్నై): చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు కేసులో ఇద్దరు ఇంజనీర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, చెన్నై విమానాశ్రయంలో బాంబు ఉందని, అది కొద్ది సేపట్లో పేలుతుందని తెలిపాడు. పోలీసులు దీనిపై విమానాశ్రయ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో భద్రతా సిబ్బంది తనిఖీలు చేయగా బాంబు లభించలేదు. ఈ ఫోన్ కాల్‌కు సంబంధించి పల్లికరనై పిళ్లయార్‌కోయిల్ వీధికి చెందిన శక్తి శరవణన్, దీపానంద్‌గా పోలీసులు గుర్తించారు. దీంతో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

బీజేపీతో డీల్ కుదిరితే మళ్లీ హోదా వద్దంటాడు

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేత అంబటి ధ్వజం
- నాలుగేళ్లుగా ప్రత్యేక హోదాను సజీవంగా ఉంచింది వైఎస్ జగన్ మాత్రమే..
- హోదా వద్దన్న చంద్రబాబు మెడలు వంచాం



సత్తెనపల్లి: బీజేపీతో డీల్ కుదిరితే మరోమారు ప్రత్యేక హోదా అవసరం లేదని చెప్పే వ్యక్తిత్వం చంద్రబాబుదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ పోరాటానికి సంఘీభావంగా సోమవారం గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన ప్రజా సంకల్ప మానవహారంలో అంబటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా అనేక ఆందోళనలు, నిరసనలు, యువభేరిలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రత్యేక హోదాను సజీవంగా ఉంచింది ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. హోదా వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, అది సంజీవని కాదన్న చంద్రబాబు.. చివరకు వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానంతో యూ టర్న్ తీసుకున్నారన్నారు. ఒకప్పుడు ప్రత్యేక హోదా కోసం పోరాడితే జైలుకు పంపిస్తానన్న చంద్రబాబు.. ఇప్పుడు ప్రత్యేక హోదా లేకపోతే బతకలేమంటున్నారని ఎద్దేవా చేశారు. హోదా వద్దన్న చంద్రబాబు మెడలు వంచామని.. రాబోయే రోజుల్లో మోదీ మెడలు వంచేందుకు రాష్ట్ర ప్రజల సహకారం కావాలన్నారు. చంద్రబాబు వ్యవహారశైలి వల్లే.. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. పూటకో మాట, గంటకో అబద్ధం ఆడుతూ ఊసరవెల్లి రాజకీయాలు చేసే చంద్రబాబును నమ్మవద్దని కోరారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకున్న చంద్రబాబు ఇప్పుడు పిల్లిమొగ్గలు వేస్తున్నారని.. దేశ రాజకీయాల్లో చంద్రబాబును మించిన మోసగాడు మరొకరు లేరన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని.. భవిష్యత్‌లో చేపట్టే ఉద్యమాలకు సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు గుబ్బా చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరిమండ వరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 20-3-2018



ఎయిర్ ఇండియా తొలిసారిగా గత ఏడాది ఢిల్లీ నుంచి కాలిఫోర్నియాకు నడిపిన 'ఆల్ ఉమెన్ క్రూ' బోయింగ్ విమానంలోని మహిళా సిబ్బంది. (మెయిన్ ఫొటో). అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మహిళా దినోత్సవం సందర్భంగా ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, స్పైస్ జెట్.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 'ఆల్–ఉమెన్ క్రూ' విమానాలను నడిపాయి. ఒక్క ఎయిర్ ఇండియానే ఒకే రోజు అంతా మహిళా సిబ్బందే ఉన్న ఎనిమిది ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌ని ఆపరేట్ చేసింది!



రైట్ సిస్టర్స్



ఏరోప్లేన్‌ని కనుగొన్నది రైట్ బ్రదర్స్.
ఇప్పుడు ఎగరేస్తున్నది రైట్ సిస్టర్స్.
ఆడపిల్లలకు సహజంగానే రెక్కలు ఉంటాయి.
మగ ప్రపంచమే అసహజంగా
పంజరాల్లో ఉంచుతోంది.
ఏదో.. ఇలా ఒకసారి ఓ గొప్ప అద్భుతం
ఆవిష్కృతమైనప్పుడు..
ఆడపిల్ల మళ్లీ రెక్కలు తొడుగుతోంది.
ఇప్పటిదాకా ఆడపిల్లలకు రాంగే జరిగింది.
ఇప్పుడు రైట్ జరుగుతోంది.
వియ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యు.
మహిళా నువ్వు.. మహా 'ఇల'.

ఫిబ్రవరి 26, 2017. ఢిల్లీ. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్. ఎయిర్ ఇండియా బోయింగ్ 777–200 ఎల్.ఆర్. ఎయిర్‌క్రాఫ్ట్‌కు చెందిన 16 మంది మహిళా సిబ్బందితో కూడిన బృందం డిస్పాచ్ యూనిట్‌లో కూర్చుని ఉన్నారు. కొద్ది క్షణాల్లో చరిత్ర సృష్టించబోతున్నారు. అందరిలో ఉద్విగ్నత, ఆనందం. ఆ భావాలే వాళ్ల సంభాషణల్లో, బాడీ లాంగ్వేజ్‌లోనూ! బోర్డింగ్ స్టార్ట్ అయింది. పదహారు మందీ ఒకొక్కరే ఠీవిగా నడుచుకుంటూ వెళ్తున్నారు ఫ్లయిట్‌లోకి. ప్రయాణికులందరూ బోర్డ్ అయ్యారు. సీట్ బెల్ట్ గురించి, ఇతరత్రా జాగ్రత్తలూ చెప్పడం పూర్తయింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి ఆ ఫ్లయిట్ కెప్టెన్ సునీతా నరూలా టేకాఫ్ కోసం ఇన్‌స్ట్రక్షన్స్ మొదలయ్యాయి ''సర్'' అంటూ!

నో 'సర్స్'.. ఓన్లీ లేడీస్

సునీతా నరూలా సహా కాక్‌పిట్‌లో ఉన్న కోపైలట్స్ నవ్వుకున్నారు ఆ పిలుపుకి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కూడా నవ్వారు అలవాటులో పొరపాటుకి. ''డజంట్ మ్యాటర్'' అంటూ రన్‌వే మీద పరుగులు తీసి, క్షణాల్లో టేకాఫ్ అయింది ఆ ఫ్లయిట్.

టేకాఫ్ అయ్యాక... ''అటెన్షన్ లేడీస్ అండ్ జెంటిల్‌మెన్'' అంటూ ఎనౌన్స్ వినపడటంతో ఒక్కసారిగా ప్రయాణికుల్లో గుబులు! ఏమన్నా అపశకునమా? వాళ్లు ఆ అనుమానంలో ఉండగానే.. ''ఈ ఫ్లయిట్ ఆల్ ఫిమేల్ క్ర్యూతో నడుస్తోంది. పదహారు మంది సిబ్బందీ మహిళలే. ఈ వార్తను సంతోషంగా మీతో పంచుకుంటున్నా...' అనే మాట ఇంకా పూర్తి కానేలేదు.. ఊపిరి పీల్చుకున్న ప్రయాణికుల నుంచి చప్పట్లు. 'కుడోస్' అంటూ ఆ ఫ్లయిట్‌లో ఉన్న 250 మంది థంబ్స్ అప్ చేశారు. తమ మధ్య కూర్చున్న లేడీ ప్యాసెంజర్స్‌నూ ప్రశంసించారు ఆడవాళ్లూ మీకు జోహార్లూ అంటూ!

ఫాస్ట్‌గా.. నాన్-స్టాప్‌గా..

గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో 15 వేల 300 కిలోమీటర్లు.. 13 టైమ్ జోన్స్‌ను దాటుతూ పదిహేను గంటల పదినిమిషాలు గాల్లో ఎగిరి.. గమ్యస్థానం అయిన అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ల్యాండ్ అయింది విమానం. సీట్ బెల్ట్ తీసేసి అందరూ ఒక్కసారిగా.. ''హుర్రే''అంటూ జయజయధ్వానాలు చేశారు. ఆ తర్వాత అనౌన్స్‌మెంట్‌లో వినిపించింది. ప్రపంచంలోనే అత్యంత దూరం ప్రయాణించిన నాన్‌స్టాప్ ఫ్లయిట్ అని. ఇది రికార్డ్.

రైట్ బ్రదర్స్ విమానాన్ని కనిపెట్టిన తర్వాత ఫ్లయిట్ వింగ్స్‌ను కంట్రోల్ చేస్తోంది పురుషాధిపత్యమే. కమర్షియల్ పైలట్స్‌గా మహిళలు ఉన్నా.. ఫ్లయిట్ మొత్తం మహిళా బృంద నిర్వహణలో టేకాఫ్ తీసుకోవడం ఇదే తొలిసారి కావచ్చు. పైగా ఇంత దూరం ప్రయాణం. శాన్‌ఫ్రాన్సిస్కోలో విమానంలోంచి ప్రయాణికులు దిగుతున్నప్పుడు ఆ కెప్టెను, కో పైలట్స్‌ను చూడాలని తాపత్రయపడ్డున్నారు. తోసుకుంటున్నారు... ప్రయాణికులు.



ఫస్ట్ : దర్బా బెనర్జీ

ఎయిర్ ఇండియా

ఎయిర్ ఇండియా సంస్థ 1956లో తొలిసారిగా మహిళా పైలట్‌ను నియమించింది. ఆమె పేరు దర్బా బెనర్జీ. 1990లో 26 ఏళ్ల నివేదితా భాసిన్ అనే పైలట్ జెట్ ఎయిర్ క్రాఫ్ట్‌ను నడిపి సివిల్ ఏవియేషన్ హిస్టరీలోనే అత్యంత పిన్నవయసు పైలట్‌గా పేరు నమోదు చేసుకుంది.



యంగెస్ట్: నివేదితా భాసిన్

ప్యాసెంజర్స్ సెల్యూట్ కొట్టారు

ఒక తల్లి.. తన పదకొండేళ్ల కూతురికి క్షమతాను చూపిస్తూ.. ''పెద్దయ్యాక నువ్వు ఆమెలా కావాలి'' అంటూ స్ఫూర్తి నింపుతోంది. అది చూసిన క్యాబిన్ క్ర్యూ రోమాంచితమైంది. ఈ తరానికి తాము రోల్‌మోడల్స్! ఇంతకు మించిన ఆనందం ఏముంటుంది? గుండెనిండుగా ఆత్మసంతృప్తిని నింపుకొని.. ఆత్మవిశ్వాసం నడిపిస్తుంటే అదే ఠీవితో పదహారు మంది కదులుతుంటే.. ప్యాజెంజర్స్ సెల్యూట్ చేశారు. ఇది విజయం! స్త్రీ శక్తి గెలుపు. అదే ప్రేరణ, అదే పదహారు మంది సిబ్బందితో ఆ ఫ్లయిట్ ఢిల్లీకి కూడా తిరుగు ప్రయాణం చేసింది! ఢిల్లీలో ల్యాండ్ అయ్యాక కూడా సేమ్ ఫీలింగ్. ఆ స్ఫూర్తి ఎంతో మంది ఆడపిల్లలకు రెక్కలు తొడిగింది. కొత్త లక్ష్యాలను ఏర్పర్చింది.

శక్తికి సారథులు.. వారధులు

స్టీరియో టైప్‌ను బ్రేక్ చేసి, కొత్త శక్తికి సారథ్యం వహించినవాళ్లు.. కెప్టెన్ సునీతా నరూలా, క్షమతా బాజ్‌పేయి, కెప్టెన్ ఇందిరా సింగ్, కెప్టెన్ గుంజన్ అగ్రవాల్. పైలట్‌గా వీళ్లందరిదీ 20 నుంచి 30 ఏళ్ల అనుభవం. కాక్‌పిట్ క్ర్యూ, క్యాబిన్ క్ర్యూ, చెక్ ఇన్ స్టాఫ్, డాక్టర్, కస్టమర్ కేర్ స్టాఫ్, ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) సహా టెక్నీషియన్స్, ఇంజనీర్స్, ఫ్లయిట్ డిస్పాచర్, ట్రిమ్మర్ సహా అందరు మహిళలే ఆ రోజు సేవలందించారు. ఇది రికార్డ్. అంతేకాదు లైన్ ఆపరేషన్ ఆడిట్ సేఫ్టీని నిర్వహించింది కూడా మహిళే. హర్‌ప్రీత్ సింగ్. వరల్డ్ ట్రిప్‌కి ఓ మహిళా ఆఫీసర్ ఆడిట్ నిర్వహించడం అదే తొలిసారి. మహిళా దినోత్సవానికి తమ సంస్థ తరఫున కానుకగా ఎయిర్ ఇండియా సంస్థ ఆ నిర్ణయాన్ని తీసుకొని అమలు చేసిందట. ''అలాగని ఈ రంగంలో వివక్ష లేదని చెప్పలేం. అధిగమించడం వాళ్ల వాళ్ల శక్తిసామర్థ్యాలను బట్టి ఉంటుంది. నేను 1980ల్లో ఈ ఫీల్డ్‌లోకి వచ్చాను. నా వయసప్పుడు 20లో ఉంది. అప్పుడున్న మగ పైలట్లందరూ 40 పైబడ్డవాళ్లే. నన్ను భయపెట్టేవాళ్లు. అయితే తర్వాత కొద్ది రోజులకే నా ఎబిలిటీస్‌తో వాటన్నిటినీ అధిగమించాననుకోండి'' అంటూ నాటి రోజులను గుర్తు చేసుకుంటుంది సునీతా నరూలా.

– శరాది

నేడు స్పారో డే

పిచ్చుకేదీ! పెంకుటిల్లేదీ!

ఈ జనరేషన్ పిల్లలు కొన్నింటిని చూడ్డం అదృష్టం. వాటిల్లో పిచ్చుకను చూడ్డం ఒక అదృష్టం. పిచ్చుకలు పూర్తిగా అదృశ్యం అయిపోలేదు. ఇంకా అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. అయితే, వాటిని ఆగి చూసే అదృష్టమే మనకు ఉండడం లేదు. నేడు అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం. పిచ్చుకలను చూడలేకపోయినా, పిచ్చుకల గురించి మాట్లాడుకోడానికి ఒక సందర్భం. ఐదే ఐదు విషయాలు చెప్పుకుని ఎవరి పనుల్లోకి వాళ్లం ఎగిరిపోదాం!





పిచ్చుకలు అడవిలోనైతే
నాలుగైదేళ్లు బతుకుతాయి.
సిటీల్లోనైతే.. చెప్పలేం! ఎవరి
గింజల్ని వాళ్లు వెతుక్కోడానికి
పరుగులు తీస్తున్న నగరాల్లో..
పిచ్చుకల కోసం ఇంటి ముందు
కంకులు వేలాడదీసేవాళ్లెవరు?
మట్టి పాత్రలో వాటికి నీళ్లు
పెట్టేవాళ్లెవరు? పెంకుటిళ్ల లాగే
పిచ్చుకల ఆయుషూ
తీరిపోతోంది!

01. పిచ్చుకల ఈకలపై ఉండే రంగులను బట్టి అవి ఆడో మగో చెప్పేస్తారు రైతులు. వీపు మీద గోధుమ రంగు ఈకలుంటే అవి ఆడవి. ఎరుపు రంగు ఈకలు ఉంటే అవి మగవి. గోధుమ అంటే పూర్తి గోధుమ, ఎరుపంటే పూర్తి ఎరుపు కాదు. నలుపు చారలు కూడా మిక్స్ అయి ఉంటాయి. మీ దగ్గర్లో రైతు ఎవరైనా ఉంటే ఆయన్ని అడగండి. మరికొన్ని కొండ గుర్తులు చెప్తారు. రైతుని గుర్తుపట్టడం ఎలా అని మాత్రం అడక్కండి.. ప్లీజ్.

02. చాలా పక్షుల్లాగే పిచ్చుకలు కూడా గుంపు జీవులు. ఒంటరిగా ఉండవు. ఒకవేళ ఏ పిచ్చుకైనా ఒంటరిగా కనిపించిందంటే.. అది దారి తప్పి వచ్చిందనే. మీ దగ్గర గుబురుగా ఉండే చెట్టు ఉంటే, సాయంత్రం చీకటి పడుతుండగా గమనించండి. మీ చుట్టుపక్కల ఉండే పిచ్చుకలన్నీ ఆ గుబుర్లలో చేరి కిచకిచమని ఆవేళ్టి కబుర్లు చెప్పుకుంటూ కనిపిస్తాయి.

03. పిచ్చుకలు నీటి జీవులు కాదు. అయితే నీటిలో వేగంగా ఈదగలవు. ఏదైనా ప్రమాదం రాబోతోందని పసిగట్టగానే వేరే దారి లేనప్పుడు అవి నీటి దారిలోనైనా ఎస్కేప్ అవుతాయి.

04. పిచ్చుకలు సాధారణంగా 'ఇది నా అడ్డా' అని గిరి గీసుకుని ఉండవు. అయితే తమ గూడును కాపాడుకోడానికి మాత్రం చేతులు మడిచి ఫైటింగ్‌కి వస్తాయి.

05. గూళ్లను కట్టే బాధ్యత మగ పిచ్చుకలదే. అలా కడుతున్నప్పుడు.. అవి ఆడ పిచ్చుకలను ఆకర్షించడానికి ఓ లుక్ ఇస్తాయి.. 'చూశావా, ఎలా కడుతున్నానో' అని!!

చెట్టు నీడ

ఖాళీ చేసుకోవడం ముందు తెలిస్తే...

పంతొమ్మిదవ శతాబ్దంలో జపాన్‌లో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఆయన పేరు నాన్ ఇన్. జెన్ అంటే ధ్యానం ద్వారా సత్యాన్ని దర్శించే ఒక మార్గం. ఒకరోజు ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడు జెన్ గురించి తెలుసుకోవడానికి నాన్ ఇన్ దగ్గరికి వచ్చాడు. ఆ ఆచార్యుడి దృక్పథమూ, ఆలోచనలూ నాన్ ఇన్‌కు తెలుసు. అయినా అతిథిని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు. ఇద్దరూ టీ తాగడం కోసం ఆసీనులయ్యారు. వారి మధ్యలో టీ పాత్ర, కప్పులు ఉన్నాయి. నాన్ ఇన్ అతిథి కప్పులోకి టీ వంపసాగాడు. కప్పు నిండిపోయింది. అయినా అలాగే పోస్తున్నాడు. టీ కప్పు అంచులు దాటి బయటికి రావడం మొదలైంది. అయినా అలాగే పోస్తున్నాడు.

> ఇద్దరూ టీ తాగడం కోసం ఆసీనులయ్యారు.
> వారి మధ్యలో టీ పాత్ర, కప్పులు ఉన్నాయి.
> నాన్ ఇన్ అతిథి కప్పులోకి టీ వంపసాగాడు.
> కప్పు నిండిపోయింది.

ఇక దీన్ని చూడలేక ఆ ఆచార్యుడు, 'మాస్టర్, టీ కప్పు నిండిపోయింది. ఇంక అందులో మీరు ఏమీ నింపలేరు' అన్నాడు.

అప్పుడు నవ్వి, టీ పాత్రను పక్కకు పెడుతూ చెప్పాడు గురువు: 'మీరు కూడా ఈ కప్పులాగానే మీవైన అభిప్రాయాలూ భావనలతో పూర్తిగా మీ మెదడును నింపుకునివున్నారు. మరింక నేను మీకు జెన్ గురించి ఏం చెప్పగలను? ఏం చెప్పినా అది మీ లోపలికి మాత్రం ఎలా వెళ్లగలుగుతుంది?'

ఆ ఆచార్యుడికి ఒక వెలుగు ఏదో గోచరించింది. తన మెదడు అనే కప్పును ఖాళీ చేసుకోకుండా జెన్ సాక్షాత్కరించదని అర్థమైంది.




న్యూస్

స్వల్ప వ్యాయామంతో సుఖ ప్రసవం నిజమే!

సాధారణ స్థితిలో ఉన్నప్పుడు వ్యాయామం చేయడంపై ఎవరికీ ఎలాంటి అనుమానాలూ ఉండవు గాని, గర్భంతో ఉన్నప్పుడు వ్యాయామం చేయవచ్చా, లేదా అనే సందేహాలు చాలామందికి ఉంటాయి. అయితే గర్భిణులుగా ఉన్నప్పుడు కూడా మహిళలు నిరభ్యంతరంగా తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చని, వ్యాయామం చేయకుండా ఉండటం కంటే వ్యాయామం చేస్తూ ఉంటేనే వారికి మంచిదని మాడ్రిడ్ టెక్నికల్ యూనివర్సిటీ నిపుణులు ఒక తాజా అధ్యయనంలో తేల్చారు. దాదాపు 500 మందికి పైగా గర్భిణులపై అధ్యయనం జరిపి ఈ విషయాన్ని నిర్ధారించారు. గర్భిణులుగా ఉన్నప్పుడు క్రమం తప్పకుండా వ్యాయామం చేసినట్లయితే, ప్రసవ సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని వారు చెబుతున్నారు. గర్భిణులుగా ఉన్నప్పుడు వ్యాయామం చేస్తూ ఉన్నట్లయితే, ప్రసవ సమయంలో నొప్పుల తీవ్రత చాలా వరకు తక్కువగా ఉంటుందని, సుఖప్రసవం జరుగుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ రూబెన్ బరాకత్ చెబుతున్నారు.

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా...! నేను మీకు రాయడం రెండో సారి. అప్పుడు మా ప్రేమను ఇంట్లో ఒప్పుకోవడం లేదంటే ముందు జాబ్ వచ్చాక ఇంట్లో ఒప్పించు అన్నారు. ఇప్పుడు నాకు గవర్నమెంట్ జాబ్ వచ్చింది. అయినా ఒప్పుకోవడం లేదు. కులాలు వేరుకావడంతో మా నాన్న ఆ అమ్మాయిని చేసుకుంటే చచ్చి పోతా అంటున్నారు. అమ్మాయి నన్ను విడిచి ఉండలేదు. తను లేకుండా నేనూ బతకలేను. ఇద్దరం విడిపోయి మాత్రం ఉండలేం. వీళ్లని కాదని వెళ్లి కలిసి బతకాలా? లేక ఇద్దరం కలిసి చావాలా అర్థం కావడం లేదు. అన్నయ్యా ఏం చెయ్యను?

- తేజ

ప్రేమ ఊపిరి అయినప్పుడు...
చావు ఆలోచన ఎలా వస్తుందన్నా???
ప్రేమ కోసం జీవించాలి.
జీవితాన్ని ప్రేమించాలి.
దూరంగా ఉన్న...
ఎంత దూరంగా ఉన్నా...
నేనున్నానన్న భరోసాతో బతికించాలి.
చావు అంటావేంటి అన్నా..?
ప్రతి పిరికివాడు...
ప్రతి ఓడిపోయిన వాడు...
ప్రతి అసమర్థుడు....
ప్రతి అప్రేమికుడూ....
'అప్రేమికుడు అంటే ఏంటి సార్???'
ప్రేమించానని చెప్పి ప్రేమకు, ప్రియురాలికి వ్యాల్యూ ఇవ్వనివాడు – అప్రేమికుడు.
తేజ అలాంటి వాడు కాదు.
'అవును సార్ సిన్సియర్ లవర్ సార్...
అమ్మాయి కోసం బతుకుతాడు...
అమ్మాయిని బతికించుకుంటాడు...
ప్రేమనూ బతికించుకుంటాడు సార్...'
అవును తేజ, కొంచెం టైమ్ ఇవ్వు. పెద్దలు అర్థం చేసుకుంటారు... బ్లెస్ యు!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com


ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి: మెల్లగా తెల్లారిందో ఎలా వెలుతురే తెచ్చేసిందో ఇలా
బోసి నవ్వులతో మెరిసే పసిపాపల్లా
చేదతో బావులలో గలగల చెరువులో బాతుల ఈతల కళ
చేదుగా ఉన్న వేపను నమిలే వేళ
చుట్ట పొగ మంచుల్లో చుట్టాల పిలుపుల్లో బాటలే కలిపేస్తూ
మనసారా మమతల్ని పండించి అందించు హృదయంలా
చలిమంటలు ఆరేలా గుడి గంటలు మోగేలా
సుప్రభాతాలే వినవేలా
గువ్వలు వచ్చే వేళ నవ్వులు తెచ్చే వేళ
స్వాగతాలవిగో కనవేలా
చరణం-1 పొలమారే పొలమంతా ఎన్నాళ్లో నువ తలచి
కళమారే ఊరంతా ఎన్నేళ్లో నువు విడచి
మొదట అందని దేవుడి గంట
మొదటి బహుమతి పొందిన పాట
తాయిలాలకు తహతహలాడిన పసితనమే గుర్తొస్తోందా
ఇంతకన్నా తియ్యనైన జ్ఞాపకాలే
దాచగల బుజువులు ఎన్నో ఈ నిలయాన
నువ్వూగిన ఉయ్యాల ఒంటరిగా ఊగాలా
నువ్వెదిగిన ఎత్తే కనపడక
నువ్వాడిన దొంగాట బెంగల్లే మిగలాలా
నన్నెవరూ వెతికే వీల్లేక
చరణం-2 కన్నులకే తియ్యదనం రుచి చూపే చిత్రాలే
సవ్వడితో సంగీతం పలికించే సెలయేళ్లే
పూల చెట్టుకి ఉందో భాష అలల మెట్టుకి ఉందో భాష
అర్థమవ్వని వాళ్లే లేరే అందం మాటాడే భాష
పలకరింపే పులకరింపై పిలుపునిస్తే
పరవశించడమే మనసుకి తెలిసిన భాష
మమతలు పంచే ఊరు ఏమిటి దానికి పేరు
పల్లెటూరేగా ఇంకెవరు
ప్రేమలు పుట్టిన ఊరు అనురాగానికి పేరు
కాదనేవారే లేరెవరూ

చిత్రం: శతమానం భవతి; సంగీతం: మిక్కీ జె మేయర్;
రచన: శ్రీమణి; గానం: అనురాగ్ కులకర్ణి, రమ్య బెహరా, మోహన భోగరాజు


నాగార్జున


నాని


రష్మికా మండన్నా

డీ బ్రదర్స్ - జోడీ కుదుర్స్

ఒకరు డాన్, మరొకరు డాక్టర్. బ్రదర్స్ లాంటి రిలేషన్‌షిప్. కానీ బ్రదర్స్ కాదు. ఒకరికేమో జోడీ కుదిరింది. మరొకరు తన జోడీని వెతుక్కునే పనిలో ఉన్నారు. ఇంతకీ ఎవరీ డీ బ్రదర్స్, ఎవరు వాళ్ల జోడీ అంటే?.. నాగార్జున, నానీ హీరోలుగా వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఓ మల్టీస్టారర్ సినిమా నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. రెగ్యులర్ షూటింగ్ ఉగాది రోజున స్టార్ట్ అయింది. ఈ సినిమాలో నాగార్జున డాన్‌గా, నానీ డాక్టర్‌గా కనిపిస్తారని సమాచారం. ఇందులో నానీకి జోడీగా 'ఛలో' ఫేమ్ రష్మికా మండన్నాను ఫిక్స్ చేశారు. నాగార్జునకు జోడీగా ఇలియానా పేరును పరిశీలిస్తున్నారట చిత్రబృందం. అమలా పాల్ పేరు కూడా వినిపిస్తోంది. ఈ ఇద్దరూ కాకుండా వేరే కథానాయిక సీన్లోకొస్తుందా? ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు ఫైనలైజ్ అవుతారా? తెలియాలంటే జస్ట్ వారం పది రోజులు ఆగితే చాలు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో మ్యూజిక్‌కి చాలా స్కోప్ ఉంటుందని చిత్రబృందం తెలిపింది.

ఫారిన్‌లో డ్యూయెట్


అల్లు అర్జున్

ఇప్పటివరకూ బార్డర్‌లో దేశం కోసం పోరాడిన సూర్య ఇప్పుడు విదేశాల్లో కొంచెం విశ్రాంతి తీసుకోనున్నారు. విశ్రాంతి ఏంటి అనుకుంటున్నారా? ఇన్ని రోజులు యాక్షన్ సీక్వెన్స్‌లో పాల్గొన్న సూర్య ఇప్పుడు తన ప్రేయసితో డ్యూయెట్ పాడుకోవటం కోసం ఫారిన్ వెళ్లారట. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. సోల్జర్ సూర్య పాత్రలో అల్లు అర్జున్ కనిపించనున్నారు. అల్లు అర్జున్, అనూ ఇమ్మాన్యుయేల్‌పై ఒక రొమాంటిక్ సాంగ్‌ను ఫారిన్‌లో బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో షూట్ చేయనున్నారట చిత్రబృందం. మార్చి 21 నుంచి ఈ సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ కూడా ఉందట. ఆ పాటకు బాలీవుడ్ భామ ఎలీ అవరమ్ డ్యాన్స్ చేయనున్నారు. ఈ సాంగ్ గురించి ఎలీ మాట్లాడుతూ – ''ఇది ఐటమ్ సాంగ్ కాదు. అద్భుతమైన లిరిక్స్, మెసేజ్ ఉండే స్పెషల్ సాంగ్. అల్లు అర్జున్ డ్యాన్స్‌కు నేను పెద్ద ఫ్యాన్. అయితే ఈ పాటలో అల్లు అర్జున్ ఎక్కువ డ్యాన్స్ చేయరు'' అని పేర్కొన్నారామె. కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా శ్రీధర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'బన్నీ' వాసు సహనిర్మాత. మే 4న ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

చిరస్థాయిగా మహానటి


'మహానటి' పోస్టర్

అలనాటి అందాలతార, అభినయ రాణి సావిత్రి జీవితం ఆధారంగా తమిళ్, తెలుగు భాషల్లో రూపొందుతున్న చిత్రం 'మహానటి'. తమిళ్‌లో 'నడిగర్ తిలకం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కీర్తీ సురేశ్ టైటిల్ రోల్‌లో, సమంత, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ ముఖ్య తారలుగా నాగ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోంది. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, భానుప్రియ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏఎన్నార్ పాత్రలో నాగచైతన్య కనిపించనున్నారు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ పతాకాలపై ప్రియాంకా దత్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. మరోవైపు పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్స్ కూడా స్టార్ట్ చేశారు. మే 9న 'మహానటి' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఉగాది సందర్భంగా చిత్రబృందం అధికారికంగా తెలియజేసింది. దాదాపు 27 ఏళ్ల కిత్రం వైజయంతీ మూవీస్ సంస్థ నుంచి 1990 మే 9న చిరంజీవి, శ్రీదేవి నటించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా విడుదలై సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తేదీన 'మహానటి' చిత్రం విడుదల కానుండటం విశేషం. ''మహానటి సావిత్రి కథని వెండితెరపై దర్శకుడు ఆవిష్కరించిన తీరు తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

శ్రీదేవి ప్లేస్‌లో మాధురి


శ్రీదేవి
మాధురీ దీక్షిత్

శ్రీదేవి అతిలోక సుందరి. అందంలో కానీ అభినయంలో కానీ పోటీ అనే ప్రసక్తి లేకుండా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీని రూల్ చేశారు. ఇటీవల దుబాయ్‌లో ఆమె దురదృష్టవశాత్తూ బాత్ టబ్‌లో పడి మరణించిన విషయం తెలిసిందే. ఇది జరగకముందే '2 స్టేట్స్' ఫేమ్ అభిషేక్ వర్మ దర్శకత్వంలో 'షిద్దత్' అనే సినిమాలో నటించటానికి అంగీకరించారట శ్రీదేవి. ఆమె హఠాన్మరణంతో ఆ ప్లేస్‌లో వేరే తారను తీసుకునే పనిలో పడింది చిత్రబృందం. పలువురు కథానాయికలను సంప్రదించారని సమాచారమ్. ఫైనల్లీ మాధురీ దీక్షిత్ 'యస్' చెప్పారు. ఈ విషయాన్ని శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ స్వయంగా వెల్లడించారు. తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ''అభిషేక్ వర్మ రూపొందించబోయే తదుపరి సినిమా మమ్మీ హృదయానికి చాలా దగ్గరైనది. ఈ సినిమాలో నటించడానికి ఒప్పుకున్నందుకు నేను, ఖుషీ, డాడీ మాధురీజీకి చాలా థాంక్‌ఫుల్‌గా ఉంటాం'' అని పేర్కొన్నారామె. కరణ్ జోహార్ నిర్మించనున్న ఈ సినిమాలో వరుణ్ ధావన్, ఆలియా భట్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ ఇయర్ సెకండ్ హాఫ్‌లో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

ఆ మాట అనిపించుకోకూడదు

''**చ**దువు సరిగ్గా రాని కుర్రాడి జీవితంలో చదువు పూర్తయినప్పటి నుంచి సెటిలయ్యే వరకు ఏం జరిగిందన్నదే 'నీది నాది ఒకే కథ'. వేణుగారు ఫుల్ క్లారిటీతో మంచి సినిమా తీశారు'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీవిష్ణు, సాట్నా టైటస్ జంటగా వేణు ఊడుగుల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నా క్యారెక్టర్‌ని చూసి, చాలామంది కుర్రాళ్లు వాళ్లను వాళ్లు చూసుకుంటున్నట్లుగా భావిస్తారు. జీవితంలో కీలక సమయాల్లో సొసైటీ గురించి ఆలోచిస్తాం. కానీ, సొసైటీ మనకేమీ చేయదు. అందుకే.. అన్ని సందర్భాల్లో సమాజం గురించి ఆలోచించి, మన ఇష్టాయిష్టాలను చంపేసుకోవాల్సిన అవసరం లేదని మా చిత్రంలో చెబుతున్నాం. దర్శకులు దేవి ప్రసాద్‌గారు నా తండ్రి పాత్రలో అద్భుతంగా నటించారు. ఆయన పాత్రతో పెద్దవాళ్లు కనెక్ట్ అవుతారు. ఆయన ఓ డైరెక్టర్‌లా కాకుండా మాతో ఓ నటుడిలా కలిసిపోయారు. ఆయన పాత్ర చూసి థ్రిల్ అవుతారు. మాస్ హీరో అయిపోవాలనే ఆలోచనతో ఇలాంటి పాత్రలు ఎంచుకోవడం లేదు. కథ నచ్చే ఒప్పుకుంటున్నా. అయినా.. మాస్ హీరో అవ్వడం చాలా కష్టం. ఈ చిత్రంలో డోగ్మే 95 టెక్నిక్ వాడారు. అది 1995 టెక్నిక్. తక్కువ బడ్జెట్‌లో సినిమా తీయడం ఎలా అనేది అందులో మెయిన్. ట్రాలీలు, జిమ్మీలు, సెట్‌లు వంటివి లేకుండా చాలా తక్కువలో సినిమా చేశాం. ఆ టెక్నిక్ వాడి తెలుగులో తీసిన మొదటి సినిమా మాదే. ఒకే తరహా సినిమాలు, పాత్రలు చేస్తే 'వీడు ఒకే టైప్ క్యారెక్టర్స్ చేస్తున్నాడ్రా' అంటారు. ఆ మాట అనిపించుకోకూడదన్నదే నా ప్రయత్నం. అందుకే డిఫరెంట్ మూవీస్ సెలెక్ట్ చేసుకుంటున్నా. నాకు వెంకటేష్‌గారంటే చాలా ఇష్టం. ప్రస్తుతం 'వీరభోగ వసంతరాయలు' సినిమా చేస్తున్నాను. తర్వాత 'అసుర' దర్శకుడితో 'తిప్పరా మీసం' చేస్తా. ఆ తర్వాత కొత్త డైరెక్టర్‌తో ఓ పోలీస్ స్టోరీ చేయనున్నా'' అన్నారు.


శ్రీవిష్ణు

సమంత మెచ్చుకున్నారు


మనాలి రాథోడ్, ఆనంద్, చిరుతేజ్

మనాలి రాథోడ్, సౌమ్య వేణుగోపాల్, చిరుతేజ్ సింగ్ ముఖ్య తారలుగా ఆనంద్‌కుమార్ దర్శకత్వంలో ఎన్.ఎస్. నాయక్ నిర్మించిన బాలల చిత్రం 'చిరుతేజ్ సింగ్'. బాలమేధావి చిరుతేజ్ సింగ్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ''కేవలం మూడు నిమిషాల్లో 236 ప్రపంచ పటాలను గుర్తించి, బాలమేధావి చిరుతేజ్ సింగ్ రికార్డ్ సృష్టించాడు. అనాథ పిల్లలకోసం ఓ ప్రముఖ స్టూడియోలో ప్రివ్యూ వేసినప్పుడు ప్రముఖ హీరోయిన్ సమంత ఈ సినిమాను చూసి అభినందించారు. దర్శకుడు వీరశంకర్, నిర్మాత రాజ్ కందుకూరి, దర్శకులు 'మధుర' శ్రీధర్‌లతో పాటు మరికొందరు సినీ ప్రముఖులు కూడా చిత్రాన్ని మెచ్చుకున్నారు. చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు నచ్చుతుందన్న నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. రాజశేఖర్, ఎన్.ఎస్. నాయక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గీతా పూనిక్.

సీనియర్ ఎడిటర్ అనిల్ మల్నాడ్ ఇకలేరు


అనిల్ మల్నాడ్

ప్రఖ్యాత ఎడిటర్ అనిల్ మల్నాడ్ (66) ఇకలేరు. కర్నాటకలోని మల్నాడులో పుట్టిన అనిల్ అసలు పేరు జీఆర్ దత్తాత్రేయ. సినిమాటోగ్రఫీ కోర్స్‌లో చేరాలనే ఆశయంతో 17వ ఏట మద్రాసులో అడుగుపెట్టారు దత్తాత్రేయ. సీటు దొరక్కపోవడంతో దర్శకత్వ శాఖలో చేరారు. ప్రముఖ దర్శకుడు బాపు తీసిన 'సంపూర్ణ రామాయణం' చిత్రానికి సహాయ దర్శకుడిగా చేరారు. మరోవైపు ఎడిటింగ్‌పైనా దృష్టి పెట్టారు. దత్తాత్రేయ పని తీరు నచ్చి తాను దర్శకత్వం వహించిన 'వంశవృక్షం' చిత్రం ద్వారా ఎడిటర్‌ని చేశారు బాపు. ఒక్క బాపూ దగ్గరే 22 సినిమాలకు దత్తాత్రేయ ఎడిటర్‌గా చేయడం విశేషం. అప్పుడే దర్శకుడు వంశీ చిత్రాలకూ చేయడం మొదలుపెట్టారు. వంశీ తెరకెక్కించిన 'సితార' ద్వారా ఉత్తమ ఎడిటర్‌గా దత్తాత్రేయ జాతీయ అవార్డు అందుకున్నారు. పలు నంది అవార్డులూ సొంతం చేసుకున్నారు. తెలుగులో కె. రాఘవేంద్రరావు, గీతాకృష్ణ వంటి పలు దర్శకుల చిత్రాలకూ, తమిళంలో ఆర్వీ ఉదయ్‌కుమార్, ఆర్.కె. సెల్వమణి తదితరుల చిత్రాలకూ పని చేశారు. తెలుగుతో పాటు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్.. ఇలా దాదాపు 9 భాషల్లో 200 చిత్రాలకుపైగా పని చేసిన ఘనత దత్తాత్రేయది. ఇన్ని భాషల్లో ఎడిటర్‌గా చేసిన అతి కొద్దిమందిలో దత్తాత్రేయ ఒకరు కావడం విశేషం. ఈయన పేరు అనిల్‌గా మారడానికి కారణం.. తమిళీయులు 'దత్తాత్రేయ' పేరుని సరిగ్గా ఉచ్చరించలేకపోవడమే. అక్కడివారు అనిల్ దత్ అని పిలిచేవారు. పుట్టిన ఊరు తన పేరులో ఉండాలనుకుని తన పేరుని 'అనిల్ మల్నాడ్'గా మార్చుకున్నారు. గతేడాది డిసెంబర్ 4న అనారోగ్యానికి గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. తలలో రక్తం గడ్డ కట్టడంతో శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ వచ్చారు. సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో ఆయన కన్నుమూశారు. అనిల్ మల్నాడ్‌కు భార్య శ్రీలక్ష్మి, కొడుకు సూరజ్, కూతురు అఖిల ఉన్నారు. మంగళవారం ఉదయం చెన్నై, క్రోమ్‌పేటలోని శ్మశాన వాటికలో అనిల్ మల్నాడ్ అంత్యక్రియలు జరగనున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం
20-3-2018



'మృత్యువు నుంచి తప్పించు కోలేం' అని అంటారు. కానీ, మృత్యువుకు కారణమైనవాడిని కూడా తప్పించుకోనివ్వదు క్లూ!

తప్పు జరగవచ్చు... చిన్నవి, పెద్దవి ఎలాంటి తప్పలైనా జరగవచ్చు. ఆ తప్పను ఒప్పకోవడంలో ధైర్యం ఉంది. తప్పు నుంచి పారిపోవడంలో ఉన్నది శిక్ష.

2016 డిసెంబర్ 10.
హైదరాబాద్.

తెల్లవారుజాము 6 గంటలు.

మనసు కీడు శంకిస్తూ ఉంది. సాధారణంగా ఉదయాలు ప్రశాంతంగా అనిపిస్తాయి ఆమెకు. కాని ఆరోజు తెల్లవారుజాము ఏదో దుశ్శకునంగా ఉంది. అసలే రాత్రి పడ్డ పీడకల తాలుకు కలత వదల్లేదు. ఇప్పుడు ఈ గుబులు. అవునూ... ఈయన ఇంకా రాలేదేమిటి?

వాకిలిలోకి వచ్చింది. గేటువైపు చూసింది. మరో అరగంట గడిచింది. గుబులు పెరిగిపోతోంది. ఇలా ఎప్పుడూ జరగలేదు. రోజూ ఐదింటికి వాకింగ్‌కు వెళ్లడం మామూలే. ఆరు లోపే వచ్చేస్తాడు. కొంచెం ఆలస్యం అయితే ఫోన్ చేస్తాడు. ఇవాళ రాలేదు. ఫోనూ చేయలేదు.

సెల్ తీసుకొని కాల్ చేసింది.

నో రెస్పాన్స్.. ఏమై ఉంటుంది?! స్నేహితులు ఎవరైనా కలిసి ఉంటారులే అని మనసుకు సర్దిచెప్పుకుంది. కాని గుబులు. పేపర్ తిరిగేసింది. గమ్మంగుండా గేటు వరకు కళ్లను అప్పగించింది. కిచెన్‌లోకి వెళ్లింది. అప్పటికే ఒకసారి కలిపి ఉంచిన డికాషన్ చల్లారిపోతే మళ్లీ వేడి చేసింది. ఆయన వస్తే రోజూ కలిసి కాఫీ తాగడం అలవాటు.

ఇంకా రాలేదేమిటి?

గుబులు పెరిగిపోతూ ఉంది.

ఫోన్ రింగ్ అయ్యింది. ఈ టైమ్‌లో ఫోన్ చేసేదెవరు? ఈయనే అయి ఉంటుంది. సెల్ చేతిలోకి తీసుకుంది.

కొత్త నెంబర్. ఇది కీడే... మనసు చెబుతూ ఉంది. వణుకుతన్న చేతిని కంట్రోల్ చేసుకుంటూ గ్రీన్ బటన్ ప్రెస్ చేసింది. అవతలి నుంచి విషయం వింటూనే ఫోన్ జారి నేలన పడింది..

• ❖ •

రాయదుర్గం గచ్చిబౌలీ రోడ్.

రోడ్డు మీద ఆయన పడి పోయి ఉన్నాడు. కళ్లద్దాలు ఒకవైపు పడి ఉన్నాయి. చెప్పులు జారిపోయాయి. పేరు దేవదానం అని పోలీసులకు అర్థమయ్యాక ఇంటికి ఫోన్ చేశారు. 'ఎలా జరిగింది?' ఆమె అతి కష్టం మీద అడిగింది.

'హిట్ అండ్ రన్ కావచ్చు' అని జవాబు వచ్చింది.

ఆ గుర్తు తెలియని వాహనం ఎవరిది? ప్రత్యక్షసాక్షులు ఎవరూ లేరు. ఓ చిన్న గోడ అడ్డు రావడంతో ఆ స్పాట్‌లో ఉన్న సీసీ కెమెరాలో యాక్సిడెంట్ రికార్డు కాలేదు. రోడ్లు ఊడ్చే వాళ్ళు, పాలు పోసే వాళ్ళు, పాల ప్యాకెట్లు వేసే వాళ్ళు ఎవరిని ప్రశ్నించినా ఫలితం లేదు.

'మాకు తెలియదు... మేం చూళ్లేదు' అన్నారు.

కేసు మిగిలిన 'హిట్ అండ్ రన్' కేసుల మాదిరిగా మిస్టరీగా మారింది. ఎవరైనా కావాలనే దేవదానంను హత్య చేసి ఉంటారా? అంత అవసరం ఎవరికి ఉంటుంది? కుటుంబసభ్యులకు ఎడతెరిపిలేని సందేహాలు. వాటిని పోలీసుల ముందుంచారు.

• ❖ •

'సార్... ఈ కేసులో అనఫీషియల్‌గా ఇన్‌వాల్వ్ కావడానికి నాకు పర్మిషన్ ఇవ్వండి' అన్నారు సీసీఎస్ స్పెషల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్యాంబాబు.

'ఏం అవసరం శ్యాంబాబు... లోకల్ పోలీసులు ఇన్వెస్టిగేట్ చేస్తున్నారుగా' అన్నాడు పై అధికారి.

'చనిపోయింది మా నాన్న సార్. నేనొక పోలీస్సై ఉండి అతణ్ణి పట్టుకోలేకపోతే మనసుకు కష్టంగా ఉంది. మా నాన్న కోసమే కాదు... ఇలా హిట్ అండ్ రన్ చేసి తప్పించుకోవచ్చు అనుకునేవారందరికీ ఈ కేసొక గుణపాఠం కావాలి' పట్టుదలగా అన్నారు శ్యాంబాబు.

'ఓకే... గో అహెడ్' పర్మిషన్ దొరికింది.

• ❖ •

శ్యాంబాబు ఘటనాస్థలికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. దేవదానం మృతదేహం దొరికిన ప్రాంతంలో ఓ చిన్న ప్లాస్టిక్ ముక్క కనిపించింది. అది తప్ప ఇంకేమీ దొరకలేదు. ఈ కేసుకు ఇదే ముఖ్యమైన క్లూ అని శ్యాంబాబుకు అనిపించింది. దానిని పరీక్షగా చూశారు. 'ఫోర్డ్' అనే అక్షరాలు ఉండటం వల్ల అది ఫోర్డ్ కారుకు చెందిన మడ్‌గార్డ్ కుడివైపు లైనర్‌దిగా గుర్తించారు. దీన్ని తీసుకుని షోరూమ్‌కు వెళ్ళిన ఆయన దాన్ని అక్కడి మెకానిక్స్‌కు చూపించారు.

'ఇది 2012 మోడల్‌కు చెందిన ఫోర్డ్ ఫిగో కారుది సార్'అని తేల్చారు వాళ్లు.

తండ్రి మరణానికి ఈ ఫోర్డ్ ఫిగోకి లంకె ఉందని శ్యాంబాబుకు అర్థమైంది. వెంటనే గచ్చిబౌలి నుంచి మెహదీపట్నం మార్గంలో ఉన్న సీసీ కెమెరాలపై దృష్టిపెట్టారు. యాక్సిడెంట్ అయిన రోజు అనేక కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను సేకరించి పరిశీలించారు. ముఖ్యంగా ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల మధ్య వెళ్ళిన ఫోర్డ్ ఫిగో మోడల్స్‌పై దృష్టిపెట్టారు. ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫీడ్ మరికొంత క్లూ ఇచ్చింది.

'నెంబర్ జూమ్ చేయండి' ఆదేశించారు శ్యాంబాబు.

జూమ్ అయ్యింది.

ఏపీ 10 బీసీ 6768.

ఎస్. ఈ కారే అయి ఉండాలి. వెంటనే ఆర్టీఏ రికార్డుల్లో ఉన్న అడ్రస్ దొరికింది.

2017 జనవరి 2.

తన తండ్రిని చంపింది ఎంటెక్ విద్యార్థి గుత్తికొండ ప్రశాంత్‌కుమార్‌గా శ్యాంబాబు తేల్చారు.

• ❖ •

ఎవరీ దేవదానం?

నాయబ్ సుబేదార్ హోదాలో దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తించిన దేవదానం ఇండో–పాక్, ఇండో–బంగ్లాదేశ్ యుద్ధాల్లో పాల్గొన్నారు. సంగ్రామ్ మెడల్, వార్ మెడల్, '25 ఇయర్స్ ఇండిపెండెన్స్ మెడల్' పొందారు. పదవీ విరమణ తర్వాత రాయదుర్గంలో తన భార్యతో కలిసి నివసిస్తూ 72 ఏళ్ళ వయస్సులోనూ ఫస్ట్‌మ్యాన్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పని చేసేవారు.. ముగ్గురు కుమారులూ ఉన్నత స్థితిలోనే ఉన్నప్పటికీ తాను మాత్రం ఖాళీగా కూర్చోనంటూ ఉద్యోగం కొనసాగించారు. హైదరాబాద్ దర్గా ప్రాంతంలో అందరికీ సుపరిచితుడైన దేవదానం ఎప్పటిలాగే 2016 డిసెంబర్ 10 తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్ళారు. వాకింగ్ పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న ఆయన్ను 5.30 గంటల ప్రాంతంలో మాతా మందిర్ వద్ద ఓ కారు ఢీ కొట్టి వెళ్ళిపోయింది. తీవ్రగాయాల పాలైన ఆయన అక్కడే రక్తపు మడుగులో మృత్యువుతో పోరాడి ప్రాణాలు వదిలారు.

ఆ రోజు ఏమైందంటే...

ప్రశాంత్ ముందురోజు రాత్రి ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకున్నాడు. తెల్లవారుజామున ఇంటికి బయల్దేరాడు. నిద్ర, మద్యం మత్తు.... ఎక్స్‌లేటర్ మీద అదుపులేని కాలు.. దారిలో వాకింగ్ చేస్తున్న దేవదానాన్ని ప్రశాంత్ గుర్తించలేదు. దారుణంగా యాక్సిడెంట్ చేసి ఆయన మృతికి కారకుడయ్యాడు. అయితే ఆ యాక్సిడెంట్‌ని ఎవరూ చూడలేదని గ్రహించి నేరుగా సికింద్రాబాద్‌లోని బాపుబాగ్‌కాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్లిపోయాడు.

ప్రశాంత్ తండ్రి గుత్తికొండ రమేష్ ఎలక్ట్రికల్ గూడ్స్ దుకాణం నిర్వహించడంతో పాటు ఎలక్ట్రికల్ కాంట్రాక్టులు చేస్తుంటారు. ఇంటికి వెళ్ళిన ప్రశాంత్ తాను కూకట్‌పల్లి నుంచి వస్తుండగా కారు గుంతలో పడి మడ్‌గార్డ్ దెబ్బతిందని తల్లిదండ్రుల్ని నమ్మించాడు. కొన్ని రోజులపాటు బండిని బయటకు తీయలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకు ప్రశాంత్ బోయిన్‌పల్లిలోని ఓ గ్యారేజ్‌లో కార్ రిపేర్ చేయించాడు. రోడ్డు ప్రమాదం కేసు నుంచి తప్పించుకోవడానికి కారు నెంబర్ ప్లేట్‌తో పాటు మడ్‌గార్డ్ తదితరాలను మార్చేందుకు పూనుకున్నాడు. ఈ క్రమంలోనే బోయిన్‌పల్లిలోని గ్యారేజ్‌లో ఉన్న కారును స్వాధీనం చేసుకున్న శ్యాంబాబు ఘటనాస్థలిలో దొరికిన లైనర్ ముక్కను దానికి అమర్చి చూడగా సరిగ్గా సరిపోయింది. ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా... పూర్తి విషయాలు వెలుగులోకి వచ్చాయి.

• ❖ •

ప్రమాదం జరిగిన సమయంలో నిందితుడు మద్యం తాగి ఉన్నాడనేది నిరూపించడం కోసం పోలీసులు ఆ రోజు అతడు వెళ్ళిన పబ్స్‌లో నమోదైన సీసీ కెమెరా పుటేజ్‌తో పాటు అతడు తన డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించిన బిల్లుల్నీ సేకరించారు. సాక్ష్యాల తారుమారుకు యత్నించిన ప్రశాంత్‌పై నమోదైన కేసులో ఆ సెక్షన్లనూ జోడించి అరెస్టు చేశారు. కేసు విచారణలో ఉంది.

ఇన్‌పుట్స్: **కామేశ్**, సాక్షి ప్రతినిధి

క్లూ కథనాలు పంపండి

రెండు రాష్ట్రాలలో ఎందరో గొప్ప పోలీస్ ఆఫీసర్లు ఉన్నారు. ఎన్నో గొప్ప కేసులను క్లూల ద్వారా సాల్వ్ చేసి ఉంటారు. అలాంటి ఆఫీసర్లకు ఇదే మా ఆహ్వానం. మీరు సాల్వ్ చేసిన కేసులను సాక్షి పాఠకులతో పంచుకోండి. నేరస్థుడు తప్పించుకోలేడన్న భావన నేరాన్ని సగం నిరోధిస్తుంది. నేరం లేని సమాజం కోసం సాక్షి చేస్తున్న ఈ ప్రయత్నానికి మీ సహకారాన్ని ఆశిస్తూ... మీరు సాల్వ్ చేసిన కేసు వివరాలు పంపాల్సిన ఈ మెయిల్: sakshiclue@gmail.com

ఇది విన్నారా?

మగాళ్లకూ గర్భ నిరోధక మాత్రలు!

పిల్లలు పుట్టకుండా ఉండేందుకు ఇకపై మహిళలు మాత్రమే మాత్రలు తీసుకోవాల్సిన అవసరం లేదు. పురుషులపై జరిపిన ప్రయోగాలు విజయవంతం కావడంతో, ఇప్పుడు పురుషులకూ గర్భ నిరోధక మాత్రలు వస్తున్నాయి. మగాళ్లకూ ఇలాంటి సౌకర్యం కల్పించేందుకు ఇప్పటివరకూ బోలెడన్ని ప్రయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. చివరకు డైమిథ్రడ్రోలోన్ అండీకానోయేట్ అనే రసాయనం దీన్ని సాధ్యం చేసింది. దీని సామర్థ్యం, భద్రతపై జరిగిన తొలి పరీక్షలు విజయవంతం కావడంతో మలిదశ ప్రయోగాలకు రంగం సిద్ధమైంది. చాలామంది పురుషులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ఇష్టపడరని.. అవసరమైనప్పుడు మాత్రమే ఇలాంటి సామర్థ్యమున్న పద్ధతి కోసం చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త స్టెఫానీ పేజ్



తెలిపారు. తొలిదశ ప్రయోగాల్లో తాము వంద మంది పురుషులను ఎంచుకుని మూడు వేర్వేరు మోతాదుల్లో మందు అందించామని, అత్యధిక మోతాదు తీసుకున్న వారిలో టెస్టోస్టిరాన్ హార్మోన్ ఉత్పత్తి గణనీయంగా మందగించినట్లు గుర్తించామని చెప్పారు. అయితే ఈ మాత్రల వినియోగం వల్ల శరీరంలోని మంచి కొలెస్ట్రాల్ కొంత నష్టపోవడంతో పాటు కొద్దిగా ఒళ్లు చేసే అవకాశం కూడా ఉన్నట్లు తెలిసిందన్నారు.

ఃకాసుకో సుడోకు

			5			4		3
			9	8	3			
		6		4		9	1	
9		3	2			7	6	8
4	5						9	2
6	7	2			9	1		4
	8	5		2		6		
			3	9	5			
7		9			8			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	2	1	7	9	8	4	6	3
8	4	3	6	1	5	2	7	9
6	9	7	2	4	3	5	8	1
1	8	2	9	5	7	6	3	4
7	3	9	8	6	4	1	5	2
4	5	6	3	2	1	7	9	8
9	1	8	5	7	2	3	4	6
2	6	5	4	3	9	8	1	7
3	7	4	1	8	6	9	2	5

పరి పరిశోధన

శక్తినిచ్చే ఉపాహారంతో మధుమేహులకు మేలు!



ఊబకాయంతో పాటు మధుమేహంతో బాధ పడుతున్న వారు ఉదయాన్నే ఉపాహారం తీసుకోవాలి. ఆ ఉపాహారంలో ఎక్కువ శక్తి ఉండేలా చూసుకోవడం మంచిదని సూచిస్తున్నారు ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు. అధిక కేలరీలున్న ఉపాహారం... కొంచెం తక్కువ కేలరీతో మధ్యాహ్న భోజనం, అతితక్కువ కేలరీలతో రాత్రి భోజనం తీసుకుంటుంటే, ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని అధ్యయన పూర్వకంగా తెలుసుకున్నామని వారు ఇటీవలే ముగిసిన ఓ అంతర్జాతీయ సదస్సులో ప్రకటించారు. చిన్న మోతాదుల్లో ఆరు సార్లు ఆహారం తీసుకోవాలని మధుమేహులకు చెబుతూంటారని.. తాము సూచించే పద్ధతి వల్ల వారు బరువు తగ్గడమే కాకుండా ఇన్సులిన్ మోతాదు నియంత్రణలో ఉంటుందని, ఆకలి తగ్గడంతో పాటు తక్కువ ఇన్సులిన్‌తోనే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకునేందుకూ ఇది ఉపయోగపడుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డేనియాలే జకోబోవిచ్ తెలిపారు. ఏ సమయంలో ఆహారం తీసుకుంటామన్నదే ముఖ్యం గానీ.. ఎన్ని కేలరీలు అన్నది కాదని చెప్పారు. దాదాపు 70 ఏళ్ల వయసున్న, ఊబకాయులు, మధుమేహ వ్యాధిగ్రస్తులపై మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. కొంతమందికి సంప్రదాయ పద్ధతుల్లోనూ.. ఇంకొందరికి కొత్త పద్ధతి ద్వారా ఆహారం అందించాక, జరిపిన పరిశీలనలో, కొత్త పద్ధతి ద్వారా మంచి ఫలితాలు వచ్చినట్లు తెలిసింది.

హార్మోన్ ఉత్పత్తిని ప్రభావితం చేసే సుగంధ నూనెలు!



అరోమా థెరపీ గురించి మీరు వినే ఉంటారు. ఒత్తిడిని తగ్గించుకునేందుకు మాత్రమే కాకుండా.. అనేకానేక రుగ్మతలకు సుగంధ నూనెల వాడకంతో ఉపశమనం కలుగుతుందని చాలామంది నమ్ముతారు. అయితే మిగిలిన వాటి మాటెలా ఉన్నా.. లావెండర్, 'టీ ట్రీ ఆయిల్'లతో మాత్రం కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు అమెరికాకు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్ శాస్త్రవేత్తలు. కౌమార వయసులో బాలుర రొమ్ములు అసాధారణంగా పెరిగిపోయే అతి అరుదైన రుగ్మతకు ఈ నూనెలు కారణమవుతున్నాయని వీరు అంటున్నారు. హార్మోన్ల ఉత్పత్తిని ప్రభావితం చేయడం దీనికి కారణమని 2007లోనే ఒక పరిశోధన స్పష్టం చేసింది. అయితే ఈ నూనెలను సమర్థించే వర్గానికి చెందిన శాస్త్రవేత్తలు 2013లో ఓ పరిశోధన ద్వారా ఈ నూనెలకూ... హార్మోన్ల ఉత్పత్తికి సంబంధం లేదని స్పష్టం చేసింది. తాజాగా జరిగిన అధ్యయనం మాత్రం ఎసెన్షియల్ నూనెల్లోని ఎనిమిది రసాయనాలతో ముప్పు తప్పదని పునరుద్ఘాటిస్తోంది. ఈ నూనెలను ఎలాంటి నియంత్రణ లేకుండా అమ్ముతున్నారని.. వచ్చే సమస్యల గురించి అవగాహన లేకపోవడం వల్ల చాలామంది వీటి వాడకం ద్వారా ఇబ్బందులకు గురవుతున్నట్లు తాజా అధ్యయనం చెబుతోంది.

హై-బీపీ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

పేరెంట్స్‌కు హైబీపీ ఉంటే నాకూ వస్తుందా?



నా వయసు 35. మా కుటుంబంలో తల్లిదండ్రులకు హైబీపీ ఉంది. నాకూ వస్తుందేమోనని ఆందోళనగా ఉంది. పేరెంట్స్‌కు బీపీ ఉన్నప్పుడు అది నాకు కూడా వచ్చే అవకాశం ఉందా? దీన్ని నివారించడానికి నేనేం చేయాలో చెప్పండి.

- జగన్నాథరావు, వరంగల్

మీ తల్లిదండ్రులకూ, మీ రక్తసంబంధీకులకూ, మీకు చాలా దగ్గరి బంధువులకు అధిక రక్తపోటు ఉంటే మీకు కూడా వచ్చే అవకాశాలు కాస్త ఎక్కువే. అయితే, మీ జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చుకోవడం ద్వారా కుటుంబంలో హైబీపీ చరిత్ర ఉన్నప్పటికీ దీన్ని చాలావరకు నివారించుకోవచ్చు. దీనికోసం మీరు చేయాల్సింది చాలా సులభం. అది...

- ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని తీసుకోవాలి.
- మీరు ఉప్పు చాలా తక్కువగా తీసుకోవాలి.
- మీరు శారీరక శ్రమను ఇష్టపడుతూ చేయండి. నడక వంటి వ్యాయామాలు దీనికి బాగా ఉపకరిస్తాయి.
- బరువు పెరగకుండా చూసుకోండి. మీ ఎత్తుకు మీరెంత బరువుండాలో దానికి మించకుండా నియంత్రించుకుంటూ ఉండండి
- పొగాకు వాడకాన్ని పూర్తిగా మానేయండి.
- ఆల్కహాల్ పూర్తిగా మానేయండి.

తరచూ తలనొప్పి... హైబీపీ కావచ్చా?

నా వయసు 48 ఏళ్లు. నాకు తరచూ తలనొప్పిగా ఉండటంతో పాటు ఇటీవల బాగా తలతిరుగుతున్నట్లుగా ఉంది. ఒక్కోసారి ముందుకు పడిపోతానేమో అన్నంత ఆందోళనగా ఉంటోంది. నా లక్షణాలు చూసిన కొంతమంది మిత్రులు ''నీకు హైబీపీ ఉందేమో, ఒకసారి డాక్టర్‌కు చూపించుకో'' అంటున్నారు. వారు చెబుతున్నదాన్ని బట్టి నాకు మరింత ఆందోళన పెరుగుతోంది. నాకు తగిన సలహా ఇవ్వగలరు.

- ఎమ్. సుదర్శన్, నిజామాబాద్

హైబీపీని కేవలం మీరు చెప్పిన లక్షణాలతోనే నిర్ధారణ చేయలేం. అసలు బీపీని కొలవకుండా ఆ సమస్యను నిర్ధారణ సాధ్యం కాదు. మనలో రక్తపోటు పెరగడం వల్ల ఎండ్ ఆర్గాన్స్‌లో ముఖ్యమైనదైన మెదడులోని రక్తనాళాల చివరల్లో రక్తం ఒత్తిడి పెరిగి తలనొప్పి రావచ్చు. కొందరిలో మైగ్రేన్ వల్ల కూడా తలనొప్పి రావచ్చు. అలాగే మనం ఉన్న భంగిమ (పోష్చర్)ను అకస్మాత్తుగా మార్చడం వల్ల ఒకేసారి మనలో రక్తపోటు తగ్గవచ్చు. దీన్ని ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్ అంటారు. అలాంటి సమయాల్లోనూ మీరు చెప్పినట్లుగా ముందుకు పడిపోతారేమో లాంటి ఫీలింగ్, గిడ్డీనెస్ కలగవచ్చు. బీపీలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల మీరు చెప్పిన లక్షణాలు కనిపించినప్పటికీ, అవి కేవలం బీపీ వల్లనే అని చెప్పలేం. సాధారణంగా బీపీ వల్ల ఉదయం వేళల్లో తలనొప్పి కనిపించనప్పటికీ, మరెన్నో ఆరోగ్య సమస్యలలోనూ తలనొప్పి ఒక లక్షణంగా ఉంటుంది. అలాగే మీరు చెప్పిన గిడ్డీనెస్ సమస్యతో పాటు వర్టిగో, సింకోప్ లాంటి మరెన్నో సమస్యలు కూడా మీకు కనిపిస్తున్న లక్షణాలకు కారణం కావచ్చు. అందుకని కేవలం లక్షణాల ఆధారంగానే బీపీ నిర్ధారణ చేయడం సరికాదు. అందుకే మీరు నిర్భయంగా ఒకసారి డాక్టర్‌ను కలవండి. అయితే డాక్టర్ కూడా కూడా కేవలం ఒక్క పరీక్షలోనే బీపీ నిర్ధారణ చేయరు. అనేక మారు బీపీని కొలిచి, ఒకవేళ నిజంగానే సమస్య ఉంటే అప్పుడు మాత్రమే దాన్ని కచ్చితంగా నిర్ధారణ చేసి, దానికి తగిన చికిత్స సూచిస్తారు.



డాక్టర్ ఎమ్. గోవర్ధన్,
సీనియర్ ఫిజీషియన్,
కేర్ హాస్పిటల్స్,
నాంపల్లి, హైదరాబాద్

హైబీపీ నిర్ధారణకు పరీక్షలేమిటి?



నా వయసు 48. నాకు తరచూ తల తిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. దాంతో నాకు హైబీపీ ఉందేమోనని అనుమానం వస్తోంది. హైబీపీ నిర్ధారణకు ఏయే పరీక్షలు చేయించాలి?

- కృష్ణ, ఖమ్మం

రక్తపోటు ఉన్నట్లు అనుమానించేవారు చేయించుకోవాల్సిన సాధారణ పరీక్షలు ఇవి... • పూర్తిస్థాయి మూత్ర పరీక్ష (కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్) • రక్తంలో హీమోగ్లోబిన్ పాళ్లు • రక్తంలో పొటాషియమ్ స్థాయి • బ్లడ్ యూరియా అండ్ క్రియాటిన్ లెవెల్స్ • ఈసీజీ • కిడ్నీ సైజ్‌ను తెలుసుకునేందుకు అల్ట్రాసౌండ్ స్కాన్ ఆఫ్ అబ్డామిన్ పరీక్ష • రక్తంలో చక్కెర పాళ్లు తెలుసుకునే రాండమ్ బ్లడ్ షుగర్ లెవెల్స్ పరీక్ష... ఇవి మామూలుగా చేయించాల్సిన పరీక్షలు. అయితే కొందరిలో మరికొన్ని ప్రతేక పరీక్షలు అవసరమవుతాయి. ఈ ప్రత్యేక పరీక్షలు ఎవరికి అవసరమంటే ... • కుటుంబ చరిత్రలో రక్తపోటు వల్ల మూత్రపిండాలు దెబ్బతిన్న వారికి • డయాబెటిస్ పేషెంట్లు అందరికీ • కాళ్లలో, పాదాల్లో వాపు వస్తున్నవారికి • రక్తపోటు అదుపు చేయడానికి రోజూ రెండు కంటే ఎక్కువ మందులు ఉపయోగిస్తున్నవారికి • ముప్పయి ఏళ్ల వయసు రాకముందే రక్తపోటు వచ్చిన వారికి, రక్తపోటు కనుగొని ఐదేళ్లు దాటిన వారికి • తీవ్రమైన తలనొప్పి వస్తున్నవారు, రక్తపోటు పెరగడం వల్ల గుండెదడ, శ్వాస తీసుకోవడం లో ఇబ్బందిపడే వారికి ఇవి అవసరం. హైబీపీ వల్ల కిడ్నీలకు ఏదైనా ప్రమాదం జరిగిందేమో తెలుసుకోడానికి ఈ పరీక్షలు చేయిస్తారు. అవి... • 24 గంటలలో మూత్రంలో పోయే ప్రొటీన్లు, క్రియాటిన్ పాళ్లు తెలుసుకునే పరీక్ష. (మూత్రంలో పోయే ప్రోటీన్లను కేవలం ఒక శాంపుల్‌తోనే తెలుసుకునే పరీక్షలూ అందుబాటులోకి వచ్చాయి) • కిడ్నీ బయాప్సీ • మూత్రపిండాల్లోని రక్తనాళాల పరిస్థితిని తెలుసుకునేందుకు డాప్లర్ అల్ట్రాసౌండ్ స్కాన్ • బ్లడ్ గ్యాస్ అనాలిసిస్ • రీనల్ యాంజియోగ్రామ్.

సాక్షి

సాగుబడి

ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

మీ అభిప్రాయాలు, సూచనలను sagubadi@sakshi.com కు పంపవచ్చు.

ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 18 నుంచి

సేంద్రియ ఇంటిపంటల ఉత్పాదకత ఆరుబయట పొలాల్లో కన్నా 15 రెట్లు ఎక్కువ: ఎఫ్.ఎ.ఓ.

ఇంటి పంట

విశ్రాంత జీవనం.. ఆకుపచ్చని లోకం!

- సేంద్రియ ఇంటిపంటల సాగులో విశ్రాంత బ్యాంక్ సీనియర్ మేనేజర్ మమేకం
- మిద్దెపైనే పుష్కలంగా ఆకుకూరలు, కూరగాయల పెంపకం
- షేడ్‌నెట్ నీడలో 250 కుండీలు, డ్రమ్స్, గ్రోబాగ్స్‌లో అధిక ఉత్పాదకత
- సేంద్రియ ఇంటిపంటల సాగుపై హన్మకొండలో ప్రతి ఆదివారం ఉచిత శిక్షణ



ఇంటిపంటలకు నీరు పోస్తున్న జీవన్‌రెడ్డి



హన్మకొండలో జీవన్‌రెడ్డి ఇంటిపై కనువిందు చేస్తున్న ఇంటిపంటలు

వ్యవసాయంలో ఎమ్మెస్సీ చదువుకున్న గుడిపాటి జీవన్‌రెడ్డి 35 ఏళ్లు బ్యాంకు ఉద్యోగం చేసిన తర్వాత.. తన ఇంటిపైనే ఆధునిక వసతులతో సేంద్రియ ఇంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇనుప చువ్వల పందిరిపై గ్రీన్ షేడ్‌నెట్ వేసి.. 250కి పైగా కుండీలు, డ్రమ్స్, గ్రోబాగ్స్‌లో 15 రకాల కూరగాయలు, ఆకుకూరలు పుష్కలంగా పండించుకొని తింటూ ఇంటిల్లపాదీ ఆరోగ్యంగా జీవిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సింగాపురానికి చెందిన జీవన్‌రెడ్డి ఆంధ్రా బ్యాంక్‌లో 35 ఏళ్లు సేవలందించి సీనియర్ మేనేజర్‌గా రిటైరైన తర్వాత.. హన్మకొండ బ్యాంక్ కాలనీలో 2012లో మూడంతస్థుల ఇల్లు నిర్మించుకున్నారు. తమ ఇంటిపైనే ఆరోగ్యదాయకమైన సేంద్రియ ఆకుకూరలు, కూరగాయల సాగుకు రెండేళ్ళ క్రితం శ్రీకారం చుట్టారు. విశ్రాంత జీవితంలో పచ్చని మొక్కలతోనే సహచర్యం చేస్తున్నారు. ఇంటిపంటల సాగు చక్కని వ్యాపకంతో పాటు రోజుకు 3 గంటల పాటు ఆనందదాయకమైన వ్యాయామంగా కూడా మారిందని ఆనందంగా చెబుతున్నారు.. కాలనీ అభివృద్ధి కమిటీ సంయుక్త కార్యదర్శిగా ఉంటూ.. నలుగురిలోనూ సేంద్రియ ఇంటిపంటల సాగుపై ఆసక్తిని రేకెత్తిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

250కి పైగా కుండీలు, డ్రమ్ములు..

మొదట్లో కొంచెం ఎక్కువ ఖర్చయినా పుష్కలంగా నిరంతరం ఆకుకూరలు, కూరగాయల దిగుబడి వచ్చేలా అత్యంత ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా ఇంటిపంటలను సాగు చేస్తుండడం జీవన్‌రెడ్డి ప్రత్యేకత. ఎత్తుల వారీగా ఇనుప బెంచీలను తయారు చేయించి, వాటిపైన కుండీలను, డ్రమ్ములను ఉంచి ఆకుకూరలు, కూరగాయలు పెంచుతున్నారు. 40 కుండీల్లో టమాటాలు, 10 కుండీల్లో మిరపకాయలు, 30 కుండీల్లో వంకాయలు, 20 కుండీల్లో గోరుచిక్కుడు, 4 కుండీల్లో బంగాళదుంపలు, రెండు కుండీల్లో అల్లం సాగు చేస్తున్నారు. చిన్న కంటెయినర్లు, గ్రోబాగ్స్‌లో క్యాబేజి, కాలీఫ్లవర్ వేశారు.

మార్కెట్‌లో దొరికే వాటర్ డ్రమ్ములు 15 తెచ్చి.. వాటిని నిలువుగా కోసి 30 కుండీలుగా మార్చి.. ఆకుకూరలు వేశారు. నీరు నిలబడకుండా అదనపు నీరు కిందికి వెళ్లిపోవడం కోసం డ్రమ్ము అడుగున ఒక చిన్న బెజ్జం పెట్టి.. దానిపైన చిప్స్, గండ్ర ఇసుక వేసి దానిపైన ఎరువు కలిపిన మట్టి మిశ్రమాన్ని నింపారు. పాలకూర 4, మెంతికూర 3, గోంగూర 3, ఉల్లి కాడలు 4, కొత్తిమీర 3 డ్రమ్ముల్లో వేశారు. ఆకుకూరల విత్తనాలు వేసిన నెలరోజుల్లో కోతకు వస్తాయి. 12–15 రోజుల వ్యవధిలో విత్తనాలు వేస్తూఉండటం వల్ల ఆకుకూరలు, కూరగాయలు సంవత్సరం పొడవునా లోటు లేకుండా చేతికి అందివస్తున్నాయని జీవన్‌రెడ్డి తెలిపారు.

ఉదాహరణకు.. గత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు టమాటా నారు 3 దఫాలుగా పోసి, మొక్కలు నాటుకున్నారు. డ్రమ్ముల్లో ప్రతి సారీ ఆకుకూర పంటల మార్పిడి పాటించడం వల్ల చక్కని పంట దిగుబడులు వస్తున్నాయన్నారు.

మట్టిలో రసాయనిక అవశేషాలతో తిప్పలు..

హైబ్రిడ్ విత్తనాల కన్నా సేంద్రియ సాగులో దేశీ విత్తనాలే మంచి దిగుబడినిస్తున్నాయన్నారు. రెండు ట్రాక్టర్ల ఎర్రమట్టి తెప్పించి.. సగం మట్టి, సగం వర్మీకంపోస్టు, కొబ్బరిపొట్టు, పెర్లిలైట్ కలిపి తయారు చేసుకున్న మట్టిమిశ్రమంలో జీవన్‌రెడ్డి ఇంటిపంటలు సాగు చేస్తున్నారు. రసాయనిక ఎరువులు వాడిన పొలాల్లో మట్టి తేవడం వల్ల తొలి ఏడాది ఇంటిపంటలు సక్రమంగా రాక నీరసం వచ్చిందన్నారు. మట్టి ఆరోగ్యం బాగుపడిన తర్వాత రెండో ఏడాది పంటలు బాగా వస్తున్నాయని ఉత్సాహంగా చెప్పారు. రాలిన ఆకులు, వంటింటి వ్యర్థాలతో తయారు చేసుకునే కంపోస్టు, వేపపిండిని నెలకోసారి కొంచెం కొంచెంగా వేస్తున్నారు. 10–12 రోజులకోసారి వేపనూనె పిచికారీ చేస్తున్నారు. మొక్కలు నాటిన లేదా మొలిచిన 2–3 రోజుల్లోనే వేపనూనె చల్లితే చీడపీడల బెడద అంతగా ఉండదన్నది తన అనుభవమని తెలిపారు.

మొదట్లోనే ఆకులు తెంపెయ్యాలి..

జీవన్‌రెడ్డి మొక్కలకు రోజూ ఉదయం వేళలో స్వయంగా నీరు పోస్తుంటారు. డ్రిప్ ద్వారా నీరిస్తే ఐదు నిమిషాల్లో పని పూర్తవుతుందని, అయితే ఏ మొక్క ఎలా ఉందో మనకు తెలియదన్నారు. గోరుముద్దలు తినిపించే తల్లికి, బిడ్డకు మధ్య పెరిగే అనుబంధం, ఆనందం వంటిదే ఇది కూడానని జీవన్‌రెడ్డి మురిపెంగా చెప్పారు. ఉదయపు నీరెండలో అదే వ్యాయామంగా భావిస్తున్నారు.

పురుగూ పుట్రా కనిపిస్తే ఏరోజుకారోజు చేతులతో ఏరేయడమే ఇంటిపంటలకు ఉత్తమ మార్గమని ఆయన అంటున్నారు. టమాటాకు ఆకుమచ్చ(లీఫ్‌మైనర్) సమస్య కనిపించిన తొలిదశలోనే ఆకులను తెంపి, నాశనం చేయడం ఉత్తమం. బెండలో పేనుబంకను గమనించిన వెంటనే వేళ్లతో తీసి నేలమీద వేయాలి. గట్టి వత్తిడితో నీటిని పిచికారీ చేసినా పేనుబంక పోతుంది. అంతగా అయితే వేపనూనె పిచికారీ చేయాలన్నారు. పాలకూరను ఆశించే గొంగళిపురుగులు సాయంత్రం 5 గంటల తర్వాత మట్టిలో నుంచి బయటకు వస్తాయని, ఆ వేళలో కాచుకొని చూస్తూ పురుగులను ఏరేయాలని సూచిస్తున్నారు.

- కొల్ల కృష్ణకుమార్, సాక్షి, హన్మకొండ

ప్రతి ఆదివారం ఉచిత శిక్షణ ఇస్తా..

బెంగళూరుకు చెందిన సేంద్రియ ఇంటిపంటల నిపుణుడు డా. విశ్వనాథ్ స్ఫూర్తితో నేను ఇంటిపంటల సాగుకు శ్రీకారం చుట్టాను. నాకు ఇంటిపంటల పనులు, కాలనీ అభివృద్ధి తప్ప మరే వ్యాపకమూ లేదు. గాఢమైన ఆసక్తి ఉంటే ఇంటి పంటల సాగు కష్టమనిపించదు. నాలా అందరూ ఇంత ఖర్చు పెట్టనక్కరలేదు. తక్కువ ఖర్చుతోనూ ప్రారంభించవచ్చు. మా కాలనీవాళ్లకు కూడా ఇదే చెప్తున్నాను. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మా ఇంటితోటలోనే ఉచితంగా శిక్షణ ఇవ్వదలచాను. ఆసక్తి ఉన్న వారెవరైనా ముందు నాకు ఫోన్ చేసి రావచ్చు. ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వడానికి వాట్సాప్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేశాను.

- గుడిపాటి జీవన్‌రెడ్డి(99630 99830), బ్యాంక్ కాలనీ, హన్మకొండ

సేంద్రియ చిట్కా

వాతావరణ మార్పుల నుంచి రక్షణ

సిలికా ద్రావణం



ఆవు మూత్రం



వాతావరణంలో తీవ్ర మార్పులను తట్టుకొని నిలబడటం పంటలకు అగ్నిపరీక్ష వంటిదే. రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కన్నా బాగా తక్కువగా ఉండటం, అదే రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా ఉండటం వల్ల పంటలు తీవ్ర ఒత్తిడికి గురవుతుంటాయి. ఇటువంటి వాతావరణ మార్పుల షాక్ నుంచి తట్టుకోవడానికి, నష్టాన్ని నివారించడానికి పంటలపై సిలికా ద్రావణాన్ని పిచికారీ చేయడం ఉత్తమం. వంద లీటర్ల నీటిలో 3 లీటర్ల సిలికా ద్రావణాన్ని కలిపి (అంటే.. 3% సిలికా ద్రావణాన్ని) పిచికారీ చేయాలి. ఇది మొక్కలను వాతావరణ మార్పుల నుంచి తట్టుకునేలా చేస్తుంది. వంద కిలోల వరిపొట్టులో 17.5 కిలోల వరకు సిలికా ఉంటుంది.

తయారీ విధానం: 16 లీటర్ల దేశీ ఆవు మూత్రాన్ని ఒక పాత్రలో తీసుకొని.. దానిలో 4 కిలోల వరి పొట్టు(ఊక)ను వేసి బాగా కలపాలి. ఇలా రోజూ ఉదయం, సాయంత్రం 10 రోజుల పాటు కలపాలి. 10 రోజుల తర్వాత దీన్ని వడకట్టి వాడుకోవాలి. **మోతాదు:** వంద లీటర్ల నీటిలో 3 లీటర్ల సిలికా ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి.

- రమాకాంత్ (83747 21751), ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పరిశోధనా స్థానం, జిన్‌గుర్తి, వికారాబాద్ జిల్లా

27న వేస్ట్ డీ కంపోజర్‌పై సదస్సు

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్టు ఆడిటోరియంలో ఈనెల 27న ఉదయం 10 గంటలకు సేంద్రియ వ్యవసాయంలో వేస్ట్ డీ కంపోజర్‌ను ఉపయోగించే పద్ధతులపై రైతు సదస్సు జరగనుంది. కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం(ఎన్.సి.ఓ.ఎఫ్.) సంచాలకులు డాక్టర్ క్రిషన్ చంద్ర, శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ ముఖ్య వక్తలు. ప్రవేశం ఉచితం. సదస్సుకు హాజరయ్యే రైతులకు ఉచితంగా వేస్ట్ డీ కంపోజర్ సీసాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నభోజన ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాలకు.. సభ నిర్వాహకులు, ప్రముఖ సేంద్రియ రైతు ప్రకాశ్‌రెడ్డిని 95 428 62345 నంబరులో సంప్రదించవచ్చు.

ఏప్రిల్ 10 నుంచి ఔషధ మొక్కల సాగుపై శిక్షణ



దక్షిణ కొరియాకు చెందిన డా. చోహాన్ క్యూ సహజ సాగు, చింతల వెంకటరెడ్డి(సీవీఆర్) మట్టి ద్రావణం ఉపయోగించే పద్ధతిని అనుసరించి కలబంద, అశ్వగంధ, నిమ్మగడ్డి, జిరేనియం తదితర ఔషధ, సుగంధ పంటల సాగుపై యువతకు 41 రోజుల క్షేత్రస్థాయి ఆచరణాత్మక ఉచిత శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివశంకర్ షిండే తెలిపారు. ఏప్రిల్ 10 నుంచి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో యువతకు శిక్షణ ఇస్తామన్నారు. ఔషధ మొక్కల సాగుతోపాటు శుద్ధి, మార్కెటింగ్ సంబంధిత అంశాలపై కూడా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ, భోజన, వసతులన్నీ ఉచితమే. కనీసం పదో తరగతి చదివి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు. ఆసక్తి గల వారు ఈ నెల 25వ తేదీ లోగా 81210 08002 నంబరుకు వాట్సాప్ ద్వారా తమ వివరాలు పంపవచ్చు.

సేంద్రియ కర్బనం పెంపుదలపై ఏప్రిల్ 1న శిక్షణ


రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులో ఏర్పాటు చేసిన రైతు శిక్షణా కేంద్రంలో ఏప్రిల్ 1వ తేదీన వ్యవసాయంలో మట్టి పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనాల సేకరణలో మెళకువలు, సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉచితంగా మట్టి పరీక్షలు చేయించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తామని ఫౌండేషన్ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ విశ్రాంత అదనపు సంచాలకులు కె.రామచంద్రం, విశ్రాంత సహాయ సంచాలకులు ఆర్. జగన్నాథం శిక్షణ ఇస్తారు. పేర్లు నమోదు చేయించుకోదలచిన రైతులు 97053 83666, 0863–2286255 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఏప్రిల్ 6 నుంచి నాగ్‌పూర్ బీజోత్సవ్

నాగ్‌పూర్ (మహారాష్ట్ర)లోని మూర్ మెమోరియల్ లాన్స్ (మహరాజ్‌బాగ్ రోడ్డు, సీతాబుల్డి)లో ఏప్రిల్ 6 నుంచి 8వ తేదీ వరకు బీజోత్సవ్ (విత్తనోత్సవం) జరగనుంది. దేశీ వంగడాలను, సేంద్రియ వ్యవసాయ, ఆహారోత్పత్తులను విక్రయిస్తారు. సేంద్రియ పత్తితో తయారైన వస్త్రాలు, ఆరోగ్యదాయకమైన జీవనశైలికి అనుగుణమైన వస్తువులను అందుబాటులో ఉంచుతారు. ఆసక్తిగల వారు ఆకాశ్ నోఘరె–97669 12745, సజల్ కులకర్ణి– 98814 79239లను సంప్రదించవచ్చు.

నివాళి

సంజీవయ్య కుటుంబాన్ని ఆదుకోండి సారూ..!



నెల్లూరు జిల్లా కలువాయి మండలం చింతల ఆత్మకూరు గ్రామానికి చెందిన సోంపల్లి సంజీవయ్య(47) తనకున్న ఐదెకరాల స్వంత భూమితోపాటు మరో ఆరెకరాలను ఎకరా రూ.పది వేల చొప్పున కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. పప్పు శనగ, మినుము పంటలు సాగు చేశాడు. 2014, 2015లలో వర్షాభావం కారణంగా పంటలు చేతికి రాలేదు. ఈ క్రమంలో కౌలు, పంటలకు పెట్టిన పెట్టుబడి, కుమార్తెల పెళ్లి కోసం చేసిన అప్పులు 5 లక్షలు దాటిపోయాయి. 2016లో కూడా పంట వస్తుందన్న ఆశ కోల్పోయిన సంజీవయ్య కుటుంబ సభ్యులతో అప్పుల విషయం గురించి మథనపడేవాడు. చివరికి అప్పులు తీరవని భావించిన సంజీవయ్య 2016 ఏప్రిల్ 21న కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సంజీవయ్య చనిపోయిన తర్వాత కూడా ఏ అధికారీ బాధిత కుటుంబాన్ని పలుకరించి ధైర్యం చెప్పలేదు. అతని భార్య భారతికి పింఛను తప్ప ఆ కుటుంబానికి ఎటువంటి ప్రభుత్వ సహాయమూ అందలేదు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకొని అప్పుల ఊబిలో నుంచి బయటపడెయ్యాలని మృతుడి కుమారుడు వెంకటేశ్వర్లు (89788 54105) కోరుతున్నాడు.

పాడితోనే బాగుపడ్డాం..



క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే కుటుంబ నికరాదాయాన్ని పెంచుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని మహిళా రైతు నాగిరెడ్డి విజయగౌరి అనుభవపూర్వకంగా చెబుతున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి రూరల్ మండలం రాజుపేట గ్రామానికి చెందిన విజయగౌరి పెద్దగా చదువుకోకపోయినా.. పాడి పశువుల పోషణకు సంబంధించి తెలుసుకున్న ప్రతి విషయాన్నీ ఆసక్తిగా నోట్స్ తయారు చేసుకుంటూ.. ఆ పనిని ప్రణాళికాయుతంగా చేపడుతూ ఉత్తమ పాడి రైతుగా పలు అవార్డులు, రివార్డులను అందుకున్నారు. 18 పాడి పశువులను పెంచుతూ రోజూ విశాఖడైరీ పాలకేంద్రానికి 80 నుంచి 100 లీటర్ల పాలు పోస్తున్నారు. ఆర్థిక సంక్షోభం నుంచి కుటుంబాన్ని ఆర్థికాభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. ఆమె మాటల్లోనే విందాం.. 'ఎనిమిదేళ్ల క్రితం కుటుంబం ఆర్థికంగా చితికిపోవడంతో పశువుల పెంపకంపై దృష్టిసారించాను. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పశుక్రాంతి పథకం ద్వారా మూడు ఆవులతో డైరీ పెట్టాను. నా భర్త రామారావు సహకారంతో ప్రస్తుతం మొత్తం 15 ఆవులు 5 దూడలు పెంచుతూ పాల ఉత్పత్తి చేస్తున్నాను. రోజుకు సాధారణ స్థితిలో అయితే 80 నుంచి 100 లీటర్ల పాలు విశాఖ డైరీ పాలకేంద్రానికి అందిస్తున్నాం. పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారు చేసుకొని వాడుకుంటున్నాం. భర్తతో కలసి ఉదయం 3.30 గంటలకు నిద్ర లేచి రాత్రి 10 గంటల వరకు పనులు చేసుకుంటున్నాం. డైరీలో లీటరుకు రూ. 23, బయట రూ. 30 వస్తున్నది. పశువుల పెంపకం వలన మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. నా కుమారుడు నాగేంద్రకుమార్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. కుమార్తె యశోద ఇంజనీరింగ్ చదువుతున్నది' అన్నారామె.

- రంపా రాజమోహనరావు, సాక్షి, బొబ్బిలి రూరల్

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

నాటు కోళ్ల హేచరీ!

- రెండెకరాల్లో నాటు కోళ్ల పెంపకం.. మొలక గడ్డే ప్రధాన ఆహారం
- స్వల్ప ఖర్చుతో నాటుకోడి పిల్లల ఉత్పత్తి..
- అధిక నికరాదాయం పొందుతున్న విద్యాధిక దంపతులు.. తోటి రైతులకూ శిక్షణ



నాటు కోళ్ళ షెడ్డులో నవత, అరుణ్ క్రాంతి కుటుంబం

మాంసాహారుల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న కొద్దీ నాటు కోళ్లకు మార్కెట్‌లో గిరాకీ పెరుగుతూ వస్తున్నది. అయితే, షెడ్లలో కోళ్లను ఉంచి పెంచే పద్ధతిలో ఖర్చులు అధికమైన నేపథ్యంలో లాభాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. అయితే, ఉన్నత విద్యావంతులైన అరుణ్ క్రాంతి, నవత దంపతులు ఉద్యోగాలకు వెళ్లకుండా వినూత్నంగా ఆలోచించి నాటుకోళ్ల పెంపకం చేపట్టారు. వినూత్నంగా మొలక గడ్డినే మేతగా వేస్తున్నారు. అంతే కాదు, స్వల్ప ఖర్చుతోనే నాటుకోడి పిల్లల హేచరీని నిర్వహిస్తున్నారు. నెలకు సుమారు 10 వేల నాటు కోడి పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. ఖర్చులు బాగా తగ్గించుకుంటూ అధిక లాభాలు పొందుతున్నారు. తమ ప్రాంతంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచారు.

వినూత్నమైన ఆలోచనలు, మనోబలంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చనడానికి నిదర్శనం ఈ యువ జంట. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన కాపరబోయిన అరుణ్ క్రాంతి బీటెక్, ఆయన భార్య నవత ఎంబీఏ చదివారు. ఇద్దరికీ కార్పొరేట్ ఉద్యోగాలు వచ్చినప్పటికీ, వ్యవసాయం, అనుబంధ రంగాలపై అభిరుచితో కోళ్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జగిత్యాల సమీపంలోని తమ రెండెకరాల భూమిలో చుట్టూ ఇనుప మెష్ వేసి, ఒక షెడ్డు వేసుకొని, ఆరుబయటే తిరుగాడే పద్ధతిలో నాటు కోళ్లను పెంచుతున్నారు. తొలుత, 2005 నుండి 2012 వరకు ఈము పక్షుల పెంపకాన్ని చేపట్టి, మార్కెటింగ్ సమస్యల వల్ల భారీ నష్టాలను చవిచూశారు. తదనంతరం కూడా ఉద్యోగాల వైపు చూడకుండా మనోధైర్యంతో వినూత్నంగా నాటు కోళ్ల పెంపకంతో పాటు హేచరీపై దృష్టి పెట్టి నిలదొక్కుకున్నారు. నెలకు రూ. లక్ష ఆదాయం పొందేలా ఎదిగారు.

800 నాటు కోళ్లు.. 10 వేల కోడి పిల్లలు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో కోళ్ల ఫారాలను స్వయంగా పరిశీలించారు. నాటు కోళ్లను షెడ్లలో పెంచడం వల్ల వ్యాధులు వస్తున్నాయని, నిర్వహణ ఖర్చు కూడా ఎక్కువై నష్టపోతున్నట్లు గ్రహించారు. షెడ్లలో పెంచడం వల్ల దాణా ఖర్చు ఎక్కువ అవుతుండటంతో పెద్దగా గిట్టుబాటు కావడం లేదని గుర్తించి, నాటు కోళ్లను వినూత్నంగా పెంచాలని నిర్ణయించుకున్నారు. తొలుత 100 గుడ్లతో కోళ్ల పెంపకం చేపట్టగా, నేడు 800 కోళ్లతో పాటు, నెలకు 5–10 వేల కోడి పిల్లలను అమ్మే స్థాయికి ఎదిగారు. కృత్రిమంగా గుడ్లను పొదిగే ఇంక్యుబేటర్‌ను కొనుగోలు చేయకుండా.. అందుబాటులో ఉన్న వస్తువులతో తయారు చేసుకున్నారు. 21 రోజుల్లో పిల్లలు బయటకు వస్తాయి. మరికొద్ది రోజుల పాటు లైట్ల కింద అతి జాగ్రత్తగా పెంచిన తర్వాత, కోడి పిల్లలను బయటకు వదులుతారు.

ట్రేలలో పెంచే మొలక గడ్డి, ఆకుకూరలు, అజొల్లా..

ఆరు బయటకు వచ్చిన పిల్లలకు సమతుల పౌష్టికాహారంగా హైడ్రోపోనిక్ పద్ధతిలో ట్రేలలో పెంచే మొక్కజొన్నగడ్డి, జొన్న గడ్డి, గోధుమ గడ్డితోపాటు.. ఆరుబయట పొలంలో పాలకూర, ఆకుకూర, షేడ్‌నెట్ హౌస్‌లో అజొల్లాలను సొంతంగా పెంచి అందిస్తున్నారు. డక్‌వీడ్ తోపాటు మినరల్స్ కూడా ఇస్తుంటారు. సాగు చేసిన తోటల్లో తిరుగుతూ కోళ్లు తమకు ఇష్టమైనవి తింటుంటాయి. కేవలం సాయంత్రం సమయాల్లో షెడ్లలోకి పిలిచేందుకే.. మొక్కజొన్న, సోయాబీన్, నూకలు, వరి తవుడును కలిపిన దాణా వేస్తుంటారు. సాధారణంగా పెరటి కోళ్లు పెంచే వారు పెట్టే ఖర్చులో 20% ఖర్చుతోనే వీరు మంచి ఉత్పాదకత సాధిస్తుండటం విశేషం.

గ్రామాల నుంచి నాటు గుడ్ల సేకరణ

నాటు కోడి పిల్లలకు డిమాండ్ రావడంతో, ప్రతి వారానికి జగిత్యాల చుట్టుపక్కల గ్రామాల నుండి 3–4 వేల గుడ్లను సేకరిస్తారు. వీటితో పాటు, తన ఫామ్‌లో కోళ్ల నుండి వచ్చిన గుడ్లను ముందుగా ఫార్మాల్డిహైడ్ ద్రావణంతో శుభ్రం చేస్తారు. తర్వాత, 6 గంటల పాటు బ్యాక్టీరియా, సూక్ష్మక్రిములు, వైరస్ లేకుండా ఉండేందుకు ఫ్యూమిగేషన్ చేస్తారు. ఎందుకంటే, 21 రోజుల పాటు ఎలాంటి వైరస్ గుడ్లకు సోకకుండా కాపాడుతుంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే స్వయంగా తయారు చేసిన గుడ్లను ఉంచే పరికరంలో లైట్ల వెలుతురులో గుడ్లను పెడుతుంటారు. ఇలా.. దాదాపు ఆరు గుడ్ల నుండి పిల్లలు వచ్చే పరికరాలు ఉన్నాయి. దాదాపు నెలకు 5–10 వేల నాటు కోడి పిల్లలు అందిస్తున్నాడు.

80 రోజుల్లో కిలో–కిలోన్నర బరువు

నాటు కోడి పిల్లలు కొనుగోలు చేసిన వ్యక్తులకు వీటిని ఏ రీతిన పెంచితే లాభాలు వస్తాయో కూడా వీరు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో కోడి పిల్లను రూ. 35 పెట్టి కొనుగోలు చేసి తీసుకెళ్లిన వారు.. 80 రోజుల్లో మార్కెట్‌లో అమ్మే వరకు ఏ రోజు ఏమి చేయాలో షెడ్యూల్ ఇస్తుంటారు. కోడి కిలో నుండి కిలోన్నర బరువు పెరగ్గానే అమ్మితే, కిలో రూ. 200 పలుకుతోంది. నాటు కోళ్లకు డిమాండ్ బాగా ఉండటంతో, వీరి నాటు కోళ్ల ఫారాన్ని ప్రతి రోజూ చాలా మంది చూసి వెళ్తుంటారు.

- పన్నాల కమలాకర్ రెడ్డి, సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్

ఓటమే రేపటి విజయానికి నాంది!

ఏదో సాధించాలన్న తపనతోనే కోళ్ల పెంపకం చేపట్టాము. ఈము కోళ్ల పెంపకంతో చేతులు కాల్చుకున్నాం. విదేశీ కోళ్ల సాగులో గుణపాఠం నేర్చుకొని అత్యంత శ్రద్ధతో నాటు కోళ్లు, పిల్లల పెంపకం చేపట్టాం. ఓటమే రేపటి విజయానికి నాంది అనడానికి మేమే నిదర్శనం. ప్రతి రోజూ కోళ్ల ఫారానికి వచ్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. నిశితంగా గమనిస్తూ ఉంటే ఏ కోడి గుడ్డు పెడుతుందో, ఏ కోడి పెట్టడం లేదో మాకు తెలిసిపోతుంది. కోళ్లకు వివిధ రకాల గడ్డిని ట్రేలలో పెంచుతుంటాం. ఆరోగ్యంగా ఆరుబయట తిరుగాడుతూ పెరుగుతున్న నాటు కోళ్లను చూస్తే తృప్తిగా ఉంటుంది.

- నవత, అరుణ్ క్రాంతి (90005 67121), జగిత్యాల



కృత్రిమంగా గుడ్లను పొదిగే ఏర్పాటు



విద్యుత్ దీపాల వెలుగులో నాటు కోడి పిల్లలు



ట్రేలలో పెరుగుతున్న మొలక గడ్డి



మొక్కజొన్న మొలక గడ్డిని తింటున్న కోళ్లు